

ఈనాడు



విజయవాడ 5-1-2019 శనివారం సిటీ సంపుటి 45 . సంచిక 146
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 18+24 www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

కొలువుల క్రాంతి

- నెలాఖరులోగా 14 ఉద్యోగ ప్రకటనలు విడుదల చేస్తాం
- ఆయా శాఖల నుంచి వివరాలు రాకనే జాప్యం
- ఇప్పటివరకు 21 ప్రకటనలు ఇచ్చాం
- ప్రకటించిన తేదీల్లోనే పరీక్షలు నిర్వహిస్తాం
- వయోపరిమితి పెంపు ప్రభుత్వ పరిధిలోది
- వెల్లడించిన ఏపీపీఎస్సీ

ఈనాడు – అమరావతి



నెలాఖరులోగా రానున్న ఉద్యోగ ప్రకటనలు

జిల్లా ప్రజా సంబంధాల అధికారి పోస్టులు -	04
ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్ (గ్రేడ్-3 -	60
అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్స్ -	78
అసిస్టెంట్ డైరెక్టర్ (ఏపీ ఎకనామిక్స్ అండ్ స్టాటిస్టికల్) -	06
తెలుగు రిపోర్టర్ (లెజిస్లేచర్) -	05
ఇంగ్లీష్ రిపోర్టర్ (లెజిస్లేచర్) -	10
జూనియర్ అసిస్టెంట్-కంప్యూటర్ అసిస్టెంట్ -	670
ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ -	10
సెరికల్చర్ ఆఫీసర్ -	13
ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ -	330
లెజిస్లేటివ్ ఆఫీసర్ -	03
అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ -	100
రీసెర్చి ఆఫీసర్ -	02
అసిస్టెంట్ ఇంజినీర్ -	190

ఈ నెలాఖరులోగా మరో 14 ఉద్యోగ ప్రకటనలు జారీ చేయనున్నట్టు ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ) అధ్యక్షుడు ప్రొఫెసర్ ఉదయ్‌భాస్కర్ వెల్లడించారు. గత సెప్టెంబరులో ఆర్థిక శాఖ జారీచేసిన ఉత్తర్వులు అనుసరించి డిసెంబరు చివరి వరకు 3,255 ఉద్యోగాల భర్తీకి 21 ప్రకటనలు జారీచేసినట్లు తెలిపారు. రెవెన్యూశాఖ నుంచి వివరాలు రానందున 670 జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగాలు, అటవీ శాఖకు చెందిన అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ 330, ఇతర శాఖల ఉద్యోగాల భర్తీ ప్రకటనలు కలిపి 14 వరకు ఇవ్వలేకపోయినట్లు చెప్పారు. ఆయా శాఖల నుంచి వివరాలు అందిన వెంటనే వీటిని కూడా జారీ చేస్తామని తెలిపారు. ఇందుకు ఈ నెలాఖరు వరకు సమయం పట్టే అవకాశం ఉందన్నారు.

త్వరితగతిన ప్రకటనలు ఇచ్చేందుకు సంప్రదింపులు

విజయవాడలోని కమిషన్ కార్యాలయంలో సహచర సభ్యులు జింకా రంగజనార్ధన, కె.విజయకుమార్, జి.సుజాత, కె.పద్మరాజు, సేవారూప, కార్యదర్శి మౌర్యలతో కలిసి ఉదయ్‌భాస్కర్ శుక్రవారం సాయంత్రం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. త్వరితగతిన ఈ ప్రకటనలు ఇవ్వాలన్న ఉద్దేశంతో ఆయా శాఖల అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నామని చెప్పారు. ప్రకటనల్లో పేర్కొన్న తేదీల్లోనే రాత పరీక్షలు నిర్వహిస్తామని, అనివార్య పరిస్థితులు తలెత్తితే తప్ప వాయిదాలు ఉండవని వెల్లడించారు. ప్రకటించాల్సిన రాత పరీక్ష నిర్వహణ తేదీలను తగిన సమయంలో (మిగతా 6లో)



అవినీతికి పాల్పడినందుకు, దేశ భద్రతను బలహీనపర్చినందుకు ప్రధాని మోదీపై విచారణ జరగాలి. నిర్మలా సీతారామన్ నేను అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా తప్పించుకున్నారు. మేం అధికారంలోకి వస్తే రఫేల్‌పై క్రిమినల్ దర్యాప్తు చేయిస్తాం.

– రాహుల్‌గాంధీ



బోఫోర్స్ కారణంగా కాంగ్రెస్ పతనమయింది. కానీ, రఫేల్‌తో మోదీ తిరిగి అధికారంలోకి వస్తారు. గతంలో మాదిరిగా రక్షణ రంగ కొనుగోళ్లలో దళారులు లేరు. రాహుల్ ఏఏ (అనిల్ అంబానీ) అంటున్నారు. కానీ అక్కడ 'క్యూ' (అట్టావియో ఖత్రోకీ), 'ఆర్‌వీ' (రాబర్ట్ వాద్రా) ఉన్నారు.

– నిర్మలా సీతారామన్

విమానం మోత

- రఫేల్‌పై అధికార, విపక్షాల మాటల యుద్ధం
- క్రిమినల్ దర్యాప్తు చేయిస్తాం: రాహుల్ గాంధీ
- ఇదేమీ బోఫోర్స్ కాదు: రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్



రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలు వ్యవహారంపై శుక్రవారం అధికార విపక్షాల మధ్య మాటల యుద్ధం జరిగింది. లోక్‌సభలో జరిగిన స్వల్పకాలిక చర్చ, అనంతరం జరిగిన విలేకరుల సమావేశాల్లో కాంగ్రెస్ నేతలు ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. నిజాలు నిగ్గుతేలేలా సంయుక్త పార్లమెంటరీ సంఘంచే దర్యాప్తు చేయించాలని డిమాండు చేశారు. కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ మరో అడుగు ముందుకు వేసి తాము అధికారంలోకి వస్తే దీనిపై క్రిమినల్ దర్యాప్తు చేయించడంతోపాటు, బాధ్యులను శిక్షిస్తామని ప్రకటించారు. మొత్తం వ్యవహారానికి ప్రధాని మోదీదే బాధ్యత అని చెబుతూ సమాధానాలు చెప్పాలని ఆయనకు పలు ప్రశ్నలు సంధించారు. లోక్‌సభలో విపక్షాల విమర్శలకు రక్షణ మంత్రి నిర్మాలాసీతారామన్ దీటుగా స్పందించారు. దాదాపు రెండు గంటల సేపు మాట్లాడుతూ అంశాల వారీగా వివరణ ఇచ్చారు. కుంభకోణం అనడానికి ఇదేమీ బోఫోర్స్ కాదని, దేశ ప్రయోజనాల దృష్ట్యా తీసుకున్న నిర్ణయమని స్పష్టం చేశారు.

పూర్తి వివరాలు 12లో



ఎగుమతులకు సిద్ధమైన బెండకాయలు

జర్మనీకి కొమరాడ బెండ

- ఎర్రబాలెం నుంచి కూడా ఎగుమతి
- సేంద్రియ పద్ధతిలో పండించిన విజయనగరం, ప్రకాశం జిల్లా రైతులు
- మొదటి విడతగా టన్ను సరకు తరలింపు

3లో

జగన్‌పై దాడి కేసు ఎన్ఐఏకు

- అప్పగిస్తూ కేంద్రం నిర్ణయం
- జనవరి 1న ఎఫ్ఐఆర్ నమోదు చేశారు..
- హైకోర్టుకు తెలిపిన సహాయ సొలిసిటర్ జనరల్

ఈనాడు – అమరావతి



వైకాపా అధ్యక్షుడు జగన్‌పై విశాఖ విమానాశ్రయంలో జరిగిన దాడి ఘటన దర్యాప్తును జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ)కు అప్పగిస్తూ కేంద్ర హోంశాఖ డిసెంబరు 31న ఉత్తర్వులిచ్చిందని కేంద్ర ప్రభుత్వం తరపున సహాయ సొలిసిటర్ జనరల్(ఏఎస్‌జీ) కె.లక్ష్మణ్ శుక్రవారం ఏపీ హైకోర్టుకు తెలిపారు. ఆ ఉత్తర్వుల ఆధారంగా హైదరాబాద్‌లోని ఎన్ఐఏ స్టేషన్‌లో జనవరి 1న ఎఫ్ఐఆర్ నమోదైందని వివరించారు. కేంద్ర హోంశాఖ ఉత్తర్వులు, ఎఫ్ఐఆర్ ప్రతులను న్యాయస్థానానికి అందజేశారు. పిటిషనర్లు ఎన్ఐఏ దర్యాప్తునకు అభ్యర్థించారని, ఎఫ్ఐఆర్ నమోదైనందున ఈ వ్యాజ్యాలపై విచారించి ఉత్తర్వులివ్వాల్సిన అవసరం లేదని ఈ సందర్భంగా ధర్మాసనం పేర్కొంది. ఈ అంశంపై దాఖలైన నాలుగు వ్యాజ్యాలపై విచారణను మూసివేసింది. ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎస్వీ భట్, జస్టిస్ కె.విజయలక్ష్మితో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఆదేశించింది. కేంద్ర హోంశాఖ ఉత్తర్వులను సవాలు చేసే హక్కును కల్పించాలన్న ఏపీ అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ విన్నపాన్ని మన్నిస్తూ ధర్మాసనం ఉత్తర్వులిచ్చింది. విశాఖ విమానాశ్రయంలో తనపై హత్యాయత్నం ఘటన కేసు (మిగతా 6లో)

కేంద్ర హోంశాఖ ఉత్తర్వులపై రాష్ట్రం సవాలు

జగన్‌పై దాడి ఘటనను ఎన్ఐఏకు అప్పగిస్తూ కేంద్రం గత నెల 31న జారీ చేసిన ఉత్తర్వులను సవాలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. కేంద్ర నిర్ణయం రాష్ట్రాధికారాల్లో జోక్యం చేసుకోవడం కిందికే వస్తుందని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ అసమ్మతిని కేంద్రానికి తెలిపేలా లేఖ రాయాలని యోచిస్తోంది.

పేదల గూడు @ 10 వేల కోట్లు

- రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ద్వారా వెచ్చింపు
- ఆర్థిక ఇబ్బందులున్నా ఇళ్లకు ప్రాధాన్యం

11లో

ఎల్ఈడీ వెలుగుల్లో ఏపీ నంబర్ 1

- రాష్ట్రంలో 21,81,615 వీధి దీపాల ఏర్పాటు
- లోక్‌సభలో కేంద్ర ఇంధనశాఖ మంత్రి వెల్లడి

7లో

మేమే ఓడిపోతే మీకు డిపాజిట్లు వస్తాయా?

- మోదీని నిలదీసిన సీఎం చంద్రబాబునాయుడు
- ప్రధాని చెబితే జగన్ ఊడిగం కూడా చేస్తారు
- రాష్ట్రానికి రావాల్సిన నిధులపై పవన్ పోరాడాలి
- రాష్ట్ర ప్రజలకు నా జీవితం అంకితం
- సంక్షేమ శాఖలపై శ్వేతపత్రం విడుదల
- కాకినాడ జన్మభూమి సభలో ముఖ్యమంత్రి

కాకినాడ – ఈనాడు, ఈనాడు డిజిటల్ – అమరావతి

'మనం ఓడిపోతామని ప్రధాని మోదీ మాట్లాడుతున్నారు. నేను ప్రజలకు న్యాయం చేశాను. సంక్షేమం, అభివృద్ధి అందించాను. అన్నిట్లో నెంబర్ 1గా ఉన్నాం. మేమే ఓడిపోతే మీకేమైనా చిరునామా ఉంటుందా..? డిపాజిట్లు వస్తాయా..? అసలు మీ విషయం ఏమిటి..? మీరు దేశానికి ఏమి చేశారని (మిగతా 6లో)




జన్మభూమి సభ ప్రాంగణంలో క్రీడాకారిణులతో వాలీబాల్ ఆడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

కొత్త గోదాముల్లోకి అనుమతించలేం

- హమాలీల అధ్యక్షుడి అప్పీల్ కొట్టివేత
- ఏపీ హైకోర్టు తొలి తీర్పు


ఈనాడు, అమరావతి: ఏపీ బేవరేజ్ కార్పొరేషన్ పర్యవేక్షణలో నిర్వహిస్తున్న మద్యం గోదాముల్లో పనిచేస్తున్న హమాలీలను కొత్తగా ఏర్పాటు చేసిన గోదాముల్లో పనిచేసేందుకు వీలు కల్పించాలన్న అభ్యర్థనను హైకోర్టు తిరస్కరించింది. సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. హమాలీల అధ్యక్షుడు దాఖలుచేసిన అప్పీల్‌ను కొట్టేసింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సి.ప్రవీణ్‌కుమార్, జస్టిస్ ఎం.సత్యనారాయణమూర్తిలతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఈమేరకు తీర్పు ఇచ్చింది. ఏపీ హైకోర్టు అమరావతికి తరలి వచ్చాక ఇచ్చిన మొదటి తీర్పు ఇదే కావడం విశేషం. విజయవాడ గ్రామీణ మండలం (మిగతా 6లో)

ఇదీ సంగతి!



ఇళ్లను క్రమబద్ధీకరించుకోండి

- మళ్లీ బీపీఎస్‌ను తీసుకొచ్చిన రాష్ట్ర ప్రభుత్వం
- 1.1.1985 నుంచి 31.08.2018 మధ్య నిర్మించిన అక్రమ కట్టడాలకు వర్తింపు
- 90 రోజుల్లోగా దరఖాస్తులకు అవకాశం



ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లోని నగరాలు, పట్టణాల్లో అక్రమ నిర్మాణాల క్రమబద్ధీకరణకు రాష్ట్ర ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. ఈ మేరకు భవనాల క్రమబద్ధీకరణ పథకం (బీపీఎస్) మార్గదర్శకాలను శుక్రవారం విడుదల చేసింది. రాష్ట్ర విభజన తర్వాత ఈ పథకాన్ని తీసుకురావడం ఇది రెండోసారి. 1985 జనవరి 1 తర్వాత, 2018 ఆగస్టు 31వ తేదీ కంటే ముందు నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భవనాలన్నింటినీ ఈ పథకంలో భాగంగా క్రమబద్ధీకరించుకోవచ్చు.

ఎక్కడెక్కడ వర్తిస్తుంది?

నగర పాలక సంస్థలు, పురపాలక సంఘాలు, నగర పంచాయతీలు, రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ(సీఆర్‌డీఏ) పరిధిలో ఉన్న గ్రామ పంచాయతీలు (రాజధాని నగరం పరిధిలోనివి మినహా), మెట్రోపాలిటన్ ప్రాంత అభివృద్ధి సంస్థలు, పారిశ్రామిక ప్రాంత స్థానిక సంస్థలు (ఐలా)ల్లోని భవనాలన్నింటికీ ఈ పథకం వర్తిస్తుంది.

100 చ.మీ. ఇళ్లకు మినహాయింపు

నోటిఫికేషన్ విడుదలైన శుక్రవారం నుంచి 90 రోజుల్లోగా ఈ పథకం కింద క్రమబద్ధీకరణ కోసం (మిగతా 6లో)



నూతన సంవత్సర కానుక
ఫ్యూచర్ పే ఆప్‌ని డౌన్‌లోడ్ చేసుకొని మీ వాలెట్‌లోకి
₹501* ని పొందండి
8010 35 0000
₹789 ₹939 హెల్దీ హార్ట్ సన్‌ఫ్లవర్ ఆయిల్ (5 లీ.) + గోల్డెన్ హార్వెస్ట్ పంచదార (5 కిలోలు) + గోల్డెన్ హార్వెస్ట్ ఫార్చిఫైడ్ చక్కీ ఫ్రెష్ ఆటా (5 కిలోలు)
₹190 ₹240 ఆశీర్వాద్ సంపూర్ణమైన గోధుమ పిండి (5 కిలోలు)
₹1035 ₹1780 గోల్డెన్ హార్వెస్ట్ సోనా మసూరి ఎకానమీ బియ్యం (25 కిలోలు)
₹69.50 ₹80 కందిపప్పు ప్రీమియం విడిగా (1 కిలో)
₹108 ₹135 వేరుశనగలు విడిగా (1 కిలో)
పొదుపు ₹101 ₹940-₹1048 ఏరియల్/సర్ఫ్ ఎక్సెల్ మేటిక్ టాప్/ఫ్రంట్ లోడ్ డిటెర్జెంట్ పౌడర్ (4 కిలోలు + 2 కిలోలు)
కొనండి 1 పొందండి 1 ఉచితంగా ₹199-₹224 సంతూర్ గ్లిసరిన్ (3 x 125 గ్రా.) నివియా క్రీమ్ సోప్ (4 x 125 గ్రా.)
కొనండి 1 మరియు పొదుపు ₹120 కొనండి 2 పొందండి 1 ఉచితంగా ₹440 స్టేఫ్రీ ఆల్ నైట్ అల్ట్రా డ్రై ఎక్స్ఎల్ (42 పీసులు)
కొనండి 2 పొందండి 1 ఉచితంగా క్లోజ్ అప్ టూత్‌పేస్ట్ రెడ్ హాట్ (2 x 150 గ్రా.)/ కోల్గేట్ టూత్‌పేస్ట్ మ్యాక్స్ ఫ్రెష్ (300 గ్రా.) ₹144-₹164
పొదుపు ₹320 ₹999 పాంపర్స్ ప్యాంట్స్ బేబీ డయపర్ మీడియం (80 పీసులు)/ లార్జ్ (64 పీసులు)/(68 పీసులు)/ ఎక్స్‌ఎల్ (58 పీసులు)/ (60 పీసులు)
కొనండి 2 పొందండి 1 ఉచితంగా ₹67 సన్‌ఫీస్ట్ ఇప్పీ నూడిల్స్ మేజిక్ మసాలా (360 గ్రా.)/(420 గ్రా.)
పొదుపు ₹42 ₹347 బూస్ట్ (750 గ్రా.)
పొదుపు ₹30 ₹225 తాజ్ మహల్ టీ (500 గ్రా.)
పొదుపు ₹90 ₹229 క్వాకర్ ఓట్స్ క్విక్ కుకింగ్ (1.5 కిలోలు)
కస్టమర్ హెల్ప్‌లైన్ నెంబర్: 1800 266 2255
/bigbazaar @bigbazaar /big.bazaar bigbazaar.com
స్టోర్‌లో ఇంకా ఎన్నో ఆఫర్స్ లభ్యం.
బిగ్ బజార్: – వి.వి.కాంప్లెక్స్, గోపాల్‌రెడ్డి రోడ్, గవర్నర్‌పేట, విజయవాడ.
BIG BAZAAR
ఇండియాని చేస్తుంది బ్యూటిఫుల్



స్టైల్ అప్ సంక్రాంతి
ఫ్లాట్ 50% తగ్గింపు*
అప్పారెల్ మరియు ఫుట్‌వేర్ పైన
EXTRA 10% OFF** WITH fbb SBI STYLEUP CARD
TO APPLY, SMS STYLEUP TO 5676791
**T&C APPLY
ఎఫ్‌బిబి స్టోర్ బిగ్ బజార్‌లో వి.వి.కాంప్లెక్స్, గోపాల్‌రెడ్డి రోడ్, గవర్నర్‌పేట, విజయవాడ.
ఎఫ్‌బిబి ప్రత్యేకమైన స్టోర్ 2వ అంతస్తు, పి.వి.పి. మాల్, ఎమ్.జి రోడ్, విజయవాడ.
Scan for the collection
/fbbonline | కస్టమర్ హెల్ప్‌లైన్ నెంబర్ : 1800 266 2255
ఇప్పుడు దీనిపైన ఆన్‌లైన్ షాపింగ్ చెయ్యండి: www.fbbonline.in
*నియమాలు మరియు నిబంధనలు వర్తిస్తాయి.
fbb INDIA'S FASHION HUB
BIG BAZAAR ఇండియాని చేస్తుంది బ్యూటిఫుల్

వినియోగపత్రాలపై నిజానిజాలు తేల్చండి

- కేంద్రానికి లేఖ రాయాలని రాష్ట్రం యోచన

ఈనాడు, అమరావతి: కేంద్ర నిధులతో చేపట్టిన పనుల వివరాలతో ఏపీ ప్రభుత్వం వినియోగపత్రాలు పంపలేదని ఇటీవల ప్రధాని మోదీ చేసిన ప్రకటనపై నిజానిజాలు తేల్చాలని కోరుతూ కేంద్రానికి లేఖ రాయాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. వెనుకబడిన జిల్లాలకు రూ. వెయ్యి కోట్లు ఇచ్చామని, పోలవరానికి వంద శాతం నిధులిచ్చామని.. అయినా వినియోగపత్రాలు ఇవ్వలేదని ప్రధాని హోదాలో ఉన్న వ్యక్తి వ్యాఖ్యలు చేయడం సరికాదంటూ లేఖ రాయాలని భావిస్తోంది.

ఎగువ పెన్నార్ ఎత్తిపోతలకు పరిటాల రవీంద్ర పేరు

ఈనాడు,అమరావతి: ఎగువ పెన్నార్ ఎత్తిపోతల పథకానికి పరిటాల రవీంద్ర నీటిపారుదల పథకంగా పేరు ఖరారు చేస్తూ జలవనరులశాఖ కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ ఉత్తర్వులు ఇచ్చారు. జీడిపల్లి జలాశయం నుంచి ఎగువ పెన్నార్ ప్రాజెక్టుకు నీటిని ఎత్తిపోసేలా ఒక పథకం రూపకల్పన చేసి టెండర్లు పిలిచి నిర్మాణం చేపట్టారు.

జర్మనీ కిచెన్‌లో ఆంధ్రా బెండ

- విజయనగరం, ప్రకాశం జిల్లాల పంట ఎగుమతి

నూజివీడురూరల్ – న్యూస్‌టుడే



శుద్ధి చేస్తున్న బెండకాయలను పరిశీలిస్తున్న ఉద్యానశాఖ కమిషనర్ చిరంజీవి చౌదరి తదితరులు

రాష్ట్ర రైతులు పండించే ఉత్పత్తులకు తగిన ప్రోత్సాహం అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూచనలు మేరకు ఇక్కడి పంటలను విదేశాలకు ఎగుమతి చేసేందుకు ఉద్యానశాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా విజయనగరం జిల్లా కొమరాడ, ప్రకాశం జిల్లా ఎర్రబాలెంకు చెందిన రైతులు శివకుమార్‌రాజు, ఇండీనర్‌లు సాగు చేసిన సేంద్రియ బెండకాయలను ..నూజివీడులోని చీడపీడల నియంత్రణ కేంద్రంలో శుద్ధి చేస్తున్నారు. వీటికి అన్ని పరీక్షలు పూర్తి చేసి జర్మనీ దేశంలోని ఫ్రాంక్‌ఫర్ట్‌కు ఎగుమతి చేసేందుకు సిద్ధం చేశారు. ఉద్యానశాఖ కమిషనర్ చిరంజీవి చౌదరి శుక్రవారం ఎగుమతుల కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ విలేకర్లతో మాట్లాడుతూ ఐటీసీ, గుంటూరులోని విన్నూ ప్రయోగకేంద్రాల్లో 160 రకాల రసాయన పరీక్షలు చేశామని పేర్కొన్నారు. అన్ని రకాల పరీక్షల్లో ఈ బెండకాయలు అర్హత సాధించాయని తెలిపారు. వీటిలో రసాయన అవశేషాలు 0.05 కంటే తక్కువ ఉంటేనే ఎగుమతులకు అనుమతి లభిస్తుందని వివరించారు. మొదటి విడతగా ఒక టన్ను బెండకాయలను జీఎంఆర్ కార్గోలో ఎగుమతి చేస్తున్నామని తెలిపారు. హైదరాబాద్, బెంగళూరు విమానాశ్రయాల ద్వారా ఎగుమతి చేస్తున్నామని తెలిపారు. త్వరలో గన్నవరం నుంచి పంపుతామని పేర్కొన్నారు. సేంద్రియ ఉత్పత్తుల ఎగుమతులే లక్ష్యంగా గుంటూరు జిల్లాలో 15 వేల హెక్టార్లలో ఉద్యాన పంటల సాగుకు ప్రణాళికను సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. గత ఏడాది సువర్ణరేఖ మామిడి కాయలను ఉత్తర కొరియాకు ఎగుమతి చేసినట్లు తెలిపారు. సేంద్రియ పంటల సాగుపై దృష్టి పెట్టాలని రైతులకు సూచించారు.

జగన్‌పై కేసులు ఎన్నేళ్లు నడుపుతారు?

- మొదటి నుంచి విచారించాలనడంలో అర్థమేంటి?
- మంత్రి కళా ధ్వజం
- జగన్‌కు 19 ప్రశ్నలతో బహిరంగ లేఖ

ఈనాడు, అమరావతి: 'వైకాపా అధ్యక్షుడు జగన్ అవినీతికి సంబంధించిన కేసులను మళ్లీ మొదటినుంచీ విచారించాలనడం దేనికి సంకేతం? ఇన్ని రోజులు విచారించింది రెండు ఛార్జిషీట్లకు సంబంధించిన కేసులే. ఇప్పుడు మళ్లీ మొదటినుంచి విచారించి ఎన్నేళ్లు జాప్యం చేస్తారు? ఎన్ని దశాబ్దాలు నడుపుతారు?' అని తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు, మంత్రి కిమిడి కళావెంకటరావు ప్రశ్నించారు. ఆంధ్రా తెరాస పార్టీగా మారిన వైకాపాకు అధ్యక్షుడిగా ఉన్న జగన్.. రాష్ట్రానికి తీరని ద్రోహం చేస్తున్నారని మండిపడ్డారు. జగన్‌ను ఉద్దేశించి ఆయన శుక్రవారం బహిరంగ లేఖ రాశారు. జగన్‌కు 19 ప్రశ్నలు సంధించారు. 2014లో జగన్‌ను ప్రజలు నమ్మలేదని, 2019లోనూ నమ్మడం లేదని తెలిపారు.



ఫ్యాన్‌ను చించితే కారు బయటపడుతోంది

తెరాస, వైకాపాల లాలూచీని ఆ పార్టీ పంచిన గోడ గడియారాలే బయట పెట్టాయని, ఫ్యాన్‌ను చించితే కారు బయటపడుతోందని కళావెంకటరావు పేర్కొన్నారు. 'తెలంగాణలో తెరాస తరపున మీరు ప్రచారం చేసి అక్కడ పంచగా మిగిలిన గోడ గడియారాల్లో వైకాపా నేతల ఫొటోలు వేసి ఆంధ్రప్రదేశ్‌లో పంచడం మీ లాలూచీకి నిదర్శనం కాదా?' అని ప్రశ్నించారు.

జగన్‌కు వేసిన ప్రశ్నల్లో మరికొన్ని..

- ఐదు కోట్ల ఆంధ్రుల హక్కుల కోసం తెదేపా ఎంపీలు పోరాడుతుంటే వైకాపా ఎంపీలు ఎక్కడ దాక్కున్నారు? విజయసాయిరెడ్డి ప్రధాని కార్యాలయంలో ఏం చేస్తున్నారు?
- పెట్టుబడుల్ని ఆకర్షించేందుకు ముఖ్యమంత్రి తలపెట్టిన దావోస్ పర్యటనను అడ్డుకునేలా కేంద్రం వ్యవహరిస్తుంటే ప్రతిపక్ష నేతగా మీరు ఎందుకు నోరు మెదపడం లేదు? రాష్ట్రాల హక్కుల్ని, రాజ్యాంగబద్ధ వ్యవస్థల్ని నాశనం చేస్తుంటే ఎందుకు ప్రశ్నించడం లేదు?
- 13 జిల్లాల్లో సాగిన మీ పాదయాత్రలో ఏ రోజైనా కడప ఉక్కు పరిశ్రమ, రైల్వే జోన్, ఇతర అంశాలపై కేంద్రాన్ని నిలదీశారా?
- కడప ఉక్కు పరిశ్రమ విషయంలో కేంద్రం మొండిచేయి చూపితే ఏనాడైనా నోరు మెదిపారా? గాలి జనార్దన్‌రెడ్డికి మేలు చేసేందుకు కుట్ర పన్నలేదా?
- వెనుకబడిన జిల్లాలకు రూ. 350 కోట్ల నిధులిచ్చినట్టే ఇచ్చి వెనక్కు తీసుకున్నామని, రాష్ట్ర ప్రభుత్వం అన్ని యూసీలూ సమర్పించిందని పార్లమెంటులో కేవీపీ అడిగిన ప్రశ్నకు కేంద్రం జవాబిచ్చింది. దీనిపై మీరు ఎందుకు మౌనంగా ఉన్నారు?
- పోలవరం బకాయిలు రూ. 3,500 కోట్లు పెండింగ్‌లో పెట్టి నిత్యం కొర్రీలు వేస్తుంటే ఎందుకు నిలదీయడం లేదు?
- కోడికత్తి డ్రామాను అడ్డు పెట్టుకుని ప్రజల్లో సానుభూతి కోసం మీరు ప్రయత్నించలేదా? పాదయాత్రను నవ్వులపాలు చేయలేదా?
- వైకాపా ఎమ్మెల్యేలు అసెంబ్లీకి హాజరవకుండా జీతాలు తీసుకోవడం నైతికత ఎలా అవుతుంది?

రికార్డు సమయంలో జీఏడీ టవర్ రాఫ్ట్ ఫౌండేషన్

తుళ్ళూరు,న్యూస్‌టుడే: అమరావతి పరిధిలో నిర్మిస్తున్న సచివాలయం, వివిధ శాఖల విభాగాధిపతుల జీఏడీ టవర్ రాఫ్ట్ ఫౌండేషన్ శుక్రవారం రాత్రి 7 గంటల ప్రాంతంలో రికార్డు సమయంలో పూర్తయిందని సీఆర్‌డీఏ కమిషనర్ చెరుకూరి శ్రీధర్ తెలిపారు. నిర్మాణ ప్రదేశంలో రాఫ్ట్ ఫౌండేషన్ తుది దశ పనులను ఆయన దగ్గరుండి పరిశీలించారు. అనంతరం శ్రీధర్ మాట్లాడుతూ జీఏడీ టవర్‌కు మొత్తం 11,236 క్యూబిక్ మీటర్ల కాంక్రీటును 55 గంటల్లో వేసినట్లు తెలిపారు. ఈ నెల 2న మధ్యాహ్నం టవర్ పనులు ప్రారంభించామన్నారు. 500 మంది కార్మికులు, ఇంజినీర్లు మూడు షిఫ్టుల్లో పనిచేశారని ఆయన తెలిపారు. సచివాలయం, హెచ్‌వోడీకి సంబంధించి టవర్-3 రాఫ్ట్ ఫౌండేషన్‌ను ఈ నెల ఒకటో తేదీ సాయంత్రం ప్రారంభించిన ఎల్అండ్‌టీ సంస్థ 58 గంటల్లో శుక్రవారం ఉదయానికి పనులు పూర్తి చేసిందన్నారు. డిసెంబరు 27న ముఖ్యమంత్రి టవర్-2 పనులు ప్రారంభించగా సంబంధిత గుత్తేదారు సంస్థ 66 గంటల్లో రాఫ్ట్ ఫౌండేషన్ పూర్తిచేసిందన్నారు.

కౌరవులు టెస్ట్‌ట్యూబ్ బేబీలే!

- ఆంధ్రా వర్సిటీ వీసీ అభిప్రాయం

జలంధర్: కౌరవులంతా టెస్ట్‌ట్యూబ్ బేబీలంటూ ఆంధ్రా విశ్వవిద్యాలయ ఉపకులపతి జి.నాగేశ్వరరావు శుక్రవారం నాడిక్కడ పేర్కొన్నారు. వేలాది ఏళ్ల క్రితం నుంచీ గైడెడ్ క్షిపణుల గురించిన పరిజ్ఞానం భారత్‌కు బాగా తెలుసనీ అన్నారు. ఇక్కడ జరుగుతున్న భారత సైన్స్ కాంగ్రెస్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. శ్రీ మహావిష్ణువు శత్రుసంహారం కోసం సుదర్శనచక్రాన్ని వదిలే వారని, లక్ష్య సాధన అనంతరం ఆ చక్రం కాస్తా వెనుదిరిగి వచ్చేదని, దీన్ని బట్టి చూస్తే గైడెడ్ క్షిపణి పరిజ్ఞానం భారత దేశానికి ఏ మాత్రం కొత్తకాదని స్పష్టమవుతోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన కౌరవుల మాతృమూర్తి గాంధారి గురించి ప్రస్తావించారు. వంద అండాలను వంద కుండల్లో ఉంచి ఫలదీకరించిన మీదటే కౌరవుల జననం జరిగిందన్నారు. వారిని టెస్ట్‌ట్యూబ్ బేబీలు కాదంటారా అని ప్రశ్నించారు.

ఈనాడు

చిరుదివ్వెలు వెలగాలి!

వరసగా దెబ్బమీద దెబ్బ తగులుతూ విలవిల్లాడుతున్న లఘు పరిశ్రమలకు సాంత్వన ప్రసాదించగల జంట పరిణామాలివి. ఎగుమతిదారులకు మూడు శాతం వడ్డీ రాయితీ కల్పించడానికి కేంద్ర మంత్రిమండలి ఆమోదం తెలపడం, అందులో మొదటిది. ఏకకాల రుణ పునర్ వ్యవస్థీకరణకు రిజర్వ్ బ్యాంక్ పచ్చజెండా ఊపడం, రెండోది! ఎగుమతిదారులకు కేంద్రం తాజా నజరానా 416 రకాల ఉత్పత్తులకు వర్తిస్తుందంటున్నారు. అవన్నీ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థ (ఎమ్ఎస్ఎమ్ఈ)లకు చెందినవే కావడం విశేషం. తద్వారా రూ.600కోట్ల మేర ప్రయోజనం కలుగుతుందన్నది, లఘు పరిశ్రమలకు కచ్చితంగా మంచి కబురే. అవి రూ.25కోట్ల వరకు బకాయిపడి చెల్లించలేకపోతున్న రుణాన్ని నిర్దిష్ట షరతులకు లోబడి ఒకసారి పునర్ వ్యవస్థీకరించడానికి ఆర్‌బీఐ అనుమతించడం మరింత శుభసమాచారం. దేశంలో వ్యవసాయం తరవాత అత్యధికంగా సుమారు 12 కోట్లమందికి ఉపాధి కల్పిస్తున్నవి లఘు పరిశ్రమలే. పరిమిత తోడ్పాటు వాటిని గట్టెక్కించలేదన్నది నిష్ఠురసత్యం. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థల ఆర్థిక సుస్థిరత కోసం చేపట్టాల్సిన దీర్ఘకాలిక చర్యలపై తగు సూచనలు చేసేందుకు ఎనమండుగురు సభ్యుల కమిటీని రిజర్వ్ బ్యాంక్ సరికొత్తగా కొలువుతీర్చింది. 'సెబీ' మాజీ సారథి యు.కె.సిన్హా నేతృత్వంలోని ప్రత్యేక సంఘం అంతర్జాతీయంగా చిన్న పరిశ్రమలకు సంబంధించి అత్యుత్తమ ప్రమాణాలను అధ్యయనం చేసి ఆరు నెలల్లో నివేదిక సమర్పించనుందంటున్నారు. సమస్యలతో నిత్య పోరాటం సాగిస్తూ ఏటికి ఎదురీదుతున్న ఎమ్ఎస్ఎమ్ఈలకు ఆలోగా ఉన్నంతలో ఉపశమనం కలిగించగల మరిన్ని అవకాశాల పరిశీలనను వాయిదా వెయ్యనేకూడదు.

దేశీయంగా నాలుగు కోట్లదాకా నమోదైన సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థల పురోగతిని దిగలాగుతున్న మౌలిక సమస్యలేమిటో లోగడ కమిటీలెన్నో నిగ్గుతేల్చాయి. రుణవసతి, విపణితో అనుసంధానం, ఆధునిక పరిజ్ఞానం లభ్యత, నిపుణ కార్మికులు, వ్యవస్థాగత సహకారం- వీటన్నింటా లెక్కకు మిక్కిలి లోటుపాట్ల మూలాన ఇంతలంతలవుతున్న కష్టనష్టాలు చిన్న పరిశ్రమల రంగాన్ని ఎదుగుదల కొరవడిన శిశువుగా మార్చేశాయి. అసలే ముక్కుతూ మూలుగుతూ ఉన్న రంగానికి పెద్ద నోట్ల రద్దు నేపథ్యంలో చెల్లింపుల సంక్షోభం దాపురించనుందని ప్రముఖ రేటింగ్ సంస్థ 'మూడీస్' రెండేళ్ల క్రితమే హెచ్చరించింది. అది అక్షరాలా నిజమైంది. ఆపై వస్తుసేవల పన్ను (జీఎస్‌టీ) ప్రభావంతో చిన్న పరిశ్రమలు మరింత ఉక్కిరిబిక్కిరైనట్లు నాలుగైదు నెలల క్రితం రిజర్వ్ బ్యాంక్ అధ్యయనమే స్పష్టీకరించింది. అంతకు మునుపు ట్రాన్స్ యూనియన్ సిబిల్, సిడ్బీ నివేదికా పెద్దనోట్ల రద్దు, జీఎస్‌టీ అమలువల్ల తలెత్తిన ఇబ్బందులు ఎమ్ఎస్ఎమ్ఈలను ఎలా కుదిపేశాయో వెల్లడించింది. ఆ జోడు ఇక్కట్లను మించిన తీవ్రాఘాతం చైనా రూపేణా దాపురించింది. పొరుగు దేశంనుంచి చౌక వస్తూత్పాదనల దిగుమతుల వెల్లువ కారణంగా ఒక్క సౌర ఫలకాల విభాగంలోనే రమారమి రెండు లక్షల ఉపాధి అవకాశాలు గల్లంతైనట్లు పార్లమెంటరీ స్థాయీసంఘం నివేదిక లెక్కకట్టింది. సమస్యల దాడితో ఆర్థిక సత్తువ కోల్పోతున్న చిన్న పరిశ్రమలకు అదనపు నిర్వహణ మూలధనం సమకూరుస్తూ బ్యాంకులు మరిన్ని రుణాలివ్వాలని రెండేళ్ల క్రితమే ఆర్‌బీఐ నిర్దేశించినా జరిగిందేమిటి? సకాలంలో సరైన రుణ లభ్యత ఎండమావిని తలపించడం, మునుపటి కమిటీల సిఫార్సులు దస్త్రాలకే పరిమితం కావడంవల్ల లక్షల సంఖ్యలో లఘు పరిశ్రమలు రుజాగ్రస్తమవుతున్నాయి. ఈ దురవస్థను చెదరగొట్టే క్రమంలో యు.కె.సిన్హా కమిటీ ఏ మేరకు నిర్ణాయక భూమిక పోషించగలదో చూడాలి!

ఎస్.ఎల్.కపూర్, డాక్టర్ ఎస్.పి.గుప్తా, కె.సి.చక్రబర్తి, అబిద్ హుస్సేన్, పి.ఆర్.నాయక్ ప్రభృతుల సారథ్యంలోని కమిటీలు భిన్న పార్శ్వాల్ని స్పృశిస్తూ పరిష్కారాలు సూచిస్తూ సమర్పించిన నివేదికలు ఏళ్ల తరబడి బూజుపట్టిపోతున్నాయి. మేలిమి సిఫార్సులకు మన్నన దక్కని పర్యవసానంగానే చిన్న పరిశ్రమలు ఛిన్నాభిన్నమవుతున్నట్లు గతంలో ధ్రువీకరించిన రిజర్వ్‌బ్యాంక్- ఇప్పుడు ఇంకో కమిటీని అవతరింపజేసింది! దేశంలో కమిటీల నియామకం, అరకొర చర్యలతోనే కాలయాపన చేస్తుండగా- సృజనాత్మక ప్రణాళికలతో చిన్న పరిశ్రమల్ని ప్రోత్సహించి విశ్వవిపణుల్ని కొల్లగొట్టడంలో చైనా, జపాన్, జర్మనీ, కొరియా వంటివి పోటీపడుతున్నాయి. తక్కిన ఐరోపా దేశాలకన్నా జర్మనీలో నిరుద్యోగం తక్కువగా ఉండటానికి అక్కడి 'మిటిల్ స్టాండ్' (ఎమ్ఎస్ఎమ్ఈ) సంస్థలే కారణం. నిర్దిష్ట పరిమాణంలో సర్కారీ కొనుగోళ్లు లఘు పరిశ్రమలకు లబ్ధి చేకూర్చేలా అమెరికా, కెనడా, దక్షిణాఫ్రికా, బ్రెజిల్, యూకే వంటివి పటిష్ఠ విధి విధానాలను అమలుపరుస్తున్నాయి. దేశవ్యాప్తంగా చిన్న పరిశ్రమల రంగానికి రూ.45 లక్షల కోట్ల మేర అవసరమైన నిధుల్లో బ్యాంకుల ద్వారా సమకూరుతున్నవి 18 శాతంలోపే. ఇక్కడి సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థల్లో 60 శాతందాకా గ్రామీణ భారతంలోనే నెలకొన్నాయి. వాటికి రుణవసతి పెంపొందించి ఆటవస్తువులు, పాదరక్షలు, జనపనార, హస్తకళల ఉత్పత్తిలో నైపుణ్య శిక్షణ అందించగలిగితే- తయారీ రంగం బలోపేతమవుతుంది. అటు నిరంతర వలసలతో బావురుమంటున్న పల్లెలూ నూతన జీవకళ సంతరించుకుంటాయి. నిరుద్యోగ సమస్యపై పటుతర పోరాట సాధనం కాగల సహజ సిద్ధ సామర్థ్యం చిన్న పరిశ్రమల రంగానికి ఉంది. ఆ బలిమిని జాతి కలిమిగా మార్చే వ్యూహాలు ఇకనైనా వడివడిగా పట్టాలకు ఎక్కాలి!


పంపిణీ సంస్థలకు పాట్లు

దేశ ప్రజలకు నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి ఆరంభం కానుందని కేంద్రం తాజాగా ప్రకటించింది. అత్యధిక రాష్ట్రాల్లో విద్యుత్ డిమాండు పెరుగుతున్నంత వేగంగా విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కమ్)ల ఆర్థిక పరిస్థితి మెరుగుపడక వెలవెలబోతున్నాయి. డిస్కమ్‌ల ఆర్థిక పరిస్థితి ఎలా ఉన్నప్పటికీ అవి అవసరాల మేరకు విద్యుత్ కొని ప్రజలకు ఇవ్వాలనే నిబంధనను 'తప్పనిసరి' చేస్తామని కేంద్రం చెబుతోంది. ఇందుకోసం ఉజ్వల్ డిస్కమ్ హామీ యోజన (ఉదయ్) పథకం-2 తెస్తామంటోంది. కానీ ఉదయ్-1 అమల్లోకి వచ్చి మూడేళ్లు దాటినా దేశవ్యాప్తంగా డిస్కమ్‌లు నష్టాలు, అప్పుల్లోనే సతమతమవుతున్నాయి. నిర్వహణాపరమైన లోపాలతో విద్యుత్ సరఫరా, పంపిణీ (టీఅండ్‌డీ) నష్టాలూ తగ్గడం లేదు. ఈ పథకం పేరుతో డిస్కమ్‌లకున్న రూ.2.69 లక్షల కోట్ల అప్పులను రాష్ట్రాల ఖాతాలకు బదిలీ చేయడంలో కేంద్రం సఫలీకృతమైంది. కానీ అదే స్ఫూర్తితో డిస్కమ్‌ల ఆర్థిక పరిస్థితి, నిర్వహణ మెరుగుపడకపోవడంతో లక్ష్యాలు మసకబారాయి.

ఎందుకీ నష్టాలు

ఉదయ్ పథకం ప్రధాన లక్ష్యాలు డిస్కమ్‌ల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచడం, టీ అండ్ డీ నష్టాలను తగ్గించడం ద్వారా ప్రతి యూనిట్ సరఫరాకు అయ్యే సగటు వ్యయం (ఏసీఎస్)- ప్రజల నుంచి వసూలవుతున్న సగటు సొమ్ము (ఏఆర్ఆర్) మధ్య అంతరం తగ్గించడం. కానీ ఈ లక్ష్యాల సాధనలో ఆశించిన ప్రగతి లేదు. ఈ పథకాన్ని 2015 సెప్టెంబరు నుంచి అమల్లోకి తీసుకు వచ్చినప్పుడు దేశవ్యాప్తంగా డిస్కమ్‌లకున్న మొత్తం నష్టాల్లో 75 శాతం (రూ.2.69 లక్షల కోట్లు) రాష్ట్ర ప్రభుత్వ ఖాతాలకు బదిలీ చేశారు. దీనితో రాష్ట్రాల రుణభారం పెరిగి ఆర్థిక ఇబ్బందుల్లో పడ్డాయని రేటింగ్ సంస్థలు చెపుతున్నాయి. కానీ డిస్కమ్‌ల ఆర్థిక పరిస్థితి అంతగా మెరుగుపడింది లేదు. పథకం ప్రారంభమైనప్పుడు ఏసీఎస్, ఏఆర్ఆర్‌ల మధ్య అంతరం యూనిట్‌కు 58 పైసలుండగా ఇప్పుడు 31 పైసలకు తగ్గినట్లు కేంద్ర విద్యుత్ శాఖ తాజాగా తెలిపింది. జాతీయ సగటు ఇలా తగ్గినట్లు కనిపిస్తున్నా ఒక్కో రాష్ట్రం లేదా డిస్కమ్ వారీగా చూస్తే కొన్నిచోట్ల 85 పైసల దాకా ఉంది. పంజాబ్ రాష్ట్ర విద్యుత్ సంస్థలో ఈ అంతరం 77, మధ్యప్రదేశ్ తూర్పు సంస్థలో 88 పైసల వరకూ ఉన్నట్లు కేంద్రం తాజాగా వెల్లడించింది. ఉత్తరప్రదేశ్‌లో అది 48 పైసలుంది.

విద్యుత్ పంపిణీ, సరఫరా నష్టాల శాతాన్ని దేశవ్యాప్తంగా కనీసం ఒక్కశాతం తగ్గిస్తే రూ.4146 కోట్లు మిగులుతాయని కేంద్ర విద్యుత్ మంత్రి ఆర్కే సింగ్ స్వయంగా ప్రకటించారు. సాంకేతిక సమస్యల వల్లనే విద్యుత్ సంస్థల టీ అండ్ టీ నష్టాలు గరిష్ఠంగా 7.71 శాతం వరకూ ఉన్నట్లు అంచనా. అంటే సంస్థల సాంకేతిక సామర్థ్యం మెరుగుపడితే అక్షరాలా ఏటా రూ.పాతిక వేల కోట్ల ప్రజాధనం డిస్కమ్‌లకు మిగులుతుంది. వాటి అసమర్థతను సరిదిద్దుకోలేక ఇప్పుడు ఈ సొమ్మంతా విద్యుత్ ఛార్జీల రూపంలో ప్రజల జేబుల నుంచే కొల్లగొడుతున్నాయి. ఇలాంటి అవలక్షణాలు డిస్కమ్‌లను పట్టి పీడిస్తున్నాయి. దేశంలో విద్యుత్కేంద్రాల స్థాపిత ఉత్పత్తి సామర్థ్యం మూడు లక్షల మెగావాట్లుగా ఉన్నట్లు అంచనా. కొనేవారు లేక అందులో 40 శాతం ఉత్పత్తి కూడా జరగడం లేదు. ఉదయ్ పథకం అమలును కేంద్ర విద్యుత్‌శాఖ నేరుగా రోజూ పర్యవేక్షిస్తూ ప్రగతి లెక్కలను వెల్లడిస్తోంది. కానీ లక్ష్యాలు నెరవేరుతున్నాయని చూపడానికి కొన్ని రాష్ట్రాలు ఇతర విధానాలు అనుసరిస్తున్నాయి. డిస్కమ్‌లకున్న నష్టాల పద్దు రాష్ట్ర ప్రభుత్వ ఖాతాల్లోకి పంపడంతో అప్పుల కిస్తీల భారం, వాటిపై వడ్డీల భారం తగ్గడం డిస్కమ్‌లకు కొంత ఊరటనిచ్చిన మాట వాస్తవమే. దీనివల్ల డిస్కమ్‌ల నష్టాలు గత మార్చి నాటికి రూ.17,352 కోట్లకు దిగివచ్చాయి. కానీ ఆ మేర మళ్లీ ఆదాయం పెంచుకోవడానికి చాలా డిస్కమ్‌లు విప్లవాత్మక చర్యలేవీ చేపట్టలేదు. ప్రజలకు విద్యుత్ ఇవ్వడానికి దాన్ని ఉత్పత్తి చేసే సంస్థ (జెన్‌కో)ల నుంచి డిస్కమ్‌లు కొనడం ఆనవాయితీ. కొన్న తరవాత 60 రోజుల్లోగా ఆ సొమ్మును డిస్కమ్‌లు చెల్లించేయాలి. కానీ చాలా రాష్ట్రాలు జెన్‌కోలకు, ప్రైవేటు విద్యుదుత్పత్తి సంస్థలకు ఈ సొమ్ము చెల్లించడకుండా బాకీ పెడుతున్నాయి. గత ఆర్థిక సంవత్సరం ఆఖరుకే ఈ బకాయిలు రూ.32 వేల కోట్లను దాటేశాయి. అభివృద్ధి చెందిన రాష్ట్రాలుగా పేరొందిన తమిళనాడు, మహారాష్ట్ర వంటి వాటితో పాటు ఉత్తర్‌ప్రదేశ్ సైతం ఈ బాకీలు పెంచడంలో పోటీపడుతున్నాయి. కొన్న విద్యుత్‌ను అమ్ముకున్న తరవాత ఆదాయం పెరిగితే ఇలాంటి బాకీలు పెట్టాల్సిన అవసరం డిస్కమ్‌లకు ఉండదు. ఆదాయం పెరగాలంటే ఖర్చులకు అనుగుణంగా ఛార్జీలైనా పెంచాలి లేదా రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్ల ద్వారా నిధులైనా కేటాయించాలి. ఈ రెండు పనులూ చాలా రాష్ట్రాల్లో జరగడం లేదు. ఉదయ్ పథకం మార్గదర్శకాల ప్రకారం ప్రతి మూడు నెలలకోమారు ఖర్చులకు అనుగుణంగా విద్యుత్



లక్ష్యాలకు చేరువకాని 'ఉదయ్'

ఛార్జీలను సవరించాలని ప్రతిపాదించారు. ప్రస్తుతం ఏడాదికి ఒకసారి వీటిని సవరించాలనే విధానం ఉంది. ఏడాదికి ఒకసారి పెంచడం వల్ల ప్రజలపై ఒకేసారి అధికంగా భారం వేసినట్లవుతుందని, ప్రతీ మూడు నెలలకు ఒకసారి సవరిస్తే అంతగా ఉండదని అనుకున్నారు. కానీ రాష్ట్రాలు మూడు నెలల సవరణకు అంగీకరించకపోవడంతో ఏడాది విధానమే సాగుతోంది. పోనీ ఏడాదికో మారైనా సవరిస్తున్నారా అంటే అదీ లేదు. దేశంలో ఎప్పుడూ ఏదో ఒక రాష్ట్రంలో ఎన్నికలు జరగడం ఆనవాయితీగా మారింది. ఫలితంగా ఓట్ల భయంతో ఎన్నికలకు ఒకటీ, రెండేళ్ల ముందు నుంచే విద్యుత్ ఛార్జీలు పెంచకుండా అధికార పార్టీలు జాగ్రత్తపడుతున్నాయి. కానీ విద్యుత్ ఉచితంగా ఉత్పత్తి అయ్యేది కాదు. కొత్త విద్యుత్కేంద్రాలు నిర్మించాలంటే మెగావాట్‌కు సగటున రూ.7 కోట్లు ఖర్చవుతుంది. అంటే కొత్త కేంద్రాల్లో కనీసం యూనిట్‌కు రూ.7 చెల్లిస్తేనే విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. ఆ సొమ్మును ప్రత్యక్షంగా ప్రజల నుంచి లేదా పరోక్షంగా రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రాబట్టుకోవాలి. ఇద్దరూ ఇవ్వనందునే డిస్కమ్‌లు ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుంటున్నాయి. ఇటీవల ఆంధ్రప్రదేశ్ డిస్కమ్‌లు ఆ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్‌సీ)కి వార్షిక ఆదాయ అవసరాల (ఏఆర్ఆర్) నివేదిక ఇచ్చాయి. దీనిప్రకారం గృహ వినియోగదారులకు 2015-20 మధ్య అయిదేళ్లలో విద్యుత్ ఛార్జీల పెంపు ప్రతిపాదనే లేదు. ప్రస్తుత ఏడాదిలో ఏపీ రాష్ట్ర డిస్కమ్‌ల ఆదాయలోటు రూ.6000 కోట్లుంటే వచ్చే ఏడాది రూ.8963 కోట్లకు చేరుతుందని డిస్కమ్‌లే వెల్లడించాయి. తెలంగాణలోనూ వచ్చే ఏడాది లోటు రూ.10 వేల కోట్ల వరకూ ఉంటుందని అంచనా.

దేశంలో విద్యుత్ లభ్యత, వినియోగ డిమాండు (రోజుకు మెగావాట్లు)

ప్రాంతం	స్థాపిత ఉత్పత్తి సామర్థ్యం	గరిష్ఠ డిమాండు
ఉత్తర భారతం	92,023	45,567
పశ్చిమం	1,13,086	54,339
దక్షిణం	1,04,083	43,911
తూర్పు	33,327	21,004
ఈశాన్యం	4,046	2672

ఆధారం: కేంద్రీయ విద్యుత్ మండలి తాజా నివేదిక

నిధులే కీలకం

విద్యుత్ సరఫరా నష్టాలు 21 శాతంగా ఉంటున్నాయి. పంపిణీ, సరఫరా నష్టాలు తగ్గాలంటే ఇప్పటికిప్పుడు మౌలిక సదుపాయాల మెరుగుదలకు రూ.లక్షా 75 వేల కోట్లు వెచ్చించాలి. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న డిస్కమ్‌లు ఇంత పెద్దమొత్తంలో నిధులు సమకూర్చుకోవడం కష్టం. గ్రామీణ ప్రాంతాలకు ఒక్కో యూనిట్ విద్యుత్‌ను కొన్ని రాష్ట్రాల్లో రూపాయిన్నరలోపే ఇస్తున్నారు. అదే సమయంలో యూనిట్‌ను ఆరేడు రూపాయలకు కొంటున్నారు. ఇంత తక్కువ ధరకు ఇచ్చే గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, ఫ్యూజులు అధునాతన పరిజ్ఞానంతో ఏర్పాటుచేయాలంటే పెద్దయెత్తున నిధులు ఖర్చుపెట్టాలి. ఆదాయం లేనిచోట భారీ పెట్టుబడులెందుకు పెట్టాలనే ధోరణిలో డిస్కమ్‌లున్నాయి. సరఫరా వ్యవస్థలు మెరుగుపడాలంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే సొంతంగా నిధులు సమకూర్చాలి. వాస్తవానికి దేశంలో విద్యుదుత్పత్తి, పంపిణీ సంస్థలు ఏ పనులు చేయాలన్నా రూ.వేల కోట్లు అప్పులు తెచ్చుకోవాల్సిందే. అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి విద్యుత్ సరఫరా చేస్తే ఆ ఖర్చుల ప్రకారం తిరిగి ఛార్జీలు వసూలు చేయాలన్నా- తుది నిర్ణయాధికారం రాష్ట్ర ప్రభుత్వాల చేతుల్లో ఉంది. డిస్కమ్‌లు అంటే కంపెనీ చట్టం కింద ఏర్పాటైన వాణిజ్య సంస్థలు. ప్రజలకు సేవలందించాలంటే వాటికవుతున్న ఖర్చులను ప్రభుత్వాలు భరించాలి. ఓట్లు రావేమోనన్న భయంతో ఛార్జీలు పెంచడానికి ప్రభుత్వాలు అంగీకరించవు. అలా అని ప్రభుత్వాలు రాయితీలు పూర్తిగా ఇస్తాయా అంటే అదీ లేదు. పేరుకు మాత్రమే డిస్కమ్‌లు కంపెనీలు. కానీ ఉద్యోగుల బదిలీలు, నియామకాల దగ్గరి నుంచి విద్యుత్ కొనుగోలు, సరఫరా, ఛార్జీల వరకూ నిర్ణయాధికారాలన్నీ రాజకీయ ప్రజాప్రతినిధుల చేతుల్లోనే ఉంటున్నాయి. వారిని కాదని అధికారులు నిర్ణయాలు తీసుకునే పరిస్థితి ఉండదు. ఇలాంటి పరిస్థితుల్లో డిస్కమ్‌లు నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తాయని ఎదురుచూడటం అత్యాశే అవుతుంది. ప్రతి రాష్ట్ర ప్రభుత్వం తనకు వీలున్నంతకాలం ఛార్జీలు పెంచకుండా ఆపుతుంది. ఇలా కొన్నేళ్లు గడిచాక డిస్కమ్‌లు పూర్తిగా మునిగిపోతున్నాయనే పరిస్థితి వస్తే ఉదయ్ లాంటి పథకాలు తెచ్చి వాటికున్న నష్టాల సొమ్మునంతా రాష్ట్ర ప్రభుత్వాల ఖాతాలకు కేంద్రం మారుస్తోంది. ఛార్జీలు పెంచకుండా రాష్ట్ర ప్రభుత్వ ఖాతాలకు మార్చడం వల్ల ఒరిగిందేమిటనేది పాలకులకే తెలియాలి. ఉదయ్ ప్రారంభం నాటికి 2015లో డిస్కమ్‌ల నష్టాలు రూ.3.58లక్షల కోట్లు. ఏళ్ల తరబడి రాష్ట్రాలు ఛార్జీల జోలికి వెళ్లకుండా ఉన్నందున అదనంగా పడిన వడ్డీల భారమే ఇందులో రూ.లక్ష కోట్లకు పైగా ఉన్నట్లు అంచనా. ఇలాంటి విధానాలతో అంతిమంగా మునిగేది ప్రజలే. ఈ విషయాన్ని గుర్తించి ఎప్పటికప్పుడు హేతుబద్ధంగా ఛార్జీలను సవరించి, మౌలిక సదుపాయాలు, డిస్కమ్‌ల సాంకేతిక సామర్థ్యాన్ని పెంచితే నాణ్యమైన విద్యుత్‌ను ఇవ్వగలం!

– మంగమూరి శ్రీనివాస్

ఉదయ్ పథకం కింద రాష్ట్రాలు భరించిన డిస్కమ్‌ల నష్టాలు (రూ.కోట్లు)

రాష్ట్రం	నష్టాల మొత్తం
రాజస్థాన్	72,090
ఉత్తర్‌ప్రదేశ్	49,510
హరియాణా	25,951
తమిళనాడు	22,815
పంజాబ్	15,629
తెలంగాణ	8,923
ఆంధ్రప్రదేశ్	8256
మహారాష్ట్ర	4,960
మధ్యప్రదేశ్	7,360
ఝార్ఖండ్	6,136
కశ్మీర్	3,538
బిహార్	3,109

అధిక వినియోగంతో అనర్థం

వ్యవసాయనికి నేల, నీరు, విత్తనం తరవాత ఎరువులే ప్రధాన అవసరం. క్రమేణా చీడపీడల నివారణకు సస్య రక్షణ మందులు అవసరమయ్యాయి. రసాయన పద్ధతులను అనుసరించడం వల్ల రైతులకు ఖర్చు తడిసి మోపెడవుతోంది. అందువల్ల వ్యయం తక్కువయ్యే ఉత్తమ వ్యవసాయ విధానాలపై చర్చ జోరందుకొంది. ప్రపంచవ్యాప్తంగా వ్యవసాయం పూర్తిగా ప్రకృతి పద్ధతులతో మొదలైంది. తరవాత కొత్త విధానాలు వచ్చాయి. కొత్త పంటలు, రకాలు, వాటిలో అధిక దిగుబడినిచ్చే సంకరాలు సాగులోకి వచ్చాయి. వాతావరణ మార్పులను, తెగుళ్లను తట్టుకొని దిగుబడినిచ్చే రకాల అన్వేషణలో నూతన రకాలు వస్తున్నాయి.

ప్రపంచవ్యాప్తంగా రసాయన ఎరువులు విస్తృతంగా వాడుకలో ఉన్నాయి. భారత్‌లో 2016-17లో నాలుగు కోట్ల టన్నుల రసాయన ఎరువులు ఉత్పత్తి అయ్యాయి. వీటిలో యూరియా అధికంగా వినియోగంలో ఉంది. రెండో ముఖ్యమైన ఎరువు భాస్వరం. సింగిల్- సూపర్‌ఫాస్ఫేట్ రూపంలోనూ, డై-అమ్మోనియం-ఫాస్ఫేట్ (డీఏపీ) రూపంలోనూ ఇది వినియోగంలో ఉంది. దేశంలో భాస్వరం మూలకాలు పరిమితంగా ఉన్నాయి. 88శాతం మేరకు డీఏపీని కెనడా, రష్యా, అమెరికాతో పాటు జోర్డాన్, మొరాకో వంటి దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నాం. ఈ మధ్యకాలంలో భాస్వరం మూలకాల ధరలు విదేశీ మార్కెట్లో తగ్గాయి. కాబట్టి డీఏపీని దిగుమతి చేసుకునే కంటే ముడిసరకు లభ్యమయ్యే ప్రాంతాల్లో తయారీ సంస్థలను నెలకొల్పడం ద్వారా ధరలు అదుపు చెయ్యవచ్చన్న ఆలోచనలో ప్రభుత్వం ఉంది. దేశంలో ముడి పొటాష్ నిల్వలు లేవు. అందువల్ల దిగుమతులే శరణ్యం. రసాయన ఎరువుల దిగుమతిపై ఏటా భారీగా డబ్బు ఖర్చవుతోంది. ఎరువుల దిగుమతి ఖర్చులు, వాటిపై ప్రభుత్వ సబ్సిడీలు పెనుభారంగా మారుతున్నాయి. అందువల్ల యూరియా తప్ప భాస్వరం, పొటాష్ ఎరువుల ధరలపై కేంద్ర ప్రభుత్వం రాయితీలు తగ్గించింది. యూరియాపై ప్రభుత్వ సబ్సిడీ ఉంది. అందువల్లే మార్కెట్లో ఇది చౌకగా లభిస్తుంది. దీని వల్ల చాలా రాష్ట్రాల్లో ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో దాని వినియోగం పెరిగింది.

సాధారణంగా పంటలకు 4:2:1 నిష్పత్తిలో వినియోగించాల్సిన నత్రజని, భాస్వరం, పొటాష్ పోషకాలను దేశవ్యాప్తంగా 7.2: 2.9:1 నిష్పత్తిలో వాడుతున్నారు. రసాయన ఎరువులు అధికంగా వాడే పంజాబ్‌లో 18.6:5.4:1 నిష్పత్తిలో వాటి వాడకం జరుగుతున్నట్లు రసాయన ఎరువుల పరిశ్రమల గణాంకాలు తెలుపుతున్నాయి. రసాయన ఎరువుల వినియోగంలో పోషకాల సమతుల్యంలోని లోటుపాట్లు వ్యవసాయానికి సమస్యగా మారుతున్నాయి. దీనిపై రైతుల్లో అవగాహన కల్పించడం ప్రభుత్వ బాధ్యత. ప్రభుత్వం సబ్సిడీపై సరఫరా చేసే యూరియా అంతా వ్యవసాయానికి ఉపయోగపడటం లేదని పరిశ్రమ వర్గాలకు, ప్రభుత్వానికీ తెలుసు. దీంతో 'నీమ్‌కోటెడ్' యూరియా తయారీని ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది.



ఎరువుల వాడకంలో పరిమితి

రసాయన ఎరువులను కట్టడి చేయడంతో పాటు సేంద్రియ ఎరువుల వినియోగాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. వీటి వినియోగం ద్వారా రసాయన ఎరువుల వాడకం 25శాతం వరకు తగ్గించవచ్చు. ఇవి పర్యావరణ హితమేగాక వ్యవసాయ భూముల స్థిరత్వానికి ఉపయోగపడతాయి. ఈ భూముల్లో ఉండవలసిన జీవ సమతుల్యాన్ని పెంచుతాయి. సేంద్రియ ఎరువులు ఎక్కువగా విత్తనశుద్ధికి, నారుశుద్ధికి తడినేలల్లో చల్లడానికి ఉపయోగించవచ్చు. వీటిని స్థానికంగానే తయారు చేసుకుని వాడుకోవచ్చు. ఇవి సూక్ష్మజీవులు, శిలీంద్రాల రూపంలో మొక్కలు, పైర్లకు ఉపయోగపడేవే. ఈ ఎరువులు నేలలో గల పోషకాలను పైర్లకు సమర్థంగా అందేలా చేస్తాయి.

భూములకు అవసరమైన బ్యాక్టీరియాను, శిలింద్రాలను పెంచుకుని, పెద్దయెత్తున వాటిని అభివృద్ధి చేసుకునే అవకాశాలున్నాయి. దేశంలో ఇప్పటికే వందకు పైగా బయో ఫెర్టిలైజర్స్ కంపెనీలున్నాయి. వీటి తయారీ సామర్థ్యం 86,000 మెట్రిక్ టన్నుల మేర ఉన్నా ప్రస్తుతం 20,000 టన్నుల ఉత్పత్తే జరుగుతోంది. జీవన ఎరువుల పరిమాణం పెంచుకునే అవకాశాలున్నాయి. వీటి వినియోగంతో వ్యవసాయ భూములలో జీవచైతన్యం తొణికిసలాడుతుంటుంది. నత్రజని వినియోగం పెరగడం, పోషకాల సమతుల్యత లోపించడం, సేంద్రియ ఎరువుల వాడకం తగ్గడం, పంటల సాంద్రత పెరగడం, పంటల సరళిలో మార్పులు, పంటపొలాల్లో కార్బన్ లోపించడం లాంటి సమస్యలతో తెలుగు రాష్ట్రాలలోని వ్యవసాయ భూముల్లో జింక్ లోపం కనిపిస్తుంది. దీనితోపాటు వేర్వేరు ప్రాంతలలో ఇనుము, బొరాన్, మెగ్నీషియం లోపాల వల్ల ప్రధాన పోషకాలైన నత్రజని, భాస్వరం, పొటాష్ అందించినా పైర్లు పెరగక, పోషక లోపాలతో దిగుబడులు తగ్గిపోతున్నాయి.

ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలలో సూక్ష్మపోషక లోపాలు వ్యవసాయానికి, ఉద్యానపంటలకు, అడ్డంకిగా ఉన్నాయి. ఈ సూక్ష్మపోషకాల మార్కెట్ అంతర్జాతీయంగా ప్రస్తుతం 25,000 కోట్ల రూపాయలున్నా రానున్న అయిదు సంవత్సరాలలో రూ. 40,000 కోట్లకు పెరిగే సూచనలున్నాయి. రైతులు రసాయన ఎరువులను పరిమితంగా వాడి ప్రయోజనం పొందాలి. సేంద్రియ ఎరువుల వాడకాన్ని పెంచాలి. అప్పుడే పంట భూములు బాగుపడతాయి. వ్యవసాయ దిగుబడులూ పెరుగుతాయి!

– డాక్టర్ మొవ్వ రామారావు

ఈనాడు లేఖలు

'శబరిమల' ఘటనలు బాధాకరం

శబరిమల దేవాలయంలో మహిళా ప్రవేశం అనంతరం జరుగుతున్న ఆందోళనలు, దాడులు, ఆస్తినష్టాలు బాధాకరం. రాజ్యాంగం ప్రకారం దేశం లౌకిక రాజ్యం. అందువల్లే ఎన్నో విభిన్న సంప్రదాయాల్ని ఇముడ్చుకొంటూ దేశం ముందుకుపోతోంది. ఆచారాలు తగనివి అనుకొంటే వదిలించుకోవాలి. ప్రగతిశీలం అనుకొంటే పాటించాలి. ప్రజాబాహుళ్యంలో ఆ లక్షణాలకు కొదవలేకపోయినా, వాటిని పూర్వపక్షం చేసే కొద్దిమంది వల్ల సామాజిక వాతావరణం కలుషితమవుతోంది. అక్షరాస్యతలో ముందున్న రాష్ట్రంలో చర్చలకు, సుహృద్భావ పరిష్కారాలకు అవకాశాలు సన్నగిల్లడం బాధాకరం. భావోద్వేగాలున్న చోట సమస్యలు పెరగడమే తప్ప తగ్గడం ఉండదు. ప్రభుత్వం, పౌరసమాజం, మీడియా, రాజకీయ పక్షాలు బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన తరుణమిది.

- డాక్టర్ డి.వి.జి.శంకరరావు, మాజీఎంపీ, పార్వతీపురం.

ప్రమాదకర ధోరణి

ఇటీవల అయిదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా పట్టణ ప్రాంతాల్లో పోలింగ్ శాతం పడిపోవటం ఆందోళన కలిగించింది. గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఓటుహక్కు వినియోగానికి చొరవ చూపుతున్న తరుణంలో పట్టణ ప్రాంతాల్లో అందుకు విరుద్ధమైన పరిస్థితి ఏర్పడటం ఆలోచించదగ్గ అంశం. రాజధాని హైదరాబాద్ నగరంతో పాటు వరంగల్, కరీంనగర్ వంటి నగరాల్లోనూ ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు పెద్దయెత్తున తరలిరాలేదు. ఉన్నత విద్యావంతులైన ప్రజలూ ఓటుహక్కు వినియోగానికి అనాసక్తి ప్రదర్శించడం దురదృష్టకరం. ఓటుహక్కుకు సంబంధించి ఎన్నికల సంఘం, స్వచ్ఛంద సంస్థలు ఎంతగా ప్రచారం చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. ఇది ప్రమాదకరమైన ధోరణి. ఈ పరిస్థితి ఇకనైనా మారాల్సిన అవసరం ఉంది.

- ఆర్.ఎస్.హేమంత్‌కుమార్, హైదరాబాద్

భావంలో జీవం

వసంతకాలంలో చెట్లను చూస్తే కొత్త చిగుళ్లు, కొత్త పూలు, కొత్త కాయలు కనిపించి మురిపిస్తాయి. ఆనందం వెల్లివిరుస్తుంది. మన శరీరాలనే చెట్లమీద కొత్త భావాలనే పక్షులు వాలాలి. హాయిగా నివసించాలి. అన్ని వైపులనుంచి ఎంతో ఉన్నతమైన, దివ్యమైన భావాలు రావాలి- అంటోంది ఋగ్వేదం.

కొత్త భావాలు వస్తాయి. అలాగని పాత భావాలు టోకున పోవాలని కాదు. పాత భావాలు కొత్తరెక్కలు తొడుక్కుని, కొత్తగా ముస్తాబై కనిపిస్తూ ఉంటాయి. అవీ ఎంతో ఆనందాన్ని కలగజేస్తుంటాయి. అది గెలుపొందే లక్షణం. విజేతలు భిన్నమైన పనులు చెయ్యరు. చేసే ప్రతి పనిలోనూ భిన్నత్వం చూపిస్తుంటారు అంటారు వ్యక్తిత్వ వికాస నిపుణులు.

అవును. ఎంతైనా కొత్తగా ఆలోచించి, కొత్తగా మాట్లాడటం, కొత్తగా చెయ్యడం ఆసక్తికరంగా ఉంటుంది. వాళ్ల సాంగత్యాన్ని ఎక్కువ మంది కోరుకుంటారు. మధురంగా మాట్లాడటంలో ఆంజనేయస్వామిని మించినవాడు లేడన్నది శ్రీరామచంద్రులవారి మాట. గొప్ప పనులు చెయ్యడంలో తనను మించినవాడు లేడని ఆంజనేయస్వామి నిరూపించాడు.

మనసు కొత్తదనాన్ని కోరుకుంటుంది. కొత్తదనంలో ఆకర్షణ మనసును వశపరచుకుంటుంది. మహా గాయకుడైనా పాడుతున్న పాటే పాడుతుంటే మనసుకు రుచించదు. చేతులు కరతాళధ్వనులు చెయ్యడానికి పైకి లేవవు. అది వాళ్ల తప్పు కాదు.

బ్రహ్మోత్సవాల్లో శ్రీవేంకటేశ్వరుడి ప్రభ ఒకలాగా ఉంటుంది. నిత్యదర్శనంలో మరోలా ఉంటుంది. దేవుడు మారడు. మన భావం మారుతుంది. భావాన్ని బట్టి మనసుంటుంది. మనసును బట్టి భావం ఉంటుంది. సృష్టి ఆదిలో ఉన్న చెట్ల విత్తనాలే ఇప్పటికీ మొలకెత్తుతూ వృక్షాలుగా ఎదుగుతున్నాయి. ఆ పచ్చదనంలోనే ఏదో కొత్తదనం ఉంది. ప్రకృతి ఎప్పుడూ నూతనోత్సాహాన్ని కలగజేస్తూనే ఉంటుంది.

పద్యాలెన్ని ఉన్నా బమ్మెర పోతన తేటతెలుగు పద్యం వేరు. కావ్యాలెన్ని ఉన్నా కాళిదాసు మహాకావ్యం వేరు. కథలెన్ని ఉన్నా పంచతంత్రం కథలు వేరు. జీవితాలెన్ని ఉన్నా శ్రీరాముడి జీవితం వేరు. జ్ఞానాలెన్ని ఉన్నా శ్రీకృష్ణజ్ఞానం వేరు. అవి సనాతనమైనవి,



శాశ్వతమైనవి, నిత్య నూతనమైనవి.

గిజిగాడి గూడు పాత అల్లికే. కానీ దాన్ని చూసినప్పుడల్లా మనకేవో కొత్త భావాలు స్ఫురిస్తాయి. హరప్పా, మొహెంజొదారో గుహలు చూసినప్పుడు శిథిలాల్లా కనిపించవు. గత చరిత్ర చిహ్నాల్లా అనిపిస్తాయి. కొత్త భావాలకు పురుడుపోస్తాయి. నయాగరా జలపాతం, నల్లటిమేఘం, కాటుక రంగు కళ్లు... ఎప్పుడూ చూసేవే. అయినా అవి కొత్త భావాలకు నిలయాలు. నల్లటి కృష్ణుడే ఎప్పుడూ ఒక కొత్త బృందావనాన్ని సృష్టిస్తూ ఉంటాడు!

భావాలు పుట్టని శరీరం సారం కోల్పోయిన భూమి. అందులో కొత్త భావాల తొలకరి చినుకులు కురవాలి. అప్పుడు రాళ్లమధ్య కూడా మొక్కలు కనిపిస్తాయి. రత్నాకరుడు రాయిలాంటి మనసు కలిగి ఉండేవాడు. దారిదోపిడుల్లో బతికినవాడు. అతడిలో భక్తిభావాలు రేకెత్తించడానికి రామనామాన్నే అపసవ్యంగా ఇచ్చాడు నారదుడు. దాన్ని నమ్మి జపించి వాల్మీకి అయ్యాడు. నిత్యనూతన దివ్యభావాల రసవత్తర రమ్యమైన కావ్యం రామాయణం రచించి లోకానికి అందించాడు.

'భావం మనసును పట్టుకుంటుందా, మనసును భావం పట్టుకుంటుందా' అనేది ఇదమిత్థంగా చెప్పలేం. భావంలోనే జీవం ఉంది. భావంతోనే ఈ జగత్తును సృష్టించాడు బ్రహ్మ. అందుకే భావనామయం జగత్తు అన్నారు. కొత్తభావాలు, కొత్తఊహలు, కొత్త దృశ్యాలు ఉన్నంతకాలం మనసు తేజోవంతంగా ఉంటుంది!

– ఆనందసాయి స్వామి

పండక్కి వూరెళ్లడమెలా?

- 'గోదావరి'లో 600 దాటిన వెయిటింగ్ లిస్ట్
- మిగిలిన రైళ్లలోనూ దాటిపోయిన నిరీక్షణ జాబితా పరిమితి
- ఒకే ప్రత్యేక రైలుతో చేతులు దులుపుకొన్న రైల్వేశాఖ
- విశాఖవైపు వెళ్లే ప్రయాణికుల ఆందోళన
- ఆర్టీసీలోనూ సీట్ల కొరత.. ప్రైవేటు బస్సుల్లో ఇష్టారాజ్యంగా ఛార్జీలు
- హైదరాబాద్-విశాఖపట్నం మధ్య రూ.4 వేల వరకు వసూలు
- దక్షిణమధ్య, తూర్పుకోస్తా రైల్వే జోన్ల మధ్య సమన్వయ లోపంతో ప్రయాణికుల కష్టాలు

ఈనాడు - హైదరాబాద్

పండక్కి సొంతూరైన విశాఖపట్నం వెళ్లేందుకు హైదరాబాద్‌లో ప్రైవేటు కొలువులో ఉన్న చంద్రశేఖర్ రైలు టికెట్ల కోసం స్టేషన్‌కు వెళ్లాడు. వెయిటింగ్‌లిస్ట్ (నిరీక్షణ జాబితా)లో సంఖ్య వందల్లో ఉండటంతో బస్సుల్లో ప్రయత్నించాడు. అక్కడా సీట్లు దొరకలేదు. మళ్లీ రైల్వే స్టేషన్‌కు వెళ్లాడు. ఏ రైలుకు ప్రయత్నించినా సమాధానం 'రిగ్రెట్' (నిరీక్షణ జాబితా పరిమితి దాటిన పరిస్థితి) మాత్రమే. ప్రయాణం ఒకరోజు అటో, ఇటో మార్చుకుందామని చూసినా పండగ మూడు రోజులూ అదే రద్దీ. ఛార్జీల భారాన్ని భరించేందుకు సిద్ధమై.. ప్రత్యేక రైల్లో చూడమని అడిగాడు. ఓ ప్రత్యేక రైలు ఉన్నా.. అందులోనూ వెయిటింగ్ లిస్ట్ ఐదొందలు దాటేసింది. ప్రైవేటు బస్సుల్లో వెళదామనుకుంటే.. అడ్డగోలు దోపిడీ. ఒక్కొక్కరికి రూ.3 వేల నుంచి రూ.4 వేల ఛార్జీలు.

సంక్రాంతి పండక్కి హైదరాబాద్ నుంచి విశాఖపట్నం సహా ఉత్తరాంధ్ర జిల్లాలకు వెళ్లాలనుకుంటున్న ప్రయాణికుల్లో చాలా మందిది దాదాపు ఇదే పరిస్థితి. జనవరి 10 నుంచే రైళ్లన్నీ కిటకిటలాడుతున్నాయి. రద్దీ విపరీతంగా ఉండటం.. రైల్వేశాఖ, ఆర్టీసీ సరిపడా బస్సులు సమకూర్చలేని పరిస్థితి ఉండటంతో ప్రైవేటు బస్సుల్లో ఛార్జీల దోపిడీ మొదలైంది. హైదరాబాద్ నుంచి విశాఖపట్నానికి ఏసీ బస్సుల్లో రూ.3 వేల నుంచి రూ.4 వేలు వసూలు చేస్తున్నారు.

జాడలేని ప్రత్యేక రైళ్లు

విశాఖపట్నం, ఆపై ప్రాంతాలకు వెళ్లే రైళ్లలో సాధారణ రోజుల్లోనే టికెట్లు దొరకడం అంతంతమాత్రం. సంక్రాంతి పండగ సమయంలో రద్దీ గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఈసారి వరుస సెలవులు ఉండటంతో హైదరాబాద్‌లో స్థిరపడిన ఉత్తరాంధ్రవాసులు పెద్దసంఖ్యలో పండక్కి సొంతూళ్లకు వెళుతున్నారు. ఇంత రద్దీ ఉన్నప్పుడు గణనీయసంఖ్యలో ప్రత్యేక రైళ్లు నడపాలి. జనవరి 10 నుంచి 13 వరకు రద్దీ ఎక్కువ ఉన్నప్పటికీ సికింద్రాబాద్ నుంచి ఒకేఒక్క ప్రత్యేక రైలును ప్రకటించి రైల్వేశాఖ చేతులు దులుపుకొంది. 'గతంలో కొన్ని ప్రత్యేక రైళ్లయినా విశాఖపట్నం వరకు నడిపేవారు. ఈసారి ఇంత రద్దీ ఉన్నా ప్రత్యేకరైళ్లు ఏర్పాటు చేయకపోవడం దారుణం' అని ఓ ప్రయాణికుడు మండిపడ్డారు. సంక్రాంతికి ప్రత్యేక రైళ్లు నడుపుతున్నామని ద.మ.రైల్వేవర్గాలు చెబుతున్నాయి. కానీ, అవి కాకినాడ, నర్సాపురం వరకే పరిమితమయ్యాయి.

ఈస్ట్‌కోస్ట్ జోన్ వివక్ష

ఒక జోన్ నుంచి బయల్దేరిన రైలు గమ్యస్థానం మరో జోన్ పరిధిలో ఉంటే ఆ రైలుకు అక్కడి అధికారుల ఆమోదం కూడా ఉండాలి. విశాఖపట్నం కేంద్రంగా ఉన్న వాల్తేర్ డివిజన్ భువనేశ్వర్ కేంద్రంగా ఉన్న ఈస్ట్‌కోస్ట్ జోన్ పరిధిలోకి వస్తుంది. సికింద్రాబాద్ నుంచి విశాఖకు ప్రత్యేక రైళ్లు నడపాలంటే రెండు జోన్ల మధ్య సమన్వయం ఉండాలి. రద్దీని బట్టి అదనపు రైళ్లు నడపాలి. ద.మ.రైల్వే.. ఈస్ట్‌కోస్ట్ జోన్ల మధ్య సమన్వయం లేకపోవడం కారణంగానే ప్రత్యేక రైళ్ల గురించి ఆలోచించకుండా ప్రయాణికుల్ని వ్యయప్రయాసలకు గురిచేస్తున్నారని పలువురు ప్రయాణికులు మండిపడుతున్నారు. తొలినుంచీ వాల్తేర్ డివిజన్ పట్ల నిర్వహణ ఇబ్బందుల వంటి సాంకేతిక కారణాల సాకుతో ఈస్ట్‌కోస్ట్ జోన్ వివక్ష చూపుతోందని.. విశాఖపట్నం వరకు ఉన్న రైళ్లను భువనేశ్వర్ వరకు పొడిగించిందని, ఈసారి కూడా విశాఖ నుంచి ప్రత్యేకరైళ్లను ఏర్పాటు చేయలేదని విమర్శిస్తున్నారు.

చాంతాడంత నిరీక్షణ జాబితా

జన్మభూమి, కోణార్క్, ఈస్ట్‌కోస్ట్, ఫలక్‌నుమా, విశాఖ, దురంతో, ఎల్‌టీటీ విశాఖ, విశాఖ గరీబ్‌రథ్ సహా అన్ని రైళ్లు 11, 12, 13 తేదీల్లో 'రిగ్రెట్'కు చేరుకున్నాయి. ఒక్క గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో వెయిటింగ్ లిస్ట్ టికెట్లు తీసుకునేందుకు అవకాశం ఉన్నా.. స్లీపర్ బోగీలో రిజర్వేషన్ కోసం ఇప్పటికే ఆరేడొందల మంది నిరీక్షణ జాబితాలో ఉన్నారు. 11న ప్రయాణానికి వెయిటింగ్‌లిస్ట్‌లో ఏకంగా 714 మంది టికెట్లు తీసుకున్నారు. 12, 13న ఇంచుమించు ఇదే పరిస్థితి. 11న ప్రత్యేకరైల్లో (నం.07149) వెయిటింగ్ లిస్ట్‌కు అవకాశం ఉన్నా అందులోనూ 586 మంది నిరీక్షణ జాబితా కింద టికెట్లు తీసుకున్నారు.



ఏసీలోనూ 400 వెయిటింగ్ లిస్ట్

ఏసీ బోగీల్లోనూ వందల్లో నిరీక్షణ జాబితా ఉండటం రద్దీ తీవ్రతకు అద్దం పడుతోంది. అన్నీ ఏసీ బోగీలే ఉండే గరీబ్‌రథ్‌లో నిరీక్షణ జాబితాలో టికెట్లు తీసుకున్న వారి సంఖ్య ఆరొందలు దాటడంతో 11, 12 తేదీల్లో టికెట్లకోసం ప్రయత్నిస్తే ఆన్‌లైన్లో 'రిగ్రెట్' చూపుతోంది. 13న 409 మంది వెయిటింగ్‌లో ఉన్నారు. కోణార్క్, ఈస్ట్‌కోస్ట్, ఫలక్‌నుమా, విశాఖ వంటి రైళ్లలోనూ ఏసీత్రీటైర్ రిగ్రెట్‌కు చేరింది. గోదావరిలో మూడొందలకుపైగా నిరీక్షణలో ఉన్నారు.

విశాఖపట్నం, ఆపై వెళ్లే రైళ్లలో శుక్రవారం పరిస్థితి

తేదీ	మొత్తంరైళ్లు	రిగ్రెట్	వెయిటింగ్‌లిస్ట్
జనవరి 11	10	9	2
జనవరి 12	12	10	2
జనవరి 13	10	7	3

శ్రీశైలంలో దిగువ నీటిని తోడొద్దు

రెండు రాష్ట్రాల ఈఎన్‌సీలకు కృష్ణా బోర్డు లేఖ

ఈనాడు, హైదరాబాద్: శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల్లో కనీస నీటి మట్టాలను కొనసాగించాలంటూ తెలంగాణ, ఏపీ రాష్ట్రాల ఈఎన్‌సీలకు కృష్ణా నదీ యాజమాన్య బోర్డు శుక్రవారం లేఖ రాసింది. నాగార్జునసాగర్‌లో 510 అడుగులు, శ్రీశైలంలో 834 అడుగుల మట్టాలను కొనసాగించేలా ఆయా ప్రాజెక్టుల నుంచి చేపడుతున్న నీటి తోడకాన్ని నిలిపివేయాలని సూచించింది. గతేడాది డిసెంబరు 17 నుంచి ఈ ఏడాది మే 31 వరకు రెండు ప్రాజెక్టుల నుంచి తాగు, సాగునీటి అవసరాలకు నీటిని తోడుకునేందుకు కేఆర్ఎంబీ గత డిసెంబరు 21న ఆదేశాలిచ్చింది. హంద్రీ-నీవా సుజల స్రవంతి, ముచ్చుమర్రి ఎత్తిపోతల నుంచి ఏపీ 6.69 టీఎంసీలు, మహాత్మా గాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల నుంచి తెలంగాణ 8 టీఎంసీలు తోడుకునేందుకు అనుమతి లభించింది. అయితే శుక్రవారం నాటికి ఏపీ 3.027 టీఎంసీలు, తెలంగాణ 3.031 టీఎంసీలను వినియోగించుకున్నాయని పేర్కొంది. ఇంకా ఏపీకి 3.66, తెలంగాణకు 4.96 టీఎంసీలు మిగిలి ఉన్నాయని తెలిపింది. ప్రస్తుతం శ్రీశైలం జలాశయం నీటిమట్టం 838.30 అడుగులు ఉందని పేర్కొంది. జలాశయంలో 59.28 టీఎంసీల నీళ్లు ఉండగా కనీస నీటినిల్వ మట్టం 53.85 టీఎంసీలను తీసివేస్తే ఇంకా 5.42 టీఎంసీలు మాత్రమే తోడుకునే అవకాశాలు ఉన్నాయంది. దీనికి అనుగుణంగా తెలంగాణ, ఏపీ జలవిద్యుత్తు ఉత్పత్తిని కూడా నిలిపివేసి సహకరించాలంటూ లేఖలో కేఆర్ఎంబీ సభ్య కార్యదర్శి ఎ.పరమేశం సూచించారు. ఒకవేళ కనీస నీటిమట్టానికి దిగువన నీటిని వినియోగించుకోవాల్సి వస్తే బోర్డు అనుమతులు తప్పవని, ఆ మేరకు ప్రతిపాదనలు పంపాలని ఆయన రెండు రాష్ట్రాలకు సూచించారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎన్ఐపీహెచ్ఎం డైరెక్టర్ జనరల్ జయలక్ష్మి. చిత్రంలో పొగాకు బోర్డు ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, ఇన్‌ఛార్జి ఛైర్మన్ కె.సునీత, కార్యదర్శి శ్రీధర్‌బాబు, పాలకవర్గ సభ్యులు

క్రిమిసంహారక అవశేషాలతో ఎగుమతులకు ఆటంకాలు

ఎన్ఐపీహెచ్ఎం డైరెక్టర్ జనరల్ జయలక్ష్మి వెల్లడి

ఈనాడు, అమరావతి: దేశవ్యాప్తంగా అన్నదాతలు పండిస్తున్న పంటల ఉత్పత్తుల్లో క్రిమి సంహారక మందుల అవశేషాలు అధికంగా ఉంటున్నాయని హైదరాబాద్‌లోని ఎన్ఐపీహెచ్ఎం (నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్) డైరెక్టర్ జనరల్ జి.జయలక్ష్మి అన్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత ఉత్పత్తుల ఎగుమతులకు విదేశాల నుంచి అనుమతులు రావటంలో సమస్యలు ఎదురవుతున్నట్లు ఆమె చెప్పారు. భారత పొగాకు బోర్డు 43వ వ్యవస్థాపక దినోత్సవం గుంటూరులోని ఐటీసీ హాలులో శుక్రవారం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన జయలక్ష్మి మాట్లాడుతూ, పొగాకు, ఇతర పంటల సాగు చేస్తున్న రైతులు పురుగు మందులు, ఎరువులను ఎక్కువగా వాడుతుండటంతో సంబంధిత అవశేషాల శాతం అధికంగా ఉంటోందన్నారు. దీంతో బయటి దేశాలు వాటి కొనుగోలుకు అనుమతులు ఇవ్వడం లేదన్నారు. సేంద్రియ, ప్రకృతి వ్యవసాయం ద్వారా భూసారం పెరగడంతో పాటు పెట్టుబడి ఖర్చులు కూడా తగ్గి అధిక దిగుబడులు సాధ్యపడతాయన్నారు. 2014 నుంచి పొగాకు బోర్డుతో ఒప్పందం కుదుర్చుకుని ప్రకృతి సేద్యంపై రైతులకు తాము శిక్షణ ఇస్తున్నామన్నారు. పొగాకు బోర్డు ఇన్‌ఛార్జి ఛైర్మన్ సునీత మాట్లాడుతూ.. భారత్ నుంచి పొగాకు దిగుమతిపై చైనా విధించిన ఆంక్షలను తొలగించేలా బోర్డు కృషి చేస్తుందని చెప్పారు. ఈ నెల 21వ తేదీన కేంద్ర వాణిజ్యశాఖ కార్యదర్శి నేతృత్వంలోని బృందం చైనాలో పర్యటించి ఈ విషయమై చర్చిస్తుందన్నారు. అనంతరం ఉత్తమ రైతులను సన్మానించారు. సమావేశంలో పొగాకు బోర్డు ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, కార్యదర్శి శ్రీధర్‌బాబు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జిలతో వైద్యుల నిరసన

- వైద్య కమిషన్ బిల్లు, వినియోగదారుల రక్షణ చట్టంపై ఆందోళన
- ఉపసంహరించుకోవాలని భారతీయ వైద్య సంఘం డిమాండ్

ఈనాడు, అమరావతి: జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) బిల్లు-2017, సవరించిన వినియోగదారుల రక్షణ చట్టం-2018కి వ్యతిరేకంగా భారతీయ వైద్య సంఘం ఆంధ్రప్రదేశ్ శాఖ శుక్రవారం నిరసన దినం పాటించింది. ఈ సంఘం సభ్యులు రాష్ట్రంలో 20 వేల మంది వరకు ఉన్నారు. వీరంతా రాష్ట్రవ్యాప్తంగా నల్ల బ్యాడ్జిలతో నిరసన తెలిపినట్లు సంఘం వెల్లడించింది. ఇప్పటికే లోక్‌సభలో ఆమోదం పొందిన ఈ బిల్లులను రాజ్యసభ ఆమోదించాల్సి ఉంది. ఈ బిల్లులను ఆమోదిస్తే సామాన్యులు, వైద్యులకు కొత్త సమస్యలు వస్తాయని సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ పి.గంగాధరరావు, రాష్ట్ర అధ్యక్షులు, గౌరవ ప్రధాన కార్యదర్శి డి.శ్రీహరిరావు, పి.ఫణిందర్ పేర్కొన్నారు. శుక్రవారం వీరు విజయవాడలో విలేకరులతో మాట్లాడారు. "ఎంసీఐ స్థానంలో తెస్తున్న ఎన్ఎంసీ బిల్లుతో వైద్య విద్య నాణ్యత ప్రమాణాలపై ప్రభావం పడుతుంది. నిర్ణయాలు తీసుకునే కీలక స్థానాల్లో నిష్ణాతులైన వైద్యులకు స్థానం కల్పించలేదు. స్వయం ప్రతిపత్తి సంస్థగా ఉన్న ఎంసీఐని పునరుద్ధరించాలి. సవరించిన వినియోగదారుల రక్షణ బిల్లులో చిన్నచిన్న తప్పులకు కూడా ఆస్పత్రులకు లక్షలాది రూపాయల భారీ జరిమానాలు విధించేలా నిబంధనలు పొందుపరిచారు. జబ్బుతో వచ్చి చనిపోయిన వ్యక్తుల విషయంలో అనేక అంశాలు పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. వైద్యులు రోగుల్ని చూడాలంటే భయపడే పరిస్థితులు వస్తాయి. బిల్లులో పేర్కొన్న నిబంధన ప్రకారం వైద్య రంగంతో సంబంధంలేని వారు ఆస్పత్రులపై వచ్చిన ఫిర్యాదులపై విచారణ జరపాల్సి ఉంటుంది. ఇది ఎంత వరకు సమంజసం. కేంద్రం నుంచి స్పందన రాకుంటే వైద్య సంఘాలు ఐక్యమై బిల్లులకు వ్యతిరేకంగా పోరాటాన్ని ఉద్ధృతం చేస్తాయి" అని హెచ్చరించారు.



విజయవాడలో విలేకరులతో మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర అధ్యక్షులు డి.శ్రీహరిరావు, చిత్రంలో పి.ఫణిందర్ తదితరులు

విశాఖ ఉక్కు వద్ద రూ.27 కోట్లు

- సీఎస్ఆర్ నిధులపై పార్లమెంటరీ స్థాయీ సంఘం నివేదిక
- ఎప్పటికప్పుడు ఖర్చు చేయాలని సిఫారసు

ఈనాడు, దిల్లీ: విశాఖ రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ వద్ద గత అయిదేళ్లలో కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధులు(సీఆర్ఎస్ఆర్) రూ.26.83 కోట్లు మిగిలిపోయినట్లు పార్లమెంటరీ స్థాయీ సంఘం పేర్కొంది. కేంద్ర ఉక్కుశాఖ ఆధ్వర్యంలోని ప్రభుత్వరంగ సంస్థలు ఖర్చుచేస్తున్న సీఎస్ఆర్ నిధులపై అధ్యయనం చేసిన స్థాయీ సంఘం శుక్రవారం పార్లమెంటుకు నివేదిక సమర్పించింది. విశాఖ స్టీల్ గత అయిదేళ్లలో సీఆర్ఆర్ కోసం రూ.71.32 కోట్ల బడ్జెట్ కేటాయించగా అందులో రూ.44.49 కోట్లు మాత్రమే ఖర్చయినట్లు తెలిపింది. 2018-19లో సంస్థ వద్ద రూ.8.31 కోట్ల సీఎస్ఆర్ మిగులు నిధులు ఉన్నట్లు వెల్లడించింది.

ఏటా పెద్దమొత్తంలో డబ్బు ఖర్చుకాకుండా నిరుపయోగంగా పడి ఉండటాన్ని స్థాయీ సంఘం తప్పుబట్టింది. ఇందుకు గల కారణాలను కేంద్ర ఉక్కుశాఖ, ఆర్ఐఎన్ఎల్ పాలకమండలి లోతుగా విశ్లేషించి, దిద్దుబాటు చర్యలు తీసుకోవాలని సూచించింది. కనీసం ఈ సంవత్సరం నుంచి అయినా సీఎస్ఆర్ నిధులను ఎప్పటికప్పుడు ఖర్చు చేసేందుకు చర్యలు తీసుకోవాలని స్థాయీ సంఘం సిఫార్సు చేసింది.

సీఎస్ఆర్ కింది స్టీలు ప్లాంట్ చేపట్టిన పనులు

★ విశాఖపట్నం జిల్లాలో 160, తూర్పుగోదావరి జిల్లాలో 6 మరుగుదొడ్ల నిర్మాణం.

★ విశాఖపట్నంలో గత నాలుగేళ్లలో 1,090 మంది ఎస్సీ యువతకు, 840 మంది దివ్యాంగులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ.

విశాఖ స్టీల్ సీఎస్ఆర్ నిధుల వ్యయం తీరు (రూ.కోట్లలో)...

సంవత్సరం	బడ్జెట్	ఖర్చు	మిగులు
2014-15	17.67	14.04	3.63
2015-16	15.00	8.73	6.27
2016-17	13.75	8.53	5.22
2017-18	13.00	9.60	3.40
2018-19 (సెప్టెంబర్‌వరకు)	11.90	3.59	8.31
మొత్తం	71.32	44.49	26.83

నేడు జగన్‌ను కలవనున్న అలీ

9న వైకాపాలో చేరే అవకాశం

ఈనాడు, అమరావతి: సినీ హాస్యనటుడు అలీ శనివారం వైకాపా అధ్యక్షుడు జగన్‌ను కలవనున్నారు. మొదట పార్టీ మాజీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డిని పశ్చిమగోదావరిలో కలిసి అక్కడినుంచి జగన్ వద్దకు వెళతారని సమాచారం.

ఫ్యాషన్ డిజైనింగ్‌లో మహిళలకు ఉచిత శిక్షణ

ఈనాడు డిజిటల్, అమరావతి: టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీపార్లర్ నిర్వహణ, ఎంఎస్ ఆఫీస్, అకౌంటింగ్ ప్యాకేజీలో మహిళలకు ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బ్యాంకర్ల గ్రామీణ, ఔత్సాహికుల అభివృద్ధి సంస్థ (బైరెడ్) తెలిపింది. శిక్షణ కాలంలో ఉచితంగా వసతి, భోజన సౌకర్యం కల్పిస్తామని సంస్థ సంచాలకులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. "రాజేంద్రనగర్‌లోని (హైదరాబాద్) క్యాంపస్‌లో ఫిబ్రవరి 2 నుంచి మార్చి 15 వరకూ శిక్షణ ఉంటుంది. 19-35 సంవత్సరాల మధ్య వయసున్న వారు అర్హులు. జనవరి 4 నుంచి 20 వరకూ www.bired.org వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. కోర్సులను బట్టి 8వ తరగతి నుంచి డిగ్రీ వరకూ విద్యార్హతలు నిర్ణయించాం" అని సంచాలకులు తెలిపారు.

తప్పు కళాశాలలది.. వేదన విద్యార్థులది

- కులం పేరు తప్పుగా నమోదు చేసిన పలు విద్యాసంస్థలు
- విడుదల కాని ఉపకారవేతనాలు, బోధనా రుసుములు
- వేలమంది ఈబీసీ విద్యార్థుల ఎదురుచూపులు

ఈనాడు డిజిటల్ - అమరావతి

విద్యార్థుల వివరాలు నమోదు చేయడంలో కళాశాలల యాజమాన్యాలు పొరపాటు చేశాయి. దాన్ని సరిదిద్దడంలో సంక్షేమ శాఖల అధికారులు జాప్యం చేశారు. ఈ నిర్లక్ష్యం వేల మంది ఈబీసీ విద్యార్థుల పాలిట శాపంగా మారింది. ఉపకార వేతనాలు, బోధనా రుసుములు కోసం చేసే దరఖాస్తులో కళాశాలల యాజమాన్యాలు కులం పేరు తప్పుగా నమోదు చేయడంతో ఏకంగా సామాజిక వర్గాలే మారిపోయాయి. రాయలసీమ జిల్లాల్లోని రెడ్డి సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులను కాపు కోటా కింద పరిగణించి వివరాలు నమోదు చేయడంతో ఈ సమస్య తలెత్తింది. దీన్ని సత్వరం పరిష్కరించాల్సిన అధికార యంత్రాంగం, కళాశాలలు తప్పు మాది కాదంటూ ఒకరిపై ఒకరు చెప్పుకుంటూ కాలయాపన చేస్తున్నాయి. మరో రెండు నెలల్లో పరీక్షలు ముంచుకొస్తుండటంతో విద్యార్థుల్లో ఆందోళన పెరుగుతోంది. సమస్య పరిష్కారం అవుతుందో లేదోనని ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

పొరపాటు తెచ్చిన చిక్కులు..

ఓపెన్ కేటగిరీలోని పేద విద్యార్థులను ఈబీసీ (ఆర్థికంగా వెనుకబడిన తరగతులు)గా గుర్తించి ప్రభుత్వం ఉపకార వేతనాలు, బోధనా రుసుములు ఇస్తోంది. ఇందుకోసం ఈ ఏడాది దరఖాస్తులు ఆహ్వానించింది. జ్ఞానభూమి వెబ్‌సైట్ ద్వారా కళాశాలల యాజమాన్యాలే విద్యార్థుల వివరాలను నమోదు చేసే విధానం ఉంది. ఆప్షన్స్‌లో కాపు (బలిజ), రెడ్డి అని వేర్వేరు కేటగిరీలు ఉన్నాయి. ఇక్కడే కళాశాలలు పొరపాటు చేశాయి. రాయలసీమలోని నాలుగు జిల్లాల్లో రెడ్డి అంటే కాపు అని వాడుకలో ఉంది. రాయలసీమ మినహా మిగతా జిల్లాల్లో కాపు అంటే బలిజ, ఒంటరి, తెలగ వర్గాలకు చెందిన వారని అర్థం. దీనిపై స్పష్టత లేని కళాశాలల యాజమాన్యాలు రెడ్డి విద్యార్థులను కూడా కాపు లాగిన్‌లో నమోదు చేశాయి. ఇలా వచ్చిన దరఖాస్తులను పరిశీలించిన కాపు కార్పొరేషన్ తప్పును గుర్తించింది. వీరికి ఉపకార వేతనాలు విడుదల చేయడం సాధ్యం కాదని తేల్చింది. కులం పేరు తప్పుగా నమోదైన వారు 30వేల మందిపైనే ఉంటారని బీసీ సంక్షేమ శాఖ అధికారులు చెబుతున్నారు.

మరోసారి అవకాశం ఇచ్చినా..

సామాజిక వర్గం తప్పుగా నమోదైందని గుర్తించిన బీసీ సంక్షేమశాఖ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లింది. దరఖాస్తుదారుల్లో కేవలం కాపు విద్యార్థుల జాబితా గుర్తించి పంపాలని సూచించారు. అప్పటికే అన్ని వర్గాల విద్యార్థుల జాబితాను పంపడంతో సమస్య మొదటికొచ్చింది. రెడ్డి విద్యార్థుల జాబితాను ఈబీసీలోకి మారిస్తేనే నిధులు విడుదల చేసే అవకాశం ఉన్నా ప్రక్రియ వేగంగా జరగకపోవడం విద్యార్థులకు ఇబ్బందికరంగా మారింది. కుల ధ్రువీకరణ పత్రాల ఆధారంగా రెడ్డి విద్యార్థుల జాబితాను వేరు చేసే ప్రయత్నం జరుగుతోందని బీసీ సంక్షేమశాఖ అధికారి ఒకరు తెలిపారు.

ఫీజు కట్టమని ఒత్తిడి..

'మాది రెడ్డి సామాజికవర్గం. ఈబీసీ విభాగం కింద బోధనా రుసుము ప్రభుత్వమే చెల్లిస్తుందన్న భరోసాతో ఎంటెక్ కోర్సులో చేరా. కళాశాల యాజమాన్యం కాపు (బలిజ) వర్గంగా నమోదు చేసింది. ఈ తప్పు కారణంగా బోధనా రుసుం, ఉపకార వేతనం విడుదల కాలేదు. ఫీజు కడితేనే పరీక్షలకు అనుమతిస్తామని కళాశాల యాజమాన్యం తేల్చి చెబుతోంది. ఏడాదికి రూ.50 వేల ఫీజు ఎక్కడి నుంచి చెల్లించాలి. సమస్య పరిష్కారమవుతుందని బీసీ సంక్షేమ శాఖ అధికారులు చెబుతున్నారు. పరీక్షలు దగ్గర పడుతున్నాయి. ఏం చేయాలో అర్థం కావడం లేదు.'

- ఓ విద్యార్థి, ఎంటెక్ ద్వితీయ సంవత్సరం, కడప

శశికళతో దినకరన్ భేటీ

బెంగళూరు, న్యూస్‌టుడే: బెంగళూరు కేంద్ర కారాగారంలోఉన్న శశికళతో ఆమె బంధువు దినకరన్ శుక్రవారం భేటీ అయ్యారు. తిరువాయూర్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా సేవలందించిన డీఎంకే అధినేత కరుణానిధి మరణంతో అక్కడ ఈనెల 28న ఉప ఎన్నిక నిర్వహించనున్నారు. తమ పార్టీ నుంచి ఎన్నికల బరిలో ఎవరిని నిలపాలనే అంశమై ఆయన నాలుగు గంటల పాటు చర్చలు జరిపారు. పోటీలో నిలిపే అభ్యర్థిని శశికళ నిర్ణయించారని, శనివారం ఆ అభ్యర్థి నామినేషన్ వేస్తారని దినకరన్ తెలిపారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో 'అమ్మ మక్కళ్ మున్నేట్ర కళగం పార్టీ' అభ్యర్థులను బరిలో నిలిపే అంశంపైనా చర్చించామని ఆయన వెల్లడించారు.

శశికళతో విజయశాంతి చర్చలు!

సీనియర్ నటి, తెలంగాణ కాంగ్రెస్ పార్టీ నాయకురాలు విజయశాంతి ఈ వారం ప్రారంభంలో శశికళతో ములాఖత్ అయ్యారని బెంగళూరు కారాగార అధికారులు శుక్రవారం ధ్రువీకరించారు. కాంగ్రెస్ పార్టీకి మద్దతు కోరేందుకు విజయశాంతి వచ్చినట్లు సమాచారం. తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు ప్రతిపాదించిన ఫెడరల్ ఫ్రంట్ విషయమై విజయశాంతి వద్ద శశికళ ఆరా తీశారని సమాచారం.



విజయవాడలోని అజిత్‌సింగ్ నగర్‌లో ఏళ్లుగా పేరుకుపోయిన చెత్తను సేంద్రియ ఎరువుగా మారుస్తూ.



చెత్త నుంచి ఇటుకల తయారీకి సిద్ధమవుతున్న ఎంఆర్ఎఫ్ ప్లాంట్

సంపద సృష్టి.. చెత్తకు విముక్తి

చెత్తను సరైన రీతిలో వినియోగించుకుంటే సంపదను సృష్టించవచ్చు.. విద్యుత్తు ఉత్పత్తి చేయవచ్చు.. సేంద్రియ ఎరువులనూ తయారు చేయవచ్చు. ప్రస్తుతం ఈ విషయంలో విజయవాడ నగరపాలక సంస్థ(వీఎంసీ) వడివడిగా అడుగులు వేస్తోంది. దీనిలో భాగంగా నగరంలోని అజిత్‌సింగ్ నగర్‌లో కొన్నేళ్లుగా పేరుకుపోయిన చెత్తను వేరుచేసి ఎరువుగా మార్చేందుకుగాను రూ.24 కోట్లు వెచ్చించింది. ఇప్పటివరకు స్థానికంగా సుమారు 75 వేల టన్నుల చెత్తను సేంద్రియ ఎరువుగా మార్చారు. ప్రస్తుతానికి వీటిని అన్నదాతలకు ఉచితంగా అందజేస్తున్నారు. మరోవైపు, అదే ప్రాంగణంలో యూఎన్‌డీపీ, కోకాకోలా సంస్థల సంయుక్త భాగస్వామ్యంతో.. వీఎంసీ ఎంఆర్ఎఫ్ (మెటీరియల్ రికవరీ ఫెసిలిటీ) పేరుతో ప్లాంటునూ ఏర్పాటు చేస్తోంది. దీని ద్వారా నగరంలో ఉత్పత్తి అవుతున్న ప్లాస్టిక్ వ్యర్థాలను కరిగించి.. నిర్మాణ రంగానికి అవసరమైన ఇటుకలను తయారు చేయనున్నారు. వీటి విక్రయం ద్వారా నగరపాలక సంస్థకు సంపద చేకూరనుందని భావిస్తున్నట్లు అధికారులు చెప్పారు. **- ఈనాడు, అమరావతి**

మేమే ఓడిపోతే.. మీకు డిపాజిట్లు వస్తాయా?



రాజధాని నిర్మాణానికి సాయం అందించిన విశ్రాంత డీఈవో బేగంకు నమస్కరిస్తున్న సీఎం చంద్రబాబు

(మొదటి పేజీ తరువాయి)

నిలదీస్తున్నా.. మీ వల్ల ఒక్క పనైందా..? లాభం వచ్చిందా... కష్టాలే వచ్చాయి...' అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. 'రఫేల్ యుద్ధ విమానాల విషయంలో పెద్దఎత్తున అవినీతికి పాల్పడి మా గురించి మాట్లాడతారా? తక్కువ అవినీతి ఉండే వాటిల్లో మూడోరాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ఉంది. వెనుకబడిన ప్రాంతాలకు నిధులు ఎందుకు ఇవ్వలేదని హైకోర్టు ప్రశ్నిస్తే మీ సమాధానం ఏమిటి. మమ్మల్ని బెదిరించలేరు. అణగదొక్కలేరు. మా పని మేము చేస్తాం.. మాకా తెలివితేటలు ఉన్నాయి...' అని సీఎం వ్యాఖ్యానించారు. ' మీరు ఇవ్వకపోయినా మేమే స్టీల్‌ప్లాంటు, పెట్రోకెమికల్ కారిడార్ ఏర్పాటుకు ముందుకొచ్చాం. కేంద్రం ముందుకొచ్చి ఉంటే రూ.32వేల కోట్లే పెట్టేవారు. ఇప్పుడు రూ.63వేల కోట్లతో హల్దియా పెట్రోకెమికల్ కాంప్లెక్స్ వస్తోంది. 5వేల మందికి ప్రత్యక్షంగా, లక్ష మందికి పరోక్షంగా ఉద్యోగావకాశాలొస్తాయి...' అని వివరించారు. తూర్పుగోదావరి జిల్లా కాకినాడ జేఎన్‌టీయూ మైదానంలో శుక్రవారం జరిగిన జన్మభూమి-మావూరులో, తొలుత అధికారులతో జరిగిన టెలికాన్ఫరెన్స్‌లో సీఎం మాట్లాడారు. నరేంద్రమోదీ సీబీఐ కత్తిని మెడపై పెట్టడంతో జగన్ వణికిపోతున్నారని.. ఊడిగం చేయమన్నా చేయడానికి సిద్ధంగా ఉన్నారని ఎద్దేవా చేశారు. అభివృద్ధిలో ఏపీతో పోటీపడలేక కేసీఆర్, జగన్... మోదీ జపం చేస్తున్నారని విమర్శించారు. కోడికత్తి పార్టీని పెట్టుకుంటే మనం మునిగిపోతామని ప్రజలనుద్దేశించి వ్యాఖ్యానించారు. రూ.75వేల కోట్లు రావాలని చెప్పిన పవన్‌కల్యాణ్ ఆ నిధుల కోసం పోరాడి రాష్ట్రానికి న్యాయం చేయాలని సూచించారు. రాష్ట్రానికి అన్యాయం జరిగిందని. . ఈ గడ్డపై పుట్టిన, ఇక్కడి నీళ్లు తాగిన ప్రతి ఒక్కరూ జన్మభూమి సాక్షిగా పనిచేయాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.



తూర్పు గోదావరి జిల్లాలోని పురుషోత్తపట్నం ఎత్తిపోతల పంప్‌హౌజ్-2ను శుక్రవారం రిమోట్‌తో ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు. చిత్రంలో ఎమ్మెల్యేలు ఎస్వీఎస్ఎన్ వర్మ, పెందుర్తి వెంకటేష్, జ్యోతుల నెహ్రూ, ఉపముఖ్యమంత్రి చినరాజప్ప తదితరులు

మీ కోసం చాలా చేశా.. ఇప్పటి నుంచి మా కోసం ఆలోచించండి

'నా జీవితం అయిదు కోట్ల రాష్ట్ర ప్రజలకు అంకితం. రాత్రి పగలు పని చేస్తా. ఎంత సంక్షేమాన్ని అందిస్తే అంత ఆనందానికి గురవుతా. ఎప్పుడూ వ్యక్తిగత విలాసాలకు పోలేదు. ఇన్నాళ్లు 24 గంటలూ మీ గురించే ఆలోచించా. మీ జీవితం ఆనందంగా ఉండాలని కోరుకుంటున్నా. ఇప్పటి నుంచి నా కోసం.. పార్టీ కోసం మీరంతా ఆలోచించాలి. నిండు మనసుతో ఆశీర్వదించండి. సంక్షేమానికి తొలిసారిగా నాంది పలికింది ఎన్టీ రామారావు. పేదల సంక్షేమానికి అంకితభావంతో పనిచేసిన మహానుభావుడు ఆయన. ఆ స్ఫూర్తిని తెదేపా భవిష్యత్తులోనూ కొనసాగిస్తుంది. నిత్యం పేదల కోసమే పనిచేస్తోంది...' అని చంద్రబాబు పేర్కొన్నారు. జన్మభూమిలో భాగంగా ముందుగా వివిధ సంక్షేమ పథకాలు పొందిన లబ్ధిదారులతో మాట్లాడారు. సామాజిక సాధికారత, సంక్షేమం-ప్రజాసంతృప్తి తదితర అంశాలతో కూడిన శ్వేతపత్రాన్ని విడుదల చేశారు. ఆరోవిడత జన్మభూమికి మంచి స్పందన వస్తోందన్నారు. ప్రతి ఒక్కరూ సంక్షేమ ఫలాలు పొందారని, పథకాల అమలులో ఎక్కడ లోపాలున్నా నిర్మొహమాటంగా చెప్పొచ్చని సూచించారు.

నగరాల్లో ఇళ్ల అభివృద్ధికి వెంటనే నివేదిక రూపకల్పన

నగరాల్లో ప్రస్తుతం ఉన్న ఇళ్లను అభివృద్ధి చేయడానికి రూ.1.5లక్షలు అందించేందుకు ప్రాజెక్టు నివేదిక తయారు చేయాలని గృహనిర్మాణ సంస్థ ఎండీ కాంతిలాల్ దండేను ఆదేశించారు. ఏడీబీ రోడ్డు విస్తరణతో పోర్టుకు, రాజమహేంద్రవరం విమానాశ్రయానికి అనుసంధానం ఏర్పడుతుందన్నారు. రూ.2,300కోట్లతో ఎస్ఈజెడ్, రూ.60వేల కోట్లతో హల్దియా పెట్రోకెమికల్ కాంప్లెక్స్, రూ.వెయ్యి కోట్లతో చేపట్టిన కాకినాడ-శ్రీకాకుళం నాచురల్ గ్యాస్ పైపులైను వ్యవస్థ ఈ జిల్లాను అభివృద్ధి పథంలో పరుగులు తీయిస్తుందని వివరించారు. తొలుత జీఎంఆర్ గ్రీన్‌ఫీల్డ్ కాకినాడ పోర్టు, ఏపీజీడీసీ గ్యాస్ పైపులైను, ఏడీబీ రహదారి, కాకినాడ స్మార్ట్ సిటీ పనులు, ఏలేరు రెండోదశ ఆధునికీకరణకు శంకుస్థాపన చేశారు. జిల్లాపరిషత్తు శతవసంతాల పైలాన్‌ను, ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. జగ్గంపేటలో పురుషోత్తపట్నం ఎత్తిపోతల రెండోదశను జాతికి అంకితం చేశారు. ఉపముఖ్యమంత్రి చినరాజప్ప, ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు, శాసనమండలి ఉపాధ్యక్షులు రెడ్డిసుబ్రహ్మణ్యం, మేయర్ సుంకర పావని, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కలెక్టర్ కార్తికేయ మిశ్రా పాల్గొన్నారు.

నాలుగేళ్లలో రూ.1.01లక్షల కోట్లు

గత నాలుగేళ్లలో సంక్షేమానికి రూ.1.01లక్షల కోట్లు ప్రత్యేకంగా కేటాయించామని చంద్రబాబు వెల్లడించారు. శ్వేతపత్రం విడుదలలో భాగంగా.. . 100 శాతం రేషన్, ఎన్టీఆర్ భరోసా పింఛన్లు, చంద్రన్న బీమా, ఉపకారవేతనాలు, గృహనిర్మాణం, ఆదరణ, అన్నక్యాంటీన్లు, మధ్యాహ్నభోజనం, ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు 100యూనిట్ల ఉచిత విద్యుత్తుపై చర్చ సాగింది. ఎస్సీ సంక్షేమానికి రూ.40,245 కోట్లు, ఎస్టీలకు రూ.14,210 కోట్లు, బీసీలకు రూ.32,472.65 కోట్లు, మైనార్టీలకు రూ.3215 కోట్లు, దివ్యాంగులకు రూ.4,326 కోట్లు కేటాయించారు. రేషన్ సబ్సిడీ కింద రూ.9941.31 కోట్లు ఖర్చు చేశారు. ఐటీడీఏలో కాఫీ సాగు ప్రోత్సాహానికి రూ.526కోట్లతో ప్రాజెక్టు ఏర్పాటు చేశారు. గిరిజన కుటుంబాలకు పౌష్టికాహారాన్ని అందించేందుకు రూ.120.40కోట్లతో పౌష్టికాహార భద్రత పథకాన్ని ప్రవేశపెట్టారు. చంద్రన్నబీమా ద్వారా అసంఘటిత రంగంలో పనిచేస్తున్న 1.93 లక్షల మంది కార్మికులకు రూ.2,381కోట్ల బీమా పరిహారాన్ని అందించారు. అయిదేళ్లలో 30.61 లక్షల కొత్త గ్యాస్ కనెక్షన్లు ఇచ్చినట్లు శ్వేతపత్రంలో పేర్కొన్నారు. గ్రామానికి, వార్డుకు ఏం కావాలో ప్రజల నుంచే అభిప్రాయాలను సేకరించి అభివృద్ధి ప్రణాళికలను ఖరారు చేస్తున్నామని, వీటి అమలుకు నిర్దిష్ట కార్యాచరణ రూపొందిస్తున్నామని టెలికాన్ఫరెన్స్‌లో చంద్రబాబు చెప్పారు. సీఎం వేసిన ప్రశ్నకు బదులిస్తూ జన్మభూమిలో ఆనందంగా పనిచేస్తున్నామని 98శాతం అధికారులు చెప్పారు. వైద్య శిబిరాలపై 72శాతం, ఆటలపోటీలపై 62.5శాతం, సాంస్కృతిక పోటీలపై 63.53శాతం సంతృప్తి వ్యక్తమైందని వివరించారు.

రాష్ట్రంలో సంతృప్తి స్థాయి ఇదీ

సంక్షేమ పథకాలపై ప్రజల సంతృప్తి స్థాయిని ఐవీఆర్ఎస్ కాల్ ద్వారా తెలుసుకుంటున్నామని సీఎం చంద్రబాబు చెప్పారు. పథకాల వారీగా రాష్ట్రంలో, జిల్లాల్లో.. జన్మభూమి సభ జరుగుతున్న నియోజవర్గ స్థాయిలో సంతృప్తి శాతాన్ని స్వయంగా చదివి వినిపించారు. రాష్ట్రంలో తూగో జిల్లా, కాకినాడ నగరంలో సంతృప్తి స్థాయి ఎక్కువగా ఉండడంపై ఆనందం వ్యక్తం చేస్తూ అధికారులను అభినందించారు.

అంశం	రాష్ట్రంలో సంతృప్తి శాతం
మొత్తం సంతృప్తి స్థాయి	75
ఆదరణ పరికరాలు	83
పింఛను	83
చంద్రన్న బీమా	94
రేషన్ సరఫరా	80
పెళ్లికానుక	96
అన్న క్యాంటీన్	83
100 యూనిట్ల ఉచిత విద్యుత్తు	69
ఉచిత ఇసుక	85
బెల్ట్ షాపులు	75
తాగునీరు	70
ఈపీడీసీఎల్	77
మధ్యాహ్న భోజనం	67
108 సేవలు	80
ముఖ్యమంత్రి ఆరోగ్య కేంద్రాలు	75
అన్న అమృత హస్తం	91
అన్న అమృత హస్తం (గర్భిణులు)	92
బాలామృతం	92
యువనేస్తం	80
తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్	82
ఎన్టీఆర్ వైద్యసేవ	88
చంద్రన్న సంచార చికిత్స	75

కొలువుల క్రాంతి

(మొదటి పేజీ తరువాయి)

వెల్లడిస్తామని పేర్కొన్నారు. గ్రూపు-1 ప్రాథమిక పరీక్ష రాసేందుకు తక్కువ వ్యవధి ఉన్నట్లు అభ్యర్థులు పేర్కొంటున్న విషయాన్ని ప్రస్తావించగా సెప్టెంబరు నుంచి ఉద్యోగ ప్రకటనల జారీ గురించి అభ్యర్థులకు తెలుసునని వ్యాఖ్యానించారు.

ప్రధాన పరీక్షకు అభ్యర్థుల ఎంపిక ఇలా

ప్రాథమిక పరీక్ష నుంచి ప్రధాన పరీక్షకు అభ్యర్థులను పరిమితం చేయడంపై ఉదయ్‌భాస్కర్ మాట్లాడుతూ "యూపీఎస్సీలో అనుసరిస్తున్న విధానంపై కమిషన్ అధ్యయనం చేసింది. అనంతరం కమిషన్ సమావేశంలో చర్చించి తీసుకున్న నిర్ణయాన్ని ప్రభుత్వానికి తెలియజేశాం. ప్రభుత్వం పరిశీలన జరిపి ఉత్తర్వులు జారీచేసింది. వీటిని అనుసరించి అభ్యర్థులు ప్రాథమిక పరీక్షల్లో సాధించిన మార్కులను అనుసరించి కటాఫ్ నిర్ణయిస్తాం. దీనికి అనుగుణంగా ప్రకటిత పోస్టులకు 1:12 లేదా 1:15 నిష్పత్తిలో అభ్యర్థులను ప్రధాన పరీక్షకు ఎంపిక చేయాలా? వద్దా? అన్న దానిపై అభ్యర్థులు సాధించిన మార్కులు, ఇతర అంశాలు పరిగణనలోనికి తీసుకుని కమిషన్ నిర్ణయం తీసుకుంటుంది. ఈ ప్రక్రియలో సామాజిక వర్గాల వారీగా అభ్యర్థులకు అవకాశం రాకుంటేనే కటాఫ్ తగ్గిస్తాం. కటాఫ్ మార్కు తగ్గించిన తరువాత అర్హత పొందినవారు ప్రధాన పరీక్షలు రాసి ఎక్కువ మార్కులు సాధించినప్పటికీ జనరల్ కోటాలోకి రారు. సామాజిక వర్గం ఆధారంగా కేటాయించిన పోస్టులకు మాత్రమే వీరు పోటీపడతారు. జనరల్ కోటాలో వీరిని తీసుకునేందుకు న్యాయపరమైన సమస్యలు వస్తాయి. గతంలో ఇలాగే జరిగింది. పోస్టులు మిగలకూడదన్న ప్రధాన ఉద్దేశంతో ఇచ్చిన వెసులుబాటువల్ల వీరు ప్రధాన పరీక్ష రాసేందుకు అవకాశం లభిస్తుందని" వివరించారు. వయో పరిమితి పెంపు అంశం ప్రభుత్వ పరిధిలోకి వస్తుందని వెల్లడించారు. గ్రూపు-2 1999 నోటిఫికేషన్‌కు సంబంధించి సుప్రీంకోర్టు వేసిన సబ్ కమిటీ తన నివేదికను న్యాయస్థానానికి అప్పగించినట్లు కమిషన్ అధ్యక్షుడు ఉదయ్‌భాస్కర్ తెలిపారు. తదుపరి ఆదేశాలు ఇప్పటివరకు సుప్రీంకోర్టు నుంచి రాలేదన్నారు.

ఇటీవల ఉద్యోగ ప్రకటనలకు వచ్చిన దరఖాస్తులు

- **24 ఫారెస్ట్ రేంజి ఆఫీసర్ ఉద్యోగాలు- 16,130**
- **309 అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పోస్టులు- 47,001**
- **23 అసిస్టెంట్ మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్- 5,411**
- **39 హార్టికల్చర్ పోస్టులు - 1,307**

1,051 పంచాయతీ కార్యదర్శుల పోస్టుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ ఇంకా జరుగుతోంది. శుక్రవారం వరకు 56,621 దరఖాస్తులు వచ్చాయి.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కమిషన్ ఛైర్మన్ ఉదయ్‌భాస్కర్. చిత్రంలో సభ్యులు సేవారూప, జనార్ధన, విజయకుమార్, సుజాత, పద్మరాజు, కార్యదర్శి మౌర్య

ఎన్నికలకు సంబంధంలేదు

ఎన్నికల నిర్వహణకు, ఉద్యోగాల నియామకాల ప్రక్రియకు ఎటువంటి సంబంధంలేదని కమిషన్ సభ్యులు పద్మరాజు, సుజాత వెల్లడించారు. కమిషన్ రాజ్యాంగ ప్రతిపత్తి సంస్థ అయినందున ఎన్నికలతో నిమిత్తం లేకుండా ఉద్యోగ నియామకాల రాత పరీక్షల నిర్వహణ, అవసరమైనందున ఇతర చర్యలు యథావిధిగా తీసుకుంటామని పేర్కొన్నారు. ఎక్కువమంది అభ్యర్థులు తమ మొబైల్ నంబర్లను మార్చుకోవడంవల్ల ఓటీపీఆర్ పంపడంలో సమస్యలు వస్తున్నాయని కమిషన్ సభ్యులు తెలిపారు. మెయిల్ ఐడీ, మొబైల్ నంబరు ఉంటేనే ఓటీపీఆర్‌ను కమిషన్ పంపుతుందన్నారు. అలాగే దరఖాస్తుల స్వీకరణ తేదీ వచ్చిన వెంటనే అభ్యర్థులకు పంపుకోవడం మంచిదని కమిషన్ సూచించింది. స్వీకరణ ముగింపు సమయంలో అభ్యర్థులు దరఖాస్తులు పంపుతున్నందున సర్వరుపరంగా సమస్యలు వస్తున్నాయని తెలిపింది. ఓటీపీఆర్ హెల్ప్‌లైన్ - ఫోన్ నెంబర్ 0866-2527819, నియామకాల ప్రక్రియ సందేహాలను 0866-2527820, 2527821 నెంబర్ల ద్వారా నివృత్తి చేసుకోవచ్చునని తెలిపింది.

కొత్త గోదాముల్లోకి అనుమతించలేం

(మొదటి పేజీ తరువాయి)

గొల్లపూడిలో మద్యం గోదాము నిర్వహిస్తున్నప్పుడు పలువురు హమాలీలు పనిచేసేవారు. నిడమానూరులో కొత్త ఐఎంఎఫ్ఎల్ డిపోను ఏర్పాటు చేశారు. అక్కడి గోదాములో పనిచేసేందుకు గొల్లపూడి గోదాముల్లో పనిచేసిన 40శాతం మంది హమాలీలను అనుమతించాలని కోరుతూ 'ఏపీ బేవరేజ్ కార్పొరేషన్ లిమిటెడ్ ఐఎంఎఫ్ఎల్ హమాలీల యూనియన్' తరఫున అధ్యక్షుడు సతీష్ హైకోర్టును ఆశ్రయించారు. సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పు ఉపశమనం కలగకపోవడంతో ధర్మాసనం ముందు అప్పీలు దాఖలు చేశారు. వాదనలు విన్న ధర్మాసనం.. అప్పీల్‌ను కొట్టేస్తూ తీర్పు ఇచ్చింది. సింగిల్ జడ్జి వద్ద పెండింగ్‌లో ఉన్న వ్యాజ్యంపై తుది విచారణ జరపాలని కోరేందుకు పిటిషనర్లకు స్వేచ్ఛనిచ్చింది.

దోచుకోవటం ఆగితేనే

'నిరాయుధీకరణ' అన్నది మనందరం కాంక్షించే సమున్నత లక్ష్యం. ప్రపంచ దేశాలు ఒక దాన్ని మరొకటి దోపిడీ చేసుకోవటం మానుకునే వరకూ కూడా మనం నిజమైన 'నిరాయుధీకణ'ను సాధించలేం.

– మహాత్మా గాంధీ

హైకోర్టు నిర్ణయం వెలువడకముందే ఆదేశాలా?

- **జగన్‌పై కోడికత్తి దాడి కేసును ముందే ఎన్ఐఏకు ఎలా ఇస్తారు: చంద్రబాబు**

ఈనాడు, అమరావతి: జగన్‌పై కోడికత్తి దాడి కేసును జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ)కు అప్పగించాలా? వద్దా? అనే అంశంపై హైకోర్టు నిర్ణయం వెలువరించడానికి ముందే కేసును జాతీయ దర్యాప్తు సంస్థకు(ఎన్ఐఏ) అప్పగిస్తూ కేంద్రం ఆదేశించడం సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ఈ ఘటనకు సంబంధించి దాఖలైన వ్యాజ్యాలపై ఎలాంటి నిర్ణయం వెలువడక ముందే కేసు నమోదు చేయాలని కేంద్ర హోంశాఖ ఎన్ఐఏను ఎలా ఆదేశిస్తుందని ప్రశ్నించారు. దీని వెనుకున్న ఆంతర్యమేమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. 'శాంతిభద్రతలు రాష్ట్ర పరిధిలోని అంశం. దీనిపై అనవసరమైన ఆసక్తిని ప్రదర్శించటమే కాకుండా రాష్ట్ర హక్కులను తీసుకోడానికి కేంద్రం ప్రయత్నిస్తోంది. రాష్ట్రాన్ని ఏదోలా ఇబ్బంది పెట్టాలనే కుట్ర దీనిలో కనిపిస్తోంది. ఈ అంశంపై న్యాయస్థానాన్ని ఆశ్రయించి తేల్చుకుంటాం' అని చంద్రబాబు వివరించారు.

అంతర్జాతీయ సంస్థకు అప్పగించినా నిజం మారదు: మంత్రి లోకేష్

'కోడికత్తి కేసును అంతర్జాతీయ విచారణ సంస్థకు అప్పగించినా నిజం మారదు. దిల్లీ మోదీ, ఆంధ్రా మోదీ (జగన్) కోడికత్తితో యుద్ధానికి కాలు దువ్వుతున్నారు. తుస్సుమన్న కోడికత్తి డ్రామాకు కొత్త డైరెక్టర్‌ను పెట్టినంత మాత్రాన రక్తి కట్టదు. జగన్‌కు కేసులనుంచి విముక్తి కల్పించి ఆంధ్రప్రదేశ్‌ను దెబ్బతీయాలని కేంద్రం మరో కుట్రకు తెరలేపింది. ఆంధ్రా మోదీని కాపాడేందుకు దిల్లీ మోదీ సీబీఐని బీబీఐ (భాజపా బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్)గా మార్చింది' అని రాష్ట్ర పంచాయతీరాజ్, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ట్వీట్ చేశారు.

ఎన్ఐఏ ఎఫ్ఐఆర్‌లో తప్పిదం

జగన్‌పై దాడి ఘటనపై జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో తప్పిదం దొర్లింది. జగన్ రాష్ట్ర శాసనసభ ప్రతిపక్ష నేత కాగా, ఆయన్ను ఆంధ్రప్రదేశ్ శాసనసభ నాయకుడిగా (లీడర్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ లెజిస్లేటివ్ అసెంబ్లీ)గా ఎన్ఐఏ ఎఫ్ఐఆర్‌లో పేర్కొంది. శాసనసభ నాయకుడిగా ముఖ్యమంత్రి ఉంటారు.

జగన్‌పై దాడి కేసు ఎన్ఐఏకు

(మొదటి పేజీ తరువాయి)

దర్యాప్తును స్వతంత్ర దర్యాప్తు సంస్థకు అప్పగించాలని వైకాపా అధ్యక్షుడు జగన్ హైకోర్టులో వ్యాజ్యం వేశారు. ప్రధాన వ్యాజ్యంలోని అనుబంధ పిటీషన్‌లో కేంద్ర హోంశాఖ పరిధిలో దర్యాప్తు చేయాలని అభ్యర్థించారు. దర్యాప్తును ఎన్ఐఏకు అప్పగించాలంటూ వైకాపా రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యుడు వై.వి.సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి వేర్వేరుగా వ్యాజ్యాలు వేశారు. భద్రతా లోపం వల్లే జగన్‌పై దాడి జరిగిందని, సీబీఐతో దర్యాప్తు చేయాలని గుంటూరు వాసి బి.అనిల్‌కుమార్ మరో వ్యాజ్యం వేశారు. ఈ వ్యాజ్యాలపై ఇటీవల హైదరాబాద్‌లోని ఉమ్మడి హైకోర్టు విచారించింది. కేంద్ర పారిశ్రామిక భద్రతాదళం (సీఐఎస్ఎఫ్) ఇచ్చిన సమాచారం, ఇతర మార్గాల ద్వారా తెప్పించుకున్న వివరాల ఆధారంగా.. ఎన్ఐఏ చట్ట నిబంధనల మేరకు దీనిపై కేంద్ర హోంశాఖ నిర్ణయానికి రావాల్సి ఉందని పేర్కొంది. విచారణను ఈనెల నాలుగో తేదీకి వాయిదా వేసింది. ఈ నేపథ్యంలో శుక్రవారం ఏపీ హైకోర్టులో జరిగిన విచారణలో కేంద్రం తరఫున ఏఎస్‌జీ హాజరయ్యారు.

కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వుల సారాంశం, ఎఫ్ఐఆర్‌లో వివరాలు

'జగన్‌పై దాడి ఘటనలో ఐపీసీ సెక్షన్ 307 ప్రకారం విశాఖ విమానాశ్రయ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైందని సమాచారం అందుకున్నాం. ఈ ఘటన 'ది సప్రెషన్ ఆఫ్ అన్‌లాఫుల్ యాక్ట్స్ ఎగైనెస్ట్ సేఫ్టీ ఆఫ్ సివిల్ ఏవియేషన్ యాక్ట్-1982లోని సెక్షన్ 3(ఏ)(1)(ఏ) శిక్షార్హమైన నేరం కిందికి వస్తుంది. ఎన్ఐఏ చట్టం ప్రకారం అది షెడ్యూల్డ్ నేరం. నేర తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ఎన్ఐఏ దర్యాప్తు చేయాల్సి ఉంది. ఎన్ఐఏ చట్టంలోని సెక్షన్ 6(5), 8 కల్పించిన అధికారాల్ని ఉపయోగించి జగన్‌పై దాడి కేసు దర్యాప్తు చేయాలని కేంద్రం ఎన్ఐఏను ఆదేశించింది.'

- హైదరాబాద్‌లోని ఎన్ఐఏ స్టేషన్‌లో జనవరి 1న ఎఫ్ఐఆర్ నంబరు 1గా ఐపీసీ 307, సివిల్ ఏవియేషన్ యాక్ట్-1982లోని సెక్షన్ 3(ఏ)(1)(ఏ)ల కింద కేసు నమోదైంది. నిందితుడు జె.శ్రీనివాసరావు చిన్న కత్తితో చేసిన దాడి ఘటనల సమాచారాన్ని ఎఫ్ఐఆర్‌లో పేర్కొంది.

అప్పట్లో రాష్ట్ర ప్రభుత్వ వాదనలు

ఒకరిపై జరిగిన దాడిని విమానయాన భద్రతతో ముడిపెట్టలేమని అప్పట్లో ఏపీ అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపించారు. జగన్‌పై దాడి ఘటన ఎన్ఐఏ చట్టం పరిధిలోకి రాదన్నారు.

రాష్ట్ర హక్కులను హరిస్తున్న కేంద్రం

- **కోడి కత్తి కేసు ఎన్ఐఏ కిందికి రాదు**
- **తెదేపా ఎంపీ కనకమేడల వ్యాఖ్యలు**

ఈనాడు, దిల్లీ: రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో విచారిస్తున్న కేసులను కేంద్రం జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ)కు అప్పగించడం రాష్ట్ర హక్కులను హరించడమేనని తెదేపా ఎంపీ కనకమేడల రవీంద్రకుమార్ విమర్శించారు. దిల్లీలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేసును ఎన్ఐఏకు అప్పగించడం కేంద్రం, భాజపా-వైకాపాల మధ్య అన్యోన్యతను తెలియజేస్తోందన్నారు. కేంద్రం రాష్ట్ర ప్రభుత్వంపై పెత్తందారీ ధోరణితో వ్యవహరిస్తూ పోలీసు విచారణలో జోక్యం చేసుకుంటోందని ఆరోపించారు. కోడి కత్తి కేసు ఎన్ఐఏ పరిధిలోకి వచ్చే నేరం కాదని అన్నారు. ఇది సంచలనం, రాజకీయ ఆర్భాటం కోసం వేసుకున్న కేసుగా పోలీసు విచారణలో తేలిందని వివరించారు. హైకోర్టు ఏర్పాటును తాము స్వాగతించామని, వెంటనే విడిపోవాలనే కేంద్రం తీరునే తాము తప్పుపట్టామని అన్నారు. జగన్ కేసు విచారిస్తున్న న్యాయమూర్తి ఆంధ్రప్రదేశ్‌కు రావడంతో కేసు మళ్లీ మొదటినుంచి వినాల్సిన పరిస్థితి తలెత్తిందని అన్నారు. ఫలితంగా విచారణ ఎప్పటికి ముగుస్తుందో తెలియని పరిస్థితి నెలకొందని తెలిపారు. భాజపా నేతలు కళ్లుండీ కబోదుల్లా తయారయ్యారని రవీంద్రకుమార్ ధ్వజమెత్తారు. చేసిన పనులకు యూసీలు సమర్పించలేదని ప్రధాని అన్నారని, దీనికి భిన్నంగా ఎంపీ కేవీపీ రామచంద్రరావు అడిగిన ప్రశ్నకు 99శాతం యూసీలు సమర్పించారని ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ లిఖితపూర్వక సమాధానమిచ్చారని వివరించారు. ప్రధాని చెప్పే దానికి, ఆర్థిక మంత్రి సమాధానానికి పొంతనే లేదని దుయ్యబట్టారు.

ఆగమేఘాలపై విశాఖకు అధికారులు

దర్యాప్తు వివరాలు ఇవ్వడానికి తిరస్కరించిన సిట్

ఈనాడు, విశాఖపట్నం: వైకాపా అధినేత జగన్‌పై హత్యాయత్నం కేసును జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్.ఐ.ఎ.)కు అప్పగించిన నేపథ్యంలో ఆ అధికారులు ఆగమేఘాలపై గురువారం విశాఖకు వచ్చారు. ఇక్కడి పోలీసు ఉన్నతాధికారులను కలిసి కేసు దర్యాప్తు వివరాలను కోరారు. కేసును అప్పగించాలని రాష్ట్ర ప్రభుత్వంనుంచి లిఖితపూర్వక ఆదేశాలు వస్తేగానీ తాము ఇవ్వలేమని ఎన్.ఐ.ఎ. బృందానికి సిట్ అధికారులు చెప్పినట్లు సమాచారం. దర్యాప్తు వివరాలు ఇవ్వడానికి వారు సున్నితంగా తిరస్కరించారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని సంప్రదించకుండానే ఎన్ఐఏ ఏకపక్షంగా కేసు నమోదు చేసిందని వారు పేర్కొంటున్నారు. డిసెంబరు 31న కేంద్ర హోంమంత్రిత్వ శాఖ తన ఆదేశాలను ఎన్.ఎ.ఐ. ప్రధాన కార్యాలయానికి పంపింది. గంటల వ్యవధిలోనే ఈ ఆదేశాలను హైదరాబాద్‌లోని తమ కార్యాలయానికి వారు పంపారు. మరుసటిరోజే ఎఫ్.ఐ.ఆర్. నమోదైంది.

ఆ సెక్షన్ వర్తించదు.. ఏపీ పోలీసులు

విమానాశ్రయాల్లో పలు ఘటనలు జరుగుతుంటాయి. సాధారణంగా వాటిని విమానాశ్రయంలోని పోలీస్‌స్టేషనే విచారిస్తుంది. విమానాశ్రయం కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్నా.. అన్ని కేసులనూ కేంద్ర దర్యాప్తు సంస్థలు విచారించవు. రాష్ట్ర, దేశ భద్రతకు ముప్పునకు సంబంధించిన కేసులనే విచారిస్తుంది. అది కూడా రాష్ట్ర ప్రభుత్వ విన్నపం మేరకు చేస్తుండడం ఇప్పటివరకున్న సంప్రదాయం. అప్పుడు రాష్ట్ర పోలీసులు తాము అప్పటివరకు చేసిన దర్యాప్తు వివరాలను సంబంధిత సంస్థకు అప్పగిస్తారు. ఈ నేపథ్యంలో జగన్‌పై హత్యాయత్నం కేసుకు 'ది సప్రెషన్ ఆఫ్ అన్‌లాఫుల్ యాక్ట్ ఎగైనెస్ట్ సేఫ్టీ ఆఫ్ సివిల్ ఏవియేషన్ యాక్ట్-1982' చట్టమే వర్తించదన్నది ఏపీ పోలీసుల వాదన. ఈ చట్టాన్ని విమాన ప్రయాణికుల, విమానాశ్రయాల భద్రతకు ముప్పు ఏర్పడినప్పుడు వినియోగిస్తారు.

ఇళ్లను క్రమబద్ధీకరించుకోండి

(మొదటి పేజీ తరువాయి)

దరఖాస్తు చేసుకోవచ్చు. 100 చదరపు మీటర్ల లోపు నిర్మించే ఇళ్లకు (జీ ప్లస్ 1) క్రమబద్ధీకరణ నుంచి మినహాయింపు ఇచ్చారు. ఈ మేరకు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఆర్.కరికల్ వలవన్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

క్రమబద్ధీకరణ రుసుములు వివరాలు ఇలా

- నివాస భవనాలు (హాస్టల్స్), పారిశ్రామిక భవనాలు (గోదాములు, పౌల్ట్రీ ఫారమ్‌లు తదితరాలు), సంస్థాగత భవనాలు (పాఠశాలలు, కళాశాలలు, ఆసుపత్రులు, నర్సింగ్ హోమ్, క్లినిక్‌లు, పరిశోధన సంస్థలు, గ్రంథాలయాలు, సాంస్కృతిక కేంద్రాలు, మతపరమైన, ఛారిటబుల్ ట్రస్టుల భవనాలు)కు- స్థల విస్తీర్ణం (ప్లాటు సైజు) 100 చదరపు మీటర్ల లోపు ఉంటే ఒక్కో చదరపు అడుగు నిర్మిత ప్రాంతానికి రూ.40 చొప్పున, స్థల విస్తీర్ణం 101 నుంచి 300 చదరపు మీటర్ల మధ్య ఉంటే ఒక్కో చదరపు అడుగు నిర్మిత ప్రాంతానికి రూ.60 చొప్పున క్రమబద్ధీకరణ రుసుము చెల్లించాలి.
- వాణిజ్య భవనాలు (ఫంక్షన్ హాళ్లు, హోటల్స్, లాడ్జీలు, రెస్టారెంట్లు, షాపింగ్ కాంప్లెక్స్, బ్యాంకులు, సినిమా థియేటర్లు, మల్టీప్లెక్స్‌లు, మాల్స్, ఐటీ, ఐటీ ఆధారిత సేవల కార్యాలయాలు, ప్రైవేటు కార్యాలయాల భవనాలకు)- స్థల విస్తీర్ణం 100 చదరపు మీటర్ల లోపు ఉంటే ఒక్కో చదరపు అడుగు నిర్మిత ప్రాంతానికి రూ.80, 101 నుంచి 300 మీటర్ల మధ్య ఉంటే రూ.120 క్రమబద్ధీకరణ రుసుము చెల్లించాలి.

గమనిక: స్థల విస్తీర్ణాన్ని అనుసరించి చెల్లించాల్సిన క్రమబద్ధీకరణ రుసుముల వివరాలు, బీపీఎస్ పథకానికి సంబంధించిన పూర్తి వివరాలు (సమగ్ర జీవో) ఈనాడు డాట్ నెట్‌లో చూడగలరు.

గ్రహం అనుగ్రహం

5-1-2019 శనివారం

శ్రీ విళంబి నామ సం॥రం॥ దక్షిణాయనం
హేమంత రుతువు; మార్గశిర మాసం; బహుళ పక్షం
అమావాస్య: తె. 6.03 తదుపరి పుష్య శుక్ల పాడ్యమి
మూల నక్షత్రం: మ. 3.10 తదుపరి పూర్వాషాఢ
అమృత ఘడియలు: ఉ. 8.21 నుంచి 10.03 వరకు
వర్జ్యం: తె. 1.33 నుంచి 3.17 వరకు
దుర్ముహూర్తం: ఉ. 6.37 నుంచి 8.04 వరకు
రాహుకాలం: ఉ. 9.00 నుంచి 10.30 వరకు
సూర్యోదయం: ఉ.6-36; సూర్యాస్తమయం: సా.5-36

చలి - పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
మెదక్	8.8	34.6
ఆదిలాబాద్	9.2	31.3
హైదరాబాద్	12.9	29.0
విశాఖపట్నం	14.0	28.6
కడప	14.0	33.0
అనంతపురం	14.9	31.5
తిరుపతి	15.9	29.6
శ్రీకాకుళం	16.0	28.0
గుంటూరు	16.0	29.8
కర్నూలు	16.2	32.7
రాజమహేంద్రవరం	16.5	32.0
విజయవాడ	18.0	29.7
నరసాపురం	19.0	21.6
తాడేపల్లిగూడెం	19.0	25.3
నెల్లూరు	20.0	30.3
ఒంగోలు	20.1	30.1

మోదీ గద్దె దిగితేనే హోదా

- ప్రజల్లోకి వెళ్లి వివరిస్తాం
- తెదేపా ఎంపీల వెల్లడి
- పార్లమెంటు బయట ఆందోళన
- ములాయం సంఘీభావం
- భాజపా మూర్ఖంగా వ్యవహరిస్తోంది
- ఎంపీలతో టెలికాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు

ఈనాడు - దిల్లీ, అమరావతి

ప్రధాని నరేంద్రమోదీ గద్దె దిగితేనే రాష్ట్రానికి ప్రత్యేక హోదా వస్తుందని తెదేపా ఎంపీలు అన్నారు. ఇతర రాష్ట్రాలకు ఇచ్చినట్లే రాష్ట్రానికి కేంద్ర నిధులు వస్తున్నాయని.. ప్రత్యేకంగా, అదనంగా ఏమీ ఇవ్వలేదని స్పష్టం చేశారు. విభజన హామీలు నెరవేరే వరకు తెదేపా పోరాడుతుందన్నారు. గురువారం లోక్‌సభ నుంచి సస్పెండ్ చేసిన నేపథ్యంలో శుక్రవారం పార్లమెంటు గాంధీ విగ్రహం, గేటు నంబరు-1 వద్ద ఎంపీలు తోట నరసింహం, అశోక్‌గజపతిరాజు, మురళీమోహన్, రవీంద్రబాబు, కనకమేడల రవీంద్రకుమార్, మాల్యాద్రి శ్రీరాం, మాగంటి బాబు, రామ్మోహన్‌నాయుడు, గల్లా జయదేవ్, తోట సీతారామలక్ష్మి, బుట్టా రేణుకలు ఆందోళన కొనసాగించారు. తెదేపా ఎంపీలకు సమాజ్‌వాదీ ఎంపీ, ఉత్తర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి ములాయంసింగ్ యాదవ్ సంఘీభావం తెలిపారు. తెదేపా ఎంపీలతోపాటు కొద్దిసేపు నినదించారు. అనంతరం రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ.. తెలుగువారి గొంతు నొక్కాలన్న ప్రయత్నం మరోసారి లోక్‌సభ వేదికగా జరిగిందని అన్నారు. కేంద్ర వైఫల్యాలను దేశ ప్రజల దృష్టికి తీసుకెళ్తున్నందునే గొంతు నొక్కాలని చూస్తున్నారని ఆరోపించారు. సస్పెండ్ చేసినా పోరాటం ఆగబోదని వివరించారు. రాష్ట్రం కట్టిన పన్నుల్లో సగం కూడా ఇవ్వడం లేదని ఆరోపించారు. ఎన్నికల సమయంలో తెదేపా ఇచ్చిన హామీలు ఎంతవరకు అమలయ్యాయో జన్మభూమి కార్యక్రమం ద్వారా ప్రజలకు వివరిస్తున్నామన్నారు. ప్రజల వద్దకు వెళ్లి కేంద్రం ఇచ్చినవాటిపై చెప్పే ధైర్యం రాష్ట్రంలో భాజపా నేతలకు ఉందా? అని ప్రశ్నించారు. 'వెనుకబడిన నియోజకవర్గాలకు ఇచ్చినట్లే నిధులిచ్చి వెనక్కు తీసుకున్నారు. వాటిని మళ్లీ తిరిగిచ్చారా? ఉపాధి నిధులు సక్రమంగా ఇస్తున్నారా? అమరావతికి ఏం నిధులిచ్చారు? రాష్ట్రానికి నిధులివ్వడం లేదని ప్రశ్నిస్తే సస్పెండ్ చేస్తారా?' అని మురళీమోహన్ ప్రశ్నించారు. ఎంపీలు పార్లమెంటులో కాకపోతే ఎక్కడ ప్రశ్నిస్తారని నిలదీశారు. చంద్రబాబు వంటి సమర్థుడైన నాయకుడు ముఖ్యమంత్రిగా రాష్ట్రానికి ఉన్నందునే మర్యాదగా ఉంటున్నామని.. చేసిన తప్పులు సరిదిద్దుకోవాలని భాజపా, ఎన్డీయే నేతలకు మురళీమోహన్ హితవు పలికారు. ఏం విధ్వంసకర పనులు చేశామని సస్పెండ్ చేశారో చెప్పాలని ఎంపీ కొనకళ్ల నారాయణ ప్రశ్నించారు. రాష్ట్రానికి కేంద్రం అన్యాయం చేస్తుంటే ఎంపీలు జీవీఎల్, హరిబాబులు మద్దతివ్వడం సరికాదని అన్నారు. రాష్ట్రంపై కక్షకట్టే నిధులివ్వడం ఆపేశారని, మోదీ సర్కారుకు రోజులు దగ్గరపడ్డాయని ఎంపీ మాగంటి బాబు ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని, ప్రజలను మభ్యపెట్టి హోదా కన్నా మెరుగైన ప్యాకేజీ ఇస్తామని కేంద్రం మోసం చేసిందని కర్నూలు ఎంపీ బుట్టా రేణుక ఆరోపించారు.



పార్లమెంటు ప్రాంగణంలో నిరసన తెలుపుతున్న తెదేపా ఎంపీలకు సంఘీభావంగా నినాదాలు చేస్తున్న సమాజ్‌వాదీ పార్టీ వ్యవస్థాపకుడు ములాయంసింగ్ యాదవ్

నిరంకుశ పోకడలు

రాష్ట్రం మొత్తం పార్లమెంటువైపే చూస్తోందని, తెదేపా ఎంపీల పోరాటాన్ని ఐదు కోట్ల మంది ప్రజలు గమనిస్తున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. పార్టీ ఎంపీలతో ఆయన శుక్రవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. "భాజపాపై రాజీలేని పోరాటం చేయాలి. ఆంధ్రప్రదేశ్ హక్కుల్ని, ఐదు కోట్ల ఆంధ్రుల ప్రయోజనాల్ని కాపాడాలి. ప్రత్యేకహోదా సహా అన్ని హామీలను, చట్టంలో పేర్కొన్న అన్ని అంశాలనూ అమలు చేయాలి. దిల్లీలో జరిగిన లాఠీఛార్జిని, ఎంపీల సస్పెన్షన్‌ను అందరూ ఖండించాలి. రెండురోజుల వ్యవధిలో 45 మంది ఎంపీలను సస్పెండ్ చేశారు. ప్రజాస్వామ్యంపై విశ్వాసం, రాజ్యాంగ విలువలపై నమ్మకం లేదు. మెజార్టీ ఉందని మూర్ఖంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికి ఐదు రాష్ట్రాల్లో శృంగభంగమైంది. రాబోయే రోజుల్లో వారికి దేశవ్యాప్తంగా గుణపాఠం చెబుతారు..." అని చంద్రబాబు వెల్లడించారు. ప్రత్యేకహోదా సాధన సమితి ప్రతినిధులపై దిల్లీలో పోలీసులు లాఠీఛార్జి చేయడాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రంగా ఖండించారు. గాయపడ్డ తెదేపా పార్లమెంటరీ పార్టీ కార్యాలయ ఉద్యోగి వెంకట్‌ను ఆయన శుక్రవారం ఫోన్‌లో పరామర్శించారు. శాంతియుతంగా ఆందోళన చేస్తున్న వారిపై లాఠీఛార్జి చేయడం అమానుషమని, కేంద్రం నిరంకుశ పోకడలకు ఇది నిదర్శనమన్నారు. లోక్‌సభలో పోరాటం చేస్తున్న తెదేపా ఎంపీల సస్పెన్షన్, ప్రత్యేకహోదా సాధన సమితి ప్రతినిధులపై లాఠీఛార్జి చేయడం ద్వారా కేంద్రం దుర్మార్గంగా వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. భాజపాతో కుమ్మక్కైన పార్టీలకూ ప్రజలు గుణపాఠం చెబుతారన్నారు.



నెల్లూరు జిల్లా నేతలు, కార్యకర్తల సమావేశంలో ఓ కార్యకర్త మాట్లాడుతుండగా వివరాలు రాసుకుంటున్న పవన్‌కల్యాణ్

ఒకట్రెండు కులాలను అడ్డుపెట్టుకుని విజయం సాధించలేం

జనసేన అధిపతి పవన్‌కల్యాణ్

ఈనాడు, అమరావతి: ఒకటి రెండు కులాలను అడ్డుపెట్టుకుని రాజకీయాల్లో విజయం సాధించలేమని.. ఉత్తరప్రదేశ్‌లో కుల రాజకీయ ప్రయోగాలు విఫలమయ్యాయని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ అన్నారు. పేరు ప్రఖ్యాతులు, డబ్బుతో మాత్రమే పార్టీలు స్థాపించి వాటిని విజయవంతం చేయలేమన్నారు. బాధ్యత, సమాజం కోసం పని చేయాలన్న తలంపు, ఓపిక, సాహసం ఉన్నప్పుడే రాజకీయాల్లో రాణించగలమన్నారు. విజయవాడలోని జనసేన రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం తూర్పుగోదావరి, నెల్లూరు జిల్లాల పార్టీ నాయకులు, సమన్వయకర్తలు, కార్యకర్తల సమావేశాల్లో ఆయన మాట్లాడారు. 'కులం పేరు చెప్పి వ్యక్తులు లాభపడుతున్నారు తప్ప కులాలు బాగుపడటం లేదు. 2009లో ప్రజారాజ్యం పార్టీ ఏర్పాటైన సందర్భంలోని అనుభవాలను దృష్టిలో పెట్టుకుని జనసేనని తీర్చిదిద్దుతున్నా. రాజకీయాల్లోకి వచ్చిన వెంటనే ఎమ్మెల్యేలు, ఎంపీలు అయిపోదాం అనుకుంటే సాధ్యమయ్యే పనికాదు. నన్ను నమ్మి పార్టీలోకి వచ్చి పని చేసిన వారికి తప్పకుండా గుర్తింపు ఇస్తా' అని పవన్ పేర్కొన్నారు. జనవరి 9 తర్వాత స్వల్పకాలిక పార్టీ జిల్లా కమిటీలు ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. నెల్లూరు జిల్లాలో కేవలం 10 కుటుంబాల చేతుల్లో రాజకీయం బందీ అయిందన్నారు. రాజకీయ వారసత్వంతో మనుగడ సాగిస్తున్న కుటుంబాలను ఎదుర్కొనే బాధ్యతను అక్కడి యువత సాయంతో తానే తీసుకుంటానన్నారు. ఈ సమావేశాల్లో నాదెండ్ల మనోహర్, మాదాసు గంగాధరం, తోట చంద్రశేఖర్, రావెల కిషోర్‌బాబు, ముత్తంశెట్టి కృష్ణారావు, పార్థసారధి, కందుల దుర్గేష్ తదితరులు పాల్గొన్నారు.

దిల్లీ లాఠీఛార్జికి నిరసనగా వామపక్షాల ప్రదర్శనలు

ఈనాడు, అమరావతి: రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు కోసం దిల్లీలో ధర్నాచేసిన వామపక్షాలు, ఏపీ ప్రత్యేక హోదా విభజన హామీల సాధన సమితి, ప్రజాసంఘాల నాయకులపై పోలీసుల లాఠీఛార్జీని నిరసిస్తూ వామపక్షాల ఆధ్వర్యంలో శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. ప్రధాని మోదీ దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా కొందరు నాయకులు, కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేశారు. విశాఖపట్నంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి, నర్సీపట్నంలో సీపీఐ విశాఖ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకట రమణ, సీపీఎం నాయకుడు సత్తిబాబు నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. విజయవాడలో సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు వై.వెంకటేశ్వరరావు, సీపీఐ విజయవాడ నగర కార్యదర్శి దోనేపూడి శంకర్ పాల్గొన్నారు. జిల్లాల్లో జరిగిన కార్యక్రమాల్లో వామపక్ష నాయకులు, కార్యకర్తలు ప్రధాని మోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

ఖండించిన జగన్

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా ఇవ్వాలన్న డిమాండ్‌పై దిల్లీలో ధర్నా చేస్తున్న వామపక్ష నేతలు, ప్రతినిధులపై అక్కడి పోలీసులు ప్రవర్తించిన తీరు, లాఠీఛార్జీ చేయడాన్ని వైకాపా అధ్యక్షుడు జగన్ ఖండించారు. ఆయన సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మధుకు ఫోన్ చేసి మాట్లాడారు. ప్రత్యేక హోదా డిమాండ్‌కు మద్దతు తెలపడంతోపాటు, లాఠీ ఛార్జీని ఖండిస్తున్నట్లు జగన్ సంఘీభావం ప్రకటించారు. ఈ వివరాలను వైకాపా కేంద్ర కార్యాలయం వెల్లడించింది.

మంత్రి అయ్యన్న మహిళలకు క్షమాపణలు చెప్పాలి: ఐద్వా

విశాఖ జిల్లాలో జన్మభూమి- మా ఊరు కార్యక్రమంలో మంత్రి అయ్యన్నపాత్రుడు మహిళలనుద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) కార్యదర్శి డి.రమాదేవి ప్రకటనలో పేర్కొన్నారు. మంత్రి వ్యాఖ్యలను ఖండిస్తున్నామని, ఆయన మహిళలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

ముఠా నాయకుడిలా మోదీ వ్యవహారం

- సీఎంపై ఆరోపణలుంటే తేల్చాలి
- ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి వ్యాఖ్యలు

ఈనాడు, అమరావతి: ప్రధానమంత్రి నరేంద్రమోదీ రాయలసీమలోని ఒక ముఠా నాయకుడి స్థాయిలో వ్యవహరిస్తున్నారని తెదేపా ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి వ్యాఖ్యానించారు. భాజపా రాష్ట్ర నాయకులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మోదీ మాట్లాడిన మాటలు ప్రధాని స్థాయికి తగినవి కావని అభిప్రాయపడ్డారు. "ముఖ్యమంత్రి చంద్రబాబు అవినీతిపరుడంటూ.. ప్రధానమంత్రిగా ఉండి అతి సాధారణంగా, ఆధారం లేకుండా వ్యాఖ్యలు చేయడం తగదు. ఆరోపణలుంటే తేల్చాలి. ప్రాసిక్యూట్ చేయాలి" అని జేసీ వ్యాఖ్యానించారు. ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసం వద్ద శుక్రవారం మధ్యాహ్నం జేసీ విలేకరులతో మాట్లాడారు. ఎన్టీఆర్ దుష్ట కాంగ్రెస్ అన్న పార్టీతోనే తెదేపా కలుస్తోందన్న ప్రధాని వ్యాఖ్యలపై స్పందిస్తూ.. మోదీని మించిన దుష్టశక్తి ఏముంటుందని ఎంపీ ప్రశ్నించారు. ఈ ప్రభుత్వం అందరికీ దుష్టశక్తి.. లేకపోతే మోదీకి వ్యతిరేకంగా ఇంతమంది ఏకమవుతారా అని వ్యాఖ్యానించారు. కలిసి పనిచేద్దామంటూ.. పవన్‌కల్యాణ్‌ను సీఎం ఆహ్వానించడంపై విలేకరులు ప్రశ్నించగా.. శత్రువులను మిత్రులుగా చేసుకోవడంలో తప్పేముందని పేర్కొన్నారు.

ఎల్ఈడీ వెలుగుల్లో ఏపీ నంబర్ 1

లోక్‌సభలో కేంద్ర ఇంధనశాఖ మంత్రి వెల్లడి

ఈనాడు, దిల్లీ: ఎల్ఈడీ వీధి దీపాల ఏర్పాటులో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే తొలిస్థానంలో నిలిచింది. రాష్ట్రంలో ఇప్పటి వరకూ 21,81,615 ఎల్ఈడీ దీపాలు ఏర్పాటు చేసినట్లు కేంద్ర ఇంధనశాఖ మంత్రి ఆర్‌కే సింగ్ శుక్రవారం లోక్‌సభలో ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. దేశంలో మొత్తం 76.77 లక్షల ఎల్ఈడీ దీపాలు ఏర్పాటు చేయగా అందులో 28.41% ఏపీలోనే ఉన్నట్లు తెలిపారు. ఇప్పటివరకూ దేశవ్యాప్తంగా 1,492 పట్టణ స్థానిక సంస్థలు ఎల్ఈడీల ఏర్పాటుకు సంతకం చేశాయని, అందులో ఏపీ నుంచి 108, తెలంగాణ నుంచి 76 ఉన్నట్లు తెలిపారు.

నడికుడి-శ్రీకాళహస్తి రైలుమార్గం గడువు చెప్పలేం

నడికుడి-శ్రీకాళహస్తి రైలు మార్గానికి పలు అనుమతులు అవసరం ఉందని, ఆ ప్రాజెక్టు పూర్తికి గడువు చెప్పలేమని రైల్వేశాఖ సహాయమంత్రి రాజన్ గోహెన్ తెలిపారు. రాజ్యసభలో తెదేపా సభ్యులు రవీంద్రకుమార్, టీజీ వెంకటేష్‌లు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. పిడుగురాళ్ల-శావల్యాపురం (45 కిమీ) మధ్య రైల్వేలైన్ నిర్మాణంలో రెండుచోట్ల భూ వివాదాలు ఉండటంతో వాటి పరిష్కారం కోసం హైకోర్టులో రైల్వేశాఖ వాదనలు వినిపిస్తున్నట్లు చెప్పారు. పిడుగురాళ్ల-రొంపిచర్ల మధ్య 2.3 కిలోమీటర్లు తప్ప మిగతా నిర్మాణ పనులన్నీ పూర్తయినట్లు వెల్లడించారు.

కేంద్రానికి సహకరిస్తేనే రాష్ట్ర ప్రయోజనాలు: హరిబాబు

కేంద్రానికి సహకరిస్తేనే రాష్ట్ర ప్రయోజనాలు నెరవేరుతాయని భాజపా ఎంపీ కంభంపాటి హరిబాబు సూచించారు. కేంద్రం ఏదీ చేయలేదన్నట్లు చిన్నచూపు చూడడం సరికాదని పేర్కొన్నారు. కేంద్రం ఇచ్చినవి రాష్ట్రం హక్కుగా, ఇవ్వనివి మోదీ తప్పుగా చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారమిక్కడ ఆయన ఎంపీ జీవీఎల్ నరసింహారావుతో కలిసి మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్‌తో జత కట్టిన ఏ పార్టీ అయిన నక్కతోక తొక్కినట్లేనని ఏపీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి పేర్కొనడం విడ్డూరమని అన్నారు. నక్కతోకగా భావించి తొక్కితే కుక్కతోకగా మారి కరుస్తుందని ఆయా పార్టీలు గమనించాలని ఎంపీ హరిబాబు హితవు పలికారు.

హోదాతోనే ఏపీకి న్యాయం

- మాట తప్పిన కేంద్రం ప్యాకేజీ కూడా ఇవ్వలేదు
- కేంద్రంపై సీతారాం ఏచూరి ధ్వజం
- కేరళ, తమిళనాడు నిధులకు కోతేసి ఏపీకి ఇవ్వాలా?
- సీపీఐ ఎంపీలతో జైట్లీ వెటకారం



ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని కోరుతూ అరుణ్ జైట్లీని శుక్రవారం కలిసిన సీపీఐ జాతీయ కార్యదర్శి డి.రాజా, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ తదితరులు

ఈనాడు, దిల్లీ: ప్రత్యేక హోదాతోనే ఆంధ్రప్రదేశ్‌కు న్యాయం జరుగుతుందని సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అన్నారు. ప్రత్యేక హోదాపై మాట తప్పిన కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్యాకేజీ కూడా ఇవ్వలేదని విమర్శించారు. పార్లమెంట్ లోపల, బయట హోదా సాధనకు పెద్ద ఎత్తున ఉద్యమం కొనసాగుతోందన్నారు. అంతా సంఘటితంగా పోరాడితేనే కేంద్రంలో రాజకీయ మార్పు సాధించగలమని... అప్పుడే ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా సాధించగలమన్నారు.

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా కోరుతూ సీపీఐ, సీపీఎం, జనసేన, ప్రత్యేక హోదా సాధన సమితి ఆధ్వర్యంలో దిల్లీలోని జంతర్‌మంతర్ రోడ్డులో శుక్రవారం దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఏచూరి మాట్లాడుతూ ప్రత్యేక హోదా విషయంపై తాను కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీతో పలుమార్లు మాట్లాడానని.. ఎప్పుడూ తప్పుడు సమాచారమే ఇచ్చారని ఆయన అన్నారు. కార్యక్రమంలో సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బి.వి.రాఘవులు, సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు, విభజన హామీల సాధన సమితి అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ ఏపీకి ప్రత్యేక హోదా ఇచ్చి తీరాల్సిందేనన్నారు. దీక్షలో వివిధ పార్టీలు, సంఘాల నాయకులు పుణ్యవతి, జి.వి.సత్యనారాయణరాజు, శివరామకృష్ణ, చాట్ల పుల్లారావు, రామకృష్ణ, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విభజన హామీలు అమలు చేయండి

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదాను అమలు చేయాలని, రాష్ట్రానికి ఆర్థికంగా సహాయపడాలని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీకి సీపీఐ జాతీయ కార్యదర్శి రాజా విజ్ఞప్తి చేశారు. దీక్ష అనంతరం రాజా, చలసాని శ్రీనివాస్, కె.రామకృష్ణ నేతృత్వంలోని ప్రతినిధులు జైట్లీని కలిశారు. ఈ సందర్భంగా ప్రత్యేక హోదా కోరుతూ రెండు రోజులుగా దిల్లీలో దీక్ష చేస్తున్న విషయాన్ని రాజా జైట్లీకి తెలిపారు.

రెచ్చగొట్టేలా జైట్లీ తీరు: చలసాని

విభజన హామీలు అమలు చేయాలని సీపీఐ రాజ్యసభ సభ్యులు రాజా, బినోయ్ విశ్వం ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీని కోరగా కేరళ, తమిళనాడు నిధులు కోత వేసి ఆంధ్రప్రదేశ్‌కు ఇవ్వమంటారా? అని ఆయన రెచ్చగొట్టే ప్రయత్నం చేశారని చలసాని శ్రీనివాస్ తెలిపారు. ప్యాకేజీకి ముఖ్యమంత్రి ఒప్పుకున్నారని ఆర్థిక మంత్రి చెప్పారని.. దానిని తాము ఆనాడే తిరస్కరించినట్లు ఆయన దృష్టికి తీసుకెళ్లామన్నారు. వెనుకబడిన ప్రాంతాల నిధుల విషయమై రామకృష్ణ ప్రశ్నిస్తే త్వరలోనే రూ.350 కోట్లు విడుదల చేస్తామని జైట్లీ చెప్పారని చలసాని పేర్కొన్నారు. త్వరలోనే ఏపీకి ఎంతో కొంత చేస్తామని ఆర్థిక మంత్రి చెప్పారని ఆయన తెలిపారు.

మోదీ అన్యాయం చేస్తే సమర్థిస్తారా?

- కాన్వాయ్‌ను అడ్డుకున్న భాజపా నాయకులపై చంద్రబాబు ఆగ్రహం





కాన్వాయ్‌ను అడ్డుకున్న భాజపా నాయకులను ఉద్దేశించి మాట్లాడుతున్న చంద్రబాబు

గాంధీనగర్(కాకినాడ), న్యూస్‌టుడే: 'భాజపా నాయకులకు ఏం కావాలి. మీకు ఈ రాష్ట్రంలో ఉండేందుకు అర్హత లేదు. నరేంద్రమోదీ చేసిన అన్యాయాన్ని సమర్థిస్తారా?...' అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రశ్నించారు. తూర్పుగోదావరి జిల్లా కాకినాడ జన్మభూమి సభలో పాల్గొనేందుకు శుక్రవారం జేఎన్‌టీయూ మైదానానికి వెళ్తున్న ఆయన కాన్వాయ్‌ని కొందరు భాజపా నాయకులు ఎన్ఎఫ్‌సీఎల్ రోడ్డులో అడ్డుకున్నారు. సీఎం డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఇది గమనించిన చంద్రబాబు బస్సు దిగి మైక్ అందుకొని ఆ పార్టీ కార్పొరేటర్లను ఉద్దేశించి... 'మోదీ చేసిన దానికి సిగ్గుపడాలి. రాష్ట్రానికి అన్యాయం చేశారు. డౌన్‌డౌన్ కాదయ్యా... ప్రజలు మిమ్మల్ని కొడతారు...' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఎందుకమ్మా! ఇలా గొడవపెడతావ్... ఏం చేశారు మీ మోదీ...' అంటూ ఓ మహిళా కార్పొరేటర్‌ను ఉద్దేశించి అన్నారు. దీనికి స్పందించిన ఆమె మోదీనే అంతా చేస్తున్నారనడంతో .. 'ఏం చేశారు... రాష్ట్రాన్ని, దేశాన్ని ముంచేశారు. బుధవారం దిల్లీలో ప్రత్యేక ఉద్యమం చేసిన వారిపై లాఠీఛార్జి చేశారు. ఈ జన్మభూమి మీద ఉన్నారు. ఈ నీళ్లు తాగుతున్నారు. ఈ గడ్డపై ఉన్నప్పుడు మీకు బాధ్యత ఉండాలి కదా?...' అని పేర్కొన్నారు. నగరంలోని రోడ్లు తరచూ తవ్వేస్తున్నారని, అభివృద్ధి ఎక్కడని ఒకరు అడగగా... 'అన్ని చేస్తాం. కాకినాడను స్మార్ట్ సిటీగా చేస్తాం. 2014 ముందు కాకినాడ ఎలా ఉండేది. ఇప్పుడెలా ఉంది తమ్ముడు?...' అంటూ ప్రశ్నించారు. 'కేంద్ర ప్రభుత్వం సహకరించి ఉంటే రాష్ట్ర మొత్తం వీధి వీధి స్మార్ట్ అయ్యేది. వాళ్లు సహకరించకపోయినా చేస్తున్నాం. మీరూ సంతోషించాలి. మీరు మనకు రావాల్సిన నిధుల కోసం పోరాడితే అభినందిస్తా...' అని చెప్పి చంద్రబాబు బస్సులోకి వెళ్లిపోయారు.

ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి సొంతిల్లు: సీఎం

ఈనాడు డిజిటల్, అమరావతి: గృహవసతి లేని ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి సొంతిల్లు మంజూరు చేసేందుకు విధివిధానాలు ఖరారు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. మండల, డివిజన్, జిల్లా స్థాయిల్లో అవసరమైన భూమిని గుర్తించి అపార్టుమెంట్ కాంప్లెక్స్‌లు నిర్మించి ఉద్యోగుల స్థాయిని బట్టి ఫ్లాట్లు కేటాయించాలని సూచించారు. శుక్రవారం సమీక్షలో భాగంగా జన్మభూమి గ్రామసభల్లో రేషన్‌కార్డులు, పింఛన్లు, ఇళ్లస్థలాలపై వచ్చే అర్జీలు, ఫిర్యాదులను ఏరోజుకారోజు విచారణ జరిపి తుదినిర్ణయం తీసుకునే అధికారాన్ని జిల్లా కలెక్టర్లకు కట్టబెట్టారు.

బ్రాహ్మణులకు టికెట్లపై కసరత్తు

ఈనాడు, అమరావతి: శాసనసభ ఎన్నికల్లో బ్రాహ్మణులకు టిక్కెట్ల కేటాయింపు దిశగా కసరత్తు చేద్దామని, ఎక్కడ వీలైతే అక్కడ అవకాశం కల్పిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వెల్లడించారు. ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసం వద్ద శుక్రవారం చాణక్య ట్రాన్స్‌పోర్టు ఆపరేటర్ల పథకాన్ని ప్రారంభించారు. 30 మంది పేద బ్రాహ్మణ లబ్ధిదారులకు కార్లు అందించి ఆయన విలేకరులతో మాట్లాడారు. రూ.2.2కోట్లతో రూ.60లక్షల రాయితీతో ఈ పథకాన్ని ప్రారంభించినందుకు బ్రాహ్మణ కార్పొరేషన్‌ను అభినందించారు. తన పాదయాత్ర సమయంలో బ్రాహ్మణుల కష్టాలు గమనించానని, తాను అధికారంలోకి వచ్చిన తర్వాత ఎక్కడా లేనివిధంగా కార్పొరేషన్ ఏర్పాటు చేసి బడ్జెట్‌లో రూ.75కోట్లు కేటాయించామన్నారు. ఈ నాలుగేళ్లలో వివిధ సంక్షేమ పథకాలతో ఆ సామాజికవర్గంలో వెనుకబడిన వారికి రూ.210కోట్లతో 1.5లక్షల మందికి లబ్ధి చేకూర్చామని చెప్పారు. పేద విద్యార్థులు 88,105 మందికి రూ.137కోట్లు. పారిశ్రామికంగా ఎదిగేందుకు 1453 మందికి 21.12కోట్లు సాయం అందించామని, 550మందికి నైపుణ్య శిక్షణ ఇచ్చామని, సంక్షేమం కింద 47,665 మందికి రూ.41.34 కోట్లు ఖర్చు చేశామని వివరించారు. ఈ కార్పొరేషన్ ఛైర్మన్ ఆనందసూర్య, ప్రభుత్వ ప్రత్యేక ప్రధానకార్యదర్శి మన్మోహన్‌సింగ్, ఎండీ పద్మ, టి.డి.జనార్ధన్, బ్రాహ్మణ క్రెడిట్ సొసైటీ ఛైర్మన్ శ్రీశ్రీ శర్మ, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఉపసంఘానికి కరవు నివేదిక

ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లోని కరవు పరిస్థితులపై అంతర్ మంత్రిత్వశాఖల కేంద్ర బృందం ఇచ్చిన నివేదికను జాతీయ కార్యనిర్వాహక సంఘం(నేషనల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ) పరిధిలోని ఉపసంఘానికి ప్రతిపాదించినట్లు కేంద్ర వ్యవసాయ శాఖ సహాయమంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ తెలిపారు. రాజ్యసభలో శుక్రవారం తెదేపా ఎంపీ కనకమేడల రవీంద్రకుమార్ అడిగిన లిఖితపూర్వక ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తొమ్మిది జిల్లాల్లోని 347 మండలాలను గత ఖరీఫ్‌లో కరవు మండలాలుగా ప్రకటించిందని, అక్కడి పరిస్థితుల అధ్యయనానికి కేంద్రం అంతర్‌మంత్రిత్వ శాఖల బృందాన్ని పంపిందని వివరించారు. అది ఇచ్చిన నివేదికను ప్రస్తుతం ఉపసంఘానికి పంపామని, దాని సిఫారసులను హోంమంత్రి నేతృత్వంలోని ఉన్నత స్థాయి కమిటీ ఆమోదానికి పంపుతామని చెప్పారు.

చేనేత ఉత్పత్తులపై జీఎస్టీ తొలగించాలి

చేనేత ఉత్పత్తులపై వస్తుసేవల పన్ను(జీఎస్టీ)ను తొలగించాలని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీకి కర్నూలు ఎంపీ బుట్టా రేణుక నేతృత్వంలోని చేనేత సంఘాల ప్రతినిధుల బృందం విన్నవించింది. దిల్లీలో శుక్రవారం వారు కేంద్ర మంత్రిని కలిశారు. చేనేత వస్త్రాలపై గతంలో పన్ను లేదని, జీఎస్టీలో 5, 12శాతం శ్లాబుల పరిధిలో చేనేత వస్త్రాలను చేర్చడంతో ఆ రంగం కుదేలైందని మంత్రికి వివరించారు.

పోలవరానికి జాతీయ పురస్కారం

- సీబీఐపీ అవార్డు అందుకున్న దేవినేని

ఈనాడు, దిల్లీ: కేంద్రప్రభుత్వం నుంచి సహకారం లేకున్నా డిసెంబరు నాటికి పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తిచేస్తామని ఆంధ్రప్రదేశ్ నీటి పారుదల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు తెలిపారు. శుక్రవారమిక్కడ సెంట్రల్ బోర్డ్ ఫర్ ఇరిగేషన్, పవర్ (సీబీఐపీ) అవార్డు అందుకోవడానికి వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. పోలవరం ప్రాజెక్టు నిర్వహణకు జాతీయ స్థాయిలో అవార్డు రావడం సంతోషంగా ఉందన్నారు. ఇది చూసైనా విపక్షాలు ఆరోపణలు మానుకోవాలని సూచించారు. పోలవరం ప్రాజెక్టు చీఫ్ ఇంజినీరు శ్రీధర్, ఈఎన్‌సీ వెంకటేశ్వరరావులతో కలిసి కేంద్ర జలవనరుల సంఘం ఛైర్మన్ మసూద్ హుస్సేన్, కేంద్ర జలవనరుల శాఖ కార్యదర్శి యూపీ సింగ్‌లతో భేటీ అయి పలు అంశాలపై చర్చించామన్నారు. పోలవరం ప్రాజెక్టు ప్రతిపాదిత అంచనాలపై త్వరలోనే సీడబ్ల్యూసీ నోట్ తయారుచేసి జలవనరుల శాఖకు పంపుతామని మసూద్ హామీ ఇచ్చారన్నారు. అదే విధంగా రాష్ట్రంలోని నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించి కేంద్రంనుంచి రూ.4వేల కోట్లు బకాయిలు రావాల్సి ఉందని యూపీ సింగ్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. 'బెస్ట్ ఇంప్లిమెంటేషన్ ఆఫ్ వాటర్ రిసోర్స్ ప్రాజెక్ట్స్' విభాగంలో పోలవరం ప్రాజెక్టు ఉత్తమ ప్రణాళిక, నిర్మాణానికిగానూ ఆంధ్రప్రదేశ్ నీటిపారుదల శాఖకు ప్రతిష్ఠాత్మక సీబీఐపీ అవార్డు దక్కింది. ఈ అవార్డును శుక్రవారమిక్కడ సీబీఐపీ దినోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమలో కేంద్రవిద్యుత్తు మంత్రి రాజ్‌కుమార్ సింగ్ చేతుల మీదుగా రాష్ట్ర మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ వెంకటేశ్వరరావు, పోలవరం సీఈ శ్రీధర్‌లు అందుకొన్నారు.



కేంద్ర మంత్రి రాజ్‌కుమార్ సింగ్ చేతుల మీదుగా సీబీఐపీ అవార్డు అందుకుంటున్న మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, ఈఎన్‌సీ వెంకటేశ్వరరావు, సీఈ శ్రీధర్

6, 7 తేదీల్లో లోక్‌సత్తా సమావేశాలు

ఈనాడు డిజిటల్, అమరావతి: రాష్ట్ర విభజన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు, ఆంధ్రప్రదేశ్‌లో పాలనా సంస్కరణల కోసం చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించి, భవిష్యత్ కార్యాచరణను ఖరారు చేసేందుకు లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ విభాగం సమావేశం కానుంది. జనవరి 6, 7 తేదీల్లో విజయవాడలో ఈ సమావేశాలు జరగనున్నట్లు ఆ పార్టీ రాష్ట్రాధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశాలకు లోక్‌సత్తా వ్యవస్థాపకులు డా.జయప్రకాశ్ నారాయణ ముఖ్య అతిథిగా విచ్చేస్తారన్నారు. పలువురు తెలంగాణ నేతలు హాజరుకానున్నారని వివరించారు.

సెన్సెక్స్ ▲ 181 **35695** | నిఫ్టీ ▲ 55 **10727** | డోజోన్స్ 23496 ▲ 810 | నాస్‌డాక్ 6748 ▲ 286 | రూపాయి 69.72 ▲ 48 పైసలు (ఒక అమెరికా డాలరుకు) | ముడి చమురు 57.03 ▲ (బ్రెంట్ ధర డాలర్లలో)

అమెరికా కాలమానం ప్రకారం శుక్రవారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).

ఈనాడు బిజినెస్

ఘనం (+) నిఫ్టీ	4న	మార్పు%	గ్రహణం (-) నిఫ్టీ	4న	మార్పు%
BHARTI INFRATEL	285.05	4.95	HCL TECH	932.35	-1.69
YES BANK	189.65	3.01	TECH MAHINDRA	681.10	-1.47
TATA MOTORS	170.95	2.95	TCS	1876.85	-1.22
BHARTI AIRTEL	322.45	2.85	INFOSYS	661.05	-1.21
VEDANTA	192.90	2.63	HERO MOTOCORP	2987.85	-0.89
ONGC	145.70	2.32	INDUSIND BANK	1548.20	-0.76
SBI	297.65	2.25	SUN PHARMA	433.80	-0.53


విదేశీ మారకపు రేట్లు

(థామస్ కుక్) (రూ.లలో)



కరెన్సీ	కొనుగోలు	అమ్మకం	కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలరు	63.63	73.78	బ్రహెయిన్ దీనార్	172.22	197.03
పౌండ్ స్టెర్లింగ్	80.41	93.27	కువైట్ దీనార్	190.57	237.29
యూరో	72.51	84.08	ఒమన్ రియాల్	168.53	193.04
జపనీస్ యెన్/100	58.70	68.08	సౌదీ రియాల్	16.92	20.05
ఆస్ట్రేలియా డాలరు	44.73	51.74	యూఏఈ దిర్హమ్	17.32	20.23
సింగపూర్ డాలరు	46.70	55.34	మలేషియా రింగిట్	15.05	18.51
థాయ్ బాత్/100	198.48	237.43	చైనీస్ యువాన్	7.21	11.69

శుక్రవారం నిఫ్టీ కదలికలు



దిగువ స్థాయిలో కొనుగోళ్లు

● పుంజుకున్న మార్కెట్లు ● రాణించిన టెలికాం, లోహ షేర్లు ● సెన్సెక్స్‌కు 181 పాయింట్ల లాభం



సమీక్ష

రెండు రోజుల వరుస నష్టాలకు అడ్డుకట్ట పడింది. టెలికాం, లోహ, బ్యాంకింగ్ షేర్లకు దిగువ స్థాయిల్లో కొనుగోళ్ల మద్దతు లభించడంతో మార్కెట్లు లాభాలతో ముగిశాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి బలోపేతం కావడం సెంటిమెంట్‌ను మెరుగుపరిచింది. 48 పైసలు పెరిగిన రూపాయి 69.72 వద్ద స్థిరపడింది. అమెరికా- చైనాల మధ్య వాణిజ్య చర్చల నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్లకు ఉపశమనం లభించింది. జపాన్ మినహా ఆసియా మార్కెట్లు లాభపడగా, ఐరోపా షేర్లు అదే ధోరణిలో ట్రేడయ్యాయి. అయితే వారం ప్రాతిపదికన చూస్తే మాత్రం మన సూచీలు డీలాపడ్డాయి. సెన్సెక్స్ 381.62 పాయింట్లు, నిఫ్టీ 132.55 పాయింట్లు చొప్పున నష్టాలు చవిచూశాయి.

సెన్సెక్స్ ఉదయం 35,590.79 పాయింట్ల వద్ద సానుకూలంగా ప్రారంభమైంది. అయితే కొద్దిసేపటికే నష్టాల్లోకి జారుకున్న సూచీ.. ఇంట్రాడేలో 35,382.08 పాయింట్ల వద్ద కనిష్ఠానికి పడిపోయింది. అనంతరం దిగువ స్థాయిల వద్ద మదుపర్ల కొనుగోళ్లతో కోలుకున్న సూచీ బలంగా పుంజుకుంది. ఒకానొకదశలో 35,744.20 పాయింట్ల వద్ద గరిష్ఠానికి తాకిన సెన్సెక్స్.. చివరకు 181.39 పాయింట్ల లాభంతో 35,695.10 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో ఈ సూచీ 10,628.65- 10,741.05 పాయింట్ల మధ్య కదలాడింది.

✦ రంగ బ్యాంకు షేర్లలో పంజాబ్ నేషనల్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఆంధ్రా బ్యాంక్, ఎస్‌బీఐలు 4 శాతం వరకు పెరిగాయి.

సెన్సెక్స్ 30 షేర్లలో 21 లాభాలతో ముగిశాయి. యెస్ బ్యాంక్ 3.05%, భారతీ ఎయిర్‌టెల్ 3.02 శాతం, టాటా మోటార్స్ 2.74 శాతం, వేదాంతా 2.66 శాతం, ఎస్‌బీఐ 2.22 శాతం, యాక్సిస్ బ్యాంక్ 1.96 శాతం, హెచ్‌డీఎఫ్‌సీ 1.83 శాతం, ఓఎన్‌జీసీ 1.71 శాతం, ఎన్‌టీపీసీ 1.57 శాతం, టాటా స్టీల్ 1.38 శాతం, బజాజ్ ఆటో 1.27 శాతం, పవర్ గ్రిడ్ 1.16 శాతం, ఎం అండ్ ఎం 1 శాతం చొప్పున రాణించిన వాటిలో ఉన్నాయి. హెచ్‌సీఎల్ టెక్ 1.55 శాతం, టీసీఎస్ 1.19 శాతం, ఇన్ఫోసిస్ 1.02 శాతం, ఇండస్ఇండ్ బ్యాంక్ 0.71 శాతం మేర నష్టపోయాయి. రంగాల వారీ సూచీల్లో టెలికాం, లోహ, యుటిలిటీస్, ఫైనాన్స్ షేర్లు 2 శాతానికి పైగా పెరిగాయి. ఐటీ, మన్నికైన వినిమయ వస్తువుల స్క్రిప్‌లు నీరసపడ్డాయి. బీఎస్ఈలో 1,288 షేర్లు లాభాల్లోనూ, 1319 షేర్లు నష్టాలతోనూ ముగిశాయి. 158 షేర్లలో ఎటువంటి మార్పు లేదు

ఎంఎస్ఎంఈలకు రూ.కోటి వరకు రుణం

ఎస్‌బీఎఫ్‌సీతో ఐసీఐసీఐ బ్యాంక్ జట్టు

దిల్లీ: సూక్ష్మ, చిన్న మధ్య స్థాయి సంస్థలకు (ఎంఎస్ఎంఈ) రూ.కోటి వరకు రుణం అందించేందుకు స్మాల్ బిజినెస్ ఫిన్‌క్రెడిట్ (ఎస్‌బీఎఫ్‌సీ) సంస్థతో ప్రైవేటు దిగ్గజ ఐసీఐసీఐ బ్యాంక్ చేతులు కలిపింది. శుక్రవారం ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకున్నట్లు బ్యాంకు వెల్లడించింది. గత సెప్టెంబరులో ఆర్‌బీఐ జారీ చేసిన ఆదేశాలకు అనుగుణంగానే, ఈ ఒప్పందం జరిగిందని ఐసీఐసీఐ బ్యాంకు పేర్కొంది. ప్రాధాన్యతా రంగంలో ఆస్తుల సృష్టికి అవసరమైన రుణాలు అందించేందుకు ఏదైనా బ్యాంకింగేతర ఆర్థిక సంస్థతో (ఎన్‌బీఎఫ్‌సీ) కలిసి పని చేయవచ్చని ఆర్‌బీఐ నిర్దేశించిన నేపథ్యంలో ఎస్‌బీఎఫ్‌సీతో జత కట్టామని బ్యాంకు తెలిపింది. 15 ఏళ్ల కాల వ్యవధితో రూ.కోటి వరకు రుణాలు ఆయా సంస్థలకు మంజూరు చేయనున్నామని ఐసీఐసీఐ బ్యాంకు సురక్షిత ఆస్తుల విభాగ అధికారి రవి నారాయణన్ పేర్కొన్నారు.

4-5 నెలలు సమయం ఇవ్వండి

కొత్త నిబంధనల అమలుపై ఇ-కామర్స్ సంస్థలు

దిల్లీ: ఇ-కామర్స్ విధానంలో కొత్తగా ప్రవేశపెట్టిన నిబంధనలను పాటించేందుకు ఫిబ్రవరి 1 గడువు సరిపోదని దిగ్గజ ఇ-కామర్స్ సంస్థలు అభిప్రాయపడుతున్నట్లు తెలుస్తోంది. నిబంధనలకు తగ్గట్లు కార్యకలాపాల స్థాయిల్లో మార్పులు చేసేందుకు కనీసం 4-5 నెలల సమయం పడుతుందని, అందువల్ల ఫిబ్రవరి 1 గడువు పొడిగించమని ప్రభుత్వాన్ని కోరే అవకాశం ఉందని సమాచారం. 'డిసెంబరు 26న కొత్త నిబంధనలు ప్రకటించారు. ఈ మార్పులను చేసేందుకు కంపెనీలకు నెల రోజుల వ్యవధినే ఇచ్చారు. ప్రస్తుతమున్న భాగస్వామ్య ఒప్పందాలు, వ్యాపార విధానాల పునఃపరిశీలనకు ప్రభుత్వం ఇచ్చిన సమయం సరిపోద'ని ఓ దిగ్గజ ఇ-కామర్స్ సంస్థ ఉన్నతాధికారి ఒకరు పేర్కొన్నారు. ప్రభుత్వం చేసిన తాజా సవరణలను ప్రస్తుతం అధ్యయనం చేసే పనిలో కంపెనీలు ఉన్నాయని మరో అధికారి పేర్కొన్నారు. త్వరలోనే గడువు పెంపు విషయంపై ప్రభుత్వాన్ని కలిసే అవకాశం ఉందని చెప్పారు. ఇదే విషయంపై స్పష్టత కోసం అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లను ఇ-మెయిల్ ద్వారా సంప్రదించగా.. ఎలాంటి స్పందన రాలేదు.

షియామీ, రెడ్‌మీ ఇక వేర్వేరు బ్రాండ్లు



దిల్లీ: దేశీయ విపణిలో రెడ్‌మీ శ్రేణి స్మార్ట్‌ఫోన్లు విజయవంతం కావడంతో.. రెడ్‌మీని ప్రత్యేక బ్రాండ్‌గా మార్చనున్నట్లు చైనా స్మార్ట్‌ఫోన్ తయారీ సంస్థ షియామీ ప్రకటించింది. దేశంలోకి 2013 జులైలో అరంగేట్రం చేసిన రెడ్‌మీ.. బడ్జెట్ స్మార్ట్ ఫోన్‌లతో దూసుకెళ్లింది. చైనాలో ఈ నెల 10న రెడ్‌మీ బ్రాండ్ కింద 48 మెగాపిక్సెల్ కెమేరా కలిగిన స్మార్ట్‌ఫోన్‌ను విడుదల చేయనున్నట్లు సంస్థ వ్యవస్థాపకుడు లీ జున్ పేర్కొన్నారు. చైనా వార్తా సంస్థ గిజ్మో చైనా ఈ విషయాన్ని ధ్రువీకరించింది. రెడ్‌మీ, షియామీలపై ప్రత్యేక దృష్టి పెట్టడానికే వాటిని విడదీస్తున్నట్లు లీ జున్ వివరించారు. 'రెడ్‌మీ బ్రాండ్ బడ్జెట్ స్మార్ట్‌ఫోన్లపై దృష్టి పెడుతుంది. ఇక ఎంఐ బ్రాండ్ ఖరీదైన (హై ఎండ్) ఫోన్లపై దృష్టి పెట్టనుంది. రెడ్‌మీ ఫోన్లు ఇ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌లపై ఎక్కువ విక్రయమవుతుండగా, ఎంఐ ఫోన్లకు రిటైల్ విక్రయాలు అధికం' అని లీ తెలిపారు. షియామీకి చెందిన చౌక ధరల రెడ్‌మీ, రెడ్‌మీ నోట్ సిరీస్‌లకు దేశీయంగా బహుళ ప్రాచుర్యం లభించింది. ఐడీసీ గణాంకాల ప్రకారం.. 2018 మూడో త్రైమాసికంలో షియామీ 11.7 మిలియన్ ఫోన్లను ఎగుమతి చేసింది. భారత మార్కెట్‌లో 27.3 శాతం వాటా సాధించింది.

ఏఐజీజేడీసీ ఛైర్మన్‌గా అనంత పద్మనాభన్

చెన్నై: ఆల్ ఇండియా జెమ్ అండ్ జువెలరీ డొమెస్టిక్ కౌన్సిల్ (ఏఐజీజేడీసీ) ఛైర్మన్‌గా ఎన్‌ఏసీ జువెలర్స్ మేనేజింగ్ డైరెక్టర్ అనంత పద్మనాభన్ ఎన్నికయ్యారు. దేశంలో రత్నాలు, ఆభరణాల పరిశ్రమకు అత్యున్నత సంఘంగా ఏఐజీజేడీసీ వ్యవహరిస్తుంది. రెండేళ్ల పాటు పద్మనాభన్ ఛైర్మన్‌గా కొనసాగనున్నారు. వైస్ ఛైర్మన్‌గా కోల్‌కతా కేంద్రంగా పనిచేసే సెంకో గ్రూప్ ఛైర్మన్ శంకర్ సేన్ ఎన్నికయ్యారు. జాతీయ మండలి బాధ్యతలు దక్కడం గౌరవంగా భావిస్తున్నానని, ప్రభుత్వంతో కలిసి పరిశ్రమ ఎదుర్కొంటున్న వివిధ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పద్మనాభన్ వెల్లడించారు. ఆభరణాల విక్రేతల అభివృద్ధికి కృషి చేస్తామని వైస్ ఛైర్మన్ శంకర్ సేన్ అన్నారు. పరిశ్రమ మరింత వ్యవస్థీకృతంగా మారాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.

పెరిగిన విదేశీ మారకపు నిల్వలు

ముంబయి: విదేశీ మారకపు (ఫారెక్స్) నిల్వలు గత డిసెంబరు 28తో ముగిసిన వారానికి స్వల్పంగా పెరిగాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) సమాచారం ప్రకారం, విదేశీ కరెన్సీ ఆస్తులు 106.3 మిలియన్ డాలర్ల మేర పెరగడంతో మొత్తం ఫారెక్స్ నిల్వలు 116.4 మిలియన్ డాలర్లు పెరిగి, 393.404 బిలియన్ డాలర్లకు చేరాయి. అంతక్రితం వారం కూడా ఫారెక్స్ నిల్వలు 167.2 మి.డాలర్లు పెరిగి, 393.287 బి.డాలర్లకు చేరిన సంగతి తెలిసిందే. సమీక్షిస్తున్న వారంలో విదేశీ కరెన్సీ ఆస్తులు 106.3 మి.డాలర్లు పెరిగి, 368.08 బి.డాలర్లకు చేరాయి. పసిడి నిల్వల్లో ఎలాంటి మార్పు లేకుండా 21.22 బి.డాలర్లుగా నమోదయ్యాయి. అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ (ఐఎంఎఫ్) వద్ద మన స్పెషల్ డ్రాయింగ్ రైట్స్ 3.6 మి.డాలర్లు పెరిగి, 1.46 బి.డాలర్లకు, నిల్వల స్థితి 6.5 మి.డాలర్లు పెరిగి 2.64 బి.డాలర్లకు చేరినట్లు ఆర్‌బీఐ పేర్కొంది.

పీఎస్‌బీల విద్యారుణాల్లో 9% మొండివే

● అగ్రస్థానంలో నర్సింగ్, ఇంజినీరింగ్ విభాగాలు

● కేంద్ర మంత్రి శివ్ ప్రతాప్ శుక్లా



దిల్లీ: గత ఆర్థిక సంవత్సరం (2017-18)లో ప్రభుత్వ రంగ బ్యాంకులు (పీఎస్‌బీలు) పొడిగించిన విద్యారుణాల్లో 9 శాతం.. నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏలు)గా వర్గీకరించినట్లు ప్రభుత్వం వెల్లడించింది. 'భారత బ్యాంకుల సంఘం (ఐబీఏ) గణాంకాల ప్రకారం 2016 మార్చిలో ప్రభుత్వ రంగ బ్యాంకుల ఎన్‌పీఏలు 7.29 శాతంగా ఉండగా, 2018 మార్చికి మొండి బకాయిలు 8.97 శాతానికి చేరాయి' అని లోక్‌సభకు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో ఆర్థిక శాఖ సహాయ మంత్రి శివ్ ప్రతాప్ శుక్లా పేర్కొన్నారు. 2016-18 మధ్య విద్యా రంగంలో మొండి బకాయిలు 9 శాతానికి పెరిగాయని అన్నారు. విద్యా రంగంలోని ప్రభుత్వ రంగ బ్యాంకుల ఎన్‌పీఏల్లో నర్సింగ్ కోర్సులు (21.28 శాతం), ఇంజినీరింగ్ (9.76 శాతం), ఇతర వృత్తులు (9.49 శాతం), వైద్య వృత్తి (6.06 శాతం), ఎంబీఏ (5.59 శాతం) ఉన్నాయి. 2015 మార్చికి విద్యా రంగంలో మొండి బకాయిలు 5.7 శాతంగా ఉన్నాయి. 2017-18లో రూ.13,766.82 కోట్లు, 2016-17లో రూ.11,548.87 కోట్లు, 2015-16లో రూ.9,124.95 కోట్లు, 2014-15లో రూ.8,537 కోట్లు చొప్పున విద్యారుణాల చెల్లింపులను బ్యాంకులు అందుకున్నాయని శుక్లా అన్నారు. దేశవ్యాప్తంగా 2017-18లో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థలు (ఎంఎస్ఎంఈలు)కు రూ.9.06 లక్షల కోట్ల రుణాలు ఇచ్చినట్లు చెప్పారు. 2016-17లో ఈ రంగ రుణాలు రూ.7.89 లక్షల కోట్లు, 2015-16లో రూ.8.77 లక్షల కోట్లు, 2014-15లో రూ.7.76 లక్షల కోట్లుగా ఉన్నాయి. ఎంఎస్ఎంఈలకు సరళంగా రుణాలు ఇచ్చేందుకు రిజర్వు బ్యాంక్ పలు చర్యలు చేపట్టినట్లు శుక్లా తెలిపారు.

రీడ్ అండ్ టేలర్ కోసం ఉద్యోగుల బిడ్

● అంగీకరించిన ఎన్‌సీఎల్‌టీ


● ఆస్తుల అమ్మకం నిలిపివేతకు ఆదేశం

ముంబయి: ఖరీదైన దుస్తుల బ్రాండు సంస్థ రీడ్ అండ్ టేలర్ ఆస్తుల అమ్మకాన్ని నిలిపి వేయాలని జాతీయ కంపెనీ లా ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) ఆదేశాలు జారీ చేసింది. కంపెనీని కొనుగోలు చేసేందుకు ఆ కంపెనీ ఉద్యోగుల సంఘం వేసిన బిడ్‌ను అంగీకరించిన ఎన్‌సీఎల్‌టీ ఈ నిర్ణయాన్ని తీసుకుంది. దీనిపై తదుపరి విచారణను ఈనెల 8న చేపట్టనున్నట్లు పేర్కొంది. ఎస్ కుమార్ గ్రూపు యజమానులైన కాస్లీవాల్ కుటుంబీకులే రీడ్ అండ్ టేలర్‌కు కూడా యజమానులు. వివిధ బ్యాంకులు, రుణ సంస్థలకు ఈ కంపెనీ రూ.4,100 కోట్లకు పైగా బకాయి పడింది. ప్రస్తుతం దివాలా ప్రక్రియను ఎదుర్కొంటోంది. దీనిని కొనేందుకు 8 ఆఫర్లు వచ్చినప్పటికీ, రుణ పరిష్కార ప్రణాళిక సమర్పించకపోవడంతో ఆస్తులను అమ్మేందుకు రుణ సంస్థల బృందం 2018 డిసెంబరు 14న నిర్ణయం తీసుకుంది. రీడ్ అండ్ టేలర్‌కు రుణాలిచ్చిన వాటిల్లో యూనియన్ బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, ఐఎల్అండ్ఎఫ్ఎస్ సర్వీసెస్, ఐడీబీఐ బ్యాంక్, ఎల్అండ్‌టీ ఫైనాన్స్, ఫిన్‌క్వెస్ట్ ఫైనాన్షియల్ సొల్యూషన్ ఉన్నాయి. వీటిల్లో అత్యధికంగా ఫిన్‌క్వెస్ట్‌కు రూ.800 కోట్ల వరకు రావాల్సి ఉంది. అయితే రీడ్ అండ్ టేలర్‌పై ముందుగా ఎన్‌సీఎల్‌టీని ఆశ్రయించింది మాత్రం ఎడెల్‌వైజ్ ఏఆర్‌సీనే. 2018 మార్చిలో ఇది ఎగ్జిమ్ బ్యాంక్ తరఫున దివాలా ప్రక్రియ పిటిషన్ దాఖలు చేసింది. రీడ్ అండ్ టేలర్ ఆస్తులను విక్రయించాల్సిందిగా ఫిన్‌క్వెస్ట్ ఫైనాన్షియల్ మరో పిటిషన్ వేసింది. అయితే కంపెనీని కొనుగోలు చేసేందుకు ఉద్యోగుల సంఘం 2018 డిసెంబరు 19న రుణ ప్రణాళికను సమర్పించింది. దీనిని పరిగణనలోకి తీసుకున్న ట్రైబ్యునల్.. ఉద్యోగ సంఘానికి ఓ అవకాశం ఇవ్వాలని నిర్ణయం తీసుకుంటూ, ఆస్తుల అమ్మకం నిలిపివేతకు జనవరి 1న ఆదేశాలు జారీ చేసింది.

నెమ్మదించిన సేవల రంగం

దిల్లీ: డిసెంబరులో దేశీయ సేవా రంగ పనితీరు నెమ్మదించింది. కొత్త ఆర్డర్లు తగ్గుముఖం పట్టడమే ఇందుకు ప్రధాన కారణమని పీఎంఐ నివేదిక వెల్లడించింది. అయితే ఉద్యోగ కల్పనలో మాత్రం గణనీయ పురోగతి ఉందని పేర్కొంది. సేవా రంగ పనితీరును లెక్కించే నిక్కీ ఇండియా సర్వీసెస్ బిజినెస్ యాక్టివిటీ సూచీ డిసెంబరులో 53.2 శాతానికి దిగివచ్చింది. నవంబరులో రికార్డు స్థాయిలో ఆర్డర్లు రావడంతో ఇది 53.7 శాతంగా ఉంది. డిసెంబరులో పనితీరు నెమ్మదించినప్పటికీ, సేవా రంగం వరుసగా ఏడో త్రైమాసికంలోనూ వృద్ధి పథంలోనే ఉండటం గమనార్హం. పీఎంఐ సూచీ 50 శాతానికి పైన ఉంటే ఆ రంగంలో వృద్ధి ఉన్నట్లు, 50 శాతం దిగువన ఉంటే క్షీణతగా పరిగణిస్తారనే విషయం తెలిసిందే. మరోవైపు డిసెంబరులో వ్యాపార సెంటిమెంటు మూడు నెలల గరిష్ఠానికి చేరిందని నివేదిక వెల్లడించింది. ప్రకటనలకు ప్రాధాన్యం, కొత్త సేవలను అందుబాటులోకి తేవడం, ఎన్నికల తర్వాత గిరాకీ పరిస్థితులు మెరుగవుతాయనే అంచనాలు లాంటివి వ్యాపార సెంటిమెంటు బలపడటానికి దోహదం చేశాయి. ఈ ప్రభావంతో 2019లో సేవా రంగం స్థిరమైన వృద్ధిని కనబర్చే అవకాశం ఉందని ఈ నివేదికను రూపొందించిన ఐహెచ్ఎస్ మార్కిట్ ఆర్థిక వేత్త పాలీయానా డె లిమా వెల్లడించారు.

భారత సేవల పీఎంఐ



టెలికాం కంపెనీల నుంచి ప్రభుత్వానికి తగ్గిన ఆదాయం

2017-18లో 22 శాతం క్షీణత

దిల్లీ: టెలికాం రంగ కంపెనీల నుంచి ప్రభుత్వానికి వచ్చే ఆదాయం గత ఆర్థిక సంవత్సరంలో తగ్గింది. 2016-17తో పోలిస్తే, 2017-18లో ఈ ఆదాయం 22 శాతం తక్కువగా నమోదైనట్లు కేంద్ర టెలికాం మంత్రి మనోజ్ సిన్హా రాజ్యసభకు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో పేర్కొన్నారు. టెలికాం కంపెనీలకు వచ్చే ఆదాయం నుంచి లైసెన్స్ ఫీజు, స్పెక్ట్రమ్ వినియోగ ఛార్జీల (ఎస్‌యూసీ) రూపంలో ప్రభుత్వం కొంత వాటా వసూలు చేస్తుండటం తెలిసిందే. అయితే గత ఆర్థిక సంవత్సరంలో టెలికాం సర్వీసు ప్రొవైడర్ల ఆదాయాలు గణనీయంగా క్షీణించడంతో, ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం కూడా తగ్గింది. స్పెక్ట్రమ్ వినియోగ ఛార్జీల వసూళ్లు బాగా తగ్గడంతోనే సర్దుబాటు చేసిన స్థూల ఆదాయం (ఏజీఆర్) కూడా తగ్గినట్లు మంత్రి వివరించారు. టెలికాం పరిశ్రమ ఏజీఆర్ 2016-17 నాటి రూ.1,60,787.9 కోట్ల నుంచి 18.62 శాతం క్షీణించి 2017-18లో రూ.1,30,844.9 కోట్లకు పరిమితమైంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వానికి లైసెన్స్ ఫీజు రూపంలో వచ్చే ఆదాయం రూ.13,032.9 కోట్ల నుంచి 18.12 శాతం తగ్గి రూ.10,670.6 కోట్లకు పరిమితమైంది. స్పెక్ట్రమ్ వినియోగ ఛార్జీలు ఏకంగా 29 శాతం క్షీణించి రూ.7,048 కోట్ల నుంచి రూ.4,983.75 కోట్లకు చేరాయి.

విలీనాలతో ఉద్యోగాలు పోవు

ఆర్థిక మంత్రి జైట్లీ భరోసా

దిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంకుల (పీఎస్‌బీలు) విలీనాల వల్ల ఉద్యోగాలకు ఎలాంటి ముప్పు ఉండబోదని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ స్పష్టం చేశారు. అందువల్ల ఉద్యోగులు ఎలాంటి ఆందోళన చెందనక్కర్లేదని అన్నారు. మూడు బ్యాంకుల విలీనంతో ఉద్యోగాలు పోవని, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) తరహాలో అతిపెద్ద బ్యాంకు అవతరిస్తుందని అన్నారు. రుణ వ్యయాలు కూడా చౌక అవుతాయని చెప్పారు. ముఖ్యంగా నిరర్థక ఆస్తులు దిగి వస్తాయని మంత్రి తెలిపారు. దివాలా చట్టం వల్ల వ్యవస్థలోకి తిరిగి రూ.3 లక్షల కోట్లు వచ్చి చేరాయని జైట్లీ వెల్లడించారు. పీఎస్‌బీల మూలధన పునర్వ్యవస్థీకరణ నిమిత్తం 2018-19 బడ్జెట్ ప్రతిపాదనల్లో రూ.65,000 కోట్లు కేటాయించగా.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో డిసెంబరు 31 వరకు రూ.51,533 కోట్ల నిధులు అందజేశామని వివరించారు.

4న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)

(100కు రూపాయలలో)



కోడిగుడ్లు			
హైదరాబాద్	442	వరంగల్	444
చిల్లరగా (ఒక గుడ్డు)	5.00	విశాఖపట్నం	458
బెంగళూరు	445	చెన్నై	445
5వ తేదీకి...		చిత్తూరు	438
విజయవాడ/గోదావరి	453	నమక్కల్	430

ఎన్ఎస్ఈ

శుక్రవారం ముగింపు, క్రితం ముగింపు, ట్రేడింగ్ పరిమాణం (వరుసగా)

నిఫ్టీ 50

ADANI PORT & 382.15 (378.10) 1669709
ASIAN PAINTS 1385.85 (1388.30) 1202397
AXIS BANK LT 619.60 (607.95) 8381367
BAJAJ AUTO L 2734.20 (2701.35) 362393
BAJAJ FINANC 2576.05 (2586.20) 1051021
BAJAJ FINSER 6410.45 (6383.30) 156323
BHARTI AIRTE 322.45 (313.50) 10239262
BHARTI INFRA 285.05 (271.60) 6714533
BPCL 359.45 (352.50) 3858610
CIPLA 512.80 (512.40) 1651456
COAL INDIA L 236.50 (235.00) 2885669
DR. REDDYS 2600.00 (2577.35) 407397
EICHER MOTOR 20103.60 (20211.45) 341833
GAIL 353.15 (349.95) 1837879
GRASIM IND 806.15 (799.70) 1069003
HCL TECH 932.35 (948.35) 1538639
HDFC 1972.60 (1936.85) 2109614
HDFC BANK 2117.45 (2111.80) 1821780
HERO MOTOCOR 2987.85 (3014.65) 405667
HINDALCO IND 210.90 (209.20) 17408469
HINDUSTAN UN 1781.70 (1788.40) 1454134
HPCL 248.20 (248.30) 5576677
ICICI BANK 365.20 (363.25) 22896026
INDIABULLS H 829.80 (816.65) 5537276
INDIAN OIL 133.95 (132.65) 7277203
INDUSINDBANK 1548.20 (1560.10) 1868151
INFOSYS LTD 661.05 (669.15) 7889310
ITC 280.95 (278.85) 7805148
JSW STEEL LT 287.95 (282.65) 6070751
KOTAK MAHIND 1247.95 (1235.25) 1468796
LARSEN & TOU 1388.05 (1395.00) 2711485
M&M 725.60 (718.30) 5919404
MARUTI SUZIK 7234.50 (7203.95) 774445
NTPC LTD 145.75 (143.40) 6656760
ONGC 145.70 (142.40) 7395898
POWER GRID C 195.90 (193.05) 2259867
RELIANCE IND 1098.65 (1092.75) 8465141
SBI 297.65 (291.10) 19514041
SUN PHARMA 433.80 (436.10) 6228693
TATA CONSULT 1876.85 (1899.95) 4280862
TATA MOTORS 170.95 (166.05) 17650435
TATA STEEL L 487.65 (481.25) 10480072
TECH MAHINDR 681.10 (691.25) 3926171
TITAN IND 928.45 (931.20) 2340304
ULTRATECH 3914.55 (3900.05) 220079
UPL LIMITED 756.40 (746.65) 1060318
VEDANTA LIMI 192.90 (187.95) 12883382
WIPRO 324.45 (325.50) 2405278
YES BANK LTD 189.65 (184.10) 45914917
ZEE ENTERTAI 463.95 (461.45) 2552610

నిఫ్టీ నెక్స్ట్ 50

ABB 1303.65 (1308.95) 53249
ACC 1469.10 (1452.25) 532734
ADITYA BIRLA 98.00 (98.25) 1377605
AMBUJA CEMEN 216.55 (213.85) 2344100
ASHOK LEYLAN 96.80 (98.15) 24533568
AUROBIND PHA 725.85 (715.90) 1340101
AVENUE SUPER 1577.75 (1575.90) 295889
BANDHAN BANK 528.90 (533.80) 579027
BANK OFBAROD 121.70 (119.30) 22277306
BEL 91.85 (88.80) 11509090
BHEL 71.40 (70.75) 20439249
BIOCON LTD 618.55 (612.00) 1010951
BOSCH LTD 19438.75 (19299.85) 6798
BRITANNIA 3122.70 (3135.90) 170818
CADILA HEALT 344.20 (343.65) 579722
COLGATE PALM 1310.10 (1314.25) 420325
CONTAINER 678.05 (670.00) 867502
DABUR INDIA 419.25 (422.00) 1831799
DLF LIMITED 175.15 (172.45) 5556175
GENERAL INS 263.00 (261.15) 44924
GODREJ CONSU 803.40 (814.90) 631173
HAVELLS INDI 678.55 (681.40) 1257221
HDFC STAND L 393.50 (391.30) 484014
HINDUSTAN ZI 271.70 (269.50) 426003
ICICI LOMBAR 866.90 (868.20) 234451
IDEA CELLULR 36.20 (36.10) 12761684
INTERGLOBE A 1143.20 (1156.55) 994803
L&TFIN.HOLD 144.40 (145.40) 8860605
LIC HOUS.FIN 488.10 (470.20) 2348428
LUPIN 828.90 (821.05) 1279403
MARICO LIMIT 378.85 (378.05) 2011585
MCDOWELL 604.60 (620.10) 1405001
MOTHERSON 158.65 (161.25) 6208836
MRF 66603.15 (66818.25) 4278
NHPC LTD 25.55 (25.55) 2463177
NMDC LTD 93.95 (93.90) 4732566
OIL INDIA 174.55 (172.00) 431122
ORACLE FIN S 3598.20 (3594.65) 18934
P&G HYG&HEAL 9784.95 (9850.00) 1743
PETRONET LNG 220.90 (228.80) 2704039
PIDILITE IND 1105.70 (1109.25) 272802
PIRAMAL ENTE 2358.65 (2286.60) 626489
SAIL 53.15 (52.45) 12729595
SBI LIFE INS 602.85 (600.05) 119061
SHREE CEMENT 16737.10 (16948.40) 30506
SHRIRAM TRAN 1162.65 (1152.90) 1661620
SIEMENS 1062.70 (1044.90) 664139
SUN TV LTD 592.20 (585.10) 1195297
THE NEW INDI 179.85 (180.35) 31647

బీఎస్ఈలో రాష్ట్ర కంపెనీలు

AISHWARYA TE 2.70 (2.68) 7015
ALPHAGEO 469.30 (468) 161
AMAR RAJA BA 724.10 (713.55) 557575
ANDHRA BANK 29.75 (28.95) 66927
ANDHRA CEMEN 5.80 (5.84) 271
ANDHRA PAPER 451.10 (451.75) 6491
ANDHRA PETRO 63.60 (61.35) 109819
ANDHRA SUGAR 333.20 (333.80) 1402
ANJANI PORTL 131.30 (136) 1142
ASTRA MICROW 80.80 (79.50) 26303
AUROBINDO PH 725.40 (715.90) 53458
AVANTEL SOFT 227.95 (226) 1385
AVANTI FEEDS 374.55 (379.35) 19505
BALAJI AMIN 450.75 (453.05) 548
BARTRONICS 7.20 (7.21) 101
BHAGIRA CHEM 433.40 (425.10) 1029
BHAGYA NAG 33.50 (32.60) 3652
BN RATHI SEC 26.05 (26.10) 190
BRILLIANT SE 1.24 (1.27) 140479
CAMBRIDGE TE 46.25 (42.05) 4997
CIL SECURI 17.90 (18.60) 451
COMBAT DRUGS 19.50 (18.95) 10
CONT COFFEE 269.70 (269.05) 435
COROMAN FERT 468.80 (450.85) 14607
CUBEX TUB 14.40 (14.67) 170
CYBERMATE 2.36 (2.39) 44599
CYIENT LIMIT 608.70 (620.55) 12310
DECCAN CEMEN 398 (389.10) 1
DIVI'S LAB 1458.70 (1437) 15425
DIVYA GRANIT 84 (83) 1310
DR REDDY 2601.65 (2575.55) 18299
FOUR SOFT 42.65 (47.20) 8626
GATI CORPN 83.65 (84.05) 36397
GAYATRI PROJ 178.25 (175) 852
GMR INFRASTR 15.85 (15.65) 915831
GOLDST INFRA 241.90 (242.15) 24675
GOLDSTONE EN 16.25 (15.65) 2970
GRANULES (I) 89.85 (89.70) 29021
GSS AMERICA 129.65 (132.40) 18951
GVK POWER 7.82 (7.75) 322883
HBL NIFE POW 27.55 (28.30) 5956
HERITAGE FOO 521.50 (523.25) 650
HIFCO MARWEL 69.90 (71.30) 61
HIL LTD 2023.25 (2011.15) 138
HIND FLUROCA 16.85 (17.70) 1100
IDL INDUSTRS 293.95 (290) 26
IKF SOFT 0.29 (0.30) 107663
ILFS ENGINEE 15 (14.70) 36127
INCAP 40.95 (39) 702
IVRCL INFRAS 1.02 (1.02) 103776
JEEVAN SCIEN 36.95 (35) 200
KAKATIYA CEM 198 (198.95) 1693
KALLAM SPG 18.20 (18.15) 4925
KAVERI SEED 550.05 (561.50) 41202
KCP LTD 89.85 (89.80) 2119
KERNEX MICRO 23.15 (22.20) 16
KNR CONSTRUC 217.65 (220.45) 15759
KREBS BIO 111.45 (109.95) 1630
LANCO INDUS 183.55 (182) 1222
LAURUS LABS 383.55 (378.60) 1448
LOKESH MACH 45.45 (45.85) 23
MADHUCON PRO 6.60 (6.36) 4901
MEDINOVA DIA 15.60 (16.15) 300
MEGA SOFT 7.62 (7.90) 1600
MIC ELECTRON 1.41 (1.39) 2641595
MOLD-TEK.TEC 43 (42.90) 706
MOLDTK PLA 261.65 (263) 1011
MSR INDIA LT 12.07 (11.50) 9555
NAGARJAGRICH 27.45 (27) 6573
NATCO PHARMA 702.95 (694.05) 5113
NAVA BH VENT 117.90 (119.55) 9168
NCC 88.90 (88.80) 1027348
NCL IND 135.05 (137.10) 1814
NEHA INTER 4.32 (4.54) 4793
NETTLINX 52.30 (50.25) 21826
NEULAND LAB 486.30 (488.60) 673
NIHAR INFO 14.75 (15.45) 13035
NILE 377.35 (384.85) 2093
NORTHGATE TE 1 (1.02) 227354
OIL COUNTRY 16.20 (16.20) 3622
PANYAM CEMEN 13.70 (13.95) 1322
PENNER IND 36.55 (36.30) 12162
PHYTOCHEM I 46.50 (48.75) 100
PIONEER DIST 167 (168.10) 868
PITTI LAMIN 68.45 (70.45) 3979
POKARNA 154.55 (156.25) 327
PRAJAY ENGS 8.75 (8.85) 6434
PREMIER EXPL 246.05 (244.80) 682
PRISM CEMENT 90.30 (90.40) 15904
PRUDENTL PHA 3.69 (3.75) 23265
RAASI REFRAC 10.73 (10.22) 2
RAGSAN PETRO 57.95 (55.20) 65
RAIN INDUSTR 127.15 (130.50) 91244
RAJ PACKAGIN 27.75 (28) 1320
RAM INFORMAT 40.25 (40.75) 2498
REG.CERAMIC 3.53 (3.37) 350
SAMKRG PIST 187.50 (191.75) 2826
SATVAH. ISPA 9.80 (9.49) 22655
SMS PHARMA 70.75 (73.75) 7380
SPHERE GLOBA 18.50 (18.15) 110
SREE RAYAL A 34 (34.25) 23036
SRINIVASA SH 45.65 (47) 410
STARCHIK SP 23.60 (24.75) 450
STEEL EXCHAN 14.80 (14.45) 940
SUJANA METAL 0.39 (0.39) 3900
SURANA TELE 4.60 (4.55) 5181
SURYALATA SP 127.35 (133.65) 240
SUVEN PHARMA 232.55 (234.30) 21408
TAJ GVK HOTE 172.60 (174.20) 992
TANLA 31.25 (30.85) 8881
TERA SOFTWAR 40.30 (38.95) 3664
TRANS BIOTEK 3.51 (3.39) 37338
VAMSHI RUBB 31.05 (33.90) 32
VBC FERRO 43.05 (45.20) 104
VICEROY HOTE 5 (5.02) 3519
VIJAY TEXTIL 41.60 (41.85) 450
VIMTA LABS 306.60 (310.85) 6265
VISAKA IND 423.15 (426.45) 940
VISTA PHARMA 30.40 (29) 102320
VIVIMED LABS 36.10 (36.45) 14365
VJIL CONSULT 47.70 (45.45) 4940
VST INDUS 3069.50 (3075) 37
YBRANT DIGIT 2.67 (2.63) 83106
ZENOTECH LAB 36.10 (36) 5452
ZENTECH 73.25 (76.25) 9835

తూర్పుతీరంలో జీఎంఆర్ నౌకాశ్రయం

- ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శంకుస్థాపన
- హల్దియా పెట్రోకెమికల్ కాంప్లెక్స్ ఏర్పాటుకు ఒప్పందం



శుక్రవారం కాకినాడ సెజ్‌లో రిఫైనరీ పెట్రో కెమికల్ ప్రాజెక్టు కోసం హల్దియా పెట్రో కెమికల్ లిమిటెడ్‌తో ఎంవోయూలో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబునాయుడు. చిత్రంలో జీఎంఆర్ అధినేత గ్రంధి మల్లికార్జునరావు, హోం మంత్రి చినరాజప్ప తదితరులు

ఈనాడు - కాకినాడ

తూర్పుతీరంలో ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ వద్ద గల కోన గ్రామంలో జీఎంఆర్ కాకినాడ గేట్‌వే పోర్ట్ లిమిటెడ్ నిర్మించనున్న నౌకాశ్రయానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శుక్రవారం శంకుస్థాపన చేశారు. డీబీఎఫ్ఓటీ (డిజైన్, బిల్ట్, ఫైనాన్స్, ఆపరేట్, ట్రాన్స్‌ఫర్) పద్ధతిలో ఈ నౌకాశ్రయం నిర్మాణానికి జీఎంఆర్ గ్రూపు సంస్థ అయిన కాకినాడ గేట్‌వే పోర్ట్ లిమిటెడ్ గత ఏడాది నవంబరులో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్న సంగతి విదితమే. కాకినాడ సెజ్‌కు చెందిన 1811 ఎకరాల విస్తీర్ణంలో దీన్ని నిర్మించాలని ప్రతిపాదించారు. సముద్రానికి అభిముఖంగా ఉన్న 133 ఎకరాల స్థలాన్ని ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం లీజుకు ఇచ్చింది. ఈ నౌకాశ్రయం నుంచి బొగ్గు, సాధారణ సరకులు, వంట నూనెలు, ముడి చమురు ఎగుమతి- దిగుమతికి అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. దీని నిర్మాణ వ్యయం రూ.3,000 కోట్లు. కొత్త నౌకాశ్రయం వల్ల కాకినాడ సెజ్‌లో పారిశ్రామిక కార్యకలాపాలు బహుముఖంగా విస్తరించే అవకాశం ఏర్పడుతుంది.

కాకినాడ సెజ్‌లో పెట్రోకెమికల్ ప్రాజెక్టు

కాకినాడ సెజ్‌లో అతిపెద్ద పెట్రోకెమికల్ ప్రాజెక్టు రాబోతోంది. ప్రసిద్ధి చెందిన టీజీవీ గ్రూపు సంస్థ అయిన హల్దియా పెట్రోకెమికల్స్ లిమిటెడ్ రిఫైనరీ/ పెట్రోకెమికల్ కాంప్లెక్స్‌ను జీఎంఆర్ గ్రూపునకు చెందిన కాకినాడ సెజ్‌లో ఏర్పాటు చేయటానికి శుక్రవారం కాకినాడలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమక్షంలో ఒప్పందం కుదుర్చుకుంది. హల్దియా పెట్రోకెమికల్స్ లిమిటెడ్ ఇప్పటికే పశ్చిమ బెంగాల్‌లోని హల్దియా వద్ద నాఫ్తా ఆధారిత అతిపెద్ద పెట్రోకెమికల్ కాంప్లెక్స్ నిర్వహిస్తోంది. ఈ సంస్థ తాజాగా కాకినాడ సెజ్‌లో ఏర్పాటు చేసే పెట్రోకెమికల్ కాంప్లెక్స్ వల్ల రూ.60 వేల కోట్ల పెట్టుబడులు వస్తాయని అంచనా. వేల సంఖ్యలో ఉద్యోగాలు లభిస్తాయి.

'24 నెలల్లో పూర్తిచేయాలి'

ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ నౌకాశ్రయ నిర్మాణాన్ని 24 నెలల్లో పూర్తిచేయాలని కోరారు. 'దేశంలో ఎక్కడా ఇలాంటి మౌలిక సదుపాయాలుండవు. జాతీయ రహదారి, రైల్వేస్టేషన్, విమానాశ్రయం, బీచ్ అన్నీ ఉన్నాయి' అన్నారాయన. భవిష్యత్తులో రాష్ట్రంలోని నాలుగు ఉత్తమ నగరాల్లో ఒకటిగా కాకినాడ అభివృద్ధి చెందుతుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. జీఎంఆర్ గ్రూపు దిల్లీ, హైదరాబాద్ ఎయిర్‌పోర్టుల నిర్మాణాన్ని సమర్థంగా పూర్తిచేసినట్లు గుర్తుచేశారు. జీఎంఆర్ గ్రూప్ ఛైర్మన్ గ్రంధి మల్లికార్జునరావు మట్లాడుతూ కాకినాడ సెజ్‌లో పెట్రో కెమికల్స్, వ్యవసాయ ప్రాసెసింగ్, ఎలక్ట్రానిక్, బొమ్మలు, క్రీడా సామగ్రి తయారీ పరిశ్రమలు వస్తాయన్నారు. ఈ ప్రాంతం జాతీయ, అంతర్జాతీయ వ్యాపార సంస్థలకు వేదిక కాబోతోందని అన్నారు. ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి నిమ్మకాయల చినరాజప్ప, ఆర్థిక శాఖ మంత్రి యనమల రామకృష్ణుడు, కలెక్టర్ కార్తికేయ మిశ్రా, జీఎంఆర్ ట్రాన్స్‌పోర్టేషన్, అర్బన్ ఇన్‌ఫ్రా విభాగ ఛైర్మన్ బీవీఎన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



మార్చిలోపే విమానాల్లో మొబైల్ సేవలు!

కార్యాచరణకు మంత్రిత్వ సంఘం

దిల్లీ: విమానాలు, నౌకల్లో మొబైల్ సేవలను 3 నెలల్లోగా ప్రవేశపెట్టేందుకు తగిన కార్యాచరణ కోసం మంత్రిత్వ సంఘాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. విమానాలు, నౌకా ప్రయాణంలో అనుసంధానత (ఐఎఫ్ఎమ్‌సీ) సేవలు అమలు చేయడంలో తలెత్తే ఇబ్బందులు పరిష్కరించడానికి, అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయడానికి 15 రోజులకు ఒక సారి మంత్రిత్వ శాఖల బృందం భేటీ కానుందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. 'విమాన యాన సంస్థలు, షిప్పింగ్ కంపెనీలు, టెలికాం ఆపరేటర్లు, ప్రభుత్వ శాఖలతో సమావేశం జరిగింది. ఐఎఫ్ఎంసీ సేవలు వేగంగా, మార్చిలోగా అమల్లోకి తెచ్చేందుకు మంత్రిత్వ సంఘాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. 15 రోజులకోసారి ఈ బృందం భేటీ కానుంది' అని అధికారులు తెలిపారు. భారత భూభాగంలో విమానయానం, నౌక ప్రయాణంలో మొబైల్ ఫోన్ సేవలు కల్పించేందుకు ప్రభుత్వం నిబంధనలను నోటిఫై చేసింది. ఐఎంఎఫ్‌సీ సేవలపై టెలికాం శాఖ అదనపు కార్యదర్శి అన్షు ప్రకాశ్ నేతృత్వంలో రెండు గంటల పాటు ఈ సమావేశం జరిగింది. .



పసిడికి ఒకే ధర నిర్ణయించలేం

వినియోగ వ్యవహారాల సహాయమంత్రి సీఆర్ చౌధరి

దిల్లీ: బంగారానికి దేశమంతటా ఒకే ధర రోజువారీ నిర్ణయించేందుకు అనువైన వ్యవస్థ, ప్రత్యేక చర్యలేమీ లేవని వినియోగ వ్యవహారాల సహాయ మంత్రి సీఆర్ చౌధరి తెలిపారు. ప్రపంచంలోనే బంగారాన్ని అధికంగా కొనుగోలు చేస్తూ, దిగుమతి చేసుకుంటున్నా, దేశం అంతటా ఒకే ధర నిర్ణయించే పరిస్థితి ప్రస్తుతం లేదని రాజ్యసభకు లిఖిత పూర్వకంగా మంత్రి వెల్లడించారు. "దేశంలో దిగుమతి ధర, కస్టమ్స్ సుంకం, పన్నులు, రవాణా ఛార్జీలు, స్వచ్ఛత ఆధారంగా పసిడి ధర నిర్ణయమవుతుంటుంది. ప్రాంతాన్ని బట్టి ధరలు మారుతుంటాయి. నాణ్యతకు భరోసా ఇచ్చే హాల్‌మార్క్ కలిగిన ఆభరణాలతో పాటు హాల్‌మార్క్ లేని బంగారం, వెండి ఆభరణాల విక్రయానికి కూడా అనుమతులున్నాయి. అయితే భారత ప్రమాణాల చట్టం 2016 ప్రకారం 'విలువైన లోహాలతో తయారు చేసే ఆభరణాలకు హాల్‌మార్క్ వేయడం తప్పనిసరి' అని పేర్కొంటోంది" అని మంత్రి వివరించారు.



'టై హైదరాబాద్' అధ్యక్షుడిగా సురేష్ రెడ్డి



ఈనాడు, హైదరాబాద్: 'టై హైదరాబాద్' ఛాప్టర్ నూతన అధ్యక్షుడిగా హైదరాబాద్‌కు చెందిన బ్రైట్‌కామ్ గ్రూపు (గతంలో లైకోస్ ఇంటర్నెట్ లిమిటెడ్) సీఎండీ సురేష్ రెడ్డి ఎంపికయ్యారు. ఉపాధ్యక్షుడిగా కంట్రోల్‌ఎస్ సీఎండీ శ్రీధర్ పిన్నపురెడ్డి వ్యవహరిస్తారు. ఇప్పటి వరకూ 'టై హైదరాబాద్' అధ్యక్షుడిగా ఎర్నెస్ట్ అండ్ యంగ్ ఆఫీస్ మేనేజింగ్ పార్టనర్ అయిన కాళీ ప్రసాద్ గాదిరాజు వ్యవహరించారు. ఈ సందర్భంగా సురేష్ రెడ్డి స్పందిస్తూ, 2025 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల 'డిజిటల్ ఆర్థికవ్యవస్థ'ను కేంద్ర ప్రభుత్వం సంకల్పించిందని, దీనివల్ల ఐటీ రంగంలో ఎన్నో అవకాశాలు అందివస్తాయని పేర్కొన్నారు. సైబర్ సెక్యూరిటీ, బ్లాక్‌చైన్, ఐఓటీ- కనెక్టెడ్ డివైజెస్... వంటి నూతన సాంకేతిక పరిజ్ఞానం దేశీయ ఐటీ పరిశ్రమ విస్తరణకు దోహదపడుతుందని పేర్కొన్నారు. అంకుర సంస్థలకు మేలు చేసే ఎన్నో కార్యక్రమాలను 'టై హైదరాబాద్' చేపడుతోందని ఆయన తెలిపారు.



మన దేశం నుంచి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 19 బిలియన్ డాలర్ల (సుమారు రూ.1.33 లక్షల కోట్ల) విలువైన ఔషధాలు ఎగుమతి అయ్యే అవకాశం ఉందని ఫార్మాస్యూటికల్స్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ (ఫార్మాగ్జిల్) డైరెక్టర్ జనరల్ ఆర్. ఉదయభాస్కర్ తెలిపారు. అమెరికాకు అధిక ఎగుమతులు నమోదవుతుండటం, ఐరోపా, ఆఫ్రికా విపణులు ఆకర్షణీయంగా మారడం ఇందుకు కారణమన్నారు. 2017-18లో దేశం నుంచి 17.27 బిలియన్ డాలర్ల (సుమారు రూ.1.21 లక్షల కోట్ల) విలువైన ఔషధాలు ఎగుమతి అయ్యాయి. చైనా నుంచి తగినంతగా ముడి ఔషధాల సరఫరా లేకపోవడం సమస్యగా మారిందని, దీనికి పరిష్కారాన్ని కనుగొనేందుకు కేంద్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోందని వెల్లడించారు. దేశీయంగా తయారయ్యే ఔషధాలు భవిష్యత్తులో చైనాకు అధికంగా ఎగుమతి అయ్యే అవకాశాలున్నాయని తెలిపారు. ఇందుకోసం పరిశ్రమ- ప్రభుత్వం వైపు నుంచి గట్టి ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఔషధ ఎగుమతుల తీరుతెన్నులు, పరిశ్రమ స్థితిగతులు, అవకాశాలు- సవాళ్లను 'ఈనాడు' ఇంటర్వ్యూలో ఆయన వివరించారు. ముఖ్యాంశాలివీ..

ఔషధ ఎగుమతులు రూ.1.33 లక్షల కోట్లకు..

- ఈ ఆర్థిక సంవత్సరంలోనే
- అమెరికా విపణికి బాగా పెరుగుతున్నాయ్
- చైనా నుంచి బల్క్ ఔషధాల సరఫరా తగ్గడం సమస్యే
- ప్రత్యామ్నాయాలపై కేంద్రం కసరత్తు

'ఈనాడు' ఇంటర్వ్యూ

ఫార్మాగ్జిల్ డైరెక్టర్ జనరల్

ఆర్. ఉదయ భాస్కర్

ఈనాడు - హైదరాబాద్

? దేశీయ ఔషధ కంపెనీలకు యూఎస్ఎఫ్‌డీఏ నుంచి ఆంక్షలు, అవరోధాలు ఎదురయ్యాయి. దీనివల్ల ఔషధ ఎగుమతులపై ప్రభావం పడిందా? ఈ ఆర్థిక సంవత్సరంలో ఔషధ ఎగుమతులు ఏ స్థాయిలో ఉండొచ్చు

ఆర్. ఉదయ్ భాస్కర్: కొన్ని సవాళ్లున్నా, ఎగుమతులు అధికంగా ఉన్నాయి. గత ఆర్థిక సంవత్సరంలో 17.27 బిలియన్ డాలర్ల ఎగుమతులు నమోదు కాగా, ఈ ఆర్థిక సంవత్సరంలో నవంబరు నాటికే 11 బిలియన్ డాలర్లను దాటాం. అమెరికా విపణి ఆకర్షణీయంగా ఉంది. అందువల్ల ఈ ఆర్థిక సంవత్సరంలో 19 బిలియన్ డాలర్ల ఎగుమతులు చేయగలమని అంచనా. అన్నీ కలిసొస్తే ఇంకా పెరగొచ్చు.

? బల్క్ ఔషధ రసాయనాలు, ఏపీఐ (యాక్టివ్ ఫార్మా ఇన్‌గ్రేడియంట్స్) సరఫరా తగ్గి ఫార్మా కంపెనీలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఈ ముడి ఔషధాలు చైనా నుంచి తగినంతగా దిగుమతి కావటం లేదు. ఈ సమస్యను పరిష్కరించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయా

దశాబ్దకాలానికి పైగా ముడి ఔషధాల తయారీ మనదేశంలో క్షీణించింది. వీటి కోసం చైనా మీద అధికంగా ఆధారపడటం మొదలైంది. ఇప్పుడు ఆ దేశం నుంచి ముడి ఔషధాలు మన అవసరాలకు తగినంతగా రాక సమస్యలు ఎదురవుతున్నాయి. 'జాతీయ అత్యవసర ఔషధాల జాబితా'లో పేర్కొన్న యాంటీ-బయాటిక్ ఔషధాల్లో 75 శాతం వరకు చైనా నుంచి వచ్చే ముడి ఔషధ రసాయనాల మీద ఆధారపడి ఉన్నాయి. అంటే ఇది ఎంతో తీవ్రమైన సమస్యో తెలుస్తుంది. ప్రత్యామ్నాయాలను అన్వేషించేందుకు డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫార్మాసూటికల్స్ (డీఓపీ) ఒక టాస్క్‌ఫోర్స్‌ను నియమించింది. దేశీయంగా ముడి ఔషధ రసాయనాల తయారీకి స్పష్టమైన కార్యాచరణ చేపట్టే అవకాశం ఉంది.

? మనదేశం నుంచి ఔషధ ఎగుమతుల్లో అమెరికా వాటా అధికంగా ఉంది. కొత్తగా ఇతర దేశాలకు ఎగుమతులు పెంచుకునే అవకాశం ఉందా

అమెరికా ఔషధ విపణి ప్రపంచంలోనే అతిపెద్దది. దాదాపు 240 బిలియన్ డాలర్ల వార్షిక అమ్మకాలుంటాయి. ఆ తర్వాత జపాన్, చైనా ఉన్నాయి. మన ఎగుమతుల్లో అమెరికా వాటా 35% ఉంది. ఆ తర్వాత ఆఫ్రికా (17%), ఐరోపా (15%) ఉన్నాయి. జపాన్ పెద్ద మార్కెట్ అయినప్పటికీ, అక్కడ జనరిక్ ఔషధాలకు ఆదరణ పెరగడం లేదు. మనదేశంలోని ఔషధ కంపెనీలకు భవిష్యత్తులో చైనా అతిపెద్ద ఔషధ మార్కెట్ అవుతుందని అంచనా వేస్తున్నాం. చైనా నుంచి బల్క్ ఔషధాలు దిగుమతి చేసుకుంటున్నప్పటికీ, ఫార్ములేషన్లను (తుది ఔషధాలు) ఎగుమతి చేసే అవకాశం మనకు ఉంది. చైనాకు ఎగుమతులు పెంచేందుకు 'ఫార్మాగ్జిల్' తరపున కొన్ని సదస్సులు, సమావేశాలు నిర్వహించాం. చైనాలో ఔషధ రిజిస్ట్రేషన్లకు పట్టే సమయం ఎక్కువగా ఉంది. దాన్ని తగ్గించేందుకు ప్రయత్నాలు చేస్తున్నాం. గత ఏడాది ఆగస్టులో చైనా ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఫర్ ఇంపోర్ట్ అండ్ ఎక్స్‌పోర్ట్ ఆఫ్ మెడిసిన్స్ అండ్ హెల్త్ ప్రోడక్ట్స్ (సీసీఎంహెచ్‌పీఐఈ)తో ఫార్మాగ్జిల్ ఒప్పందం కుదుర్చుకుంది. ప్రస్తుతం మన దేశం, చైనా నుంచి 2.5 బిలియన్ డాలర్ల విలువైన ముడి ఔషధాలు, రసాయనాలను దిగుమతి చేసుకుంటోంది. అదే సమయంలో మనం 200 మిలియన్ డాలర్ల ఔషధాలు చైనాకు ఎగుమతి చేస్తున్నాం. ఔషధ వ్యయాలు తగ్గించుకోవాలనే ఆలోచన అక్కడ ప్రభుత్వం, ప్రజల్లో కనిపిస్తోంది. అందువల్ల భవిష్యత్తులో మన ఔషధాలు చైనాకు అధికంగా ఎగుమతి అవుతాయి.

? భవిష్యత్తు సవాళ్లకు మన సన్నద్ధత ఎలా ఉంది

పరిశోధనా కార్యకలాపాలను అధికం చేయడానికి, కొత్త ఔషధాల తయారీకి పరిశ్రమ, ప్రభుత్వం ప్రాధాన్యమివ్వాలి. సంప్రదాయ ఔషధాల తయారీకే పరిమితం అవుతామంటే... కుదరదు. సంక్లిష్టమైన జనరిక్ ఔషధాలు, బయోలాజికల్స్ తయారీకి పెద్దఎత్తున సన్నాహాలు చేయాలి. ఔషధ రంగంలో స్వయం సమృద్ధి సాధించాలని వివిధ దేశాలు ప్రయత్నాలు చేస్తున్నాయి. అందువల్ల తప్పనిసరి ఔషధాలకు మాత్రమే అంతర్జాతీయ మార్కెట్లో గిరాకీ ఉంటుంది. చైనా మార్కెట్‌నే తీసుకుంటే... ఆ దేశంలో కేన్సర్ పీడితుల సంఖ్య ఏటేటా పెరుగుతోంది. అందువల్ల తప్పనిసరై... కేన్సర్ ఔషధాలను దిగుమతి చేసుకోవటానికి వీలుగా సుంకాలు పూర్తిగా తగ్గించింది. ఈ సదుపాయం సాధారణ ఔషధాల విషయంలో లేదు. అందువల్ల తక్కువ ఖర్చులో కొత్త ఔషధాలను తయారు చేయగల పరిజ్ఞానాన్ని ఆవిష్కరించటానికి పరిశ్రమ వైపు నుంచి ప్రయత్నాలు జరగాలి. ఈ ప్రయత్నానికి ప్రభుత్వం వైపు నుంచి అధిక మద్దతు లభించాలి.

? తెలంగాణా, ఆంధ్రప్రదేశ్‌లో ఔషధ పరిశ్రమ తీరుతెన్నులు

ఈ రెండు రాష్ట్రాలకు ఎగుమతుల పరంగా చూస్తే ఎంతో ప్రాధాన్యం ఉంది. మనదేశం నుంచి ఇతర దేశాలకు ఎగుమతి అయ్యే ఔషధాల్లో దాదాపు 30 శాతం ఈ రెండు రాష్ట్రాల నుంచే ఉంటున్నాయి. దాని ప్రకారం చూస్తే దేశీయ ఔషధ రంగంలో తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు ఎంతో కీలక పాత్ర పోషిస్తున్నట్లు స్పష్టమవుతోంది. ఇటీవల కాలంలో కొన్ని విదేశీ కంపెనీలు కూడా ఇక్కడికి వచ్చి, ఔషధ తయారీ చేపడుతున్నాయి. అంచనాలకు తగ్గట్లుగా ఇక్కడ పరిశ్రమ విస్తరిస్తోంది.

అనిల్ అంబానీని జైల్లో పెట్టండి

- కోర్టు ధిక్కార చర్యలు చేపట్టాలి
- సుప్రీం కోర్టును ఆశ్రయించిన ఎరిక్సన్ ఇండియా

దిల్లీ: తమ సంస్థకు రూ.550 కోట్ల బకాయిల్ని 2018 డిసెంబరు 15లోగా చెల్లించాల్సిందిగా సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును ధిక్కరించినందుకు గాను రిలయన్స్ కమ్యూనికేషన్ ఛైర్మన్ అనిల్ అంబానీపై కోర్టు ధిక్కారం కింద చర్యలు తీసుకోవాలంటూ ఎరిక్సన్ ఇండియా రెండోసారి సుప్రీం కోర్టును ఆశ్రయించింది. అనిల్‌తో పాటు రిలయన్స్ టెలికాం ఛైర్మన్ సతీశ్ సేథ్, రిలయన్స్ ఇన్‌ఫ్రాటెల్ ఛైర్‌పర్సన్ ఛయ్య విరానీలను కూడా పౌర జైల్లో (సివిల్ ప్రిజన్) పెట్టాలని కోరింది. పౌర జైలు అంటే నిర్బంధంలో ఉన్న వారి భోజన, ఇతరత్రా ఖర్చులు పిటిషనరే భరించాల్సి వస్తుంది.. అంటే ఈ కేసులో ఖర్చుల్ని భరించడానికి ఎరిక్సన్ ఇండియా సిద్ధమైంది. అనిల్‌తో పాటు మిగతా ఇద్దరూ దేశం విడిచి పారిపోకుండా జాగ్రత్తలు తీసుకునేలా హోం మంత్రిత్వ శాఖకు సూచనలు చేయమని సుప్రీం కోర్టును కోరింది.

ఆర్‌కామ్‌కు చెందిన జాతీయస్థాయి టెలికాం నెట్‌వర్క్‌ను ఏడేళ్లపాటు నిర్వహించేందుకు ఎరిక్సన్ ఇండియా 2014లో ఆర్‌కామ్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ రూపేణ రూ.1,500 కోట్లను ఎరిక్సన్‌కు చెల్లించాల్సి ఉంది. అయితే ఆర్‌కామ్ రుణ ఊబిలో చిక్కుకోవడంతో రూ.550 కోట్లు చెల్లించేలా నేషనల్ కంపెనీ లా అప్పిలేట్ ట్రైబ్యునల్ మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. అయితే ఆర్‌కామ్ ఆ చెల్లింపులు కూడా చేయలేదు. దీంతో పిటిషనర్ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. గత మే 30న 120 రోజుల్లోగా (సెప్టెంబరు 30లోపు) రూ.550 కోట్లు చెల్లించాలని కోర్టు ఆదేశించింది. అయినా ఆర్‌కామ్ బకాయిలు చెల్లించలేదు. కోర్టు ధిక్కారానికి పాల్పడినందుకు గాను చర్యలు తీసుకోవాలని ఎరిక్సన్ ఇండియా సుప్రీం కోర్టును ఆశ్రయించింది. ఆర్‌కామ్‌కు మరో అవకాశం ఇస్తూ డిసెంబరు 15లోపు బకాయిలు చెల్లించాలంటూ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. అయితే ఇప్పటివరకు ఆర్‌కామ్ బకాయిలు చెల్లించడంలో విఫలం కావడంతో రెండోసారి కూడా కోర్టు ధిక్కార చర్యలకు పాల్పడినందున తీవ్రమైన చర్యలు తీసుకోవాలని ఎరిక్సన్ ఇండియా సుప్రీం కోర్టును ఆశ్రయించింది.



జియో ఫోన్‌కు నిక్కీ అవార్డు

దిల్లీ: ముకేశ్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ జియో ఆవిష్కరించిన చౌక ఫీచర్ ఫోన్ 'జియోఫోన్'కు ప్రతిష్ఠాత్మక అవార్డు లభించింది. రూ.49కే అపరిమిత కాల్స్‌తో పాటు అపరిమిత డేటా వినియోగించుకునే వీలున్న ఈ ఫోన్‌కు 'నిక్కీ సుపీరియర్ ప్రోడక్ట్స్ అండ్ సర్వీసెస్ అవార్డు-2018' లభించింది. తక్కువ ఆదాయం కలిగిన వారు కూడా ఇంటర్నెట్ వినియోగించుకునే అవకాశాన్ని జియో ఫోన్ కల్పించిందని, జపాన్ పబ్లిషింగ్ సంస్థ అయిన నిక్కీ తన వెబ్‌సైట్‌లో ప్రశంసించింది. మెరుగైన వినూత్న ఉత్పత్తులు, సేవలతో పాటు భవిష్యత్తు తరాలకు అవసరమైన సాంకేతికతలను అందించే యత్నాలకు ఈ అవార్డు లభించినట్లు నిక్కీ పేర్కొంది.



గ్రామీణులకు అత్యంత చౌకగా నెట్ సేవలు

'2016 సెప్టెంబరులో ఉచిత కాల్స్, డేటాతో మొబైల్ 4జీ సేవలకు శ్రీకారం చుట్టిన ముకేశ్ అంబానీ, డేటా సేవలు లభించే జియోఫోన్‌ను రూ.1,500 రిఫండబుల్ డిపాజిట్‌తో ఏడాది తరవాత విపణిలోకి తెచ్చారు. దేశీయ టెలికాం రంగ తీరును సమూలంగా మార్చిందిగా రిలయన్స్ జియో పేరొందింది. అతిచౌక ధరలతోనే, దేశీయ టెలికాం రంగంలో స్థిరీకరణకు ఈ సంస్థ శ్రీకారం చుట్టింది. జియో ఫోన్ మరింత విధ్వంసకారిగా అవతరించింది. గ్రామీణులకు కారుచౌకగా నెట్ సేవలు అందిస్తోంద'ని నిక్కీ ప్రశంసించింది. 2018 జులైకి రిలయన్స్ జియో కనెక్షన్లు 25 కోట్లు దాటాయని తెలిపింది.

ఎంపిక ఇలా

✦ 1982 నుంచి ఏటా, సరికొత్త నాణ్యమైన ఉత్పత్తులు, సేవలకు నిక్కీ సుపీరియర్ ప్రోడక్ట్స్ అండ్ సర్వీసెస్ అవార్డ్స్ అందిస్తోంది. ఇందుకు దరఖాస్తులేమీ కోరరు. నిక్కీ ప్రచురణల్లో వచ్చిన 20,000 ఉత్పత్తులు, సేవల నుంచీ ఎంపిక చేస్తుంది.

✦ సాంకేతికత అభివృద్ధిలో అత్యున్నత ప్రమాణాలు, ధర ప్రభావం, వ్యాపారంలో వాటా, వృద్ధికి అవకాశాలు, ప్రత్యేకమైనది, వాణిజ్య-సామాజిక ప్రభావాలను పరిగణనలోకి తీసుకుని, ఎంపిక చేస్తారు.

కలెక్టర్ వారి కార్యాలయము, నెల్లూరు

ఆర్ సి జి4/2324/2018 తేది. 02.01.2019

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము

ఫారం-VII

(2013 సంవత్సరం 30వ చట్టం వలన భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపనలలో న్యాయపరమైన నష్టపరిహారం పొందే హక్కు, పారదర్శకత చట్టంలో సెక్షన్ 19(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014లో రూల్25, సబ్ రూల్-1 ననుసరించి)

రూఢీ ప్రకటన

ఈ క్రింది నిర్దిష్టపరచిన షెడ్యూల్ దాఖలా భూములను విస్తీర్ణము ఎ. 41.18 సెంట్లు ప్రజా ప్రయోజనమునకై అనగా శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా దక్కిలి మండలం, వెంబులూరు గ్రామమందు న్యూ బ్రాడ్‌గేజ్ రైల్వే లైన్ నడికుడి-శ్రీకాళహస్తి నుండి వెంబులూరు మీదుగా పోవుటకు డిప్యూటీ చీఫ్ ప్రాజెక్ట్ మేనేజరు, వరల్డ్ క్లాస్ స్టేషన్ ప్రాజెక్టు, సికింద్రాబాద్ వారు భూమి కావలయునని ప్రతిపాదించినందున మరియు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము తరపున శ్రీ జిల్లా కలెక్టర్, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు వారు భావించినందున, ఈ దిగువ షెడ్యూలు దాఖలా భూమి ప్రజా ప్రయోజనముల నిమిత్తం భూసేకరణ గావించుటకు నిర్ణయించినారు. మరియు భూసేకరణకు అవసరమగు బడ్జెట్ నిధులను ఆర్థిక సంవత్సరం 2018-19 నకు సమకూర్చినారు. ఈ క్రింద రూఢీ ప్రకటన 2013వ సంవత్సరం 30వ చట్టంలోని 19(1) విభాగంను అనుసరించి చేయబడినది.

రూఢీ ప్రకటన

శ్రీ జిల్లా కలెక్టరు, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వారు 2013 సంవత్సరం 30వ చట్టంలోని 19(1) విభాగం ననుసరించి ఈ దిగువనుదహరించిన షెడ్యూల్ దాఖలు భూమి ఎ. 41.18 సెంట్లు ప్రజా ప్రయోజనములకై అనగా బ్రాడ్‌గేజ్ రైల్వే లైన్ నడికుడి- శ్రీకాళహస్తి కరకు భూమి అవసరమైనదని ఇందుమూలముగా ప్రకటన చేసియున్నారు.

షెడ్యూలు

జిల్లా: **శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు** మండలం : **దక్కిలి** గ్రామం : **వెంబులూరు**

వ. నెం.	సర్వే నెం./	మొత్తం విస్తీర్ణం ఎ.సెం	భూ సేకరణ కొరకు విస్తీర్ణము ఎ.సెం.	తర గతి	ఆసక్తి గల ఆసామి పేరు - మరియు చిరునామా	సరిహద్దులు ఉత్తరం సర్వే నెం.	తూర్పు సర్వే నెం.	దక్షిణం సర్వే నెం.	పడమర సర్వే నెం.	చెట్లు, మరియు కట్టడముల వివరములు ఉన్నచో
1	2	3	4	5	6	7A	7B	7C	7D	8
1	28-6B	1.88	1.52	మెట్ట	పురతం శ్రీనివాసులు రెడ్డి తండ్రి చిన్నపిచ్చిరెడ్డి	37	28-10	28-6C	28-7	వేప-27, తాటి-42
2	28-8B	0.49	0.01	మెట్ట	కలుపూటి గోపాల్ రెడ్డి తండ్రి నారాయణ రెడ్డి	37	28-8A	28-6A	30	వరి కోయబడినది, బీడు
3	31-2	47.20	0.01	మెట్ట	కలుపూటి సుబ్బా రెడ్డి తండ్రి రమణారెడ్డి	కత్త చెరువు గ్రామం	37	32	31-1	వేప-14, తాటి-3, రాగి-1 దిరశనం-1
4	32-2B	0.40	0.26	మెట్ట	భీమవరం నరసయ్య తండ్రి నారయ్య	32-5	32-3B	32-6	32-2A	వేప -1(పెద్దది) 2(చిన్నవి), ఈత-6
5	32-3B	0.50	0.42	మెట్ట	కలుపూటి శ్రీనివాసులు తండ్రి సుబ్బారెడ్డి	32-2B	37	32-6	32-3A	వేప -10(పెద్దది), 9 (పాతవి), తాటి-1, నిమ్మ-82, టేకు-1(పెద్దది), 11(పాతవి), సుబాబులు-2, మునగ-1
6	32-4A	0.05	0.01	మెట్ట	భీమవరం కమలమ్మ భర్త లేట్ పెంచలయ్య	32-5	37	32-4B	32-3B	వరి కోయబడినది, బీడు
7	38-3B	0.63	0.01	మెట్ట	పొట్ట చెంచు రత్నం తండ్రి చెంచయ్య	28	38-4B	38-3A	28	వరి కోయబడినది, బీడు
8	38-4B	0.69	0.02	మెట్ట	పొట్ట మునెయ్య తండ్రి మునెయ్య	38-3B	38-5B	38-4A	28	వేప-15, తాటి-3, విప్ప-2 సుబాబులు-3, బోరు-2
9	38-5B	0.18	0.02	మెట్ట	పొట్ట మునెయ్య తండ్రి మునెయ్య	38-4B	38-6A	38-5A	28	వరి కోయబడినది, బీడు
10	38-6A	0.12	0.03	మెట్ట	పొట్ట మునెయ్య తండ్రి మునెయ్య	38-5B	43	38-6B	43	వరి కోయబడినది, బీడు
11	43-1B	0.25	0.04	మెట్ట	మోట సుబ్బారెడ్డి తండ్రి సుబ్బారెడ్డి	28	43-25	43-2B	43-1A	వరి కోయబడినది, బీడు
12	43-2B	0.41	0.30	మెట్ట	పురతం లక్ష్మీనరసయ్య తండ్రి పిచ్చి రెడ్డి పురతం ప్రభాకర్ రెడ్డి తండ్రి పిచ్చి రెడ్డి	28	43-5	43-25	43-1B	వరి కోయబడినది, బీడు
13	43-8	0.07	0.07	మెట్ట	దక్కిలి కోటేశ్వరరెడ్డి తండ్రి వెంకట్రామిరెడ్డి	43-7	43-10	43-9	43-27	వేప-3
14	43-10	0.47	0.47	మెట్ట	పొట్ట మునెయ్య తండ్రి మునెయ్య	43-8	43-14	43-15	43-11B	మామిడి-150, బోరు-1
15	43-11B	0.39	0.12	మెట్ట	జంగిటి పెంచలయ్య తండ్రి వెంకటయ్య	43-8	43-12A	43-10	43-11A	వరి కోయబడినది, బీడు
16	43-12B	0.44	0.04	మెట్ట	దక్కిలి వెంకటరామిరెడ్డి తండ్రి యానాదిరెడ్డి	43-11A	44	43-11B	24	వరి కోయబడినది, బీడు
17	43-13	0.24	0.24	మెట్ట	నావూరు వెంకటయ్య తండ్రి నరసయ్య	43-10	43-18	43-17	43-11B	వరి కోయబడినది, బీడు
18	43-14	0.12	0.12	మెట్ట	దక్కిలి కోటేశ్వరరెడ్డి తండ్రి వెంకట్రామిరెడ్డి	43-10	43-17	43-15	43-13	వరి కోయబడినది, బీడు
19	43-15	0.13	0.13	మెట్ట	దక్కిలి కోటేశ్వరరెడ్డి తండ్రి వెంకట్రామిరెడ్డి	43-10	43-16	43-28	43-14	వరి కోయబడినది, బీడు
20	43-16	0.07	0.07	మెట్ట	నావూరు పెద్దయ్య	43-15	43-22	43-28	43-14	వరి కోయబడినది, బీడు
21	43-17	0.26	0.26	మెట్ట	దక్కిలి కోటేశ్వరరెడ్డి తండ్రి వెంకట్రామిరెడ్డి	43-14	43-20	43-22	43-13	వరి కోయబడినది, బీడు
22	43-18	0.10	0.10	మెట్ట	నావూరు వెంకయ్య	43-13	43-19	43-20	43-12A	వరి కోయబడినది, బీడు
23	43-19	0.07	0.07	మెట్ట	దక్కిలి కోటేశ్వరరెడ్డి తండ్రి వెంకట్రామిరెడ్డి	43-18	44	43-20	43-12A	వేప-2, తాటి-3, ఈత-2
24	43-20	0.22	0.22	మెట్ట	నావూరు వెంకటయ్య తండ్రి నరసయ్య	43-17	44	48	43-19	వరి కోయబడినది, బీడు
25	43-21	0.11	0.11	మెట్ట	పొట్ట మునెయ్య తండ్రి మునెయ్య	43-22	43-20	43-28	43-17	మామిడి-150, బావి-1
26	43-22	0.10	0.10	మెట్ట	నావూరు పెంచలయ్య తండ్రి బిత్తరయ్య	43-16	43-21	43-26	43-17	వరి కోయబడినది, బీడు
27	53-1A	0.30	0.27	మాగాణి	జంగిటి పెంచలయ్య తండ్రి వెంకటయ్య	48	54	53-1B	44	వరి కోయబడినది, బీడు
28	53-2B	0.53	0.01	మాగాణి	వెలుగు రమణమ్మ భర్త సుబ్బయ్య	53-1A	53-3A	53-2A	54	వరి కోయబడినది, బీడు
29	53-3A	0.53	0.08	మాగాణి	కోలా వెంకటరమణ తండ్రి ఈశ్వరయ్య	53-2B	53-4A	53-3B	54	వరి కోయబడినది, బీడు
30	53-4A	0.15	0.05	మాగాణి	సూరేపల్లి రమణయ్య తండ్రి నర్సయ్య	53-3A	53-6A	53-4B	54	వరి కోయబడినది, బీడు
31	53-6A	2.36	1.07	మాగాణి	వద్దినేని జంగయ్య తండ్రి గురవయ్య	53-4A	79	53-6B	55	వరి కోయబడినది, బీడు
32	54-4B	0.25	0.12	మాగాణి	మచ్చల చినపోలమ్మ భర్త రత్నయ్య	44	54-5	53	54-4A	వరి కోయబడినది, బీడు
33	54-6	0.54	0.54	మాగాణి	నావూరు తిరిపయ్య తండ్రి తిరిపయ్య	53	54-9B	54-7	54-5	వరి కోయబడినది, బీడు
34	54-7	0.55	0.55	మాగాణి	నావూరు తిరిపయ్య తండ్రి తిరిపయ్య	53	54-8	53	54-6	వరి కోయబడినది, బీడు
35	54-8	0.32	0.32	మాగాణి	సూరేపల్లి చినమునెమ్మ భర్త పెంచలయ్య	54-7	54-11B	53	54-9B	వరి కోయబడినది, బీడు
36	54-9B	0.38	0.04	మాగాణి	సూరేపల్లి గోపాల్ తండ్రి నరసయ్య	54-6	54-8	54-8	54-9B	వరి కోయబడినది, బీడు
37	54-11B	0.17	0.13	మాగాణి	పొట్ట నారయ్య	54-8	55	53	54-11A	వరి కోయబడినది, బీడు
38	55	0.33	0.33	మాగాణి	నావూరు తిరిపయ్య తండ్రి తిరిపయ్య	54	56	53	56	వరి కోయబడినది, బీడు
39	56-4B	0.27	0.07	మాగాణి	పువ్వుల విటోబాయమ్మ భర్త రమణయ్య	55	79	53	56-4A	వరి కోయబడినది, బీడు
40	78-10B	0.30	0.26	మాగాణి	కందికట్టు నారాయణమ్మ భర్త శంకరయ్య	79	99	80	78-10A	వరి కోయబడినది, బీడు
41	78-11B	0.33	0.03	మాగాణి	పోకూరు పద్మరాఘవులు తండ్రి ముసలయ్య	78-10B	99	78-10B	78-11A	వరి కోయబడినది, బీడు
42	79-1B	1.99	0.07	మాగాణి	నావూరు తిరిపయ్య తండ్రి తిరిపయ్య	56	79-5	79-6	79-1A	వరి కోయబడినది, బీడు
43	79-6	0.25	0.25	మాగాణి	నావూరు జ్ఞానమ్మ భర్త సుబ్బరామయ్య	53	79-7	80	79-5	వరి కోయబడినది, బీడు
44	79-7	0.25	0.25	మాగాణి	ఆలూరు రామయ్య తండ్రి నాగయ్య	79-6	79-8B	80	79-5	వరి కోయబడినది, బీడు
45	79-8B	1.20	0.91	మాగాణి	వద్దినేని జంగయ్య తండ్రి గురవయ్య వద్దినేని చిన్న గురవయ్య తండ్రి వెంకటయ్య	79-7	79-11	80	79-8A	వరి కోయబడినది, బీడు
46	80-1A	1.49	0.37	మాగాణి	పోకూరు పద్మరాఘవులు తండ్రి ముసలయ్య	53	80-9	80-2	79	బోరు-1
			0.25	మాగాణి	పత్తిపాటి కోటేశ్వర్రావు తండ్రి చిన్నయ్య	53	80-9	80-2	79	వరి కోయబడినది, బీడు
			0.32	మాగాణి	పచ్చూరు సుబ్రమణ్యం తండ్రి వెంకటయ్య	53	80-9	80-2	79	వరి కోయబడినది, బీడు
			0.37	మాగాణి	పోకూరు నాగరత్నమ్మ తండ్రి రాఘవ ప్రసాద్	53	80-9	80-2	79	వరి కోయబడినది, బీడు
47	80-4A	0.14	0.06	మాగాణి	సంక్రాంతి నరసయ్య తండ్రి ఈశ్వరయ్య	80-4B	80-9	80-4B	80-2	వరి కోయబడినది, బీడు
48	99-1	0.33	0.33	మాగాణి	కందుకూరు శీనయ్య తండ్రి వెంకటసుబ్బయ్య	79	99-4B	99-2	78	వరి కోయబడినది, బీడు
49	99-2	0.80	0.80	మాగాణి	పోకూరు యనాదమ్మ భర్త లేట్ కృష్ణయ్య	80	99-4B	99-3A	99-1	వరి కోయబడినది, బీడు
50	99-3A	1.63	0.23	మాగాణి	నర్రావుల వెంకటేశ్వర్లు తండ్రి చిన్ననర్సయ్య	80	99-4B	99-3B	99-2	వరి కోయబడినది, బీడు
51	99-4B	1.58	0.79	మాగాణి	నర్రావుల వెంకటేశ్వర్లు తండ్రి చిన్ననర్సయ్య గుర్రంకొండ రత్నయ్య తండ్రి క్రిష్టయ్య కోల రామయ్య తండ్రి పెద్ద గురవయ్య	99-2	100	99-4C	99-4A	వరి కోయబడినది, బీడు
52	100-1B	0.52	0.39	మాగాణి	గుర్రంకొండ రత్నయ్య తండ్రి క్రిష్టయ్య	99	100-3B	100-2A	100-1A	వరి కోయబడినది, బీడు
53	100-2A	0.47	0.37	మాగాణి	కోల రామయ్య తండ్రి పెద్ద గురవయ్య	99	100-6A	100-2B	100-1B	వరి కోయబడినది, బీడు
54	100-3B	1.01	0.51	మాగాణి	ఆలూరు జయరామయ్య తండ్రి నాగయ్య	100-1B	102	100-6A	100-3A	వరి కోయబడినది, బీడు
			0.44	మాగాణి	ఆలూరు. గురవయ్యనాయుడు తండ్రి జయరామయ్య	100-1B	102	100-6A	100-3A	వరి కోయబడినది, బీడు
55	100-4	0.42	0.42	మాగాణి	ముదిముక్కల మునెమ్మ భర్త రమణయ్య	100-6A	102	100-5	100-3B	వరి కోయబడినది, బీడు
56	100-6A	0.64	0.31	మాగాణి	అలూరు పార్వతమ్మ భర్త సుబ్బులునాయుడు	100-2A	100-4	100-6B	100-3B	వరి కోయబడినది, బీడు
57	144-7B	0.52	0.14	మాగాణి	గంగిని ఈశ్వరమ్మ భర్త వెంకటసుబ్బయ్య	145	163	160	144-7A	వరి కోయబడినది, బీడు
58	145-3B	0.41	0.29	మాగాణి	సూరేపల్లి కోటేశ్వరావు తండ్రి పోలయ్య	146	145-4B	145-5	145-3A	వరి కోయబడినది, బీడు
59	145-4B	0.25	0.18	మాగాణి	పాయసం ప్రభాకర్ తండ్రి రాధాకృష్ణయ్య	145-3B	144	145-5	145-4A	వరి కోయబడినది, బీడు
60	145-5	0.68	0.68	మాగాణి	కందల వెంకటేశ్వర్లు తండ్రి వెంకటరత్నం	146	160	145-7A	145-4B	వరి కోయబడినది, బీడు
61	145-6	0.39	0.39	మాగాణి	నర్రావులరంగప్పగారి గురవయ్య తండ్రి ఈశ్వరయ్య	146	145-7A	145-7A	145-5	వరి కోయబడినది, బీడు
62	145-7A	0.76	0.64	మాగాణి	కందికట్టు లోకనాధం తండ్రి ఈశ్వరయ్య	146	160	145-7B	145-6	వరి కోయబడినది, బీడు
63	146-2	2.14	0.41	మాగాణి	నర్రావుల సుబ్బరామయ్య తండ్రి మునెయ్య	147	145	158	146-1	వరి కోయబడినది, బీడు
			0.40	మాగాణి	నర్రావుల వెంకటకృష్ణయ్య తండ్రి మునెయ్య	147	145	158	146-1	వరి కోయబడినది, బీడు
64	147-2A	0.11	0.03	మాగాణి	ఆలూరు సుబ్బులునాయుడు తండ్రి పోలయ్య	156	147-3A	147-2B	147-3A	వరి కోయబడినది, బీడు
65	147-3A	1.05	0.94	మాగాణి	గుర్రంకొండ నాగమ్మ భర్త పోలయ్య	147-11	147-10B	147-3B	147-8B	వరి కోయబడినది, బీడు
66	147-4	0.23	0.23	మాగాణి	శ్రీరాం ఈశ్వరయ్య తండ్రి నరసయ్య	147-11	147-3A	147-3A	147-5	వరి కోయబడినది, బీడు
67	147-5	0.15	0.15	మాగాణి	పత్తిపాటి ఈశ్వరయ్య తండ్రి వెంకటసుబ్బయ్య	147-11	147-8B	147-4	147-6B	వరి కోయబడినది, బీడు
68	147-6B	0.14	0.07	మాగాణి	ఆలూరు సుబ్బులునాయుడు తండ్రి పోలయ్య	147-11	147-8B	147-5	147-6A	వరి కోయబడినది, బీడు
69	147-8B	0.56	0.12	మాగాణి	శ్రీరాం తిరుపతి రావు తండ్రి పోలయ్య	147-5	147-10B	147-3A	147-8A	వరి కోయబడినది, బీడు
70	147-10B	0.98	0.79	మాగాణి	శ్రీరాం వెంకటస్వామి తండ్రి గోవిందయ్య	147-3A	146	157	147-10A	బోరు-1
71	150-7	0.18	0.18	మాగాణి	కూచిపూటి వెంకటసుబ్బమ్మ భర్త నరసయ్య	151	147	156	150-8	వరి కోయబడినది, బీడు
72	151-2B	0.92	0.29	మాగాణి	పోకూరు వెంకటయ్య తండ్రి వెంకట్రామయ్య	153	150	156	151-2A	వరి కోయబడినది, బీడు
			0.28	మాగాణి	పోకూరు సీతారామమ్మ భర్త ఎరుకలయ్య	153	150	156	151-2A	వరి కోయబడినది, బీడు
73	153-3A	0.10	0.05	మాగాణి	ఆలూరు జయరామయ్య తండ్రి నాగయ్య	153-12	153-11A	153-3B	153-4	వరి కోయబడినది, బీడు
74	153-4	0.24	0.24	మాగాణి	శ్రీరాం ఈశ్వరయ్య తండ్రి నరసయ్య	153-12	153-10	153-5B	153-3A	వరి కోయబడినది, బీడు
75	153-5B	1.17	0.36	మాగాణి	కందుకూరి శివయ్య తండ్రి శీనయ్య	153-12	153-9	153-4	153-5A	వరి కోయబడినది, బీడు
76	153-8B	0.42	0.12	మాగాణి	పోకూరు వెంకటేశ్వర్లు తండ్రి ఎరుకలయ్య	153-5B	151	153-9	153-8A	వరి కోయబడినది, బీడు
77	153-9	0.30	0.15	మాగాణి	పోకూరు సీతారామమ్మ భర్త ఎరుకలయ్య	153-5B	151	153-10	153-8B	వరి కోయబడినది, బీడు
			0.15	మాగాణి	పోకూరు వెంకటయ్య తండ్రి వెంకట్రామయ్య	153-5B	151	153-10	153-8B	వరి కోయబడినది, బీడు
78	153-10	0.16	0.16	మాగాణి	పాయసం శివరాజు తండ్రి బుజ్జయ్య	153-4	151	153-11A	153-9	వరి కోయబడినది, బీడు
79	153-11A	0.31	0.22	మాగాణి	శ్రీరాం మునెయ్య తండ్రి మునెయ్య	153-4	156	153-11B	153-10	వరి కోయబడినది, బీడు
80	156-1A	0.88	0.17	మాగాణి	పాయసం వెంకటసుబ్బయ్య తండ్రి మీరయ్య	153	156-2A	156-1B	151	వరి కోయబడినది, బీడు
81	156-2A	0.98	0.46	మాగాణి	శ్రీరాం సీతాలక్ష్మీ భర్త పోలి నాయుడు	151	147	156-2B	150	వరి కోయబడినది, బీడు
82	160-1	1.43	1.00	మాగాణి	శ్రీరాం రత్నమ్మ భర్త లేట్ రాఘవులు	145	161	160-2	144	బోరు-1

(మిగతా 11వ పేజీలో)

డొల్ల కంపెనీలకు భూములిచ్చారు

- ఆధారాలేంటని ప్రశ్నించిన ధర్మాసనం
- హైకోర్టులో మొదటి పిల్ ఇదే

ఈనాడు, అమరావతి: అర్హతలేని వివిధ డొల్ల కంపెనీలకు ఏపీ మౌలిక సదుపాయాల కల్పనా సంస్థ(ఏపీఐఐసీ) వేల ఎకరాల భూములను కేటాయించిందని, ఈ వ్యవహారంపై విచారణ జరిపించాలని కోరుతూ మాజీ న్యాయాధికారి శ్రావణ్ కుమార్ దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యం(పిల్)పై విచారణ ఈనెల 21కి వాయిదా పడింది. వ్యాజ్యంలోని పేజీల సంఖ్యలో తేడాలుండటంతో వాటిని సరి చేసుకోవాలని ధర్మాసనం సూచించింది. ఏపీ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సి.ప్రవీణ్‌కుమార్, జస్టిస్ ఎం.సత్యనారాయణమూర్తితో కూడిన ధర్మాసనం శుక్రవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. అంతకు ముందు పిటీషనర్ శ్రావణ్‌కుమార్ వాదనలు వినిపిస్తూ.. 14900 ఎకరాల్ని ఏపీఐఐసీ అర్హతలేని కంపెనీలకు కట్టబెట్టిందన్నారు. 2014 నుంచి ఈ ప్రక్రియ జరిగిందని.. ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి పడిందన్నారు. ధర్మాసనం స్పందిస్తూ.. ఆరోపణలకు ఆధారాలేమిటని, ఆ కంపెనీలకు అర్హత లేదని ఎలా చెబుతున్నారని ప్రశ్నించింది. ఇందుకు సంబంధించిన సమాచారాన్ని పిటిషన్‌లో పొందుపరిచానని శ్రావణ్‌కుమార్ తెలిపారు. వ్యాజ్యంలోని పత్రాలను ధర్మాసనం పరిశీలించగా.. ఇద్దరు జడ్జీల ముందు ఉన్న ప్రతుల పేజీల సంఖ్యలో తేడాలున్నాయి. దీంతో వాటిని సరిచేసుకోవాలని ధర్మాసనం సూచించింది. విచారణను వాయిదా వేసింది. ఉమ్మడి హైకోర్టు విడిపోయి ఏపీ హైకోర్టు ఏర్పడ్డాక ఒకటో నంబరును ఈ పిల్‌కు రిజిస్ట్రీ కేటాయించింది. ఈ ఏడాది మొదటి ప్రజాహిత వ్యాజ్యం ఇదే.

కేరళ విధ్వంసకాండ వెనుక మోదీ ప్రభుత్వం

సీపీఐ ప్రధాన కార్యదర్శి సురవరం

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: మహిళలకు శబరిమల ఆలయం ప్రవేశం కల్పించడాన్ని వ్యతిరేకిస్తూ కేరళలో జరుగుతోన్న విధ్వంసకాండ వెనుక మోదీ ప్రభుత్వ హస్తముందని సీపీఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి ఆరోపించారు. హైదరాబాద్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 1991 వరకు శబరిమల ఆలయంలోకి మహిళలకు ప్రవేశం ఉందన్నారు. స్త్రీలకు ప్రవేశం కల్పించకపోవడమనేది సంప్రదాయానికి సంబంధించిన అంశమంటూ ఓ ఇంటర్వ్యూలో మోదీ తప్పుడు వార్తను ప్రచారం చేసేందుకు యత్నించారని మండిపడ్డారు. తాను చెప్పింది విని చప్పట్లు కొట్టాలే తప్ప ప్రశ్నలు అడగొద్దని మోదీ భావిస్తున్నారని, అందుకే నాలుగున్నరేళ్లలో విలేకరుల సమావేశాలకు బదులు ఇంటర్వ్యూలు, మన్‌కీ బాత్‌లో మాత్రమే మాట్లాడుతున్నారన్నారు. ఇటీవల కేసీఆర్ కలిసి వివరించాక కూడా మోదీ ఫెడరల్ ఫ్రంట్ గూర్చి తెలియదనడం 2019లో నిలిచిపోయే పెద్ద అబద్ధమని సురవరం వ్యాఖ్యానించారు. రఫేల్ వ్యవహారంపై సంయుక్త పార్లమెంటరీ సంఘాన్ని ఏర్పాటుచేసి, తన నిజాయితీని మోదీ నిరూపించుకోవాలని సూచించారు.

గిన్నిస్ రికార్డు కోసం పోలవరంలో ముమ్మరంగా ఏర్పాట్లు

పోలవరం, న్యూస్‌టుడే: పోలవరం ప్రాజెక్టులో మరో రికార్డు కోసం ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. స్పిల్ ఛానల్‌లో 24 గంటల్లో 28 వేల క్యూబిక్ మీటర్ల కాంక్రీట్‌ను వేసి ప్రపంచ రికార్డును అధిగమించాలన్న పట్టుదలతో నవయుగ గుత్తేదారు సంస్థ పనిచేస్తున్నట్లు ప్రాజెక్టు సలహాదారు వీఎస్ రమేష్‌బాబు చెప్పారు. శుక్రవారం పనులను నవయుగ ఎండీ కె. శ్రీధర్‌తో కలిసి పరిశీలించారు. ఈనెల 6న ఉదయం ఎనిమిది గంటలకు కాంక్రీట్ పనులు ప్రారంభమై. . ఏడో తేది ఉదయం ఎనిమిది గంటల వరకు ఏకధాటిగా సాగుతాయన్నారు. దేశ విదేశాల నుంచి వచ్చే వారికోసం ప్రాజెక్టు సమీపంలోనే ఇసుక తిన్నెలపై వసతులు ఏర్పాటు చేస్తున్నట్లు నవయుగ ఎండీ కె. శ్రీధర్ పేర్కొన్నారు.

పేదల గూటికే పెద్దపీట



- రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ద్వారా రూ. 10 వేల కోట్ల వెచ్చింపు
- ఆర్థిక ఇబ్బందులున్నా వెనుకంజ వేయని సర్కారు

ఈనాడు డిజిటల్, అమరావతి: పేదల సొంతింటి కలను సాకారం చేసే యత్నంలో ప్రభుత్వం మరో మైలురాయి దాటింది. ఆర్థిక ఇబ్బందులున్నా గ్రామీణ, పట్టణ పరిధిలో ఇళ్ల నిర్మాణం వేగం పుంజుకునేందుకు భారీగా నిధులిస్తోంది. నాలుగున్నరేళ్లలో రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ద్వారా రూ.10వేల కోట్లు వెచ్చించింది.

తెదేపా ప్రభుత్వం కొలువుదీరాక గ్రామీణ, పట్టణ పరిధిలో వ్యక్తిగతంగా ఇల్లు నిర్మించుకునే విభాగంలో గృహ నిర్మాణ సంస్థ ద్వారా పేదలకు సొంతిల్లును దరి చేరుస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో ఎన్టీఆర్ గ్రామీణ గృహ నిర్మాణం పథకం, ప్రధానమంత్రి ఆవాస్ యోజన-ఎన్టీఆర్ గ్రామీణ్ పథకం కింద, పట్టణాభివృద్ధి సంస్థలు, పురపాలికల పరిధిలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన-ఎన్టీఆర్ పట్టణ పథకాల కింద ఏటా ఇళ్లు మంజూరు చేస్తోంది. ఇలా ఇప్పటికే మొత్తంగా 15,17,003 ఇళ్ల నిర్మాణానికి పచ్చ జెండా ఊపింది. రూ. 6,908.48 కోట్లను వెచ్చించి వీటిలో 5,31,146 ఇళ్లను పూర్తి చేసింది.

పెండింగ్ ఇళ్లకు నిధులు: గత ప్రభుత్వ హయాంలో నిర్మాణం చేపట్టి అసంపూర్తిగా మిగిలిన ఇళ్లకు ఫ్రీ ఎన్టీఆర్ హౌసింగ్ పథకం కింద నిధులిచ్చి పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంది. 2013 నుంచి 2016 మధ్య ఇలా మిగిలిన 4,40,426 ఇళ్లకు రూ.1,866 కోట్లు ఖర్చుచేసింది. వీటిలో 2,17,375 ఇళ్లు పూర్తయ్యాయి. ఇలా ఇప్పటివరకు మొత్తం 8,774 కోట్ల వ్యయంతో 7,48,521 ఇళ్లు పూర్తికాగా, మిగతావి వివిధ దశల్లో ఉన్నాయి. ఇళ్ల నిర్మాణాన్ని గ్రామీణఉపాధి హామీ చట్టాని(నరేగా)కి అనుసంధానించడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం కొంత మేర నిధుల కొరతను అధిగమిస్తోంది. ఇంటి నిర్మాణంలో 90 రోజుల కూలీ, మరుగుదొడ్డి ఏర్పాటు వ్యయాన్ని నరేగా కింద చెల్లిస్తోంది. ఇలా ఇప్పటివరకు రూ.1,300 కోట్లు వెచ్చించింది.

వివిధ పథకాల కింద గడిచిన నాలుగేళ్ల కాలంలో ప్రభుత్వం వెచ్చించిన నిధులు

ఏడాది	పూర్తిచేసిన ఇళ్లు	ఖర్చుచేసిన మొత్తం(కోట్లు)
2015-16	8,874	365.27
2016-17	2,56,971	3,185.19
2017-18	1,80,431	2,392.12
2018-19	84,870	965.83
2019-20		0.07
మొత్తం	5,31,146	6,908.48

ఫ్రీ ఎన్టీఆర్ హౌసింగ్ కింద వెచ్చించిన నిధులు

ఏడాది	పూర్తి చేసిన ఇళ్లు	ఖర్చు చేసిన మొత్తం(కోట్లు)
2013-15 (ఐఏవై)	82,155	517.19
2015-16 (ఐఏవై)	64,362	406.12
ఫ్రీ ఎన్టీఆర్ గ్రామీణ, పట్టణ	70,858	596.79
మౌలిక వసతులు		346.24
మొత్తం	2,17,375	1,866.34

63 వేల సేవా టిక్కెట్లు విడుదల

- ఆన్‌లైన్‌లో తితిదే స్థానిక ఆలయాల ఆర్జిత సేవా టిక్కెట్లు
- ఈవో సింఘాల్ వెల్లడి

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల, తిరుపతి దేవస్థానం పరిధిలోని స్థానిక ఆలయాల్లో జరిగే ఆర్జిత సేవా టిక్కెట్లను ఆన్‌లైన్‌లో ఉంచినట్లు ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ వెల్లడించారు. తిరుమల నుంచి శుక్రవారం డయల్ తితిదే ఈవో కార్యక్రమాన్ని సింఘాల్ నిర్వహించారు. ఈనెల 8, 22న వయోవృద్ధులు, దివ్యాంగులకు, 9, 23న ఐదేళ్లలోపు పిల్లలతో పాటు తల్లిదండ్రులకు అదనపు సంఖ్యలో సుపథం మార్గంలో శ్రీవారి దర్శనం కల్పిస్తామన్నారు. ఈ రోజుల్లో వయోవృద్ధులకు, దివ్యాంగులకు జారీచేసే ఉచిత టోకెన్లను సైతం ఆన్‌లైన్‌లో ఉంచనున్నట్లు తెలిపారు. శ్రీవారి ఆర్జిత సేవలకు సంబంధించి ఏప్రిల్ మాసానికి 63,311 టిక్కెట్లను శుక్రవారం ఉదయం 10 గంటలకు విడుదల చేసినట్లు ఈవో వెల్లడించారు. ఆన్‌లైన్ డిప్ విధానం కింద 10,061 టిక్కెట్లు విడుదల చేయగా వీటిలో సుప్రభాతం 7,836, తోమాల 130, అర్చన 130, అష్టదళ పాదపద్మారాధన 240, నిజపాద దర్శనం 1,725 చొప్పున ఉన్నాయి. 'హైదరాబాద్‌లో నిర్మించిన శ్రీవారి ఆలయంలో మార్చి 13న, కన్యాకుమారిలో ఈనెల 27న స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ, మహాకుంభాభిషేకం నిర్వహించనున్నాం. కడప జిల్లా ఒంటిమిట్ట శ్రీకోదండరామస్వామి ఆలయం అభివృద్ధికి రూ.100 కోట్లతో బృహత్తర ప్రణాళిక రూపొందించగా.. ఇప్పటికి రూ.15.70 కోట్ల పనులు పూర్తి చేశాం. రూ.60.65 కోట్ల పనులు వివిధ దశల్లో ఉన్నాయని' ఈవో తెలిపారు. అమరావతిలో రూ.150 కోట్లతో నిర్మించనున్న శ్రీవారి ఆలయానికి ఫిబ్రవరి 10న శంకుస్థాపన చేయనున్నట్లు వెల్లడించారు.

స్వామివారి ప్రత్యేక ప్రవేశ దర్శనానికి ఏప్రిల్ కోటాను ఈ నెల 8న విడుదల చేయనున్నట్లు తితిదే ఓ ప్రకటనలో తెలిపింది. రూ.300 ధర చేసే ఈ టిక్కెట్లను ఆన్‌లైన్, ఈ-దర్శన్, తపాలా కార్యాలయాల నుంచి బుక్ చేసుకోవచ్చు.



డయల్ తితిదే ఈవో కార్యక్రమంలో మాట్లాడుతున్న అనిల్‌కుమార్ సింఘాల్. చిత్రంలో జేఈవో పోలా భాస్కర్

బాబు పర్యటనపై ఆంక్షల ఎత్తివేత

- మొత్తం 17 మందికి అనుమతిస్తూ కేంద్రం ఉత్తర్వులు
- పర్యటన మాత్రం నాలుగు రోజులకే కుదింపు

ఈనాడు, అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు దావోస్ పర్యటనకు రాజకీయ అనుమతుల విషయంలో కేంద్ర ప్రభుత్వం తన వైఖరి మార్చుకుంది. ముఖ్యమంత్రి సహా మొత్తం 17 మంది ప్రతినిధుల బృందం దావోస్ వెళ్లేందుకు శుక్రవారం అనుమతినిచ్చింది. పర్యటనను మాత్రం నాలుగు రోజులకే పరిమితం చేసింది. ఈ నెల 22 నుంచి 25 వరకు ముఖ్యమంత్రి బృందం దావోస్‌లో పర్యటించేందుకు విదేశాంగ శాఖ అంగీకరించింది. మొదట అనుకున్న షెడ్యూల్ ప్రకారం.. ముఖ్యమంత్రి బృందం ఈ నెల 20 నుంచి 26 వరకు దావోస్‌లో పర్యటించాల్సి ఉంది. ముఖ్యమంత్రితో సహా 15 మంది వెళ్లాలని అనుకున్నారు. ముఖ్యమంత్రి దావోస్ పర్యటనకు అనుమతిస్తూనే విదేశాంగ శాఖ కొన్ని ఆంక్షలు విధించింది. నాలుగు రోజులే పర్యటించాలని, ముఖ్యమంత్రితో కలిపి ఐదుగురే వెళ్లాలని సూచించింది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం అభ్యంతరం తెలియజేయగా, మరోసారి దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఆన్‌లైన్‌లో మళ్లీ దరఖాస్తు చేయగా వెంటనే అనుమతులిచ్చింది. దావోస్‌కు వెళ్లనున్న బృందంలో.. మంత్రులు యనమల రామకృష్ణుడు, నారా లోకేష్‌తో పాటు సతీష్‌చంద్ర, పూనం మాలకొండయ్య, టి.విజయకుమార్, సాయిప్రసాద్ తదితరులు ఉన్నారు.

సీఎం చంద్రబాబు దావోస్ పర్యటనపై ఆంక్షలు విధించే స్థాయికి కేంద్ర ప్రభుత్వం దిగజారడం దారుణమని రాష్ట్ర ఎక్సైజ్ మంత్రి జవహర్ విమర్శించారు. ఎంత మందితో వెళ్లాలో, ఎన్ని రోజులు పర్యటించాలో కూడా కేంద్రమే నిర్ణయిస్తుందా? అని శుక్రవారం ప్రకటనలో ధ్వజమెత్తారు.

ఇలాంటి పిటిషన్లు వేసేది మన దేశంలోనే

అమరావతిపై కేసులో సుప్రీంకోర్టు వ్యాఖ్య

ఈనాడు, దిల్లీ: అమరావతికి పర్యావరణ అనుమతులకు సంబంధించి ఎన్జీటీ ఇచ్చిన తీర్పులో న్యాయపరమైన లోపాలు చెప్పడానికి అవకాశం ఇవ్వాలన్న పిటిషన్ న్యాయవాది అభ్యర్థనను సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ సిక్రీ తోసిపుచ్చారు. జాతీయ హరిత ట్రైబ్యునల్ (ఎన్జీటీ) ఇచ్చిన తీర్పు సవాల్ చేస్తూ ఈఎన్ఎస్ శర్మ గతంలో సుప్రిం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆ వ్యాజ్యంపై శుక్రవారం జస్టిస్ ఏకే సిక్రీ ధర్మాసనం విచారణ చేపట్టింది. దురదృష్టవశాత్తూ ఇలాంటి పిటిషన్లు మన దేశంలోనే వేస్తారు అని సుప్రీంకోర్టు ఈ సందర్భంగా వ్యాఖ్యానించింది. ఇలాంటి పిటిషన్లు విచారించాల్సిన అవసరం లేదని వ్యాఖ్యానిస్తూ వ్యాజ్యాన్ని కొట్టివేశారు.

ఉత్తమ విద్యాధికారులకు ఎన్ఐఈపీఏ అవార్డులు

ఈనాడు, దిల్లీ : ప్రభుత్వ విద్యావిధానంలో క్షేత్ర స్థాయిలో ఉత్తమ పనితీరు కనబరిచిన విద్యాధికారులకు జాతీయ విద్యా ప్రణాళిక, పరిపాలన సంస్థ (ఎన్ఐఈపీఏ) 2017-18 సంవత్సరానికి జాతీయ అవార్డులు, ప్రశంసాపత్రాలు ప్రకటించింది. దిల్లీలోని ప్రవాస్ భారతీయ భవన్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో కేంద్ర మానవ వనరుల శాఖ సహాయ మంత్రి డాక్టర్ సత్యపాల్ సింగ్ వాటిని అందజేశారు. ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి దొండపాటి ఉదయ్ కుమార్, జిల్లా ఉప విద్యాశాఖాధికారి (డీవైఈవో, ఏలూరు), తిరుపతి కిశోర్ బాబు (చీమకుర్తి, మండల విద్యాధికారి), తెలంగాణకు సంబంధించి బి.వెంకటనర్సమ్మ (జిల్లా విద్యాధికారి, సూర్యాపేట), సీతారాంపల్లి రవీందర్ (మండల విద్యాధికారి, హసన్‌పర్తి, వరంగల్ అర్బన్ జిల్లా) అవార్డులు స్వీకరించారు. కె.వెంకటయ్య (మండల విద్యాధికారి, మొయినాబాద్)కు ప్రశంసాపత్రం అందజేశారు.

(10వ పేజీ తరువాయి)

					శ్రీరాం చిన్న రాఘవులు తండ్రి లేట్ కొండయ్య శ్రీరాం రవి తండ్రి లేట్ కొండయ్య					
83	161-1	0.07	0.07	మాగాణి	పాయసం పకీరయ్య	160	163	161-2	144	వరి కోయబడినది, బీడు
84	161-2	0.18	0.18	మాగాణి	కందికట్టు సుబ్బరామయ్య	160	163	161-3A	161-1	వరి కోయబడినది, బీడు
85	161-3A	0.27	0.18	మాగాణి	శ్రీరాం రత్నమ్మ భర్త లేట్ రాఘవులు శ్రీరాం చిన్న రాఘవులు తండ్రి లేట్ కొండయ్య శ్రీరాం రవి తండ్రి లేట్ కొండయ్య	160	162	161-3B	161-2	వరి కోయబడినది, బీడు
86	161-4A	0.13	0.01	మాగాణి	రావినూతల వెంకటరామయ్య	160	161-3A	161-4B	160	వరి కోయబడినది, బీడు
87	162-6B	0.80	0.07	మాగాణి	కోలా వెంకటరత్నం తండ్రి వెంకటసుబ్బయ్య	162-6A	162-7A	162-6A	162-7A	వరి కోయబడినది, బీడు
88	162-7A	1.03	0.34	మాగాణి	నర్రావుల మురళి తండ్రి వరదయ్య	162-1	162-10	162-6B	162-8	వరి కోయబడినది, బీడు
			0.66	మాగాణి	కొక్కుండ పోలయ్య తండ్రి బుజ్జయ్య	162-1	162-10	162-6B	162-8	వరి కోయబడినది, బీడు
89	162-8	0.07	0.07	మాగాణి	సంక్రాంతి వెంకటమ్మ భర్త నాగయ్య	162-7A	162-9	162-7A	163	వరి కోయబడినది, బీడు
90	162-9	0.46	0.23	మాగాణి	నర్రావుల వేణుగోపాల్ తండ్రి వెంకటయ్య	162-8	167	162-7A	166	వరి కోయబడినది, బీడు
			0.23	మాగాణి	నర్రావుల మురళి తండ్రి వరదయ్య	162-8	167	162-7A	166	వరి కోయబడినది, బీడు
91	162-10	0.19	0.19	మాగాణి	పాయిసం నరసింహులు తండ్రి రామయ్య	162-7A	167	167	162-9	వరి కోయబడినది, బీడు
92	163-10B	0.51	0.31	మాగాణి	పత్తిపాటి శ్రీలక్ష్మి భర్త రాధాకృష్ణ	163-12	163-11B	162	163-10A	వరి కోయబడినది, బీడు
93	163-11B	0.98	0.27	మాగాణి	సంక్రాంతి మునిరత్నం తండ్రి మునెయ్య	163-10B	166	162	163-11A	వరి కోయబడినది, బీడు
94	166-1B	0.60	0.19	మాగాణి	పత్తిపాటి శ్రీలక్ష్మి భర్త రాధాకృష్ణ	163	166-2B	162	166-1A	వరి కోయబడినది, బీడు
95	166-2B	0.48	0.14	మాగాణి	పత్తిపాటి కోటేశ్వర్రావు తండ్రి చిన్నయ్య	166-1B	166-3	162	166-2A	వరి కోయబడినది, బీడు
96	166-3	0.11	0.11	మాగాణి	పత్తిపాటి కోటేశ్వర్రావు తండ్రి చిన్నయ్య	166-2B	166-8B	162	166-4B	బోరు-1
97	166-4B	0.10	0.04	మాగాణి	పత్తిపాటి కోటేశ్వర్రావు తండ్రి చిన్నయ్య	166-2B	166-8B	166-3	166-4A	వరి కోయబడినది, బీడు
98	166-8B	0.21	0.15	మాగాణి	పత్తిపాటి చిన్నయ్య భార్య లేట్ వెంకటసుబ్బమ్మ	166-3	166-9B	162	166-8A	వరి కోయబడినది, బీడు
99	166-9B	0.41	0.18	మాగాణి	పత్తిపాటి రాధాకృష్ణయ్య తండ్రి చిన్నయ్య	166-8B	166-14	167	166-9A	వరి కోయబడినది, బీడు
100	166-14	0.17	0.17	మాగాణి	నర్రావుల వేణుగోపాల్ తండ్రి వెంకటయ్య	166-9B	168	167	166-13	వరి కోయబడినది, బీడు
101	167-1	0.81	0.37	మాగాణి	నర్రావుల వెంకటయ్య తండ్రి నాగయ్య	162	168	167-2A	166	వరి కోయబడినది, బీడు
			0.44	మాగాణి	పాయిశం కోటేశ్వరరావు తండ్రి పకీరయ్య	162	168	167-2A	166	వరి కోయబడినది, బీడు
102	167-2A	0.95	0.11	మాగాణి	పత్తిపాటి రాధాకృష్ణయ్య తండ్రి చిన్నయ్య	167-3A	168	167-2B	167-1	వరి కోయబడినది, బీడు
103	167-3A	0.35	0.08	మాగాణి	యద్దల సుగుణమ్మ భర్త మునిరత్నం	162	167-2A	167-3B	162	వరి కోయబడినది, బీడు
104	168-2B	1.50	0.65	మాగాణి	నర్రావుల వెంకటయ్య తండ్రి నాగయ్య	167	169	168-2C	168-2A	వరి కోయబడినది, బీడు
			0.25	మాగాణి	నర్రావుల మురళి తండ్రి వరదయ్య	167	169	168-2C	168-2A	వరి కోయబడినది, బీడు
105	169-1	0.15	0.15	మాగాణి	తోట వెంకటేశ్వర్లు తండ్రి సింహాచలం	168	170	169-2	170	వరి కోయబడినది, బీడు
106	169-2	0.85	0.85	మాగాణి	తోట వెంకటేశ్వర్లు తండ్రి సింహాచలం	168	172	169-3	169-1	వరి కోయబడినది, బీడు
107	169-3	0.40	0.40	మాగాణి	అమరావతి ఈశ్వరయ్య తండ్రి పుల్లయ్య	168	172	169-4	169-2	వరి కోయబడినది, బీడు
108	169-4	0.45	0.45	మాగాణి	దామిశెట్టి సుధాకర్ తండ్రి శివయ్య	168	172	169-12	169-3	వరి కోయబడినది, బీడు
109	169-7B	0.38	0.21	మాగాణి	వేముల దశరధనాయుడు తండ్రి పుల్లయ్య	169-7A	173	169-8B	169-6	వరి కోయబడినది, బీడు
110	169-8B	0.81	0.03	మాగాణి	వేముల దశరధనాయుడు తండ్రి పుల్లయ్య	169-8A	173	169-8A	169-7B	వరి కోయబడినది, బీడు
111	172-3B	0.88	0.21	మాగాణి	యగ్గలం కోటేశ్వరరావు తండ్రి కోటయ్య	172-6B	172-9B	172-7	172-3A	వరి కోయబడినది, బీడు
112	172-6B	0.15	0.03	మాగాణి	దామిశెట్టి ప్రభాకర్ తండ్రి శివయ్య	170	172-3B	172-7	172-6A	వరి కోయబడినది, బీడు
113	172-7	0.19	0.19	మాగాణి	తోట వెంకటేశ్వర్లు తండ్రి సింహాచలం	169	172-3B	172-8	172-6B	వరి కోయబడినది, బీడు
114	172-8	0.21	0.21	మాగాణి	తోట వెంకటేశ్వర్లు తండ్రి సింహాచలం	169	172-9B	173	172-7	వరికోయబడినది, బీడు
115	172-9B	1.01	0.16	మాగాణి	పాయసం రామమ్మ భర్త ఈశ్వరయ్య	172-3B	172-11B	173	172-9A	వరి కోయబడినది, బీడు
			0.30	మాగాణి	గుగ్గిళ్ళ వెంకటేశ్వర్లు తండ్రి రమణయ్య	172-3B	172-11B	173	172-9A	వరి కోయబడినది, బీడు
116	172-11B	0.41	0.14	మాగాణి	గుగ్గిళ్ళ తిరుపాలు తండ్రి లక్ష్మయ్య	172-9B	174	173	172-11A	వరి కోయబడినది, బీడు
			0.13	మాగాణి	గుగిళ్ళ రమణయ్య తండ్రి లక్ష్మయ్య	172-9B	174	173	172-11A	వరి కోయబడినది, బీడు
117	173-1	0.06	0.06	మాగాణి	పురం బాలకృష్ణయ్య	169	173-6A	173-2	172	వరి కోయబడినది, బీడు
118	173-2	0.08	0.08	మాగాణి	వేముల దశరధనాయుడు తండ్రి పుల్లయ్య	169	173-6A	173-3A	173-1	వరి కోయబడినది, బీడు
119	173-3A	0.15	0.05	మాగాణి	తోట వెంకటేశ్వర్లు తండ్రి సింహాచలం	169	173-6A	173-3B	173-2	వరి కోయబడినది, బీడు
120	173-6A	1.23	0.92	మాగాణి	అమరావతి ఈశ్వరయ్య తండ్రి పుల్లయ్య	173-2	174	173-6B	172	వరి కోయబడినది, బీడు
121	174-8	0.06	0.06	మాగాణి	వేముల పాపయ్య తండ్రి తిరుపలయ్య	172	174-9A	174-9A	174-15B	వరి కోయబడినది, బీడు
122	174-10	0.18	0.18	మాగాణి	వేముల ప్రసాద్ తండ్రి ఈశ్వరయ్య	174-9A	176	174-14	174-9A	వరి కోయబడినది, బీడు
123	174-11	0.10	0.10	మాగాణి	అమరావతి ఈశ్వరయ్య తండ్రి పుల్లయ్య	173	174-13A	174-12	174-9A	వరి కోయబడినది, బీడు
124	174-9A	0.96	0.93	మాగాణి	వేముల చిన్ననగారి ప్రసాద్ తండ్రి ఈశ్వరయ్య	174-15B	176	174-10	174-9B	వరి కోయబడినది, బీడు
125	174-12	0.08	0.08	మాగాణి	అమరావతి ఈశ్వరయ్య తండ్రి పుల్లయ్య	173	174-13A	174-13A	174-11	వరి కోయబడినది, బీడు
126	174-13A	0.72	0.36	మాగాణి	వేములచీలబ్బగారి కృష్ణయ్య తండ్రి సుబ్బనాయుడు	174-12	174-14A	174-14B	174-10	వరి కోయబడినది, బీడు
127	174-14A	0.70	0.57	మాగాణి	అమరావతి పాపయ్య తండ్రి పుల్లమ నాయుడు	174-13A	176	174-14B	174-10	వరి కోయబడినది, బీడు
128	174-15B	0.22	0.07	మాగాణి	అమరావతి పాపయ్య తండ్రి పుల్లమ నాయుడు	172	174-9A	174-8	174-15A	వరి కోయబడినది, బీడు
129	176-4B	0.48	0.30	మాగాణి	వేములజల్లు ఈశ్వరయ్య తండ్రి వెంకట్రామయ్య	174	176-5B	176-6	176-4A	వరి కోయబడినది, బీడు
130	176-5B	0.15	0.05	మాగాణి	చేజర్ల ఈశ్వరయ్య తండ్రి శానయ్య	176-4B	178	176-6	176-5A	వరి కోయబడినది, బీడు
131	176-6	0.36	0.36	మాగాణి	వేములజల్లు ఈశ్వరయ్య తండ్రి వెంకట్రామయ్య	174	178	176-7	174-4B	వరి కోయబడినది, బీడు
132	176-7	0.33	0.33	మాగాణి	చేజర్ల ఈశ్వరయ్య తండ్రి శానయ్య	174	178	176-8A	176-6	వరి కోయబడినది, బీడు
133	176-8A	0.31	0.27	మాగాణి	వేములజల్లు ఈశ్వరయ్య తండ్రి వెంకట్రామయ్య	174	176-9	176-8B	176-7	వరి కోయబడినది, బీడు
134	176-9	0.30	0.30	మాగాణి	వేములజల్లు ఈశ్వరయ్య తండ్రి వెంకట్రామయ్య	176-8A	178	179	176-7	వరి కోయబడినది, బీడు
135	178-1	0.24	0.24	మాగాణి	వేములజల్లు ఈశ్వరయ్య తండ్రి వెంకట్రామయ్య	176	178-2B	179	178-2A	వరి కోయబడినది, బీడు
136	178-2B	2.31	0.55	మాగాణి	వేములజల్లు ఈశ్వరయ్య తండ్రి వెంకట్రామయ్య	176	VELLA MPALLE	179	178-2A	వరి కోయబడినది, బీడు
			0.64	మాగాణి	పులకంటి అంకమ్మ	176	VELLA MPALLE	179	178-2A	వరి కోయబడినది, బీడు
137	179-1B	0.60	0.03	మాగాణి	వేముల పుల్లయ్య తండ్రి పెంచలయ్య	179-1A	179-2A	179-1A	176	వరి కోయబడినది, బీడు
138	179-2A	0.20	0.13	మాగాణి	వేములజల్లు ఈశ్వరయ్య తండ్రి వెంకట్రామయ్య	176-1B	179-3	179-2B	178	వరి కోయబడినది, బీడు

ఈ భూమి ప్లాను శ్రీ సబ్ కలెక్టర్, గూడూరు వారి కార్యాలయములో ఉంచడమైనది. దానిని ఈ కార్యాలయపు పని వేళలలో ఏ సమయములోనైనా తనిఖీ చేసుకొనవచ్చును.

ఈ భూసేకరణలో ఎవ్వరూ నిర్వాసితులు కారు.

ఈ భూసేకరణ వలన ప్రభావిత కుటుంబములు ఏమియునూ లేవు.

బొగ్గు గనులు, ఇనుపరాయి, పలకరాయి లేక ఇతర ఖనిజ సంపద, సదరు భూమిలో గాని లేదా ఒక ప్రత్యేక భాగములో గాని వుంటే అటువంటి భూములలో ప్రాజెక్టు నిర్మాణమునకు అవసరమైన భూభాగమును మాత్రమే త్రవ్వుట గాని తొలగించుటగాని చేయవలెను.

సం/- ముత్యాలరాజు రేవు I.A.S.,
జిల్లా కలెక్టర్, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు.

జస్టిస్ బాలయోగికి హైకోర్టు ఘనంగా వీడ్కోలు

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నక్కా బాలయోగికి రాష్ట్ర హైకోర్టు శుక్రవారం ఘనంగా వీడ్కోలు పలికింది. జనవరి 14వ తేదీన జస్టిస్ బాలయోగి పదవీ విరమణ చేయాల్సి ఉండగా.. నేటి (శనివారం) నుంచి హైకోర్టుకు సంక్రాంతి సెలవులు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో శుక్రవారమే జస్టిస్ బాలయోగికి వీడ్కోలు కార్యక్రమం ఏర్పాటు చేశారు. హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి(ఏసీజే) సారథ్యంలో మొదటి కోర్టు హాలులో ప్రత్యేకంగా నిర్వహించిన సమావేశంలో పలువురు హైకోర్టు న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏసీజే జస్టిస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. జస్టిస్ బాలయోగి అందించిన న్యాయసేవలను గుర్తు చేశారు. అనంతరం జస్టిస్ బాలయోగి మాట్లాడుతూ.. విధినిర్వహణలో తనకు చాలామంది సహకరించినట్టు చెప్పారు. ఇటీవల తన ఉద్యోగానికి రాజీనామా సమర్పించాక.. ఉమ్మడి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టీబీఎన్ రాధాకృష్ణన్.. జడ్జీల సంఖ్య తక్కువగా ఉందని, రాజీనామాను ఉపసంహరించుకోవాలని కోరగా.. ఆయన సూచన మేరకు నాడు తన రాజీనామాను ఉపసంహరించుకున్నట్టు చెప్పారు. అంతకు ముందు ఏపీ ఏజీ దమ్మాలపాటి శ్రీనివాస్, ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు రామన్నదొర.. జస్టిస్ బాలయోగి ప్రస్థానాన్ని వివరించారు.



జస్టిస్ బాలయోగికి జ్ఞాపిక అందజేస్తున్న ఏపీ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రవీణ్‌కుమార్

డిమాండ్ల సాధనకు ఆర్టీసీ ఐకాస

- కార్మిక సంఘాల నిర్ణయం

ఈనాడు, అమరావతి: ఆర్టీసీని రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవడంతో పాటు, కార్మికులకు 50 శాతం ఫిట్‌మెంట్ ఇవ్వాలన్న డిమాండ్ల సాధన కోసం ఐక్య కార్యాచరణ సమితిగా ఏర్పాటు కావాలని కార్మిక సంఘాలు నిర్ణయించాయి. విజయవాడలోని ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం కార్మిక సంఘాల సమావేశం జరిగింది. దీనికి నేషనల్ మజ్దూర్ యూనియన్ (ఎన్ఎంయూ) మినహా మిగతా అన్ని కార్మిక సంఘాల నుంచి ప్రతినిధులు హాజరయ్యారు. ఎన్ఎంయూ కూడా కలిసొస్తే త్వరలోనే ఐకాసగా ఏర్పడి.. ముఖ్యమంత్రి, రవాణా శాఖ మంత్రి, ఆర్టీసీ ఎండీలను తమ డిమాండ్లతో కలవాలని సమావేశంలో నిర్ణయించారు. డిమాండ్లను సానుకూలంగా పరిష్కరించకపోతే జనవరి 13 తర్వాత ఎప్పుడైనా సమ్మెకు సిద్ధంగా ఉండాలని సమావేశంలో అనుకున్నామని ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర నాయకులు వై.వి.రావు, పలిశెట్టి దామోదరరావులు తెలిపారు.



మారథాన్ విజేతలతో విట్(ఏపీ) ఉపాధ్యక్షుడు శంకర్ విశ్వనాథన్

నేటి నుంచి విట్(ఏపీ)లో విటోపియా-2019

ఐనవోలు(తుళ్ళూరు), న్యూస్‌టుడే: రాజధాని అమరావతిలోని విట్-ఏపీ విశ్వవిద్యాలయంలో ఈ నెల 5,6 తేదీల్లో విటోపియా-2019 పేరుతో అంతర్జాతీయ క్రీడా సాంస్కృతిక ఉత్సవం నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవానికి ఐదు రాష్ట్రాల నుంచి 50 జట్లు వస్తున్నాయని, వివిధ రాష్ట్రాల విద్యార్థినీ విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొంటారని విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు శంకర్‌విశ్వనాథన్ చెప్పారు. శనివారం ఉదయం 9 గంటలకు ద్రోణాచార్య అవార్డు గ్రహీత వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరై విటోపియా-2019ను ప్రారంభిస్తారు. 6వ తేదీన ముగింపు ఉత్సవానికి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.రజని, ప్రముఖ హిరోయిన్ లావణ్య త్రిపాఠి హాజరవుతారని శంకర్ విశ్వనాథన్ తెలిపారు. శుక్రవారం ఉదయం నిర్వహించిన విటోపియా-2019 మారథాన్‌లో వివిధ రాష్ట్రాల విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు శంకర విశ్వనాథన్, డిస్కస్‌త్రో జాతీయ రజత పతక విజేత కొల్లి అనితాదేవి, అండర్-18 వరల్డ్ యూత్ అథ్లెటిక్ విజేత దండి జ్యోతికశ్రీ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో విట్-ఏపీ విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్ శుభకర్, రిజిస్ట్రార్ శివకుమార్ పాల్గొన్నారు.

ఏపీ ట్రాన్స్‌కోకు సీబీఐపీ అవార్డు

ఈనాడు, దిల్లీ: విద్యుత్తు నిర్వహణలో విశేష కృషి చేసిన వారికి సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇరిగేషన్, పవర్ (సీబీఐపీ) ఏటా ఇచ్చే ఎక్స్‌లెన్స్ అవార్డు ఆంధ్రప్రదేశ్ ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్‌కు దక్కింది. కేంద్ర విద్యుత్తు మంత్రి రాజ్‌కుమార్ సింగ్ ముఖ్య అతిథిగా, రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, సీబీఐపీ అధ్యక్షుడు మసూద్ హుస్సేన్ తదితరులు అవార్డులు అందజేశారు. విద్యుత్తు నిర్వహణలో మెరుగైన పనితీరుకు ఏపీ ట్రాన్స్‌కో దక్కిన ఎక్స్‌లెన్స్ అవార్డును ట్రాన్స్‌కో మేనేజింగ్ డైరెక్టర్ పరుచూరి దినేష్ అందుకొన్నారు.

రఫేల్.. బోఫోర్స్ కాదు

- కాంగ్రెస్ విమర్శలకు రక్షణ మంత్రి సమాధానం



లోక్‌సభలో మాట్లాడుతున్న నిర్మలా సీతారామన్

దిల్లీ: మామూళ్లు దక్కనందునే గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలుపై ఒప్పందాన్ని ఖరారు చేయలేదని రక్షణ శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఆరోపించారు. శుక్రవారం లోక్‌సభలో రఫేల్ వ్యవహారంపై జరిగిన స్వల్పకాలిక చర్చకు ఆమె దాదాపు రెండు గంటల పాటు సమాధానం ఇచ్చారు. ఇది బోఫోర్స్‌లా కుంభకోణం కాదని, దేశ భద్రత కోసం తీసుకున్న నిర్ణయమని తెలిపారు. ' 'బోఫోర్స్ కారణంగా కాంగ్రెస్ పతనమయింది. కానీ, రఫేల్‌తో మోదీ తిరిగి అధికారంలోకి వస్తారు" అని చెప్పారు. చర్చలో కాంగ్రెస్, విపక్షాలు చేసిన విమర్శలకు ఆమె సమాధానం ఇచ్చారు. తనకు, ప్రధాని మోదీకి కుటుంబ వారసత్వాలు లేవని, తమను అబద్ధాలకోర్లు, దొంగలు అనే హక్కు ఎవరికీ లేదని అన్నారు. నిర్మలా సీతారామన్ ఏమన్నారంటే..

- ✦ గతంలో మాదిరిగా రక్షణ రంగ కొనుగోళ్లలో దళారులు లేరు. దేశ ప్రయోజనాల దృష్ట్యానే నిర్ణయాలు తీసుకుంటున్నాం. రాహుల్ ఏఏ (అనిల్ అంబానీ) అంటున్నారు. కానీ అక్కడ 'క్యూ' (అట్టావియో ఖత్రోకీ), 'ఆర్‌వీ' (రాబర్ట్ వాద్రా) ఉన్నారు.
- ✦ వినియోగించడానికి సిద్ధంగా ఉన్న రెండు స్క్వాడ్రన్లు అంటే 36 యుద్ధ విమానాలను కొనుగోలు చేయాలని భారత వాయుసేన సూచించింది. ఆ మేరకే కొనుగోళ్లు జరుపుతున్నాం. యూపీఏ ప్రభుత్వం వినియోగించడానికి సిద్ధంగా ఉన్న 18 విమానాలను మాత్రమే కొనుగోలు చేయాలని ప్రతిపాదించింది. విమానాల సంఖ్యను 126 నుంచి 36కి తగ్గించామనడం తప్పుదోవ పట్టించడమే.
- ✦ తొలి విమానం 2019లో రానుండగా, చివరిదైన 36వ విమానం 2022లో వస్తుంది.
- ✦ యూపీఏలో విమానం ధర రూ.526 కోట్లు అని చెబుతున్నా, నిజానికి ఆ ధరను ఖరారు చేయలేదు. ప్రస్తుతం విమానం ధర రూ.1,600 కోట్లుగా ఉంది. ధరల పెరుగుదల, ఇతర కారణాల వల్లనే ఈ వ్యత్యాసం కనిపిస్తోంది. నిశితంగా పరిశీలిస్తే యూపీఏ నిర్ణయించిన ధరకన్నా 9శాతం తక్కువకు వచ్చినట్టయింది. 2007 నాటి ధరలను, 2016 నాటి ధరలను ఎలా పోలుస్తాం? సాధారణ విమానం ధరలను, ఆయుధాలను అమర్చిన విమానం ధరలను పోల్చలేం.
- ✦ హెచ్‌ఏఎల్‌పై కాంగ్రెస్ మొసలి కన్నీరు కార్చుతోంది. ఆ సంస్థ బలోపేతానికి చర్యలు తీసుకోలేదు. మా ప్రభుత్వం రూ.లక్ష కోట్ల కాంట్రాక్టులు ఇచ్చింది.
- ✦ అనిల్ అంబానీకి చెందిన సంస్థకు గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం పలురాయితీలు ఇవ్వడంతో పాటు, 53 సార్లు బకాయిలను రద్దు చేసింది.
- ✦ ఒప్పందం ప్రకారం... బహిర్గత పరచకూడని అంశాలు ఉన్నాయి. అయితే అలాంటివి ఏవీ లేవంటూ ఫ్రాన్స్ అధ్యక్షుడు చెప్పారని రాహుల్ అంటున్నారు. దాన్ని రాహుల్ సభలో ధ్రువీకరించగలరా?
- ✦ చర్చలో భాజపా సభ్యుడు అనురాగ్ ఠాకూర్ మాట్లాడుతూ కాంగ్రెస్‌కు దేశం కన్నా ఒక కుటుంబ ప్రయోజనాలే ముఖ్యమన్నారు.

అపవాదులు తొలగిపోయాయి: మోదీ

రఫేల్ వ్యవహారంపై లోక్‌సభలో రక్షణ మంత్రి నిర్మలాసీతారామన్ ఇచ్చిన వివరణతో అపవాదులు తొలగిపోయాయని ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. "రఫేల్‌పై జరుగుతున్న నిందాపూరిత ప్రచారాన్ని రక్షణ మంత్రి నిర్మలాసీతారామన్ తన ప్రసంగం ద్వారా ధ్వంసం చేశారు." అంటూ ట్వీట్ చేశారు.

✦ లోక్‌సభలో చేసిన ప్రసంగం ద్వారా నిజాలను దేశం దృష్టికి తీసుకొచ్చారంటూ నిర్మలా సీతారామన్‌ను భాజపా జాతీయ అధ్యక్షుడు అమిత్ షా ప్రశంసించారు. "అబద్ధాలు కొంత దూరం మాత్రమే ప్రయాణించగలవు. నిజాలు దట్టించిన అద్భుత ఉపన్యాసంతో కాంగ్రెస్ చేస్తున్న అబద్ధాల ప్రచారాన్ని ధ్వంసం చేశారు" అని ట్వీట్‌లో పేర్కొన్నారు.

అధికారంలోకి వస్తే దర్యాప్తు

- బాధ్యులకు శిక్ష తప్పదు
- అధ్యక్షుడు రాహుల్ స్పష్టీకరణ
- జవాబులు ఇవ్వాలంటూ మోదీపై ప్రశ్నల వర్షం



లోక్‌సభలో మాట్లాడుతున్నరాహుల్ గాంధీ

దిల్లీ: రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలు వ్యవహారంపై కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంపై దాడిని ముమ్మరం చేసింది. ప్రధాని నరేంద్ర మోదీ లక్ష్యంగా శుక్రవారం పార్లమెంటు లోపలా, బయటా విమర్శల వర్షాన్ని కురిపించింది. ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు రాహుల్ గాంధీతో పాటు, ఇతర సీనియర్ నేతలు ప్రభుత్వానికి పలు ప్రశ్నలు సంధించారు. పార్లమెంటు వెలుపల రాహుల్ గాంధీ విలేకరులతో మాట్లాడారు. "వచ్చే ఎన్నికల్లో మా పార్టీ అధికారంలోకి వస్తే ఈ వ్యవహారంపై క్రిమినల్ దర్యాప్తు జరిపిస్తుంది. బాధ్యులైన వారిని శిక్షిస్తుంది' ' అని చెప్పారు. సుప్రీంకోర్టు తీర్పును ప్రస్తావిస్తూ. .దీనిపై విచారణ జరిపే అధికారం తనకు లేదని మాత్రమే సర్వోన్నత న్యాయస్థానం చెప్పిందని అన్నారు. దర్యాప్తు జరపకూడదని ఎక్కడా చెప్పలేదని స్పష్టం చేశారు. తాము అడిగే ప్రశ్నలకు రక్షణ మంత్రి సమాధానాలు ఇస్తున్నారే తప్ప, ప్రధాని పెదవి విప్పడం లేదని విమర్శించారు.

మోదీ పైనే ఆరోపణలు

లోక్‌సభలో రాహుల్ మాట్లాడుతూ రఫేల్‌పై తాను చేసిన ఆరోపణలన్నీ ప్రధాని మోదీపైనే తప్ప, రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్, ఆ శాఖ మాజీ మంత్రి మనోహర్ పారికర్‌లపై చేసినవి కావని అన్నారు. వారికి దీంట్లో సంబంధం లేదని చెప్పారు. నిర్మలా సీతారామన్ సుదీర్ఘంగా ఉపన్యాసం ఇచ్చినా తాను అడిగిన ప్రశ్నలకు సూటిగా సమాధానం చెప్పకుండా పారిపోయారని విమర్శించారు. చర్చల్లో వాయుసేన అధిపతి, రక్షణ మంత్రి, కార్యదర్శులు పాల్గొన్నారా, లేదా? వాయుసేన అధికారులు ఈ ఒప్పందానికి అభ్యంతరం చెప్పారా, లేదా? అన్న రెండే రెండు ప్రశ్నలకు ఔనో, కాదో అని చెప్పాలంటే ఆమె జావాబివ్వలేదని అన్నారు.

ప్రధానిపై విచారణ జరగాలి

అవినీతికి పాల్పడినందుకు, దేశ భద్రతను బలహీనపర్చినందుకు ప్రధాని మోదీపై విచారణ జరగాలంటూ రాహుల్ ట్వీట్ చేశారు. రూ.550 కోట్లు చెల్లించనందుకు అనిల్ అంబానీని అదుపులోకి తీసుకోవాలంటూ స్వీడిష్ టెలికాం కంపెనీ ఎరిక్‌సన్ సుప్రీంకోర్టులో కేసు వేసిన నేపథ్యంలో ఆయన ఈ ట్వీట్ చేశారు. అంతర్జాతీయ స్థాయిలో అప్పుల్లో కూరుకుపోయిన అనిల్ అంబానీకి మద్దతు ఇస్తున్నందున మోదీపై విచారణ జరగాలని పేర్కొన్నారు. గత 14 ఏళ్లలో ఎప్పుడూ లేని విధంగా దేశంలో పెట్టుబడులు తగ్గాయని, దీనిపై ప్రధానితోపాటు ఆర్థిక మంత్రి జైట్లీ సమాధానం ఇవ్వాలని డిమాండు చేశారు. ఒకరికి పరిపాలన చేతకాదు, మరొకరికి ఆర్థిక వ్యవస్థ అర్థం కాదు అని వ్యాఖ్యానించారు.

★ లోక్‌సభలో జరిగిన స్వల్పకాలిక చర్చలో కాంగ్రెస్ పక్ష నేత మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ రఫేల్ వ్యవహారంపై ప్రధాని మోదీయే స్వయంగా సమాధానం చెప్పాలని డిమాండు చేశారు. లేని కాగ్ నివేదికను చూపించి సుప్రీంకోర్టును తప్పుదోవ పట్టించారని విమర్శించారు. అనంతరం ఆయనతో పాటు గులాంనబీ ఆజాద్, రణదీప్ సుర్జేవాలాలు విలేకరులతో మాట్లాడుతూ ఈ వ్యవహారంపై దర్యాప్తునకు సంయుక్త పార్లమెంటరీ సంఘం ఏర్పాటు చేయాలన్నారు.

ఇవి యువత అడుగుతున్న ప్రశ్నలు

'రఫేల్'పై ప్రధానిని అడుగుతున్న ప్రశ్నలు దేశ యువత అడుగుతున్నవేనని రాహుల్ అన్నారు. వాటిని ఒక్కొక్కటిగా వివరించారు.

- ఒక్కో యుద్ధ విమానం ధరను రూ.526 కోట్ల నుంచి రూ.1,600 కోట్లకు పెంచుతూ ఎవరు నిర్ణయం తీసుకున్నారు?
- ఇది వాయుసేన నిర్ణయమా? రక్షణ మంత్రిత్వ శాఖదా? ప్రధాన మంత్రిదా?
- కొనుగోలు చేయాల్సిన విమానాల సంఖ్యను 126 నుంచి 36కు తగ్గించింది ఎవరు? వాయుసేన ఇలా చేయాలని చెప్పిందా?
- కొత్త ఒప్పందంపై రక్షణ శాఖ అభ్యంతరం చెప్పిందా? ఇందుకు సంబంధించిన పత్రాలు, దస్త్రాలపై రాసిన వ్యాఖ్యానాలు ఆ శాఖ వద్ద ఉన్నాయా?
- ఒక వేళ ఈ అభ్యంతరాలను ప్రధాని తోసిరాజంటే అందుకు సంబంధించిన పత్రాలు ఉన్నాయా?
- అనిల్ అంబానీకి చెందిన రిలయన్స్ డిఫెన్స్‌కు ఆఫ్‌సెట్ కాంట్రాక్టు ఇవ్వాలని ఎవరు నిర్ణయించారు? అనిల్ అంబానీకి కాంట్రాక్టు ఇస్తేనే ఒప్పందం కుదురుతుందని స్వయంగా నరేంద్ర మోదీయే చెప్పారంటూ ఫ్రాన్స్ అధ్యక్షుడు స్పష్టం చేశారు... దీనిపై స్పందన ఏమిటి?
- విమానం ధరను ఎందుకు పెంచారోనని అడగడం ఏమైనా తప్పుడు ప్రశ్నా? దీనిపై ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ వివరణ ఇవ్వాలి.

మూలనపడ్డ ప్రాజెక్టుల్ని పట్టాలెక్కించాం

- ప్రధాని మోదీ



ఇంఫాల్‌లో ప్రధాని మోదీకి శుక్రవారం స్వాగతం పలుకుతున్న భాజపా నేతలు, అధికారులు

ఇంఫాల్, సిల్చార్: గత ప్రభుత్వ హయాంలో పని సంస్కృతి సరిగా లేదని ప్రధాని నరేంద్ర మోదీ తీవ్రంగా తప్పుపట్టారు. మూలన పడి ఉన్న, దస్త్రాలకే పరిమితమైన రూ.12 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులను 2014లో తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పరిశీలించి వేగంగా అమల్లోకి తీసుకొచ్చామని తెలిపారు. ఈశాన్యంలో లోక్‌సభ ఎన్నికల ప్రచారాన్ని శుక్రవారం ప్రారంభించిన ఆయన మణిపూర్, అసోంలలో జరిగిన బహిరంగ సభల్లో ప్రసంగించారు. మణిపూర్‌లో 8 కీలక అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించి, నాలుగు పథకాలకు శంకుస్థాపన చేశారు. అసోంలోని కాళీనగర్‌లో నిర్వహించిన విజయసంకల్ప్ సభలో మాట్లాడారు. మణిపూర్ రాష్ట్ర రాజధాని ఇంఫాల్‌లో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం రూ.100 కోట్లు వ్యయమయ్యే ప్రాజెక్టులను రూ.200-రూ.250 కోట్లతో పూర్తి చేశాయని అన్నారు. 'ప్రగతి' వ్యవస్థను రూపొందించి అపరిష్కృత ప్రాజెక్టులపై కేంద్ర, రాష్ట్ర అధికారులతో చర్చించి, అడ్డంకుల్ని తొలగించి, పనుల్ని వేగవంతం చేసి, నిర్దిష్ట కాలవ్యవధిలోగా పూర్తి చేయిస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వం హయాంలో పునాదిరాళ్లు వేసి, రిబ్బన్లు కత్తిరించి, వాటిని ఎన్నికల్లో గెలవడానికి వాడుకునేవారన్నారు. తాము అధికారంలోకి వచ్చాక ఇలాంటి పని సంస్కృతిని మార్చేందుకు నడుంకట్టానని మోదీ స్పష్టం చేశారు.

త్వరలోనే పౌరసత్వ బిల్లుకు పార్లమెంటు ఆమోదం

అసోం రాష్ట్రం సిల్చార్ సమీపంలోని కాళీనగర్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రధాని మాట్లాడుతూ జాతీయ పౌరసత్వ రిజిస్టర్ (ఎన్ఆర్‌సీ) నుంచి నిజమైన పౌరులెవర్నీ విస్మరించబోమని చెప్పారు. పౌరసత్వ బిల్లుకు త్వరలోనే పార్లమెంటు ఆమోదం లభిస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు. "భారతమాతపై గౌరవం ఉంటూ ఇతర దేశాల్లో పీడనకు గురవుతున్న వారు ఎక్కడికి వెళ్లాలి? వారిని భారతమాత అక్కున చేర్చుకోకూడదా? విభజన సందర్భంగా జరిగిన అన్యాయాలను సరిదిద్దుకోవడం తప్పనిసరి" అని అన్నారు. పాకిస్థాన్, అఫ్గానిస్థాన్, బంగ్లాదేశ్‌ల్లోని మైనార్టీలైన హిందువులు, క్రైస్తవులు, సిక్కులు, పార్శీలు తదితరులకు భారత పౌరసత్వం కల్పించేందుకు బిల్లును ప్రవేశపెట్టగా, ఇది 1971లో కుదిరిన అసోం ఒప్పందానికి విరుద్ధంగా ఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో ప్రధాని వివరణ ఇచ్చారు.

4వ అంతస్తు నుంచి పడి బతికిన చిన్నారి

ముంబయి: ఓ 14 నెలల చిన్నారి నాలుగో అంతస్తు నుంచి కిందపడితే ఏం జరుగుతుందో ఊహించడానికే భయమేస్తుంది. ముంబయిలో అంత ఎత్తు నుంచి పడినా బాబు కొద్దిపాటి గాయాలతో బయటపడ్డాడు. బాబును రక్షించినందుకు ఆ కుటుంబమంతా ఇప్పుడు ఓ చెట్టుకు ధన్యవాదాలు చెబుతోంది. గోవండీ (తూర్పు)లోని బీఎస్ దేవాశీ రోడ్డు పక్కనున్న గోపీకృష్ణ భవనం నాలుగో అంతస్తులోని ఓ ఫ్లాట్‌లో అజిత్ బార్కడే, జ్యోతి దంపతులకు అథర్వ బార్కడే అనే 14నెలల బాబున్నాడు. గురువారం ఉదయం బాబు నాయనమ్మ ఇంటికి ఉన్న ఫ్రెంచి కిటికీ అద్దాన్ని తెరిచి సరిగా మూయడం మరిచిపోయారు. ఆ కిటికీకి చిక్కాలు లేకపోవడంతో అక్కడే ఆడుకుంటున్న అథర్వ అటువైపు వెళ్లి కిటికీలోంచి బయటకు పడిపోయాడు. గాయాలు తగిలినప్పటికీ స్పృహలోనే ఉండటంతో ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఇంతకీ జరిగిందేమిటంటే బాబు పడిపోయిన కిటికీ కింద ఓ చెట్టుంది. బాబు సరిగ్గా దానిపై పడటంతో వంగివున్న కొమ్మ మీదుగా కిందకు జారిపోయాడు. దీంతో ప్రమాద తీవ్రత బాగా తగ్గింది.

భాజపా కార్యకర్త భార్యపై సామూహిక అత్యాచారం

పశ్చిమ బెంగాల్‌లో దారుణం

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లో భాజపా కార్యకర్త భార్యపై గుర్తుతెలియని నలుగురు వ్యక్తులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఉత్తర 24 పరగణాల జిల్లాలోని పటులియాలో ఈ దారుణం జరిగింది. బాధితురాలి భర్త భాజపాలో 'శక్తి ప్రముఖ్' బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. బుధవారం రాత్రి కుమారుడిని ట్యూషన్‌లో వదిలిపెట్టి వస్తున్న బాధితురాలిపై ముసుగులు ధరించిన ఇద్దరు దుండగులు దాడి చేశారు. ఆమె నోరు మూసేసి సమీపంలో నిర్మాణంలో ఉన్న ఒక భవనం వద్దకు ఈడ్చుకెళ్లారు. అక్కడ మరో ఇద్దరితో కలిసి ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డారు. "నీ భర్త భాజపాలో కొనసాగితే ఇబ్బందులు తప్పవు' అని ఆమెను హెచ్చరించినట్లు బాధితురాలి భర్త ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆమె ప్రస్తుతం చికిత్స పొందుతోంది. ఈ ఘటనపై భాజపా జాతీయ కార్యదర్శి రాహుల్ సిన్హా రాష్ట్రంలోని తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. ఒక మహిళ పాలిస్తున్న రాష్ట్రంలో మహిళలకు గౌరవం లేకుండా పోయిందని, పోలీసులు మౌన ప్రేక్షకులుగా మిగిలిపోయారని దుయ్యబట్టారు. రాష్ట్రంలో క్షీణిస్తున్న శాంతి భద్రతలకు ముఖ్యమంత్రి మమతా బెనర్జీదే బాధ్యతన్నారు. ఈ ఆరోపణలను తృణమూల్ నేత నిర్మల్ ఘోష్ ఖండించారు. ఈ ఘటనపై జాతీయ మహిళా కమిషన్ ఆందోళన వ్యక్తం చేసింది.

ఫేస్‌బుక్ పరిచయస్థుడి దుర్మార్గం!

యువతిపై అత్యాచారం

ముజఫర్‌నగర్: ఫేస్‌బుక్‌లో పరిచయమై, స్నేహితుడిగా నటించిన ఓ వ్యక్తి, అతని సోదరులు ఓ యువతి (23)పై అత్యాచారానికి ఒడిగట్టారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని శామ్లీ జిల్లాలో ఈ దారుణం వెలుగు చూసింది. నిందితుడు సోనూ ఆమెను ఓ హోటల్‌లో నిర్బంధించి అత్యాచారానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. అతని కుటుంబ సభ్యులు కూడా ఆమెపై అఘాయిత్యానికి ఒడిగట్టారు. ఈ దారుణాన్ని చిత్రీకరించిన నిందితుడు అనంతరం ఆమెను బెదిరిస్తూ, పెళ్లి చేసుకోవాలంటూ ఒత్తిడి చేశాడు. బాధితురాలి ఫిర్యాదుతో నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్పీ తెలిపారు.

కేరళలో కొనసాగుతున్న ఉద్రిక్తత

- రెండో రోజూ హింసాత్మక ఘటనలు
- అయ్యప్పను దర్శించుకున్న శ్రీలంక మహిళ!



అయ్యప్పస్వామిని దర్శించుకున్న శ్రీలంక మహిళ

తిరువనంతపురం, కోచి: కేరళలో యుద్ధ వాతావరణం ఇంకా కొనసాగుతోంది. శబరిమల అయ్యప్ప ఆలయంలోకి మహిళలకు ప్రవేశం కల్పించడంపై... హిందూ సంస్థలు శుక్రవారమూ నిరసన తెలిపాయి. నాటు బాంబుల మోతలు, రాళ్ల దాడులు ఆగలేదు. రాష్ట్ర వ్యాప్తంగా పలుచోట్ల హింసాత్మక ఘటనలు చోటు చేసుకుంటూనే ఉన్నాయి. వీటికి సంబంధించి ఇప్పటివరకూ 801 కేసులు నమోదయ్యాయి. మొత్తం 1,369 మందిని పోలీసులు అరెస్టు చేశారు. మరో 717 మందిని ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు.

కోజికోడ్‌లో మలబార్ దేవస్థానం బోర్డు సభ్యుడు కె.శశికుమార్ ఇంటిపై నిరసనకారులు నాటు బాంబులు విసిరారు. కన్నూర్‌లో నాలుగు చోట్ల నాటు బాంబు దాడులు కలకలం సృష్టించాయి. సీపీఎం, భాజపా కార్యకర్తల మధ్య ఘర్షణలు చోటుచేసుకోగా ఓ వ్యక్తికి తీవ్రంగా గాయాలయ్యాయి. కన్నూర్ భాజపా కార్యాలయానికి ప్రత్యర్థి వర్గీయులు నిప్పంటించారు. తిరువనంతపురం, కన్నూర్, కోజికోడ్, పథనంథిట్టలో సీపీఎం, భాజపా శ్రేణులు పరస్పరం ఒకరి ఇళ్లపై ఒకరు రాళ్లు రువ్వుకున్నారు.

ఓవైపు నిరసనలు కొనసాగుతుండగానే గురువారం రాత్రి శ్రీలంకకు చెందిన 47 ఏళ్ల శశికళ శబరిమల అయ్యప్ప ఆలయంలో ప్రవేశించి, స్వామివారిని దర్శించుకున్నారు. ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులు, పోలీసులు ఈ విషయాన్ని ధ్రువీకరించారు. అయితే ఆమె అందుకు భిన్నంగా చెప్పారు. భర్త, కుమారుడితో కలిసి స్వామివారి దర్శనం కోసం వచ్చానని, ఆలయాధికారులు తనను దర్శనానికి అనుమతించలేదని ఆమె మీడియాకు వెల్లడించారు.

భాజపా-ఆర్ఎస్ఎస్ లక్ష్యాత్మక దాడి: అగ్నివేశ్

బుధవారం అయ్యప్పను దర్శించుకున్న బిందు, కనకదుర్గలను సామాజికవేత్త స్వామి అగ్నివేశ్ అభినందించారు. భాజపా, ఆర్ఎస్ఎస్‌లు కేరళను లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తున్నాయని ఆరోపించారు. సంఘ్ పరివారం పౌరజీవనాన్ని అస్తవ్యస్తం చేయడమే కాకుండా, ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్నారని మండిపడ్డారు.

★ రాష్ట్రంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో ప్రధాని మోదీ కేరళ పర్యటన వాయిదా పడింది. ఆయన ఈ నెల 6న పథనంథిట్టకు రావాల్సి ఉంది.

★ శబరిమళలో రాత్రివేళ ప్రభుత్వం దగ్గరుండి ఇద్దరు మహిళలకు ప్రవేశం కల్పించిందని, ఇది పిరికిపంద చర్య అని ఇస్రో మాజీ అధ్యక్షుడు, భాజపా నేత జి.మాధవన్ నాయర్ పేర్కొన్నారు.

'మదర్ ఆఫ్ ఆల్ బాంబ్స్'ను రూపొందించిన చైనా

బీజింగ్: 'మదర్ ఆఫ్ ఆల్ బాంబ్స్' (ఎంవోఏబీ) పేరుతో అమెరికా రూపొందించిన శక్తిమంతమైన అణ్వస్త్రేతర ఆయుధానికి పోటీగా చైనా కూడా ఒక భారీ బాంబును రూపొందించింది. విమానం నుంచి ప్రయోగించే ఈ ఆయుధాన్ని ఆ దేశ రక్షణ సంస్థ 'నారిన్‌కో' తాజాగా ప్రదర్శించింది. విధ్వంసక శక్తి విషయంలో అణ్వస్త్రాల తర్వాతి స్థానం ఈ ఎంవోఏబీలదే. దీని అసలు పేరు 'మ్యాసివ్ ఆర్డ్‌నెన్స్ ఎయిర్ బ్లాస్ట్' (ఎంవోఏబీ). మదర్ ఆఫ్ ఆల్ బాంబ్స్‌గా ఇది ప్రాచుర్యం పొందింది. 2017లో అమెరికా సైన్యం అఫ్గానిస్థాన్‌లో ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాదుల స్థావరాలపై ఈ బాంబును ప్రయోగించింది. పటిష్ఠ భవనాలు, రక్షణ శిబిరాలను కూడా ఇది సమూలంగా నాశనం చేయగలదు. గగనతలంలో హెలికాప్టర్ నుంచి సైనికులు తాళ్ల ద్వారా కిందకి దిగాలనుకున్న చోట అడవులు వంటి అవరోధాలు ఉంటే వాటిని నిర్మూలించడానికి కూడా ఈ బాంబును ఉపయోగించొచ్చు. చైనా రూపొందించిన ఈ తరహా ఆయుధాన్ని హెచ్-6కె శ్రేణి బాంబర్ విమానం ద్వారా జారవిడిస్తున్న వీడియోను నారిన్‌కో విడుదల చేసింది. దీనివల్ల భారీ విస్ఫోటం చోటుచేసుకుంది. చైనా బాంబు బరువు కొన్ని టన్నుల మేర ఉంటుందని చెబుతున్నారు. పొడవు 5-6 మీటర్ల మేర ఉండొచ్చని విశ్లేషిస్తున్నారు. అమెరికా ఎంవోఏబీ కన్నా కొంచెం చిన్నగా, తక్కువ బరువును కలిగి ఉంటుందంటున్నారు. అమెరికా బాంబు పెద్దగా ఉండటం వల్ల భారీ రవాణా విమానాల్లోనే తరలించడం సాధ్యమవుతుంది.

ఆ 45 మంది ఎంపీలపై సస్పెన్షన్ తొలగించండి

లోక్‌సభ స్పీకర్‌కు డిప్యూటీ స్పీకర్ విజ్ఞప్తి

దిల్లీ: లోక్‌సభలో 45 మంది సభ్యులపై విధించిన సస్పెన్షన్‌ను తొలగించాలని స్పీకర్ సుమిత్రా మహాజన్‌కు డిప్యూటీ స్పీకర్ తంబిదురై విజ్ఞప్తి చేశారు. వారు సోమవారం నుంచి సభలో పాల్గొనేందుకు అనుమతించాలని కోరారు. ఇందుకు మహాజన్ అంగీకరించలేదు. సభలోకి తిరిగి అనుమతిస్తే సదరు సభ్యులు మళ్లీ వెల్‌లోకి ప్రవేశించరని ఎవరు పూచీ ఇస్తారని ప్రశ్నించారు. కావేరి నదిపై ప్రతిపాదిత డ్యామ్ విషయంపై అన్నాడీఎంకే ఎంపీలు, ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా కల్పించాలని డిమాండ్ చేస్తూ తెదేపా ఎంపీలు లోక్‌సభలో నినాదాలు చేసిన సంగతి తెలిసిందే. సభ కార్యకలాపాలకు అడ్డుపడుతున్నారని పేర్కొంటూ.. బుధ, గురువారాల్లో ఈ రెండు పార్టీల ఎంపీలపై కొద్ది రోజుల పాటు సస్పెన్షన్ విధించిన సంగతి తెలిసిందే.

మరో నలుగురు సమాచార కమిషనర్ల పోస్టుల భర్తీకి ప్రకటన

దిల్లీ: మరో నలుగురు సమాచార కమిషనర్ల పోస్టుల భర్తీకి ప్రభుత్వం శుక్రవారం ప్రకటన విడుదల చేసింది. ఇటీవల కేంద్ర సమాచార కమిషన్‌లో నలుగురు కమిషనర్లను నియమించిన విషయం తెలిసిందే. సమాచార కమిషనర్ల వేతనం, అలవెన్స్‌లు, సర్వీసుకు సంబంధించిన ఇతర నియమనిబంధనల వివరాలను నియామకం సమయంలో తెలియచేస్తారు. కేంద్ర సిబ్బంది వ్యవహారాల మంత్రిత్వశాఖ ఈ విషయాన్ని ఒక ప్రకటనలో తెలిపింది. వేతనం తదితరాలను నియామకాల సమయంలోనే వెల్లడిస్తామన్న ప్రభుత్వ చర్యపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రధాని జీవితంపై త్వరలో సినిమా

దిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ జీవిత కథ త్వరలో వెండితెరపై చిత్రంగా రానుంది. ఆయన పాత్రను ప్రముఖ హిందీ నటుడు వివేక్ ఒబెరాయ్ పోషించనున్నారు. నిజ జీవితాల ఆధారంగా ఇదివరకు 'సరబ్‌జీత్', 'మేరీకోమ్' సినిమాలను తెరకెక్కించిన ఓమంగ్‌కుమార్.. మోదీ జీవిత కథకు దర్శకత్వం వహించనున్నారు. సినీ వాణిజ్య విశ్లేషకుడు తరణ్ ఆదర్శ్ ట్విటర్ వేదికగా ఈ విషయాన్ని ప్రకటించారు. సందీప్ సింగ్ నిర్మాణంలో 'పీఎం నరేంద్రమోదీ' అనే పేరుతో ఈ చిత్రం రానున్నట్లు వెల్లడించారు. మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్ సోమవారం ముంబయిలో ఈ చిత్రం 'ఫస్ట్ లుక్ పోస్టర్'ను ఆవిష్కరిస్తారని నిర్మాణ సంస్థ వర్గాలు తెలిపాయి.

'అయోధ్య'పై విచారణకు కొత్త ధర్మాసనం

దిల్లీ: అయోధ్యలోని రామ జన్మభూమి- బాబ్రీ మసీదు భూ వివాదంపై సుప్రీంకోర్టులో శుక్రవారం ఎలాంటి విచారణా జరగలేదు. దీనిపై 30 సెకన్లపాటు కూడా కోర్టు ప్రక్రియ కొనసాగలేదు. ఈ కేసు ప్రస్తుతం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగొయి, న్యాయమూర్తి జస్టిస్ ఎస్.కె.కౌల్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ముందుకు వచ్చింది. దీనిని పరిశీలించిన వెంటనే ప్రధాన న్యాయమూర్తి ఉత్తర్వులు ఇస్తూ.. ఈ కేసు విచారణకు తగిన ధర్మాసనం ఏర్పాటవుతుందని, అది ఈ నెల పదో తేదీన వాదనలు వినిపించే తేదీలను ఖరారు చేస్తుందని పేర్కొన్నారు.

దిల్లీ కాంగ్రెస్ అధ్యక్ష పదవికి మాకన్ రాజీనామా

దిల్లీ: కాంగ్రెస్ పార్టీ దిల్లీ విభాగం అధ్యక్ష పదవికి ఆ పార్టీ సీనియర్ నాయకుడు అజయ్ మాకన్ రాజీనామా సమర్పించారు. ఆరోగ్య సమస్యల వల్లే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీని గురువారం కలిసి బాధ్యతల నుంచి తనకు విశ్రాంతి కల్పించాలని అభ్యర్థించినట్లు వివరించారు. ఆమ్‌ఆద్మీ పార్టీతో చేతులు కలిపేందుకు కాంగ్రెస్ సిద్ధమవుతోందని జోరుగా ఊహాగానాలు వినిపిస్తుండటంతో ఆయన రాజీనామాకు ప్రాధాన్యం ఏర్పడింది. ఆప్‌తో పొత్తును మాకన్ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

రైల్వేలో 13,487 ఖాళీల భర్తీకి నోటిఫికేషన్

దిల్లీ: రైల్వేలో 13,487 పోస్టుల భర్తీకి ఆ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. జూనియర్ ఇంజినీర్స్(జేఈ, ఐటీ), డిపో మెటీరియల్ సూపరింటెండెంట్(డీఎంఎస్), కెమికల్ అండ్ మెటలర్జికల్ అసిస్టెంట్ ఖాళీల భర్తీ చేపట్టనున్నట్లు రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు(ఆర్ఆర్‌బీ) తెలిపింది. జీతభత్యాల స్కేలు రూ.35,400-1,12,400 ఉంటుందని రైల్వేశాఖ తన వెబ్‌సైట్‌లో పేర్కొంది. జూనియర్ ఇంజినీర్(జేఈ, ఐటీ), డీఎంఎస్ పోస్టులకు మూడేళ్ల డిప్లొమా; కెమికల్ అండ్ మెటలర్జికల్ అసిస్టెంట్ పోస్టులకు మూడేళ్ల డిగ్రీ(ఎంపీసీ) చేసినవారు లేదా తత్సమాన అర్హత కలిగినవారు అర్హులని తెలిపింది. జనవరి 1, 2019నాటికి 18 నుంచి 33 ఏళ్ల వయస్సున్నవారు ఈనెలాఖరులోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. రెండు దశల్లో పోటీపరీక్ష నిర్వహిస్తామని పేర్కొంది.

పీఎన్‌బీ కుంభకోణం కేసులో కర్మాగారం జప్తు

దిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ) కుంభకోణం కేసులో థాయ్‌లాండ్‌లోని రూ.13 కోట్లకుపైగా విలువైన ఓ కర్మాగారాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఈడీ) జప్తు చేసింది. నిందితుల్లో ఒకరైన మెహుల్ చోక్సీకి చెందిన గీతాంజలి గ్రూప్ సంస్థ యాజమాన్యంలో ఈ కర్మాగారం ఉంది. వజ్రాల వ్యాపారులు నీరవ్ మోదీ, చోక్సీ కలిసి పీఎన్‌బీని రూ.13వేల కోట్లకుపైగా మోసగించిన సంగతి తెలిసిందే. ఈ కేసులో ఇప్పటివరకూ రూ.4,765 కోట్ల విలువైన ఆస్తులను ఈడీ జప్తు చేసింది.

మే 31లోపు ఓబీసీ ఉపవర్గీకరణ కమిషన్ నివేదిక

దిల్లీ: ఓబీసీల ఉపవర్గీకరణపై ఏర్పాటయిన కమిషన్ మే 31లోగా నివేదిక సమర్పిస్తుందని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ తెలిపారు. ఈ అంశంపై చర్చకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. సమాజంలోని ప్రతి వర్గానికీ న్యాయం జరగాలన్నదే తమ ఆకాంక్ష అని స్పష్టం చేశారు. రాజ్యసభలో భాజపా ఎంపీ వికాస్ మహాత్మే ప్రవేశపెట్టిన ప్రైవేట్ మెంబర్ తీర్మానంపై స్పందిస్తూ ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు.

పాల సంద్రమా?



కశ్మీర్‌లో శుక్రవారం భారీగా హిమపాతం కురవడంతో పలు ప్రాంతాలు పాల సముద్రాన్ని తలపించాయి. కొన్నిచోట్ల ప్రధాన రహదారులు మూతపడ్డాయి.

మంచు వెలుగులు



ధగధగలాడుతున్న ఈ మంచు సౌధాలను చైనాలోని హార్బిన్ నగరంలో నిర్మించారు. ఏటా మంచు వేడుక పేరుతో ఇక్కడ ఇలాంటి శిల్పాలను తయారు చేస్తుంటారు.

ఛాంపియన్స్

కోహ్లీని గౌరవించండి

సిడ్నీ: టీమ్‌ఇండియా కెప్టెన్ బ్యాటింగ్ వచ్చే ప్రతిసారీ ఆస్ట్రేలియా అభిమానులు ఎగతాళిగా అరుస్తుండటాన్ని ఆస్ట్రేలియా చీఫ్ కెవిన్ రాబర్ట్స్ తప్పుబట్టాడు. "ఆట మనందరి కంటే పెద్దది. మనం అతిథుల్ని గౌరవించాలి. మన దేశంలో పర్యటించే వారికి ఉత్తమ అనుభవాన్ని ఇవ్వాలి. మైదానంలో వారిని ఓడించాల్సిందే కానీ.. అదే సమయంలో వారితో గౌరవప్రదంగా వ్యవహరించాలి'' అని రాబర్ట్స్ ఒక ప్రకటనలో పేర్కొన్నాడు.




జడేజా 81

"ఇంతకుముందు నేను ఇన్నింగ్స్ బాగా ఆరంభించినా.. టెయిలెండర్లతో ఆడాల్సి వచ్చేది. అప్పుడు నా ఆలోచన భిన్నంగా ఉండేది. పరుగులు పెంచడానికి ప్రయత్నించేవాడిని. కానీ ఈసారి జడేజా లాంటి బ్యాట్స్‌మన్‌తో ఆడటం కలిసొచ్చింది. ఆ తేడా నాకు స్పష్టంగా కనిపించింది. సొంతగడ్డపై వెస్టిండీస్‌తో టెస్టు సిరీస్‌లో రెండుసార్లు 90ల్లోనే ఔటయ్యా. అందుకే ఈసారి కొంచెం ఒత్తిడికి లోనయ్యా. స్లెడ్జింగ్ విషయానికి వస్తే.. మైదానంలో ప్రత్యర్థులతో వాగ్వాదాలు మనల్ని సానుకూలంగా ఉంచడానికి ఉపయోగపడతాయి. చాలాసేపు ఫీల్డింగ్ చేసి శరీరం అలసటకు గురయ్యాక కొంచెం ఉత్సాహం పెంచడానికి, ఏకాగ్రత చెదరకుండా ఉండేందుకు ఏదో ఒక మార్గం చూడాలి. అందుకే నేనలా మాట్లాడుతుంటా. అది నా విషయంలో బాగానే పని చేస్తోంది. ఒక ఆటగాడిగా నాకప్పుడు ఏమనిపిస్తే అలా మాట్లాడుతుంటా. స్టంప్ మైక్‌లు ఉన్నాయా.. అంతా రికార్డవుతోందా అన్నది ఆలోచించను"
- పంత్

159 పంత్ పరుగులు. టెస్టుల్లో ఓ భారత వికెట్ కీపర్ సాధించిన మూడో అత్యుత్తమ స్కోరిది. ధోని (224), బుధి కుందేరన్ (192) తొలి రెండు స్థానాల్లో ఉన్నారు.

1 ఆస్ట్రేలియాలో సెంచరీ చేసిన తొలి భారత వికెట్ కీపర్ రిషబ్ పంతే. ఫరూక్ ఇంజినీర్ 1967లో చేసిన 89 పరుగులే ఇప్పటిదాకా అత్యధికం. పంత్ కొన్ని నెలల కిందటే ఇంగ్లాండ్‌లో సెంచరీ చేసిన తొలి వికెట్ భారత వికెట్ కీపర్‌గానూ రికార్డు నెలకొల్పాడు.

521 సిరీస్‌లో పుజారా పరుగులు. ఆస్ట్రేలియాపై ఒక సిరీస్‌లో అత్యధిక పరుగులు చేసిన బ్యాట్స్‌మెన్‌లో అతడిది మూడో స్థానం. కోహ్లి (2014-15లో 692), ద్రవిడ్ (2003-04లో 619) తొలి రెండు స్థానాల్లో ఉన్నారు.



పంత్ 159 నాటౌట్

● ప్రపంచ క్రికెట్లో 21 ఏళ్ల లోపే రెండు టెస్టు శతకాలు సాధించిన తొలి వికెట్ కీపర్‌గా పంత్ రికార్డులకెక్కాడు.

కంగారూల ముందు కొండ!

పంత్ భారీ శతకం ● మెరిసిన జడేజా ● త్రుటిలో ద్విశతకం చేజార్చుకున్న పుజారా ● సిడ్నీలో తిరుగులేని స్థితిలో భారత్ ● తొలి ఇన్నింగ్స్‌లో 622/7 డిక్లేర్డ్

కల సాకారమైనట్లే! ఆస్ట్రేలియాలో తొలి సిరీస్ విజయం కోసం తహతహలాడుతున్న టీమ్ ఇండియా.. లక్ష్యానికి మరింత చేరువైంది. ఇప్పుడు ప్రశ్న సిరీస్ గెలిచేది 3-1తోనా లేదా 2-1తో అన్నదే! కోహ్లీసేన పరుగుల వరద పారించిన నేపథ్యంలో.. నాలుగో టెస్టులో ఆస్ట్రేలియా పోరాడాల్సింది డ్రా కోసమే! కుర్ర పంత్ చెలరేగిపోయిన వేళ.. సిడ్నీ టెస్టులో భారత్ తిరుగులేని స్థితిలో నిలిచింది. జడేజా కూడా మెరవడంతో కొండంత స్కోరు చేసి కంగారూలను గెలుపు పోటీలో లేకుండా చేసింది. పిచ్ ఇప్పటికీ బ్యాటింగ్‌కు అనుకూలిస్తున్నప్పటికీ భారత్‌ను అడ్డుకోవడం ఆతిథ్య జట్టుకు కష్టమైన పనే. ఆస్ట్రేలియాలో టెస్టు శతకం సాధించిన తొలి భారత వికెట్‌కీపర్‌గా రిషబ్ పంత్ ఘనత సాధించాడు.

సిడ్నీ

టీమ్‌ఇండియా సిరీస్ విజయాన్ని అడ్డుకోవాలంటే ఆస్ట్రేలియా ఇక అద్భుతాలు చేయాల్సిందే. సిడ్నీ టెస్టులో గెలిచే అవకాశమున్నది కోహ్లీసేనకు మాత్రమే. సిరీస్‌లో అన్నిసార్లూ బ్యాటింగ్‌ను బాగానే ఆరంభించినా పెద్ద ఇన్నింగ్స్ ఆడలేకపోయిన యువ రిషబ్ పంత్ ఈసారి అదిరే శతకంతో ఆతిథ్య జట్టుకు మ్యాచ్‌లో ఎలాంటి అవకాశమే లేకుండా చేశాడు. పంత్ (159 నాటౌట్; 189 బంతుల్లో 15×4, 1×6)తో పాటు రవీంద్ర జడేజా (81; 114 బంతుల్లో 7×4, 1×6) కూడా బ్యాటు ఝుళిపించడంతో భారత్ తొలి ఇన్నింగ్స్‌ను 622/7 వద్ద డిక్లేర్ చేసింది. నిలకడ కొనసాగించిన పుజారా (193; 373 బంతుల్లో 22×4) కొద్దిలో డబుల్ సెంచరీ చేజార్చుకున్నాడు. రెండో రోజు, శుక్రవారం ఆట ముగిసే సమయానికి ఆస్ట్రేలియా మొదటి ఇన్నింగ్స్‌లో వికెట్ నష్టపోకుండా 24 పరుగులు సాధించింది. హారిస్ (19), ఖవాజా (5) క్రీజులో ఉన్నారు.

1258 ప్రస్తుత సిరీస్‌లో పుజారా ఎదుర్కొన్న బంతులు. 4 అంత కంటే తక్కువ టెస్టుల సిరీస్‌లో అత్యధిక బంతులు ఎదుర్కొన్న బ్యాట్స్‌మెన్ జాబితాలో పుజారా నాలుగో స్థానానికి చేరుకున్నాడు. వెస్టిండీస్ ఆటగాడు రిచీ రిచర్డ్సన్ అగ్రస్థానంలో ఉన్నాడు. అతను 1988-89లో భారత్‌తో సిరీస్‌లో 1358 బంతులాడాడు.

పంత్ సూపర్

రిషబ్ బ్యాటింగ్ సామర్థ్యం విషయంలో ఎవరికీ సందేహాలేమీ లేవు. సిరీస్‌లో ఫామ్‌లోనే ఉన్నాడు. విలువైన పరుగులే చేశాడు. కానీ మంచి ఆరంభాలను భారీ స్కోర్లుగా మలచలేకపోయాడు. 25, 28, 36, 30, 39, 33.. తొలి టెస్టు నుంచి వరుసగా అతడి స్కోర్లివి. దూకుడుగా ఆడే ప్రయత్నంలో చాలాసార్లు వికెట్ పోగొట్టుకున్నాడు. శుక్రవారం కూడా అతడు అలాగే ఆడతాడని అంతా భావించి ఉంటారు. ఐతే అతడు పరుగులు వేగంగానే రాబట్టాడు కానీ.. సంయమనం పాటించాడు. అనవసర షాట్లకు పోలేదు. భారత్ 329/5 ఉన్నప్పుడు క్రీజులోకి వచ్చిన పంత్.. ఎడాపెడా బాదాలని చూడకుండా పుజారాలాగే క్రీజులో పాతుకుపోయి నియంత్రణతో ఆడాడు. మొదట్లో బంతిని ఎక్కువగా గాల్లోకి లేపలేదు. ఆరో వికెట్‌కు 89 పరుగులు జోడించిన పుజారా ఔటయ్యాక పంత్ జట్టుకు భారీ స్కోరును అందించే బాధ్యత తీసుకున్నాడు. 85 బంతుల్లో అర్ధశతకం పూర్తి చేసిన పంత్ ఆ తర్వాత వేగం పెంచాడు. పేసర్లు కమిన్స్, హేజిల్‌వుడ్, స్టార్క్ కానీ.. స్పిన్నర్లు లైయన్, లబుషేన్ కానీ అతడిపై ఎలాంటి ప్రభావం చూపలేకపోయారు. టీ సమయానికి భారత్ 491/6తో నిలిచింది. ఆ తర్వాత పంత్, జడేజా స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. లబుషేన్ బౌలింగ్‌లో మిడ్‌వికెట్లో బౌండరీతో టెస్టులో తన రెండో సెంచరీ (137 బంతుల్లో) పూర్తి చేసిన పంత్.. ఆ తర్వాత మరింత దూకుడుగా ఆడాడు. జడేజా కూడా అలవోకగా బౌండరీలు సాధించాడు. 89 బంతుల్లో అర్ధశతకాన్ని అందుకున్నాడు. కమిన్స్ వేసిన ఓ ఓవర్లో జడేజా ఏకంగా నాలుగు ఫోర్లు బాదేశాడు. మరోవైపు హేజిల్‌వుడ్ ఓవర్లో మూడు బంతులను బౌండరీ దాటించిన పంత్.. ఆ క్రమంలో 150 (185 బంతుల్లో) పరుగులు పూర్తి చేశాడు. సెంచరీ చేసేలా కనిపించిన జడేజా.. లైయన్ బౌలింగ్‌లో బౌల్డయ్యాడు. వెంటనే కోహ్లి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేశాడు. పంత్-జడేజా జోడీ ఏడో వికెట్‌కు 224 బంతుల్లో 204 పరుగులు జోడించింది.



పుజారా 193

చేజారిన డబుల్

సూపర్ ఫామ్‌ను కొనసాగిస్తూ తొలి రోజు భారత్ పటిష్టమైన స్థితిలో నిలిపిన పుజారా రెండో రోజు కూడా పట్టుదలగా ఆడాడు. ఓవర్‌నైట్ స్కోరు 303/4తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన భారత్ లంచ్.. సమయానికి 389/5తో నిలిచింది. పుజారా (ఓవర్‌నైట్ 130) సాధికారిక బ్యాటింగ్‌ను కొనసాగించాడు. లైయన్ బౌలింగ్‌లో ఎక్స్‌ట్రా కవర్లో ముచ్చటైన బౌండరీతో 150 (282 బంతుల్లో) పూర్తి చేశాడు. విహారి (42) మాత్రం ఎక్కువసేపు నిలవలేకపోయాడు. ఓవర్‌నైట్ స్కోరుకు 3 పరుగులు మాత్రమే జోడించి లైయన్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. అయినా ఆసీస్‌కు పెద్దగా సంతోషించడానికి ఏమీ లేకపోయింది. మరోవైపు పంత్ అండగా నిలవడంతో పుజారా సాఫీగా ఇన్నింగ్స్ కొనసాగించాడు. అతను డబుల్ సెంచరీ చేయడం ఖాయమనిపించింది. కానీ ఏడు పరుగుల దూరంలో.. లైయన్‌కు రిటర్న్ క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. విదేశాల్లో పుజారాకిది అత్యధిక స్కోరు.

భారత్ తొలి ఇన్నింగ్స్: మయాంక్ (సి) స్టార్క్ (బి) లైయన్ 77; రాహుల్ (సి) షాన్ మార్ష్ (బి) హేజిల్‌వుడ్ 9; పుజారా (సి) అండ్ (బి) లైయన్ 193; కోహ్లి (సి) పైన్ (బి) హేజిల్‌వుడ్ 23; రహానె (సి) పైన్ (బి) స్టార్క్ 18; విహారి (సి) లబుషేన్ (బి) లైయన్ 42; పంత్ నాటౌట్ 159; జడేజా (బి) లైయన్ 81; ఎక్స్‌ట్రాలు 20 **మొత్తం: (167.2 ఓవర్లలో) 622/7 డిక్లేర్డ్**
వికెట్ల పతనం: 1-10, 2-126, 3-180, 4-228, 5-329, 6-418, 7-622
బౌలింగ్: స్టార్క్ 26-0-123-1; హేజిల్‌వుడ్ 35-11-105-2; కమిన్స్ 28-5-101-0; లైయన్ 57.2-8-178-4; లబుషేన్ 16-0-76-0; హెడ్ 4-0-20-0; ఖవాజా 1-0-4-0
ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: హారిస్ బ్యాటింగ్ 19; ఖవాజా బ్యాటింగ్ 5; **మొత్తం:** (10 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా) **24; బౌలింగ్:** షమి 3-0-9-0; బుమ్రా 3-0-12-0; జడేజా 2-1-1-0; కుల్‌దీప్ యాదవ్ 2-1-2-0



పంత్‌పై పాట!

సిడ్నీ: రిషబ్ పంత్ పేరు ఆస్ట్రేలియాలో మార్మోగుతోంది. శుక్రవారం సిడ్నీ మైదానంలో కంగారూల బౌలింగ్‌తో ఓ ఆటాడుకున్న ఈ యువ బ్యాట్స్‌మన్‌పై భారత అభిమానులు ఏకంగా ఓ కవితనే రాశారు "మాకో పంత్ ఉన్నాడు. పేరేమో రిషబ్ పంత్. సిక్సులు కొడతాడు. మీ పిల్లల్ని చూసుకుంటాడు" అంటూ ఇంగ్లిషులో సాగే ఓ కవితను స్టేడియంలోని భారత ఆర్మీ సభ్యులు ఆనందంతో పాడారు. మెల్‌బోర్న్ టెస్టులో ఆస్ట్రేలియా కెప్టెన్ పైన్, పంత్ మధ్య వాగ్వాదం జరిగిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో "నేను నా భార్యతో సినిమాకి వెళితే మా పిల్లల్ని చూసుకుంటావా" అని పైన్ అడగడం.. టెస్టు ముగిశాక పైన్ భార్యా పిల్లలతో పంత్ ఫొటో దిగడం చర్చనీయాంశమైంది.

పుజారాకు 'ఎ+'?

దిల్లీ: ఆస్ట్రేలియాతో టెస్టు సిరీస్‌లో అద్భుత ప్రదర్శన చేసిన చెతేశ్వర్ పుజారాను బీసీసీఐ సముచిత రీతిలో గౌరవించనున్నట్లు సమాచారం. ప్రస్తుతం 'ఎ' కాంట్రాక్టులో ఉన్న పుజారాను.. 'ఎ+'లోకి తీసుకురాబోతున్నట్లు బోర్డు వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం 'ఎ+'లో కెప్టెన్ కోహ్లితో పాటు రోహిత్ శర్మ, జస్‌ప్రీత్ బుమ్రా, భువనేశ్వర్ కుమార్, శిఖర్ ధావన్ మాత్రమే ఉన్నారు. వీరికి రూ.7 కోట్ల చొప్పున వార్షిక వేతనం అందుతోంది. 'ఎ'లోని ఆటగాళ్లు ఏటా రూ.5 కోట్లు అందుకుంటున్నారు. బి, సి విభాగాల ఆటగాళ్లకు వరుసగా రూ.3 కోట్లు, రూ.కోటి చొప్పున జీతం దక్కుతోంది. ప్రస్తుత ఆస్ట్రేలియా సిరీస్‌లో పుజారా 74.42 సగటుతో మూడు శతకాలు సహా 521 పరుగులు సాధించాడు. కేవలం టెస్టుల్లో మాత్రమే ఆడుతున్న చెతేశ్వర్‌కు ఐపీఎల్‌లోనూ అవకాశం రావట్లేదు. అలాంటి ఆటగాడికి బోర్డు తరఫున మరింత ప్రోత్సాహం అవసరమని భావించి 'ఎ+' కాంట్రాక్టు ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది.

తొలిసారి తొడ కొట్టేదెవరో?



రాత్రి 8 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో

ముంబయి: మూడు నెలలుగా భారత క్రీడాభిమానుల్ని అలరిస్తున్న ఉర్రూతలూగించిన ప్రొ కబడ్డీ ఆరో సీజన్ తుది అంకానికి చేరుకుంది. శనివారమే తుది పోరు. టైటిల్ కోసం బెంగళూరు బుల్స్‌తో గుజరాత్ ఫార్చ్యూన్‌జెయింట్స్ తలపడనుంది. ఏ జట్టు గెలిచినా పీకేఎల్ చరిత్రలో కొత్త ఛాంపియన్‌ను చూడబోతున్నట్లే. ఈ రెండు జట్లూ ఇప్పటిదాకా టైటిల్ గెలవలేదు. క్వాలిఫయర్-1 లో గుజరాత్‌ను ఓడించి నేరుగా ఫైనల్ చేరిన బెంగళూరే ఈ మ్యాచ్‌లో ఫేవరేట్‌గా బరిలో దిగుతుంది. రోహిత్ కుమార్ సారథ్యంలోని బెంగళూరు జట్టు పటిష్ఠంగా ఉంది. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు ఆ జట్టు కేవలం మూడు మ్యాచ్‌ల్లోనే ఓడింది. జట్టు స్టార్ రైడర్ పవన్ కుమార్ సెరావత్ (260 పాయింట్లు) అద్భుత ఫామ్‌లో ఉన్నాడు. ఈ సీజన్‌లో అత్యధిక పాయింట్లు సాధించిన రైడర్ల జాబితాలో అతడిదే అగ్రస్థానం. కెప్టెన్ రోహిత్ కుమార్ (170) కూడా గొప్పగా ఆడుతున్నాడు. మరోవైపు గుజరాత్ ఆశలన్నీ ఆ జట్టు రైడర్ సచిన్ తన్వార్ (194) పైనే ఉన్నాయి. తుది పోరులోనూ అతను చెలరేగాలని గుజరాత్ కోరుకుంటోంది.

భారత్‌తో వన్డేలకు ఇదేం జట్టో?

సిడ్నీ: తమ దేశ క్రికెట్ చరిత్రలోనే తొలిసారిగా భారత్‌కు టెస్టు సిరీస్ కోల్పోయే ప్రమాదంలో పడ్డ ఆస్ట్రేలియా.. ఈ సిరీస్ తర్వాత జరిగే మూడు వన్డేల పోరుకు పూర్తి స్థాయి జట్టును ప్రకటించలేదు. ప్రధాన బౌలర్లయిన మిచెల్ స్టార్క్, పాట్ కమిన్స్, జోష్ హేజిల్‌వుడ్ లేకుండానే జట్టును ఎంపిక చేశారు. త్వరలో శ్రీలంకతో జరగబోయే టెస్టు సిరీస్ కోసం ఈ ముగ్గురినీ పక్కన పెట్టినట్లు సమాచారం. చివరగా 2010లో వన్డేలాడిన సీనియర్ పేసర్ పీటర్ సిడిల్‌ను వన్డే సిరీస్‌కు ఎంపిక చేయడం ఆశ్చర్యకరం. టెస్టు ఆటగాళ్లయిన ఉస్మాన్ ఖవాజా, నేథన్ లైయన్‌లకు కూడా సెలక్టర్లు అవకాశమిచ్చారు. విధ్వంసక ఆటగాడు క్రిస్ లిన్‌తో పాటు ట్రావిస్ హెడ్, డార్సీ షార్ట్‌లపై వేటు వేశారు. ఫించ్ నాయకత్వంలో 14 మందితో కూడిన జట్టును సెలక్టర్లు శుక్రవారం ప్రకటించారు.

జట్టు: ఫించ్ (కెప్టెన్), ఖవాజా, షాన్ మార్ష్, హాండ్స్‌కాంబ్, మాక్స్‌వెల్, స్టాయినిస్, మిచెల్ మార్ష్, అలెక్స్ కేరీ (వికెట్ కీపర్), జే రిచర్డ్సన్, స్టాన్‌లేక్, బెరెన్‌డార్ఫ్, సిడిల్, లైయన్, జంపా.

అర్థరహితం

ఆస్ట్రేలియా జట్టు ఎంపికపై వార్న్



సిడ్నీ: భారత్‌తో వన్డే సిరీస్‌కు ఆస్ట్రేలియా జట్టు ఎంపిక అర్థరహితంగా ఉందని దిగ్గజ స్పిన్నర్ షేన్ వార్న్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాడు. "ఆస్ట్రేలియా వన్డే జట్టును చూశా. కొందరిని పక్కన పెట్టడం, కొందరిని జట్టులోకి తేవడం ఎంతమాత్రం సహేతుకంగా లేదు. ఆస్ట్రేలియా క్రికెట్లో ఇలాంటి హాస్యాస్పద సెలక్షన్ కచ్చితంగా ఆగాలి. జట్టు నుంచి షార్ట్‌ను తప్పించడం నమ్మశక్యంగా అనిపించడం లేదు. అతనేం తప్పు చేశాడో అర్థం కావడం లేదు. టాప్ ఆర్డర్లో బ్యాటింగ్ చేయగలడు. బౌలింగ్‌కూ ఉపయోగపడతాడు. అతను మంచి ఫామ్‌లో కూడా ఉన్నాడు. ఓపెనింగ్‌లో ఫించ్‌తో కలిసి అతను మంచి ఆరంభాలివ్వగలడు. మీకు ఆసక్తి ఉన్న ఆటగాళ్లను ఎంపిక చేస్తే సరిపోతుందా? ఇంగ్లాండ్‌లో ప్రపంచకప్‌ను దృష్టిలో ఉంచుకుని కూడా ఆటగాళ్ల ఎంపిక ఉండాలి" అని వార్న్ అన్నాడు.

నజరానా ఇప్పించండి



దిల్లీ: గతేడాది యూత్ ఒలింపిక్స్‌లో స్వర్ణం గెలిచిన తర్వాత హరియాణా ప్రభుత్వం తనకు ప్రకటించిన రూ.2 కోట్ల నజరానాను త్వరగా ఇవ్వాలని టీనేజ్ షూటింగ్ సంచలనం మను బాకర్ కోరింది. ఈ మేరకు ఆమె హరియాణా క్రీడల మంత్రి అనిల్ విజ్ తనను ఉద్దేశించి చేసిన ట్వీట్లను స్క్రీన్ షాట్లుగా పెట్టింది. "యూత్ ఒలింపిక్స్‌లో గెలిచిన తర్వాత హరియాణా క్రీడల మంత్రి అనిల్ విజ్ రూ.2 కోట్లు నజరానా ప్రకటించారు. ఈ హామీ నిజమేనా.. స్పష్టత ఇవ్వండి" అని మను ట్వీట్ చేసింది.

డుప్లెసిస్ సెంచరీ

దక్షిణాఫ్రికాకు భారీ ఆధిక్యం



డుప్లెసిస్ (103)

కేప్‌టౌన్: పాకిస్థాన్‌తో తొలి టెస్టులో గెలిచిన దక్షిణాఫ్రికా.. రెండో టెస్టుపైనా పట్టు బిగిస్తోంది. తొలి రోజు పాక్‌ను 177 పరుగులకే కుప్పకూల్చిన దక్షిణాఫ్రికా.. రెండో రోజు ఆట ఆఖరుకు తొలి ఇన్నింగ్స్‌లో 6 వికెట్ల నష్టానికి 382 పరుగులు చేసింది. 123/2తో శుక్రవారం బ్యాటింగ్ కొనసాగించిన దక్షిణాఫ్రికా.. కాసేపటికే ఆమ్లా (24), డిబ్రుయిన్ (13)ల వికెట్లు కోల్పోయింది. ఐతే కెప్టెన్ డు ప్లెసిస్ (103; 226 బంతుల్లో 13×4)తో పాటు బవుమా (75), డికాక్ (55 బ్యాటింగ్) కూడా సత్తా చాటడంతో తిరుగులేని స్థితికి చేరుకుంది. దక్షిణాఫ్రికా ఇప్పటికే 205 పరుగుల ఆధిక్యంలో ఉంది.

అవధె వారియర్స్ జోరు

● అహ్మదాబాద్‌పై విజయం
● ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్

అహ్మదాబాద్: ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్ నాలుగో సీజన్‌లో అవధె వారియర్స్ మూడో విజయాన్ని ఖాతాలో వేసుకుంది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో అవధె 6- మైనస్ 1 తేడాతో అహ్మదాబాద్ స్మాష్ మాస్టర్స్‌ను దాని సొంతగడ్డపై చిత్తుచేసింది. అవధె ట్రంప్ మ్యాచ్‌గా ఎన్నుకొన్న మహిళల సింగిల్స్ మ్యాచ్‌లో బీవెన్ 10-15, 15-11, 15-11తో గిల్మోర్‌పై గెలిచి జట్టుకు శుభారంభం అందించింది. తర్వాత జరిగిన పురుషుల డబుల్స్ మ్యాచ్‌లో యాంగ్ లీ- క్రిస్టియాన్సెన్ జోడీ 15-12, 10-15, 15-6తో నందగోపాల్- సాత్విక్ జంటపై నెగ్గింది. పురుషుల సింగిల్స్ మ్యాచ్‌లో సన్ వాన్ హో 15-7, 8-15, 15-10తో విక్టర్‌పై విజయం సాధించడంతో అవధె విజయం ఖరారైంది. అహ్మదాబాద్ ట్రంప్ మ్యాచ్‌గా ఎంచుకొన్న పురుషుల సింగిల్స్‌లోనూ అవధె విజయం సాధించింది. లీ డాంగ్ 15-8, 15-12తో సౌరభ్ వర్మపై నెగ్గాడు. చివరగా జరిగిన మిక్స్‌డ్ డబుల్స్ మ్యాచ్‌లో క్రిస్టియాన్సెన్- అశ్విని పొన్నప్ప జోడీ 13-15, 15-10, 15-12తో సాత్విక్- సిక్కిరెడ్డి ద్వయంపై గెలిచింది.

పీబీఎల్‌లో ఈనాడు
ముంబయి రాకెట్స్ × చెన్నై స్మాషర్స్ (సాయంత్రం 4 నుంచి)
బెంగళూరు రాప్టర్స్ × నార్త్ ఈస్టర్న్ వారియర్స్ (రాత్రి 7 నుంచి)

దేవ దేవా!

దేవుళ్లకూ ఉన్నివస్త్రాలు!



ఉత్తరాఖండ్: గజగజలాడిస్తున్న చలి ప్రభావం తమ ఆరాధ్య దైవాలపై పడకుండా ఉండాలని ఉత్తరాఖండ్ వాసులు భక్తిభావంతో ఆలయాల్లోని విగ్రహాలకు దుప్పట్లు, ఉన్ని వస్త్రాలు కప్పుతున్నారు.. టోపీలు, చలికోట్లు కూడా పెడుతున్నారు. కొన్ని ఆలయాల్లో మూలవిరాట్ వద్ద హీటర్లు ఉంచుతున్నారు. విపరీతంగా మంచు కురుస్తూ.. ఉష్ణోగ్రతలు 3 డిగ్రీలకు పడిపోయి ఇళ్ల నుంచి బయటకు రాలేని స్థితిలో కూడా ఆలయాలకు వెళ్లి ఇలాంటి ఏర్పాట్లు చేస్తున్నారు. ఖటిమా నగరంలో ఏ ఆలయంలో చూసినా దేవుళ్లకు చలి తగలకుండా చేసిన ఏర్పాట్లు కనిపిస్తున్నాయి. ప్రతిరోజూ ఆలయాన్ని శుద్ధిచేసి, విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం దేవుళ్లు ఆవహిస్తారని ఇక్కడి ప్రజలు బలంగా విశ్వసిస్తుంటారు. "మా దృష్టిలో ఆలయాల్లో ఉన్నవి కేవలం విగ్రహాలు కాదు.. మా ఆరాధ్య దైవాలు. అందుకే చలి తగలకుండా ఇలా చేస్తుంటాం." అని స్థానికులు భక్తిపారవశ్యంతో చెబుతున్నారు.

ఈటీవీ భారత్

మనాలీలో మంచు వేడుక

హిమాచల్‌ప్రదేశ్: ఏటా అంబరాన్నంటేలా నిర్వహించే శీతాకాల సంబరాలు మనాలీలో ప్రారంభమయ్యాయి. దేశంలోనే విఖ్యాతి గాంచిన ఈ వేడుకలకు వివిధ రాష్ట్రాల నుంచే కాకుండా విదేశాల నుంచి కూడా పర్యాటకులు తరలివచ్చారు. వివిధ సంప్రదాయ నృత్యాలతో వేడుకలు నేత్రపర్వంగా సాగుతున్నాయి. చలికాలంలో పూర్తిగా మంచుతో కప్పి ఉండే మనాలీలో శీతాకాల క్రీడలను ప్రోత్సహించేందుకు గాను 1977లో తొలిసారిగా ఈ 'వింటర్ కార్నివాల్'కు శ్రీకారం చుట్టారు. 1999లో ఈ ఉత్సవాలకు రాష్ట్ర ప్రభుత్వం అధికారిక గుర్తింపునివ్వగా, 2011లో జాతీయస్థాయి గుర్తింపు లభించింది.

భలేభలే..



24లోగా చుక్కల భూములకు పరిష్కారం

- సుమోటోగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు
- 7 జిల్లాల్లో ఈ మేరకు ఏర్పాట్లు

ఈనాడు, అమరావతి: చుక్కల భూముల సమస్యలను తనకు తానుగా (సుమోటో) పరిష్కరించాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. వీటిని అనుసరించి ఈ నెల 24లోగా పరిష్కరించాలని రెవెన్యూ శాఖ జిల్లా కలెక్టర్లకు శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. సమస్య ఎక్కువగా ఉన్న రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం, గుంటూరు జిల్లాలకు ఒక సీనియర్ డిప్యూటీ కలెక్టర్‌ను జిల్లా అధికారులకు సహకరించేందుకు పంపించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనిపై ప్రభుత్వం ఓ ప్రకటన జారీ చేసింది. ఇందులో పేర్కొన్న ప్రకారం..

★ ఆర్‌ఓఆర్ చట్టం ప్రకారం 1బి రిజిస్టర్ 2వ కాలంలో నమోదైన పట్టాదారు పేరును సరి చూసుకుని తదనుగుణంగా 1బి రిజిస్టర్ 8వ కాలమ్‌లో కొనుగోలు లేదా వారసత్వం లేదా వంశపారంపర్యం అని నమోదు చేసిన వాటిని నిషిద్ధ జాబితా నుంచి తొలగిస్తారు. 8వ కాలంలో ఏమీ రాయకపోయినా పట్టాదారు భూమిగా పరిగణించి నిషిద్ధ జాబితా నుంచి తప్పిస్తారు. 1954కు ముందు ఇచ్చిన డి-పట్టా, డీకేటీ పట్టా, అసైన్ భూములు అని నమోదు చేసినట్లయితే వాటిని కూడా నిషిద్ధ జాబితా నుంచి తొలగిస్తారు.

★ 1954 తరువాత ప్రభుత్వం ఇచ్చిన భూములు నిషిద్ధ జాబితాలోనే కొనసాగుతాయి. చుక్కల భూముల పరిశీలన పూర్తయిన అనంతరం తుది జాబితాను తహశీల్దార్ కార్యాలయాల్లో ప్రదర్శిస్తారు. అభ్యంతరాలను పరిశీలించి తుది జాబితాను అధికారులు ప్రకటిస్తారు. అనంతరం 22 ఏ1 ఏ నుంచి డి వరకు కొత్త జాబితాలను నేరుగా రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు పంపాలని జిల్లా కలెక్టర్లను ప్రభుత్వం ఆదేశించింది. సెక్షన్ 22ఏ1(ఇ) జాబితాను నేరుగా ప్రభుత్వానికి పంపాలని, దానిని గెజెట్‌లో ప్రచురిస్తారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

1954 రికార్డులే ప్రామాణికంగా..

1906లో దేశవ్యాప్తంగా భూముల సర్వే జరిగింది. ఆ తరువాత 1954లో రీ సర్వే చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు సర్వే జరగలేదు. దీంతో భూమి హక్కులకు సంబంధించి 1954నాటి రెవెన్యూ రికార్డులే ప్రామాణికంగా ఉన్నాయి. 1954లో రీ సర్వే జరిగినప్పుడు రెవెన్యూ రికార్డుల్లో సర్వే నంబర్ల వారీగా ఖాతాదారుల పేర్లు, విస్తీర్ణం నమోదు చేశారు. అయితే యాజమాన్య హక్కుకోరని భూముల వద్ద రికార్డుల్లో చుక్కలు పెట్టారు. వీటిని అప్పటి నుంచి చుక్కల భూములుగా వ్యవహరిస్తున్నారు. 1954 తరువాత ఆ భూములను సాగు చేసుకునే వారికి యాజమాన్య హక్కులు లేవు. వాటిని బదిలీ చేసుకునే, అమ్ముకునే అవకాశం లేదు.

ఆ భూములు ఒకే వర్గానికి చెందేలా ప్రయత్నం

- వైకాపా సీనియర్ నేత బొత్స ఆరోపణ

హైదరాబాద్, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్‌లో 'చుక్కల భూముల వ్యవహారం' తాజా కుంభకోణం అని వైకాపా సీనియర్ నేత బొత్స సత్యనారాయణ ఆరోపించారు. ఈ భూములు ఒకే సామాజిక వర్గానికి చెందేలా చంద్రబాబు ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతంలోను సదావర్తి భూములను కాజేసే ప్రయత్నాలను వైకాపా తీవ్రంగా అడ్డుకుని విజయం సాధించిందన్నారు. అగ్రిగోల్డ్ మొత్తం బాధితుల్లో రూ.20 వేలు డిపాజిట్ చేసిన బాధితులు 80శాతం పైగా ఉన్నారని, వీరికీ డబ్బు చెల్లిస్తే ఆదుకున్నట్లవుతుందని తెలిపారు.

అగ్రిగోల్డ్ ఆస్తుల అమ్మకం ద్వారా సేకరించే నిధులతో నిరుపేద బాధితులను ఆదుకోవచ్చన్నారు. ప్రభుత్వ అవినీతి, అక్రమాలపై అనేక ఆరోపణలు వస్తుండగా వివరణ ఇవ్వడానికి కేబినెట్‌లోని మంత్రులు ఎందుకు ముందుకు రావడం లేదని ప్రశ్నించారు. విశాఖ విమానాశ్రయంలో వైఎస్ జగన్‌పై జరిగిన హత్యాయత్నం కేసును ఎన్ఐఏకి అప్పగించడం శుభపరిణామమని మాజీ పార్లమెంట్ సభ్యుడు మిథున్‌రెడ్డి అన్నారు.



రంగరాయ వైద్య కళాశాల

పూర్వ విద్యార్థుల సంఘం స్వర్ణోత్సవం

- రంగరాయ వైద్య కళాశాలలో ఏర్పాట్లు పూర్తి
- ముఖ్యఅతిథిగా హాజరుకానున్న ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

కాకినాడ(భానుగుడి సెంటర్), న్యూస్‌టుడే: రంగరాయ వైద్య కళాశాల మరో వేడుకకు సిద్ధమైంది. ఇక్కడ అభ్యసించిన వారు రంగరాయ వైద్య కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం(రాంకోసా)గా ఏర్పడి 50 వసంతాలు పూర్తిచేసుకున్న సందర్భంగా స్వర్ణోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేశారు. కళాశాల ప్రాంగణంలో రెండు రోజుల పాటు జరిగే ఈ వేడుకలు శనివారం ప్రారంభం కానున్నాయి. ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ముఖ్యఅతిథిగా విచ్చేయనున్నారు. శనివారం ఉదయం 9.40 నిమిషాలకు రానున్న ఉపరాష్ట్రపతి 11.30 గంటల వరకు కళాశాలలో పలు కార్యక్రమాల్లో పాల్గొంటారని వైద్య కళాశాల ప్రిన్సిపల్ ఆర్.మహాలక్ష్మి తెలిపారు. అనంతరం ప్రత్యేక ఉపన్యాసాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. ఆరోతేదీన సదస్సులు, కళాశాల అభివృద్ధిపై చర్చా గోష్ఠులు, వినోద కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. దేశ విదేశాల నుంచి సుమారు 3,500 మంది వైద్యులు, వైద్య నిపుణులు ఈ కార్యక్రమానికి హాజరు కానున్నారని వివరించారు. రాంకోసా అధ్యక్షుడు డాక్టర్ శేషగిరిరావు ఆధ్వర్యంలో వేడుకలు జరగనున్నాయి. 1958లో వందమంది విద్యార్థులతో ప్రస్థానాన్ని ప్రారంభించిన రంగరాయ వైద్య కళాశాల వేల మందిని వైద్యులుగా తీర్చిదిద్దింది. కళాశాల 60 వసంతాలు పూర్తిచేసుకున్న సందర్భంగా గత ఏడాది అక్టోబరు నుంచి వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వజ్రోత్సవాల్లో భాగంగా మార్చిలో మెడీ ఫెస్ట్, సెప్టెంబరు 5న టీచర్స్ డే నిర్వహిస్తారు. నవంబరు 17న ముగింపు వేడుక జరగనుంది.

చిన్నారులపై ఉపాధ్యాయుడి అకృత్యాలు

- అరెస్టు.. విధుల నుంచి తొలగింపు



ఉపాధ్యాయుడు ప్రతాప్‌కుమార్‌ను నిలదీస్తున్న గ్రామస్థులు

గుర్రంకొండ, న్యూస్‌టుడే: చిత్తూరు జిల్లా గుర్రంకొండ మండలం మర్రిపాడు పంచాయతీ భూమకవారిపల్లెలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడి అకృత్యాలు శుక్రవారం వెలుగులోకి వచ్చాయి. భూమకవారిపల్లెలో ఏకోపాధ్యాయ పాఠశాలలో కె.ప్రతాప్‌కుమార్ (35) నాలుగేళ్లుగా ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఇక్కడ అయిదో తరగతి లోపు పదిమంది చిన్నారులు చదువుకుంటున్నారు. ఈ ఉపాధ్యాయుడు కొంతకాలంగా వారిని వికృతచేష్టలతో లైంగికంగా వేధిస్తున్నా..వారు తల్లిదండ్రులకు చెప్పేందుకు భయపడ్డారు. తాజాగా గురువారం ఒకటో తరగతి చదువుతున్న ఆరేళ్ల చిన్నారి పట్ల అసభ్యంగా వ్యవహరించి లైంగిక వేధింపులకు గురిచేశాడు. దీంతో ఆ బాలిక తీవ్ర ఇబ్బందులకు గురై ఇంటికి వెళ్లాక తల్లిదండ్రులకు విషయం చెప్పింది. శుక్రవారం బాలిక తల్లిదండ్రులు, గ్రామస్థులంతా ఏకమై పాఠశాల వద్దకు చేరుకున్నారు. ఉపాధ్యాయుడిని చితకబాది పోలీసులకు అప్పజెప్పారు. కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు గుర్రంకొండ ఎస్సై నరేష్ చెప్పారు. డీఈఓ పాండురంగస్వామి ఆదేశాల మేరకు అతన్ని విధుల నుంచి తాత్కాలికంగా తొలగించినట్లు ఎంఈఓ సురేంద్రబాబు తెలిపారు. నిందితుడు గతంలోనూ పలుమార్లు చిన్నారులపై వేధింపులకు పాల్పడిన సంఘటనలు ఉన్నాయని గ్రామస్థులు చెబుతున్నారు.

9 మంది డీఎస్పీల బదిలీ

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో 9 మంది డీఎస్పీలను బదిలీ చేస్తూ డీజీపీ ఆర్.పి.ఠాకూర్ శుక్రవారం ఆదేశాలు జారీచేశారు. పోలీసు ఎస్టాబ్లిష్‌మెంట్ బోర్డు సమావేశంలో తీసుకున్న నిర్ణయాల మేరకు ఈ బదిలీలు చేపట్టారు.

ప్రస్తుత, బదిలీ స్థానం వివరాలు

అధికారి	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
కె.రమేష్‌బాబు	డీఎస్పీ, నిరీక్షణ	ఏసీపీ, విజయవాడ ఉత్తర
కె.శ్రీహరిబాబు	డీఎస్పీ, సీఐడీ	ఎస్‌డీపీవో, గురజాల
ఎస్.వి.వి.ప్రసాదరావు	డీఎస్పీ, ఏసీబీ, విజయవాడ రేంజ్	ఎస్‌డీపీవో, అనకాపల్లి
జి.పూర్ణచంద్రరావు	డీఎస్పీ, ఏసీబీ	ఏసీపీ, విశాఖపట్నం తూర్పు
ఏ.శ్రీనివాసరావు	డీఎస్పీ, ఉత్తర, రాజమహేంద్రవరం	ఎస్‌డీపీవో, బాపట్ల
కె.ఎస్.వినోద్‌కుమార్	డీఎస్పీ, ఎస్సీ ఎస్టీ సెల్, కర్నూలు	డీఎస్పీ, తిరుపతి పశ్చిమ
పి.సౌమ్యలత	డీఎస్పీ, గుంటూరు పశ్చిమ	ఎస్‌డీపీవో, పుత్తూరు
పి.ఎన్.బాబు	డీఎస్పీ, రైల్వే, గుంతకల్లు	ఎస్‌డీపీవో, అనంతపురం
ఎం.ఖాసింసాహెబ్	డీఎస్పీ, పీటీసీ, ఒంగోలు	ఎస్‌డీపీవో, గుంతకల్లు

(★ ఏసీపీ– అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్,
★ ఎస్‌డీపీవో– సబ్‌డివిజనల్ పోలీసు అధికారి)

నిమిషం ఆలస్యమైనా అనుమతించరు

- రేపే కానిస్టేబుల్ ఉద్యోగాల ప్రాథమిక రాత పరీక్ష
- రాష్ట్ర వ్యాప్తంగా 704 కేంద్రాలు
- పరీక్ష రాయనున్న 3.92 లక్షల మంది అభ్యర్థులు

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో కానిస్టేబుల్ స్థాయి ఉద్యోగాల భర్తీకి ఆదివారం ప్రాథమిక రాత పరీక్ష జరగనుంది. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ ఏపీ పోలీసు నియామక మండలి ఈ పరీక్ష నిర్వహించనుంది. ఉదయం 9 గంటల నుంచే పరీక్షా కేంద్రాల లోపలికి అనుమతిస్తారు. 10 గంటల తర్వాత ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షకు అనుమతించరు. రాష్ట్ర వ్యాప్తంగా 704 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 200 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. ఐచ్ఛిక విధానంలో ప్రశ్నలు ఉంటాయి. ఎలాంటి నెగిటివ్ మార్కులు ఉండవు. సివిల్, ఏఆర్, ఏపీఎస్పీ విభాగాల్లో కానిస్టేబుల్, జైలు వార్డరు, ఫైర్‌మెన్ పోస్టులకు సంబంధించి మొత్తం 2,723 ఉద్యోగాల భర్తీ కోసం ఈ ప్రాథమిక రాత పరీక్ష నిర్వహిస్తున్నారు. 3.92 లక్షల మంది అభ్యర్థులు ఈ పరీక్ష రాయనున్నారు. అభ్యర్థులంతా హాల్ టిక్కెట్ల వెనుకభాగంలో పొందుపరిచిన నిబంధనలు విధిగా పాటించాలని పోలీసు నియామక మండలి ఛైర్మన్ కుమార్ విశ్వజిత్ సూచించారు.

- హాల్‌టికెట్‌పై అభ్యర్థి ఫొటో, సంతకం తప్పనిసరిగా ఉండాలి.
- పాస్‌పోర్ట్, పాన్‌కార్డు, ఓటర్ ఐడీ, ఆధార్, డ్రైవింగ్ లైసెన్సు వంటి గుర్తింపు కార్డుల్లో ఒకదాన్ని తీసుకెళ్లాలి.
- బయోమెట్రిక్ విధానంలో అభ్యర్థుల హాజరు తీసుకుంటారు.
- ఆంగ్లం, తెలుగు, ఉర్దూ భాషల్లో ప్రశ్నపత్రాలు ఉంటాయి.

ఒక్కో పోస్టుకు 144 మంది పోటీ

ప్రాథమిక రాత పరీక్షలో ఒక్కో పోస్టు కోసం 144 మంది అభ్యర్థులు పోటీపడుతున్నారు. కర్నూలు, శ్రీకాకుళం జిల్లాల్లో పోటీ ఎక్కువగా ఉంది. కానిస్టేబుల్ ఉద్యోగాలకు కనీస విద్యార్హత ఇంటర్మీడియట్ కాగా.. పోటీపడుతున్న వారిలో 2.56 శాతం మంది పీజీ పట్టభద్రులు, 29.75 శాతం మంది డిగ్రీ విద్యార్హత కలిగిన వారు ఉన్నారు.

మద్యం అనర్థాలపై అవగాహన సదస్సులు

- ఇంజినీరింగ్ కళాశాలల్లో ఏర్పాటు
- ఆబ్కారీ శాఖ చర్యలు

ఈనాడు డిజిటల్, గుంటూరు: మద్యం తాగడం వల్ల కలిగే అనర్థాలు తెలియజేసేందుకు ఇంజినీరింగ్ విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహించాలని ఆబ్కారీ శాఖ నిర్ణయించింది. రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో విద్యార్థులు మద్యం తాగి కళాశాలలకు హాజరవుతున్న ఘటనలు వెలుగుచూడటంతో ఈ కార్యక్రమానికి పూనుకొంది. మద్యానికి బానిసైతే భవిష్యత్తు ఎలా నాశనమవుతుందో తెలిసేలా అవగాహన సదస్సులు చేపట్టాలని జిల్లా యంత్రాంగాలకు సూచించింది. ఈ నేపథ్యంలో ఇంజినీరింగ్, డిగ్రీ, పీజీ కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు గుంటూరు జిల్లా విభాగం సమాయత్తమైంది. 'మత్తు పదార్థాలకు బానిసవ్వడం వల్ల కలిగే అనర్థాలు' పేరిట దీన్ని నిర్వహించనున్నారు. అలానే జిల్లావ్యాప్తంగా ఉన్న మద్యం దుకాణాల్లో 18ఏళ్ల లోపు వయస్సు వారికి సరకు విక్రయించకుండా పకడ్బందీగా చర్యలు తీసుకుంటారు. గొలుసు దుకాణాలను కట్టడి చేసేందుకు నిత్యం తనిఖీలు చేపట్టాలని నిర్ణయించారు.

సదస్సుల నిర్వహణ ఇలా.... జనవరి రెండో వారం నుంచి ఎంపిక చేసిన ఇంజినీరింగ్ కళాశాలల్లో సాయంత్రం 3 నుంచి 5 గంటలలోపు విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తారు.

- దీనివల్ల విద్యార్థుల్లో మార్పు తీసుకువచ్చి మద్యానికి దూరంగా ఉంచాలన్నదే ఆబ్కారీ శాఖ ప్రయత్నమని సహాయ కమిషనర్ కె.శ్రీనివాస్ తెలిపారు.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications; a division of Ushodaya Enterprises Private Limited and Printed at EENADU Press, Gudavalli Village & Panchayat, Vijayawada Rural Mandal, Krishna District, A.P and EENADU Press, Patamatalanka, Vijayawada AND Published at EENADU Press, Patamatalanka, Vijayawada-520 010. Phones: 2494900 (4 Lines), Fax-2470000. Regd. No. VJ/013/2018-20 RNI No. 32238/78. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10-00

ఐదేళ్ల కిందట ఐపీఎల్‌లో ముంబయి ఇండియన్స్ జట్టు ఒక కొత్త బౌలర్‌ను జట్టులోకి తీసుకుంది. తుది జట్టులో ఆడించింది. తక్కువ రనప్‌తో వచ్చి.. బౌలింగ్ క్రీజు దగ్గర కొంచెం నెమ్మదించి.. చేతిని పూర్తిగా తిప్పకుండా.. చిత్రమైన కోణంలో పెట్టి బంతి విడుదల చేస్తుంటే చూడ్డానికే ఏదోలా అనిపించింది అందరికీ!

అతడి బౌలింగ్ యాక్షన్ చూసి.. వీడేం బౌలర్రా బాబూ అనుకున్నారు అందరూ! ఇప్పుడు కూడా ఆ కుర్రాడి గురించి.. ఇలాగే అనుకుంటున్నారు.. వీడేం బౌలర్రా అని!

కానీ ఇప్పుడు ఆశ్చర్యపోతున్నది అతడి నిలకడ చూసి.. అతడి ఎదుగుదల చూసి.. అతడి ఫిట్‌నెస్ చూసి... అతడి బౌలింగ్‌లో పదును చూసి.. అతడి బంతుల్లో వైవిధ్యం చూసి! క్రికెట్ అభిమానుల్ని అంతగా ఆశ్చర్యపరుస్తున్న ఆ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా!



"బుమ్రా తరహా బౌలింగ్ యాక్షన్‌తో ఒక 20 ఏళ్ల ముందు బౌలర్ వస్తే కోచ్‌లు మైదానం లోపలికి కూడా రానిచ్చేవారు కాదేమో. తొలిసారి బుమ్రా బౌలింగ్ చూసినపుడు అతను అంతర్జాతీయ క్రికెట్లో ఎక్కువ కాలం మనలేడనిపించింది. అతను టెస్టులకు పనికి రాడని కూడా అనుకున్నా. కానీ అతను నా అభిప్రాయం తప్పని రుజువు చేశాడు. ఆస్ట్రేలియాలో బుమ్రా బౌలింగ్‌ను ప్రశంసించకుండా ఉండలేం" – కపిల్ దేవ్

వీడేం బౌలరండీ బాబూ!





2018 ఏడాది ఆరంభంలో బుమ్రాను దక్షిణాఫ్రికా టెస్టు సిరీస్‌కు ఎంపిక చేసినపుడు ఒక ప్రముఖ క్రికెట్ రచయిత.. ఇదేం ఎంపిక అన్నాడు. సెలక్టర్ల నిర్ణయం బెడిసికొడుతుందన్నాడు. టెస్టులకు బుమ్రా పనికి రాడన్నట్లే మాట్లాడాడు. ఇప్పుడు అదే రచయిత బుమ్రాను పొగుడుతూ వ్యాసం రాశాడు. ఈ రచయితే కాదు.. చాలామంది మాజీలు సైతం బుమ్రాను తక్కువగా అంచనా వేసిన వాళ్లే. భారత ఫాస్ట్‌బౌలింగ్ దిగ్గజం కపిల్ దేవ్ సైతం బుమ్రా టెస్టుల్లో సత్తా చాటలేడనే అన్నాడు. కానీ ఇప్పుడు ఆయనే.. తన మాట తప్పని బుమ్రా రుజువు చేశాడంటూ అతడిపై ప్రశంసలు కురిపించాడు. ఐదేళ్ల కిందట ఐపీఎల్‌లో బుమ్రా బౌలింగ్ యాక్షన్ చూసిన వాళ్లు.. అసలతను అంతర్జాతీయ క్రికెట్లోకి వస్తాడని కూడా అనుకోలేదు. ఐపీఎల్‌లో జస్‌ప్రీత్ వికెట్లు తీస్తుంటే బౌలింగ్ యాక్షన్ అర్థం కాక తికమక పడి బ్యాట్స్‌మెన్ ఔటైపోతున్నట్లే అనిపించింది తప్ప.. అతడి ప్రతిభపై నమ్మకాలు కలగలేదు. ఈ బౌలింగ్ యాక్షన్‌కు బ్యాట్స్‌మెన్ కాస్త అలవాటు పడితే అతడికి కష్టాలు తప్పవని.. అతనెంతో కాలం నిలవలేడని వ్యాఖ్యానాలు వినిపించాయి. అలాంటి బౌలర్ భారత జట్టులోకి ఎంపికవడమే ఆశ్చర్యం అంటే.. టెస్టుల్లోనూ అవకాశం దక్కించుకోవడం.. జట్టులో ప్రధాన బౌలర్‌గా ఎదగడం.. ఇప్పుడు ప్రపంచ అత్యుత్తమ టెస్టు బౌలర్లలో ఒకడిగా పేరు తెచ్చుకోవడం ఊహకందని విషయమే! ఐతే బుమ్రా ఈ స్థాయికి చేరుకోవడం వెనుక కఠోర శ్రమ ఉంది.

అదే బలం.. అదే బలహీనత!

మిగతా బౌలర్లకు భిన్నమైన బౌలింగ్ శైలే బుమ్రా ప్రధాన బలం! అతను కెరీర్ ఆరంభంలో విజయవంతం కావడానికి, వేగంగా ఎదగడానికి ఉపయోగపడింది చిత్రమైన అతడి బౌలింగ్ యాక్షనే. అతడి బంతుల్ని అర్థం చేసుకోవడం బ్యాట్స్‌మెన్‌కు సవాలుగా మారింది! ఐతే ఇలాంటి యాక్షన్‌తో ఎంతో కాలం ప్రభావవంతంగా బౌలింగ్ చేయడం అంత సులువు కాదు. బ్యాట్స్‌మెన్ బౌలర్‌ను చదివేయడం మొదలుపెట్టాక సత్తా చాటడం కష్టమవుతుంది. ఇక బుమ్రా శైలితో తలెత్తిన పెద్ద సమస్య ఏంటంటే.. ఇలాంటి యాక్షన్ కొనసాగిస్తే అతను గాయాల పాలవడానికి ఎక్కువ ఆస్కారముందని కోచ్‌లు, ఫిజియోలు తేల్చారు. ఫాస్ట్‌బౌలర్లకు మామూలుగానే గాయాల పాలవడానికి ఆస్కారం ఎక్కువ. బుమ్రాకు ఆ ప్రమాదం మరింత ఎక్కువని తేలింది. అయినప్పటికీ అతనేమీ యాక్షన్ మార్చుకోలేదు. శరీరాన్ని మరింత దృఢంగా మార్చుకోవడం ద్వారా ఈ సమస్యను అధిగమించాలనుకున్నాడు. తిరుగులేని ఫిట్‌నెస్ స్థాయిని అందుకున్నాడు. ఇక బౌలింగ్ విషయంలోనూ అతను మెరుగులు దిద్దుకున్న తీరు ప్రశంసనీయం. త్వరగా నేర్చుకునే, తప్పుల్ని దిద్దుకునే తత్వం అతడి ఎదుగుదలకు దోహదం చేసింది. దక్షిణాఫ్రికాలో ఆడిన తొలి టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో అతను అంత మంచి ప్రదర్శనేమీ చేయలేదు. కానీ రెండో ఇన్నింగ్స్‌లో బౌలింగ్ మారిపోయింది. బంతుల లెంగ్త్ మార్చాడు. పేస్ పెంచాడు. అక్కడి పరిస్థితులకు త్వరగా అలవాటు పడి అందుకు తగ్గట్లుగా బౌలింగ్ చేశాడు. ఆపై ఇంగ్లాండ్‌లోనూ చక్కగా పరిస్థితుల్ని అన్వయించుకున్నాడు. ఇన్నాళ్ల బుమ్రా మెరుపులు ఒకెత్తయితే.. ప్రస్తుత ఆస్ట్రేలియా సిరీస్‌లో ప్రదర్శన మరో ఎత్తు. ముఖ్యంగా మెల్‌బోర్న్‌లో బుమ్రా విజృంభించిన తీరు చాన్నాళ్ల పాటు క్రికెట్ అభిమానుల మనసుల్లో నిలిచిపోయేదే. ప్రతి బ్యాట్స్‌మన్‌కూ ఒక ప్రణాళిక ప్రకారం బౌలింగ్ చేసి కంగారూల్ని బోల్తా కొట్టించిన వైనం అద్భుతమే. బంతుల్లో, వేగంలో అతను చూపించిన వైవిధ్యం ప్రశంసనీయం. బుమ్రా పడగొట్టిన ఆరు వికెట్లలో దేనికదే ప్రత్యేకం. షాన్ మార్ష్ లాంటి అనుభవజ్ఞుడిని పరిమిత ఓవర్ల క్రికెట్లో మాదిరి స్లో డెలివరీతో బోల్తా కొట్టించిన వైనం చూసి అందరూ విస్తుబోయారు. బుమ్రా తెలివికి ముగ్ధుడైపోయిన వ్యాఖ్యాత మైకేల్ క్లార్క్ అతడిని బౌలింగ్ మేధావిగా అభివర్ణించాడు. ఇంగ్లాండ్‌లో ఒక స్వింగ్ బంతితో ప్రత్యర్థి ఓపెనర్ జెన్నింగ్స్‌ను ఔట్ చేసిన తీరు కూడా దిగ్గజాలను ఆశ్చర్యపరిచింది.

బౌలరేంటి.. ఈ బాడీ ఏంటి?

బాక్సర్లు, వెయిట్‌లిఫ్టర్లలాగా క్రికెటర్లు కూడా బాడీలు పెంచడం.. సిక్స్ ప్యాక్‌లతో కనిపించడం గత కొన్నేళ్ల నుంచే చూస్తున్నాం. కానీ అలా కండలు తిరిగిన శరీరంతో కనిపించే వాళ్లలో ఎక్కువగా బ్యాట్స్‌మెన్‌నే చూస్తుంటాం. భారత జట్టు విషయానికి వస్తే.. విరాట్ కోహ్లి సిక్స్ ప్యాక్ బాడీతో దర్శనమిస్తుంటాడు. కేఎల్ రాహుల్, హార్దిక్ పాండ్య లాంటి ఆటగాళ్లు కూడా దేహ దారుఢ్యంపై ప్రత్యేక దృష్టిసారించిన వాళ్లే. ఐతే బౌలర్లలో వీరిలాంటి శరీరాకృతి ఉన్నది బుమ్రాకు మాత్రమే. తన కెప్టెన్‌నే స్ఫూర్తిగా తీసుకుని ఫిట్‌నెస్ దీక్ష పట్టాడతను. ఇటీవలే సిక్స్ ప్యాక్ సాధించి.. సెల్ఫీ దిగి ఒక ఫొటో పెట్టాడతను. ఆ ఫొటోలో బుమ్రా శరీరాకృతి చూసి అందరూ ఆశ్చర్యపోయారు. ఒక బౌలర్ ఇలాంటి బాడీతో కనిపించడం అరుదైన విషయమే. బుమ్రా బౌలింగ్ యాక్షన్ చాలా ప్రమాదకరమని.. అతడికి గాయాలయ్యేందుకు ఆస్కారం ఎక్కువ అని స్పష్టం చేయడంతో.. మామూలు ఫిట్‌నెస్‌తో తాను నిలకడగా బౌలింగ్ చేయడం కష్టమని భావించాడు బుమ్రా. కోహ్లి లాగా ఫిట్‌నెస్‌లో తిరుగులేని స్థాయిని అందుకుంటే తప్ప తాను అత్యుత్తమంగా రాణించలేననుకున్నాడు. ఇంగ్లాండ్‌లో గాయం కారణంగా రెండు టెస్టులకు దూరం కావాల్సి రావడంతో అతను మరింత అప్రమత్తం అయ్యాడు. పట్టుబట్టి సిక్స్ ప్యాక్ సాధించాడు. బుమ్రా ఫిట్‌నెస్ స్థాయిని చూసి కోహ్లినే ఆశ్చర్యపోయాడు. అతడి పట్టుదలను ప్రశంసించాడు.



"బుమ్రా గొప్ప ఆటగాడు. అతడిపై అంచనాల ఒత్తిడి కనిపించట్లేదు. ప్రతి రోజూ నేర్చుకోవడానికి సిద్ధంగా కనిపిస్తున్నాడు. అతను అతి త్వరలో ప్రపంచ అత్యుత్తమ బౌలర్ అవుతాడు. మూడు ఫార్మాట్లలోనూ నంబర్‌వన్ బౌలర్‌గా నిలుస్తాడు" - మైకేల్ క్లార్క్



"మిగతా పేసర్లతో పోలిస్తే బుమ్రా చాలా భిన్నం. అతడిని చూస్తే మా శకంలో జెఫ్ థామ్సన్ గుర్తుకొస్తున్నాడు. బౌలింగ్ యాక్షన్, టెక్నిక్ విషయంలో ఉండే నిబంధనల్ని దాటి వీళ్లిద్దరి బౌలింగ్ ఉంటుంది" - డెన్నిస్ లిల్లీ



"నిజాయితీగా చెప్పాలంటే.. నేనైతే బుమ్రాను ఎదుర్కోవడానికి ఇష్టపడను. లయ దొరకబుచ్చుకున్నాడంటే అతడిని ఎదుర్కోవడం చాలా కష్టం" - విరాట్ కోహ్లి



"బుమ్రా లాంటి బౌలర్‌ను ఎదుర్కోవడం ఏ బ్యాట్స్‌మన్‌కైనా పీడకలే" - బ్రాడ్ హాడ్జ్

ఒక భారత ఫాస్ట్‌బౌలర్‌ను చూసి ప్రత్యర్థి బ్యాట్స్‌మెన్ వణికిపోవడం, అతడిని ఎదుర్కోవడానికి ఉక్కిరిబిక్కిరి కావడం, విదేశీయులు సైతం మనోడిని ప్రపంచ అత్యుత్తమ ఫాస్ట్‌బౌలర్ అని కితాబివ్వడం.. బుమ్రా విషయంలోనే జరుగుతోంది. అతను ఇదే నిలకడ కొన్నేళ్ల పాటు కొనసాగించగలిగితే.. ప్రపంచ అత్యుత్తమ ఫాస్ట్‌బౌలర్‌గా నిలవడం, భారత క్రికెట్ చరిత్రలో తనకంటూ ఒక ప్రత్యేక అధ్యాయాన్ని లిఖించుకోవడం ఖాయం.

కేక పెట్టించిన కూతగాళ్లు!

కూతకు వచ్చిన ఆటగాడిని తెలివిగా పట్టేయడమే ఒకరికి తెలుసు.. పొలాల్లో కలుపు తీయడం గురించి ఇంకొకరికి బాగా తెలుసు..! కొన్నేళ్ల ముందు వరకు వాళ్లిద్దరికి అదే పని..! కానీ రూటుమార్చిన ఈ ఇద్దరూ ప్రొకబడ్డీలో ప్రత్యర్థి ఆటగాళ్లను కూత పెట్టించారు. అర్ధసెంచరీ, సెంచరీ, డబుల్ సెంచరీ.. ఇలా కబడ్డీ కోర్టులో రికార్డు పాయింట్లతో హోరెత్తించారు. బెంగళూరు బుల్స్ సూపర్ రెయిడర్ పవన్ కుమార్ షెరావత్, యు ముంబా సంచలనం సిద్దార్థ్ దేశాయ్‌ల గురించే ఇదంతా! మరి ప్రొకబడ్డీ కొత్త తారల గురించి తెలుసుకుందామా..!

అరంగేట్రంలోనే..

సిద్దార్థ్ దేశాయ్.. ఈ ఏడాది ప్రొకబడ్డీ ఆరంభానికి ముందు ఈ పేరు తెలిసిన వారి సంఖ్య చాలా తక్కువ. కానీ.. ఇప్పుడు పేరు మాత్రమే కాదు.. అతడి రూపం కోట్లాది మందికి పరిచయమే. ప్రొకబడ్డీలో అత్యంత వేగంగా 50 రెయిడ్ పాయింట్లు సాధించిన ఆటగాడిగా, అత్యంత వేగంగా 100 పాయింట్లు అందుకున్న రెండో రెయిడర్‌గా, ఒకే సీజన్‌లో 200 పాయింట్లు సాధించిన తొలి ప్లేయర్‌గా అసాధారణ రికార్డులను కొల్లగొట్టాడు సిద్దార్థ్. అరంగేట్ర లీగ్‌లోనే అతడిలా చెలరేగడం ఆశ్చర్యపరిచే అంశం. నాలుగేళ్ల కిందట కబడ్డీని కెరీర్‌గా ఎంచుకుని.. అప్పుడే పెద్ద జట్లను వణికించే స్థాయికి చేరుకున్నాడు దేశాయ్. అతడి పుణ్యమా అని గత రెండేళ్లు పరాజయాలతో ఎదురీదిన యు ముంబా ఈసారి ప్లేఆఫ్స్ వరకు చేరుకుంది. ఐతే.. తండ్రికి సాయంగా పొలం పని చేసుకునే సిద్దార్థ్ కబడ్డీ స్టార్‌గా ఎదగడానికి మధ్య చాలా కథనే ఉంది. మహారాష్ట్రలోని కొల్హాపూర్ జిల్లాలో పులెవాడి గ్రామంలో పుట్టిన సిద్దార్థ్‌కు చిన్నప్పటి నుంచే కబడ్డీ తెలుసు. ఆ ఊరిలో కబడ్డీ సంప్రదాయ క్రీడ. ఐతే పూర్తిగా దానిపై దృష్టిసారించింది మాత్రం ప్రొకబడ్డీ ఆరంభం తర్వాతే. క్రికెటర్లలానే కబడ్డీ ఆటగాళ్లు కూడా సెలబ్రిటీలుగా మారుతుండటంతో.. అతడు కబడ్డీని కెరీర్‌గా చేసుకున్నాడు. అప్పటివరకు వ్యవసాయంలో కలుపు ఏరడంలో తండ్రికి తోడ్పడిన అతడు.. కోర్టులో ఆటగాళ్ల పనిపట్టడం ఆరంభించాడు. మహారాష్ట్రలో వివిధ క్లబ్‌ల తరపున సత్తా చాటి.. ఆ తర్వాత నేషనల్స్‌లో రాణించి లీగ్‌లో ముంబా జట్టుకు ఎంపికయ్యాడు సిద్దార్థ్. 6.2 అడుగుల ఎత్తుండే అతడు తన పొడవైన చేతులతో... కోర్టుకు రెండు వైపులా అనూహ్యంగా దాడులకు దిగుతూ ప్రత్యర్థి జట్టును దెబ్బతీయడంలో నేర్పరి. 150 పాయింట్లు సాధించాలన్న లక్ష్యంతో లీగ్‌లో ప్రవేశించిన అతడు ఏకంగా 221 పాయింట్లు కొల్లగొట్టాడు. ఇక భారత కబడ్డీ జట్టులో చోటు సంపాదించడమే తన లక్ష్యమని అంటున్నాడు దేశాయ్. తన ప్రదర్శనతో ఆకట్టుకున్న అతడికి భారత జట్టులో చోటు లాంఛనమే. మరి అక్కడ ఎలాంటి సంచలనాలు సృష్టిస్తాడో చూడాలి!



అనుకోకుండా రెయిడర్‌గా మారి..

క్రికెట్లో బ్యాట్స్‌మన్, బౌలర్‌లానే.. కబడ్డీలో డిఫెండర్, రైడర్! మరి బౌలర్ రూట్ మార్చి.. అద్భుత బ్యాట్స్‌మన్‌గా అవతరిస్తే..! అలాంటి అసాధారణ ఘనతే సాధించాడు పవన్ కుమార్ షెరావత్. పన్నెండేళ్ల వయసులో కబడ్డీ పట్ల ఆకర్షితుడైన పవన్ ఆరంభం నుంచి డిఫెండర్‌గానే అందరికీ తెలుసు. ప్రొకబడ్డీలో అతడి అరంగేట్రం కూడా అలానే జరిగింది. 2016లో బెంగళూరు బుల్స్ తరపున లీగ్‌లో ప్రవేశించాడు. తన తొలి సీజన్‌లో అదరగొట్టినా.. ఆ తర్వాతి సీజన్‌లో విఫలమవడంతో బెంగళూరు వద్దనుకుంది. అప్పుడు వదులుకున్న అదే జట్టు ఈసారి పవన్ కోసం ఏకంగా రూ. 52.8 లక్షలు ఖర్చు చేసింది. అంతలా ఎందుకంటే.. రెండేళ్ల ముందు వరకు డిఫెండర్‌గా ఉన్న పవన్ అనూహ్యంగా రెయాడర్‌గా మారి అసాధారణ ప్రదర్శన చేస్తుండటమే. దిల్లీలో రైతు కుటుంబంలో జన్మించిన పవన్ స్కూల్లో పరిచయమైన కబడ్డీపై ఆసక్తి పెంచుకున్నాడు. చదువులో మార్కులు తగ్గుతున్నా.. ఆటలో పాయింట్లు పెంచుకుంటూ పోయాడు. కళాశాల, యూనివర్సిటీ స్థాయి కబడ్డీలో విశేషంగా రాణించి లీగ్‌లో ప్రవేశించాడు. ఐతే రెండు సీజన్‌ల తర్వాత అతడి ఆట గాడి తప్పింది. అదే సమయంలో రైల్వేలో ఉద్యోగం లభించడం.. సీనియర్ నేషనల్స్‌లో రైల్వేస్ జట్టుకు మారడం అతడి రాతను మార్చింది. రెండేళ్ల ముందు వరకు డిఫెండర్‌గా ఉన్న పవన్.. రైల్వేస్ కోచ్ సూచనతో రైడర్‌గా మారాడు. అప్పటి నుంచి అతడికి ఎదురులేకుండా పోయింది. నేషనల్స్‌లో అతడి ప్రదర్శనను గుర్తించిన బెంగళూరు.. అతడి కోసం అరకోటి ఖర్చు చేసింది. జట్టు ఆశలు వమ్ము చేయని అతడు.. తొలి మ్యాచ్‌లోనే 20 పాయింట్లతో అదరగొట్టాడు. ఆ జోరును సీజన్ మొత్తం కొనసాగించి.. జట్టును ఒంటిచేత్తో ఫైనల్ చేర్చాడు. మొత్తం 260 పాయింట్లతో ప్రస్తుతం సీజన్‌లో అతడే టాప్‌స్కోరర్. హ్యాండ్, టో టచ్‌లతో పాటు కప్పలా గెంతుతూ ప్రత్యర్థి కోర్టు నుంచి వెనక్కి దూసుకొచ్చే విన్యాసాలతో అతడు ప్రత్యేకత చాటాడు. జట్టులో రోహిత్ కుమార్, కాశీలింగ్ అడెకె లాంటి సీనియర్లను వెనక్కినెట్టి స్టార్‌గా ఎదిగిన ఈ 21 ఏళ్ల కుర్రాడి లక్ష్యం ఇప్పుడు భారత జట్టులో చోటు సంపాదించడంతో పాటు.. దేశానికి ప్రపంచకప్‌ను అందించడమే.



దూసుకొస్తున్న జూ షుమీ

ఐదేళ్లయిపోయింది రేసింగ్ దిగ్గజం షుమాకర్ అచేతనావస్థకు వెళ్లిపోయి! అతణ్ని ఎంతగానో ప్రేమించిన కుటుంబానికి, అతడి జైత్రయాత్రను ఆస్వాదించిన అభిమానులకు ఎంతో వేదన. కానీ ఇప్పుడో శుభవార్త. తల్లడిల్లిన హృదయాలకు సాంత్వన చేకూర్చేందుకు వస్తున్నాడు షుమీ వారసుడు. ఫార్ములావన్ చరిత్రలోనే అత్యుత్తమ డ్రైవర్‌గా శిఖరాన్ని అందుకున్న నాన్నను అందుకునేందుకు దూసుకెళ్తున్నాడు. పేరు మిక్ షుమాకర్!



రేసింగ్ చాలా ప్రమాదకరమైన ఆట. కానీ వేగం అతడి రక్తంలోనే ఉంది. అందుకేనేమో.. ఏడుసార్లు ఫార్ములావన్ ప్రపంచ ఛాంపియన్ అయిన తండ్రి బాటలోనే పరుగులుపెట్టాలని నిర్ణయించుకున్నాడు మిక్ షుమాకర్. ఆరంభం చూస్తే తండ్రికి తగ్గ తనయుడిలానే కనిపిస్తున్నాడు. నిరుడు యూరోపియన్ ఫార్ములా-3 టైటిల్ గెలిచి సత్తా చాటిన అతడు ఫార్ములా-2 రేసులకు సిద్ధమవుతున్నాడు. తండ్రి లాగే గొప్ప ఎఫ్1 డ్రైవర్‌గా ఎదగగలిగే సామర్థ్యం ఈ 19 ఏళ్ల కుర్రాడిలో ఉందని రేసింగ్ పండితులు అంటున్నారు. ఫార్ములావన్నే అతడి తదుపరి లక్ష్యం.

తల్లి పేరుతో..

మిక్ తన తొమ్మిదో ఏట కార్టింగ్ (బుల్లి కార్ల రేస్)లో తన రేసింగ్ కెరీర్‌ను ఆరంభించాడు. ఆరంభంలో మిక్ షుమాకర్ పేరు మిక్ బెష్. పక్కన తండ్రి పేరు ఉంటే ఒత్తిడి పెరగడంతో పాటు జనాల దృష్టిలో పడడం వల్ల ఏకాగ్రత చెదురుతుందన్న ఉద్దేశంతో మొదట్లో తన పేరు పక్కన తల్లి ఇంటి పేరును చేర్చుకున్నాడు మిక్. ఈమధ్యే మిక్ షుమాకర్‌గా మారిపోయాడు. ఐతే ఇంటి పేరుతో సంబంధం లేకుండా ఇప్పటికే అతడు ప్రశంసలు అందుకుంటున్నాడు. మొదటిసారి 2015లో ఎఫ్4 రేసింగ్‌లో అడుగుపెట్టిన మిక్ తొలిసారి తన అసలు ఇంటి పేరు (షుమాకర్)తో బరిలోకి దిగాడు. అప్పుడు కేవలం రెండు రేసులే గెలిచిన మిక్, మొత్తంగా పదో స్థానం సాధించాడు. ఐతే షుమాకర్ కొడుకుగా అందరి దృష్టిలో పడ్డాడు. మైకేల్‌కు మేనేజర్‌గా పనిచేసిన సబీన్ ఖేమ్ తర్వాత జూనియర్ బాధ్యతలనూ అందుకున్నాడు. క్రమంగా జోరు పెంచిన మిక్ 2016లో జర్మన్, ఇటాలియన్ ఎఫ్4 ఛాంపియన్‌షిప్‌లలో రెండో స్థానంలో సాధించాడు.



చిన్నప్పుడు నాన్నతో..

భలే పుంజుకున్నాడు..

మిక్ కారణంగా గత ఏడాది యూరోపియన్ ఎఫ్3 సీజన్‌పై మీడియా ఆసక్తి విపరీతంగా పెరిగింది. ఐతే ఆరంభంలో మిక్ పెద్దగా రాణించలేకపోయినా.. ద్వితీయార్ధంలో అదరగొట్టాడు. వరుసగా ఐదు టైటిళ్లు గెలిచాడు. మెర్సిడెజ్‌కు చెందిన ప్రెమా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న అతడు చివరికి మరో రేసు మిగిలి ఉండగానే ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నాడు. 28 ఏళ్ల కింద మైకేల్ షుమాకర్ ఎఫ్3 గెలవడం ద్వారానే ఎఫ్1లో అడుగుపెట్టాడు. ఎఫ్-3 విజయంతో మిక్.. వచ్చే ఎఫ్1లో పోటీ పడేందుకు 'సూపర్ లైసెన్స్' సంపాదించాడు. కానీ అక్కడ ఎక్కువగా ఖాళీలు లేని నేపథ్యంలో ఈ ఏడాది అతడు ఎఫ్-2లో పోటీ పడే అవకాశముంది. ఎఫ్1 కోసం మెర్సిడజ్, ఫెరారీ సంస్థలు జూనియర్ షుమాకర్‌పై ఆసక్తి ప్రదర్శిస్తున్నాయి.

ఈనాడు సినిమా

జీవితంలో ఏదైనా సహజంగా జరగాల్సిందే



బాలీవుడ్ 'క్వీన్' కంగనా రనౌత్. కథానాయకుల స్థాయిలో బాక్సాఫీసుని ప్రభావితం చేస్తున్న నాయిక ఆమె. బలమైన పాత్రల్లో ఒదిగిపోతూ నటిగానూ సత్తా చాటుతోంది. మూడు జాతీయ పురస్కారాల్ని సొంతం చేసుకొన్న ఆమె త్వరలోనే 'మణికర్ణిక'తో సందడి చేయబోతున్నారు. విజయేంద్రప్రసాద్ కథతో... క్రిష్, కంగన తెరకెక్కించిన చిత్రమిది. ఈ సందర్భంగా కంగన హైదరాబాద్‌లో 'ఈనాడు సినిమా'తో ప్రత్యేకంగా ముచ్చటించారు. ఆ విషయాలివీ....

చాలా రోజుల తర్వాత హైదరాబాద్‌కి వచ్చారు...

అప్పుడప్పుడు వస్తూనే ఉంటాను. దక్షిణాదితో నాకున్న అనుబంధం చాలా బలమైనది. తెలుగులో పూరి జగన్నాథ్ నాకు మంచి స్నేహితుడు. ప్రభాస్‌తో కలిసి నటించా. అనుష్కతోనూ నాకు మంచి సాన్నిహిత్యం ఉంది. 'మణికర్ణిక' చిత్రానికి తెలుగు చిత్ర పరిశ్రమతో బోలెడంత సంబంధం ఉంది. దర్శకుడు క్రిష్, రచయిత విజయేంద్రప్రసాద్, ఛాయాగ్రాహకుడు జ్ఞానశేఖర్... వీళ్లంతా ఇక్కడి వాళ్లే. ఈ చిత్రాన్ని ఎక్కువ భాగం రామోజీ ఫిలింసిటీలోనే చిత్రీకరించాం.

ఝాన్సీ లక్ష్మీబాయి గురించి ఈ సినిమాకి ముందు మీకు ఎంత తెలుసు?

చిన్నప్పట్నుంచి ఆమె గురించి వింటూనే ఉన్నా. ఈ సినిమా చేశాకే లక్ష్మీబాయి వ్యక్తిగత జీవితం, అందులోని తీవ్రత గురించి పూర్తిగా తెలిసింది. ఝాన్సీ లక్ష్మీబాయి అసలు పేరు మణికర్ణిక అనే విషయం నాకు ఈ సినిమా చేసేటప్పుడే తెలిసింది. ఆమె చాలా శక్తిమంతమైన మహిళ. ఒక బ్రాహ్మణ కుటుంబం నుంచి వచ్చిన ఆమె పోరాటం చేస్తూనే సమాజంలో స్ఫూర్తిని నింపారు. ఆమె జీవితం గురించి ప్రస్తుత సమాజానికి కచ్చితంగా తెలియాల్సిందే అనిపించింది.

'మణికర్ణిక' చేయడానికి అదే కారణమా?

మన కోసం రక్తం ధారబోసిన చాలా మందిని మనం మరచిపోతున్నాం. వాళ్లే నిజమైన హీరోలు. వాళ్ల పోరాటం, స్ఫూర్తి భవిష్యత్ తరాలకీ తెలియాలి. అదే మనం వాళ్లకిచ్చే నిజమైన నివాళి. ఆమె సామాజిక రుగ్మతలపైనా పోరాటం చేశారు.

తొలిసారి ఓ వీర వనితగా నటించారు. అందుకోసం ఎలా సన్నద్ధమయ్యారు?

నేను చేసిన తొలి పీరియాడిక్ సినిమా ఇదే. యాక్షన్ ప్రధానంగా సాగే ఈ జోనర్ సినిమా ఇప్పటిదాకా మన దేశంలో ఎవ్వరూ చేయలేదు. ఒక ప్రత్యేకమైన కాలంలో జరిగే కథలతో ఒక చరిత్రని చెప్పారు, ప్రతీకార గాథల్ని చూపించారు కానీ.. యాక్షన్ ప్రధానంగా సాగే ఇలాంటి కాస్ట్యూమ్ డ్రామాని ఎవ్వరూ చేయలేదు. అదీ ఓ మహిళ నేపథ్యంలో సాగే కథని చేయడం చాలా గర్వంగా ఉంది. ఈ సినిమా చిత్రీకరణకి ముందు కొన్ని నెలల పాటు ప్రత్యేకంగా శిక్షణ తీసుకొన్నా. గుర్రపుస్వారీతో పాటు రెండు చేతులతోనూ కత్తి యుద్ధం చేయడం నేర్చుకొన్నా.

మహిళా ప్రధానమైన కథల్లోనే ఎక్కువగా నటిస్తుంటారు కాబట్టి కంగన స్త్రీ పక్షపాతి అంటుంటారు. నిజమేనా?

మానవ హక్కుల్ని నేను నమ్ముతాను. పురుషులతో పాటు మహిళల్నీ సమానంగా చూడాలంటాను. కానీ ప్రస్తుత సమాజంలో అది కనిపించడం లేదు. మహిళలు వివక్షకి గురవుతూనే ఉన్నారు. ఆ విషయంలోనే నేను హక్కుల గురించి మాట్లాడుతుంటానంతే. నా సినిమాల్లో అది ప్రతిబింబిస్తుందేమో.

మూడు సార్లు జాతీయ పురస్కారాలు అందుకొన్నారు. ఈ 12 ఏళ్ల ప్రయాణాన్ని వెనక్కి తిరిగి చూసుకొంటే ఏమనిపిస్తోంది?

చిన్న పాత్రలతో నా ప్రయాణం మొదలైంది. అదృష్టవశాత్తూ గొప్ప చిత్రాల్లో భాగమయ్యా. ఇదివరకు జాతీయ పురస్కారాలంటే చిన్న చిత్రాలకే వచ్చేవి. నాకు బ్లాక్‌బస్టర్ చిత్రాలతోనే జాతీయ పురస్కారాలు దక్కాయి. అటు కమర్షియల్‌గా, ఇటు నటిగా రాణిస్తున్నందుకు చాలా ఆనందంగా ఉంది.

ఈ చిత్రంతో దర్శకురాలిగా కూడా మారారు...

నేను యాక్సిడెంటల్ డైరెక్టర్‌ని (నవ్వుతూ). అనుకోకుండానే ఆ బాధ్యతలు చేపట్టాల్సి వచ్చింది. 'మణికర్ణిక' కథ వింటున్నప్పుడు వ్యక్తిగతంగా ఒక మహిళగా చాలా స్ఫూర్తి పొందాను. యాదృచ్ఛికమే అయినా ఆ స్ఫూర్తి నేను దర్శకత్వ బాధ్యతల్ని చేపట్టేంత శక్తిని ఇస్తుందనుకోలేదు. క్రిష్ ప్రతిష్ఠాత్మకమైన 'ఎన్టీఆర్' బయోపిక్ చిత్రంతో బిజీ కావడం వల్లనే నేను దర్శకత్వం చేయాల్సివచ్చింది. సినిమాల విడుదలకి సరైన సమయం జనవరి కాబట్టి ఎలాగైనా ఈ చిత్రాన్ని ఈ నెలలోనే ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలనుకొన్నాం. క్రిష్ చేయగా, మిగిలి ఉన్న కొంత భాగాన్ని నేను తెరకెక్కించా. ఈ సినిమా ప్రయాణంలో నాకు బాగా సవాల్ విసిరిన సందర్భాలంటే... పోరాట ఘట్టాలు చేస్తున్నప్పుడు గాయాల పాలు కావడం, దర్శకత్వ బాధ్యతలు చేపట్టాల్సి రావడమే.

ఓ సందర్భంలో మీ ఆఖరి దర్శకుడు క్రిష్ అనీ, ఇకపై పూర్తిస్థాయిలో దర్శకురాలిగా మారబోతున్నాననీ చెప్పారు. ఇప్పుడూ ఆ మాటకే కట్టుబడి ఉన్నారా?

దర్శకురాలిగా మారడం అనేదైతే నిజమే. తదుపరి నేను దర్శకత్వం వహించబోయే చిత్రానికి విజయేంద్రప్రసాద్ కథని సిద్ధం చేస్తున్నారు. ఇకపై దర్శకత్వం చేస్తూనే నటిస్తుంటా.

బాలీవుడ్ కథానాయికలు పెళ్లి చేసుకొంటున్నారు కదా. మరి పెళ్లి విషయంలో మీ నిర్ణయమేంటి?

వ్యక్తిగత జీవితంలో ఏం జరిగినా సహజంగానే జరగాలి. నా దృష్టంతా దర్శకత్వం మీద ఉంది.

సగం వరకు రిటైర్ అయినట్టే!

అగ్ర దర్శకుడు రాజమౌళికే కాదు పెద్దన్న... ప్రస్తుత తెలుగు సినిమా సంగీత ప్రపంచంలోనూ పెద్దన్న పాత్రనే పోషిస్తున్నారు ఎమ్.ఎమ్. కీరవాణి. తన సంగీతంతో సినిమా స్థాయిని పెంచే ఒక అరుదైన స్వరకర్త ఆయన. దశాబ్దాలుగా సుస్వరాల్ని వినిపిస్తూ భాషతో సంబంధం లేకుండా శ్రోతల్ని ఉర్రూతలూగిస్తున్నారు. ఆయన స్వరకల్పనలో ఒక పాట వచ్చిందంటే అది కొన్ని కాలాల పాటు శ్రోతల నోళ్లలో నానుతూ ఉండాల్సిందే. ఇటీవల ఎన్టీఆర్ జీవిత చరిత్రతో తెరకెక్కిన 'ఎన్టీఆర్ కథానాయకుడు' చిత్రానికి స్వరాలు అందించారు కీరవాణి. క్రిష్ దర్శకుడిగా, ఎన్టీఆర్ పాత్రలో బాలకృష్ణ నటించిన ఆ చిత్రం ఈ నెల 9న ప్రేక్షకుల ముందుకొస్తున్న సందర్భంగా 'ఈనాడు సినిమా'తో ప్రత్యేకంగా ముచ్చటించారు కీరవాణి. ఆ విషయాలివీ...



'ఎన్టీఆర్' చిత్రానికి సంగీతం అందిస్తున్నప్పుడు ఎన్టీఆర్ సినిమాకి పనిచేస్తున్నట్టు అనిపించిందా? లేదంటే బాలకృష్ణ సినిమాకా?

నాకైతే బాలకృష్ణగారు అస్సలు కనిపించలేదు, మొత్తం ఎన్టీఆర్‌గారే కనిపించారు. ఎన్టీఆర్ 'మేజర్ చంద్రకాంత్'కి స్వరాలు సమకూర్చాను. దాంతో నేను రెండోసారి ఎన్టీఆర్‌తో కలసి పనిచేస్తున్నట్లు అనిపించింది.

ఈ సినిమా ప్రయాణంలో ఎన్టీఆర్ గురించి కొత్తగా తెలుసుకొన్న విషయాలేంటి?

ఎన్టీఆర్‌ని తెరపై చూస్తూ ఆయన గురించి మాట్లాడుకోవడం వేరు, తెర వెనక ఆయన జీవితంలోని విశేషాలు వేరు. ఈ స్క్రిప్టు చదువుతున్నప్పుడు ఎన్టీఆర్ జీవితం వెనక చాలా విషయాలు తెలిశాయి. సినిమా చూస్తున్నప్పుడు ప్రేక్షకులకూ అలాంటి అనుభూతే కలుగుతుంది. రామారావుగారు సుదీర్ఘ కాలం పాటు రాజకీయ రంగంలో కొనసాగినా ఒక నయాపైసా అక్రమంగా సంపాదించలేదు. ఆయన అవినీతికి వ్యతిరేకం అనేది అందరికీ తెలిసిందే. ఆ నేపథ్యంలో వచ్చే సంఘటనలన్నీ ఈ సినిమాలో కనిపిస్తాయి.

ఎన్టీఆర్‌తో వ్యక్తిగతంగా మీకున్న అనుబంధం?

ఆయన్ని ఒక్కసారి కలిశా. 'మేజర్ చంద్రకాంత్' చిత్రీకరణలో కె.రాఘవేంద్రరావుగారు పరిచయం చేశారు. 'ఏం బ్రదర్' అంటూ షేక్ హ్యాండ్ ఇచ్చారు. ఒక నిమిషం పాటు కలసి మాట్లాడుంటానంతే.

మీరు చేసిన తొలి బయోపిక్ ఇదే కదా. ఈ ప్రయాణాన్ని మిగతా సినిమాలతో పోల్చి చూసుకుంటే?

'అన్నమయ్య', 'శ్రీరామదాసు' కథలు కూడా కల్పితం కాదు కదా. నా దృష్టిలో అవీ బయోపిక్‌లే. సమకాలీన వ్యక్తుల బయోపిక్‌ల్లో అంటే ఇదే తొలిసారి అనుకోవచ్చు. బయోపిక్‌లు చేసేటప్పుడు సత్యానికి దూరంగా వెళ్లకూడదు. సిన్సియారిటీ లేనివాళ్లు బయోపిక్‌లకి పని చేయలేరు. ఎన్టీఆర్ అభిమానిని కాబట్టే ఈ సినిమా చేయడానికి ఒప్పుకొన్నా. ఇదివరకు కొన్ని బయోపిక్‌లను నేను ఒప్పుకోలేదు. అంటే పతాక సన్నివేశాలు మారుస్తున్నాం, సత్యానికి దూరంగా వెళతామన్నారు. అలాంటివాటిలో భాగం కావడం కష్టం కదా.

ఈ చిత్రంలో ఎన్టీఆర్ పాటలేమైనా రీమిక్స్ చేశారా?

రీమిక్స్ ఏమీ చేయలేదు. పాటల నేపథ్యంలో చిత్రీకరణ జరుగుతున్నప్పుడు అవగాహన కోసం దర్శకుడు లొకేషన్‌కి తీసుకెళ్లి చూపించారు. ఆ పాటలు యథాతథంగా వినిపిస్తూనే ఉంటాయి. అయితే నేపథ్య సంగీతం అప్పటి వాతావరణాన్ని ప్రతిబింబించేలా ఉంటూనే నేటి తరానికి కావల్సినట్టుగా వినిపిస్తుంది.

'జైత్రయాత్రికా..' పాటలో సంస్కృత పదాలు వినిపిస్తుంటాయి. ఇందులోని పాటల కోసం ప్రత్యేకమైన కసరత్తులేమైనా చేశారా?

రెండు చిత్రాల్లోనూ భావోద్వేగాలే ప్రధానం. అందుకు తగ్గట్టుగానే సంగీతం అందించా. ఈ రెండు కథల్నీ బసవతారకంగారే చెబుతారు. ఒకదానికొకటి కనెక్షన్ ఉంటుంది. 'ఎన్టీఆర్ కథానాయకుడు'లో మా నాన్నగారు శివశక్తి దత్తా, సిరివెన్నెల సీతారామశాస్త్రి గారు, భాస్కరభట్ల, నేను ఒకొక్క పాట చొప్పున రాశాం. రామారావుగారి పాత్రల్లో పౌరాణికాలు ఎక్కువగా ఉంటాయి. పౌరాణిక పాత్రలు పోషించిన నటుడి గురించి చెప్పడానికి దేవ భాష అయిన సంస్కృతం అయితేనే గొప్పగా ఉంటుందనిపించింది. మా నాన్నగారికి సంస్కృతంపై పట్టుంది కాబట్టి మరింత అథెంటిక్‌గా ఉంటుందని ఆ పాట రాశారు.

క్రిష్ చిత్రానికి సంగీతం అందించడం ఇది రెండోసారి. ఒక యువ దర్శకుడైన ఆయన ఒక జీవిత చరిత్రని తీయడంపై మీ అభిప్రాయం?

క్రిష్ మంచి పాఠకుడు. పుస్తకాల పురుగు అంటాను. దర్శకుడు పుస్తకాలు చదివుండాలి, జీవితాన్ని చూసుండాలి... ఎదురు దెబ్బలు తినుండాలి. క్రిష్ జీవితంలో కష్టనష్టాలు చూశారు. అంతకుమించిన అర్హత ఏం కావాలి? ముఖ్యంగా బయోపిక్ తీయాలంటే ఎవరిపై తీస్తున్నారో వాళ్లపై అవగాహన ఉండాలి. క్రిష్‌గారు ఎన్టీఆర్ జీవితంపై మంచి హోమ్ వర్క్ చేశారు. బాలకృష్ణ ఆయన్ని ఎంచుకొని పరిపూర్ణంగా న్యాయం చేశారు. రచయిత బుర్రాసాయిమాధవ్ ఈ సినిమాకి కలిసొచ్చే అంశం. చక్కటి సంభాషణలు రాశారు.

తెలుగు సినిమా సంగీతంలో వచ్చిన మార్పులపై మీ అభిప్రాయమేంటి?

ఏ రోజుకారోజు సినిమా సంగీతం మార్పు చెందుతూ ఉంటుంది. జనాలు మార్పు కోరుకొంటున్నారు కాబట్టి, ప్రస్తుతం సినిమా సంగీతం ఎలా ఉండాలో అలాగే ఉంది. మనం మాట్లాడుకునే భాషలో విలువలు పడిపోతున్నాయని బాధపడాలి తప్ప, సాహిత్యంలో విలువల గురించి చెప్పేదేముంది? మనం మాట్లాడుకొనే భాషని ప్రతిబింబించేదే సినిమా సంగీతం. పాటల్లో అయినా సినిమాల్లో అయినా సమకాలీన సమాజమే కనిపిస్తోంది. అందులో అసంతృప్తి అంటూ ఏమీ లేదు.

పాట రాయాలని ఎప్పుడనిపిస్తుంటుంది?

అనిపించడం అంటూ ఏమీ ఉండదు. మీరు నన్నొక ప్రశ్న వేశారు. నేను గూగుల్ చూసి సమాధానం చెప్పడం లేదు కదా. నా మనసుకు అనిపించిందే చెబుతా. సినిమా ప్రయాణంలో ఒకొక్కసారి మనసుకు అనిపించింది మాటగా వస్తుంటుంది, దాన్నే పాటగా రాస్తుంటా. ఒకవేళ నాకేమీ రాకపోతే సిద్ధహస్తులైన రచయితలకి ఆ పనిని అప్పజెబుతుంటా. అంతే తప్ప పనిగట్టుకొని పాట రాయాలని కూర్చోను. భావాలు సహజంగా ఆశువుగా వస్తే పేపర్‌పై పెడుతుంటా.

ఇదివరకు రిటైర్‌మెంట్ అన్నారు. ఇక ఆ ఆలోచనల్ని పక్కనపెట్టినట్టే కదా?

నేను సగం వరకు రిటైర్ అయినట్టే. ఒక ప్రాజెక్టుకి ఒక్కడే నాయకుడుంటాడు. ఆ నాయకుడు చెప్పినట్టు వినాలి. నేను ఇదివరకు హీరో, దర్శకుడు, నిర్మాత, నిర్మాత మనవరాలు... ఇలా ముగ్గురు నలుగురు సలహాల మేరకు చేసినవాడినే. నిర్మాత మనవరాలికి నచ్చలేదని పాట క్యాన్సిల్ చేసిన సందర్భాలున్నాయి. ఇలాంటివన్నీ చేస్తున్నాను కాబట్టి ఆ పరిస్థితుల నుంచి రిటైర్‌అయ్యాను. ఇప్పుడు ఆ పరిస్థితులు లేవు. ఎవరో ఒక్కళ్ల మాటే వింటా. దర్శకుడా? నిర్మాతా? ఆయన మనవరాలా? ఒక్కరే. ఇలా రెండు మూడు విషయాల నుంచి నేను రిటైర్‌మెంట్ తీసుకొన్నా.

మీ అబ్బాయి మీకు పోటీ అనుకోవచ్చా?


పోటీ అని నేననుకోవడం లేదు. మా అబ్బాయిల్లో ఒకరే సంగీత దర్శకుడయ్యారు. రెండో అబ్బాయి సంగీత దర్శకుడు కాలేకపోయాడనే బాధ ఉంది. ఎందుకంటే నాకు సంగీతం అంటే ఇష్టం. సంగీత దర్శకుడి తనయుడు సంగీత దర్శకుడే కావాలనే నియమమేమీ లేదు. ఏదైనా వాళ్ల ఇష్టాన్నిబట్టే ఉంటుంది. మా అబ్బాయి కాలభైరవ నాతో కలిసి నాలుగైదేళ్లు పని చేశాడు. తనకి సైకిల్ నేర్పించడం పూర్తయింది. ఇక తనే తొక్కుకుంటూ ముందుకెళ్లాలి.

బయోపిక్‌లకి అమ్మలాంటిది

"ప్రస్తుతం బయోపిక్స్ చక్కటి విజయాల్ని అందుకొంటున్నాయి. విజయేంద్రప్రసాద్ అద్భుతమైన స్క్రిప్టుని అందించారు. ఇప్పటివరకు వచ్చిన బయోపిక్‌లకి అమ్మలాంటిది మా 'మణికర్ణిక'" అన్నారు కమల్‌జైన్. ఆయన జీ స్టూడియోస్ సంస్థతో కలిసి నిర్మించిన చిత్రమిది. శుక్రవారం హైదరాబాద్‌లో ట్రైలర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. కంగన రనౌత్ మాట్లాడుతూ "క్రిష్ ఈ సినిమాని గొప్పగా తెరకెక్కించారు. ఆయన్ని నేను అనుసరిస్తూ ఈ చిత్రాన్ని పూర్తి చేశానంతే" అన్నారు. ఆర్. నారాయణ మూర్తి మాట్లాడుతూ "హిందీలో తెలుగు ఖ్యాతిని చాటిన సాంకేతిక నిపుణులు ఎంతో మంది ఉన్నారు. 'బాహుబలి' చిత్రాలతో అంతర్జాతీయ ఖ్యాతిని పొందిన విజయేంద్రప్రసాద్ అందించిన కథతో, క్రిష్ గొప్పగా ఈ సినిమాని తీశారు. ఝాన్సీ లక్ష్మీబాయి పాత్రలో కంగన చాలా బాగా నటించారు. ఇందులో కొన్ని యాక్షన్ ఘట్టాల్నీ తెరకెక్కించిన ఆమెని అభినందిస్తున్నా" అన్నారు. ఈ కార్యక్రమంలో తమ్మారెడ్డిభరద్వాజ, మామిడి హరికృష్ణ, విజయేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వాళ్లింటి వంటలే తిన్నా

తెలుగు తెరపై మెరుస్తున్న హిందీ అందం... కియారా అద్వాణీ. 'భరత్ అనే నేను'తో వసుమతిగా తెలుగు ప్రేక్షకుల హృదయాల్ని దోచుకొంది. ఆ వెంటనే రామ్‌చరణ్‌తో కలిసి 'వినయ విధేయ రామ'లో నటించే అవకాశాన్ని సొంతం చేసుకొంది. బోయపాటి శ్రీను దర్శకత్వం వహించిన ఆ చిత్రం సంక్రాంతి పండగని పురస్కరించుకొని ఈ నెల 11న విడుదల కానుంది. శుక్రవారం హైదరాబాద్‌లో కియారా అద్వాణీ విలేకర్లతో మాట్లాడింది. ఆ విషయాలివీ...



"నాకు డ్యాన్స్ అంటే ఇష్టం. భరతనాట్యం, కథక్‌ల్లో ప్రవేశం ఉంది. నటిని కావడానికి కారణం అదే. అటు డ్యాన్స్‌తోపాటు ఇటు కామెడీని ప్రదర్శించే అవకాశం ఈ సినిమాతో దొరికింది. అందుకే 'వినయ విధేయ రామ'ని ఆద్యంతం ఆస్వాదిస్తూ చేశా. బోయపాటి శ్రీను కథ చెబుతున్నప్పుడే సినిమా చూసేసిన అనుభూతి కలిగింది. ఒక మంచి కుటుంబ కథ ఇది"

● "ఇందులో నా పాత్ర పేరు సీత. కుటుంబంలో అందరి ముందు వినయంగా మెలుగుతుంటా. రామ్ ఎంతంటే అంత అన్నట్టుగా ఉంటా. కానీ బయట రౌడీయిజం చేస్తుంటా. నాకూ, రామ్‌చరణ్‌కీ మధ్య సన్నివేశాలు, కెమిస్ట్రీ ఆసక్తికరంగా ఉంటాయి. చరణ్‌తోపాటు స్నేహ, ప్రశాంత్, వివేక్ ఒబెరాయ్.. ఇలా ఎక్కువమంది నటీనటులుతో కలిసి పనిచేసే అవకాశం ఈ చిత్రంతో లభించింది. నా కెరీర్‌లో తొలి మాస్ కమర్షియల్ చిత్రమిది. దర్శకుడు బోయపాటి బాగా తెరకెక్కించారు. సహజమైన అంశాల్ని తెరపై చూపించడం వేరు, నమ్మడానికి వీల్లేనివీ నమ్మేలాగా తెరపైకి తీసుకురావడం వేరు. బోయపాటి తన బ్రాండ్‌కి తగ్గట్టుగా ఈ సినిమాని బాగా తీశారు".

● "కథలో నా పాత్ర భాగమైతే చాలు. పాత్ర నిడివి ఎక్కువా? తక్కువా? అని ఆలోచించను. 'ధోనీ'లో చేసిన సాక్షి పాత్రతో మంచి పేరొచ్చింది. 'భరత్ అనే నేను'తో వసుమతిగా ప్రేక్షకులకి దగ్గరయ్యాను. సీత పాత్ర అలాంటి ప్రభావమే చూపిస్తుందని నా నమ్మకం. పాత్రల కోసం ప్రత్యేకంగా సన్నద్ధం కావాల్సిన అవసరం ఇప్పటిదాకా ఏర్పడలేదు. కానీ ఈ మధ్యనే ఓ పంజాబీ చిత్రం కోసం యాక్షన్ పార్ట్‌కి సంబంధించి హోం వర్క్ చేయడం మొదలెట్టాను".

● "కరణ్‌జోహార్ సినిమాలో చేయాలనేది కల. అది 'లస్ట్ స్టోరీస్'లో మేఘ పాత్రతో నెరవేరింది. ఈ సినిమా కన్నా ముందు ఆయన్ని రెండు మూడు సార్లు కలిశా. రిహార్సల్స్, ఆడిషన్ లేకుండానే నన్ను ఎంపిక చేశారు. ప్రతి కమర్షియల్ సినిమాలో విభిన్నమైన పాత్రే చేయాలి, అది కోరుకొన్నట్టుగా నటించాలనేది నా సిద్ధాంతం. ప్రస్తుతం హిందీలో 'అర్జున్‌రెడ్డి' రీమేక్‌లో నటిస్తున్నా. దిల్లీ నేపథ్యంలో సాగే ఆ కథలో నేటివిటీకి తగ్గట్టుగా కొన్ని మార్పులు చేశారు. దర్శకుడు సందీప్‌రెడ్డి సూచనలకి అనుగుణంగా నటిస్తున్నా. ఒక భాషకి పరిమితం కావాలనే ఆలోచనలు లేవు. 'బాహుబలి' చిత్రాల తర్వాత సినీ పరిశ్రమలో చాలా మార్పులు వచ్చాయి. కాబట్టి ఎక్కడ మంచి పాత్ర దక్కినా ఉత్తర, దక్షిణాది భాషా చిత్రాలన్నిటిలో చేస్తా. ప్రస్తుతం కొత్త కథలు వింటున్నాను. ఏదీ ఖరారు కాలేదు. తెలుగులో వరుసగా సినిమాలు చేస్తుండడంతో నమ్రత, మహేష్‌బాబు, ఉపాసన, రామ్‌చరణ్‌లతో కుటుంబం తరహా సంబంధాలు ఏర్పడ్డాయి. చాలావరకు సినిమా చిత్రీకరణ సమయాల్లో వాళ్లింటి వంటలే తిన్నా".

పిల్లలు - పెంపకం: టీనేజ



టీనేజీని అర్థం చేసుకుందాం

అప్పటివరకూ... అమాయక ప్రశ్నలకు విసుక్కుంటూనైనా జవాబిస్తాం. గొంతెమ్మ కోరికలు కోరినా లేదులేదంటూనే తీరుస్తాం. అంతలోనే... చెప్పినట్టు విన్న చిన్నారులే పొగరుబోతులుగా కనిపిస్తారు. కొంగు పట్టుకొని తిరిగినవాళ్లే 'గది పక్షులు'గా అనిపిస్తారు. ఎందుకింత మార్పు? బాల్యాన్ని దాటి... యవ్వనంలోకి దూకుతున్న పిల్లలపై ఎందుకిన్ని ఫిర్యాదులు? నిజాయతీగా ప్రశ్నించుకుంటే... సహృదయతతో ఆలోచిస్తే సామరస్య పరిష్కారం దొరక్కపోదు!!




యౌవ్వనంలో శారీరకంగానే కాదు, మానసికంగానూ ఎన్నెన్నో మార్పులు మొగ్గతొడుగుతాయి. అప్పటివరకూ అమ్మకూచిగా తిరిగిన పిల్లల మనసులో స్వతంత్ర భావనలు, స్వీయ అభిప్రాయాలు గూడుకట్టుకునే సమయం. ఒకవైపు బయటి ఆకర్షణల ప్రభావాలు, స్నేహితుల ప్రోద్బలాలు... మరోవైపు తల్లిదండ్రుల ఆకాంక్షలు, చదువుల భారం... వీటన్నింటి మధ్య పసి మనసులు కొట్టుమిట్టాడుతుంటాయి. మంచి, చెడు తేల్చుకోలేని సందిగ్ధావస్థలో ఊగిసలాడుతుంటాయి. ఇంట్లో పెరిగిన వాతావరణానికి, బయటి పరిస్థితులకూ పొంతన కుదరదు. ఈ మానసికావస్థే కొన్నిసార్లు తల్లిదండ్రులు, పిల్లల మధ్య పొరపొచ్చాలకు, అపార్థాలకు దారితీస్తుంటుంది. తల్లిదండ్రులకు పిల్లలు చేసేవన్నీ పొరపాట్లుగానే కనిపిస్తే... పిల్లలకు పెద్దల మాటలన్నీ పాత చింతకాయ పచ్చడిలా తోస్తుంటాయి. అయితే మనం కూడా అలాంటి దశను దాటుకొనే వచ్చామని, జీవితంలో ఇదొక అనివార్య మార్పని గుర్తించినపుడు పరిష్కారం దానంతటదే లభిస్తుంది. కావాల్సిందల్లా పిల్లలకూ స్వతంత్ర భావాలుంటాయని గుర్తించడమే.

1. ఎప్పుడూ ఫోన్ పట్టుకొని కూర్చోవడమేనా?

చాలామంది తల్లిదండ్రులు చేసే ఫిర్యాదు ఇది. ఎప్పుడు చూసినా ఫోన్‌లోనే తలదూరుస్తుంటారని, ఆ ధ్యాసలో పడి సరిగ్గా చదువుకోవటం లేదని నిందిస్తుంటారు. ఫేస్‌బుక్, ట్విటర్, వాట్సాప్ వంటి సామాజిక మాధ్యమాలు ఉక్కిరిబిక్కిరి చేస్తున్న ఈ రోజుల్లో తోటివాళ్ల కన్నా తామెక్కడ వెనకబడిపోతామో అనే బెంగ కుర్రకారును నిలవనీయదనే సంగతి పెద్దవాళ్లు గుర్తించాలి. ఉబుసుపోక కబుర్ల వంటివి పక్కనపెడితే- చదువుల్లోనైనా, ఉద్యోగాన్వేషణలోనైనా పరస్పర సహకారానికి ఇలాంటి 'సాంకేతిక బంధాలు' మున్ముందు ఎంతగానో ఉపయోగపడతాయని తెలుసుకోవాలి. ఒకవేళ పరిస్థితి మరీ శ్రుతిమించుతోందని అనిపించినపుడు... ముందు చదువు, ఆరోజు పాఠాలు, ప్రాజెక్టుల వంటివన్నీ పూర్తిచేశాకే ఫోన్ ముట్టుకోవాలని షరతులు పెట్టొచ్చు. అవసరమైతే ఫోన్ బిల్లు కూడా చూపించొచ్చు. పిల్లలు కూడా దీన్ని అర్థం చేసుకోవటానికి ప్రయత్నిస్తారు. కోపగించుకుంటే, అరిస్తే ప్రయోజనం ఉండకపోవచ్చు. గట్టిగా మందలించినపుడు ఫోన్‌ను పక్కకు పెట్టినా మనం బయటికి వెళ్లినప్పుడూ అలాగే ఉంటారని చెప్పలేం.

2. స్నేహితులే లోకమా?

యుక్తవయసులో స్నేహితుల ప్రభావం చాలా ఎక్కువ. ఈ వయసులో పిల్లలు ఇంట్లో కన్నా ఎక్కువ సమయం బయటే గడుపుతుంటారు. వయసు ప్రభావమో ఏమో గానీ కుటుంబ సభ్యులతో కలిసి బయటకు వెళ్లటానికీ కొందరు ఆసక్తి చూపించరు. ఇదే తల్లిదండ్రుల మనసును కలచివేస్తుంది. కానీ పెద్దయ్యాక కష్టనష్టాల్లో స్నేహితులే ఎక్కువగా తోడుంటారనే విషయాన్ని మరవరాదు. పైగా అన్ని స్నేహాలూ చివరికంటా కొనసాగవు. ఒకసారి మీ చిన్ననాటి స్నేహాలను తలచుకోండి. అప్పుడు ఎంతమంది స్నేహితులుండేవారు? ఇప్పుడు ఎంతమంది ప్రాణ స్నేహితులు మిగిలారు? ఒకరో, ఇద్దరో! పిల్లల విషయమూ అంతే. కాబట్టి స్నేహం చేయనివ్వండి. బాధ్యతగా మెలగటం, ఆపదల్లో ఆదుకోవటం వంటివి పిల్లలు స్నేహాలతోనే నేర్చుకుంటారు. అయితే స్నేహాల మధ్య తారతమ్యాలను గ్రహించగలిగేలా చేయాలి. నిజమైన స్నేహితులెవరూ మనకు ఇష్టంలేని పనులు చేయమని బలవంతపెట్టరనీ.. మన నిర్ణయాలు, నిబంధనలను గౌరవిస్తారనే విషయాలను తెలుసుకునేలా చూడాలి. ఒకవేళ ఈ విషయంలో మీరు ఆందోళన పడుతోంటే వారి తల్లిదండ్రులను ఇంటికి ఆహ్వానించండి. కలిసి భోజనం చేయండి, షికారుకు వెళ్లండి. పిల్లల దృష్టికోణంలోంచి ఆలోచిస్తుంటే మనమూ ఎదుగుతాం, మనలోనూ మార్పు వస్తుంది.



3. చెల్లిని, తమ్ముడిని పట్టించుకోకపోతే ఎలా?

ఇంట్లో ఇద్దరు, ముగ్గురు పిల్లలు ఉన్నప్పుడు చెల్లినో, తమ్ముడినో పట్టించుకోకపోతే తల్లిదండ్రుల మనసు చివుక్కుమనటం నిజమే. అలాగని తోబుట్టువులను కచ్చితంగా పట్టించుకోవాల్సిందేనని పట్టుబట్టడం మాత్రం తగదు. దీంతో మంచి కన్నా చెడు జరిగే అవకాశమే ఎక్కువ. అందువల్ల ఇతరత్రా మార్గాలతో పిల్లల మనసు గెలవడానికి ప్రయత్నించాలి. వీలైనప్పుడల్లా కుటుంబమంతా కలిసి బయటకు వెళ్లొచ్చు. ఒకరితో మరొకరు చనువుగా మెలగటానికి అవకాశం ఇచ్చినట్టు అవుతుంది. నిజానికి చిన్నప్పుడు తోబుట్టువుల మధ్య 'వైరం' ఉండడం సహజమే. అయితే అది రాన్రానూ పోతుంది. పిల్లలు ఒకరినొకరు అర్థం చేసుకుని, ఒకరి అవసరాలను మరొకరు కనిపెట్టుకోవడం అలవడుతుంది. ఒకసారి మీ పిల్లల చిన్ననాటి రోజులను గుర్తుతెచ్చుకొని చూడండి. చెల్లి, తమ్ముళ్ల విషయంలో అప్పటి ప్రవర్తనకూ ఇప్పటి ప్రవర్తనకూ గల తేడా మనకు ఇట్టే అర్థమైపోతుంది. ఒకప్పుడు ప్రతిదానికీ పేచీ పడినవాళ్లే ఇప్పుడు ఎంత కలిసిమెలిసి ఉంటున్నారనేది తెలుస్తుంది. కాబట్టి ఈ విషయాన్ని పదే పదే చెప్పాల్సిన పని లేదు.

4. ఈ వయసులో ప్రేమలా?

నవ యౌవన ఆకర్షణలు, ఇతరుల చనువు కోరుకోవటం సహజం. అంతమాత్రాన ప్రేమలో పడినట్టు కాకపోవచ్చు. అయితే పిల్లలు ఏదైనా విషయాన్ని దాచిపెడుతున్నారా? ఒకవేళ ఎవరినైనా ఇష్టపడుతుంటే ఆ విషయాన్ని మీతో ధైర్యంగా చెప్పగలుగుతున్నారా లేదా అనేవి ప్రశ్నించుకోవాలి. ఏ విషయాన్నయినా చెప్పటానికి సంకోచిస్తుంటే అంత చనువు, స్వేచ్ఛ లేదనే అర్థం. కాబట్టి ముందు నుంచే పిల్లలతో స్నేహితుల్లా మెలగాలి. ఒకవేళ పిల్లలు ప్రేమలో పడినట్టు తెలిస్తే ఆ విషయాన్ని నిర్భయంగా, నిస్సంకోచంగా ఇంట్లో చెప్పగలిగే వాతావరణం ఉండాలి. దీంతో ప్రేమబంధంలో ఏవయినా సమస్యలు ఉన్నా తెలుసుకుని ముందే గుర్తించే వీలుంటుంది. తమ సమస్యల్ని వేరెవరితోనో కాకుండా తల్లిదండ్రులతోనే చెప్పుకోవటం మంచిది కదా. పిల్లలు ప్రేమలో పడినట్టు తెలియగానే చాలామంది 'అవన్నీ కట్టిపెట్టు, బుద్ధిగా చదువుకో' అంటూ వాళ్లను కట్టడి చేస్తారు. ఇలాంటివి వికటించే అవకాశమే ఎక్కువ. అంతకన్నా 'ఒంటరిగా కలుసుకోవద్దు, ఇతర స్నేహితుల సమక్షంలోనే మాట్లాడుకోవాలి, పెద్దవాళ్లు ఉన్నప్పుడే ఇంటికి రానివ్వాలి' వంటి జాగ్రత్తలు చెప్పొచ్చు.

5. ఇంటి పరిస్థితులు తెలియకపోతే ఎలా?

చిన్నప్పుడంటే ఏమో గానీ ఇంత వయసు వచ్చాకా ఇంటి పరిస్థితుల గురించి తెలుసుకోకపోతే ఎలా? ఇది మరికొందరి ఫిర్యాదు. ఒక వయసుకు వచ్చాక పిల్లలు బాధ్యతగా మెలగాలని కోరుకోవటంలో తప్పులేదు. కానీ నిజంగా అలాంటి అవకాశాన్ని కల్పిస్తున్నామా? వారి బాధ్యతను గుర్తించేలా చేస్తున్నామా? ఒకసారి మనకు మనమే ప్రశ్నించుకుంటే సమాధానం తెలిసిపోతుంది. అన్నీ మన చేతుల్లోనే, మనం అనుకున్నట్టుగానే జరగాలని కోరుకుంటాం. అలాంటప్పుడు పిల్లలు తమ అభిప్రాయాలను చెప్పుకోవటానికి వీలుంటుందా? ఒకవేళ చెప్పినా ఆచరణ సాధ్యమవుతుందా? తప్పు మనలోనే పెట్టుకొని పిల్లలను నిందించటం తగదు. వారికి ముందు నుంచే బాధ్యతలను తెలుసుకునే మార్గాలను తెరచి ఉంచాలి. పిల్లలతో కలిసి ఇంటి బడ్జెట్ వేసుకోవచ్చు. ఎంత ఆదాయం వస్తుందో, ఎంత ఖర్చు చేయాలో, ఎంత ఆదా చేయాలో అనేవి కలిసి నిర్ణయించుకోవచ్చు. కావాలంటే ఒక నెల జీతం పిల్లల చేతికివ్వచ్చు. ఆ నెలంతా వాళ్లనే చూసుకోమనొచ్చు. ఇలాంటివి పరోక్షంగానే బాధ్యతలను నేర్పిస్తాయి. అంటే ముందు ఆ అవకాశాన్ని పెద్దవాళ్లే కల్పించాలని గుర్తించాలి.

- పి.భాగ్య

గర్భం రాకుండా ఉండాలంటే?

మాకు కొత్తగా పెళ్లయ్యింది. అప్పుడే పిల్లల్ని కనే ఆలోచన లేదు. నెలసరి సమయంలో తప్ప మిగిలిన అన్ని రోజుల్లో కలయికలో పాల్గొంటున్నాం. ఇలా రోజూ కలవడం వల్ల గర్భం వస్తుందేమోనని భయంగా ఉంది. అసలు మేం ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి. గర్భం దాల్చకుండా ఉండాలంటే ఏ సమయంలో దూరంగా ఉండాలి?

– ఓ సోదరి

డియర్ వసుంధర



డా॥ అనగాని మంజుల
గైనకాలజిస్టు

గర్భం వచ్చే రోజుల్ని అంచనా వేసుకుని కలయికను వాయిదా వేస్తారు కొందరు. దీన్ని సేఫ్ పిరియడ్ టెక్నిక్ అని అంటారు. అయితే దీన్ని ఆధారం చేసుకుని కలయికలో పాల్గొనడం అనేది ఏ మాత్రం సురక్షితం కాదు. సాధారణంగా అండం నెలసరి వచ్చిన తరువాత 12 -15 రోజుల్లో విడుదల అవుతుంది. అంటే నెలసరి వచ్చిన మొదటి రోజు నుంచి లెక్కపెట్టుకోవాలి. అలా అండం విడుదలయ్యేందుకు ఐదు రోజుల ముందు ఆ తరువాత అసురక్షితం కాబట్టి అప్పుడు దూరంగా ఉండాలి. నెలసరి సక్రమంగా వస్తూ... అండం కూడా అనుకున్న తేదీల్లోనే విడుదల అవుతోంటే ఈ జాగ్రత్త తీసుకోవచ్చు. అయితే ప్రతీసారి ఇలాగే అవుతుందని చెప్పలేం. ఒత్తిడి, జీవనవిధానం, ఇతర కారణాల వల్ల అండం విడుదల ఆలస్యం కావచ్చు. కాబట్టి జాగ్రత్తలు తీసుకున్నా కూడా గర్భం వచ్చే అవకాశం ఉంటుంది. మీరు గర్భం దాల్చకుండా ఉండాలంటే... గర్భనిరోధక మాత్రలు వాడటమే సరైన పరిష్కారం. ఓసారి వైద్యుల్ని సంప్రదిస్తే మీకు అనువైనదాన్ని సూచిస్తారు. ఆలస్యం చేయకండి.

- మీ సందేహాలను, సమస్యల్ని vasuhealth@eenadu.net కు పంపించగలరు.

బంగారం వెండి

4న ముగింపు-క్రితం

	హైదరాబాద్		విజయవాడ	
బంగారం(24క్యా)	32,970	32,950	32,690	32,550
ఆర్నమెంట్	30,790	30,780	30,300	30,200
వెండి (కిలో)	40,200	40,060	40,500	39,600

	ప్రొద్దుటూరు		రాజమహేంద్రవరం	
బంగారం(24క్యా)	32,600	32,800	32,860	32,940
ఆర్నమెంట్	30,700	30,700	30,480	30,520
వెండి (కిలో)	40,100	40,100	40,100	40,000

	విశాఖపట్నం		తమిళనాడు	
బంగారం(24క్యా)	32,820	32,890	-------	-------
ఆర్నమెంట్	30,530	30,590	3,048	3,052 గ్రా
వెండి (కిలో)	39,700	39,700	42.40	42.20 గ్రా

అమ్మచేత కమ్మగా



కొర్రదోశ

పిల్లల చేత చిరుధాన్యాలు తినిపించడం అంటే సవాలే. అందుకే ఈసారి వాటితో ఇతర పదార్థాలు వండేందుకు ప్రయత్నించండి. అలాంటిదే ఈ దోశ.

కావాల్సినవి: కొర్రలు - మూడు కప్పులు, మినప్పప్పు - కప్పు, అటుకులు - చెంచా, ఉప్పు - కొద్దిగా, మెంతులు - నాలుగైదు గింజలు.

తయారీ: కొర్రలు, మినప్పప్పు, మెంతుల్ని కనీసం ఎనిమిది గంటలసేపు నానబెట్టుకోవాలి. అటుకుల్ని ఓ పదినిమిషాల ముందు నానబెట్టి... ఆ తరువాత అన్నింటినీ కలిపి మెత్తగా రుబ్బుకోవాలి. ఇందులో తగినంత ఉప్పు కలిపితే చాలు. పొయ్యిమీద పెనం పెట్టి గరిటెడు పిండి తీసుకుని దోశలా వేసుకోవాలి. చెంచా నూనె వేసి రెండువైపులా కాల్చి తీసుకుంటే చాలు. కావాలనుకుంటే ఇందులో ఉల్లిపాయ ముక్కలు, పనీర్ తురుము... ఇలా ఏవైనా వేయొచ్చు. ఈ దోశలు కరకరలాడుతూ వస్తాయి.

ఏడుస్తూనే పరీక్ష రాశా!

భరించలేని బాధను... ప్రసవ వేదనతో పోలుస్తారు. కానీ ఆ వేదననే ఆమె మౌనంగా భరించింది. రెండున్నర గంటలు.. గట్టిగా అరిచి ఏడవాలనిపించినా.. కళ్లలో నీళ్లు కుక్కుకుంది. చదివింది మర్చిపోకుండా గుర్తు తెచ్చుకుంటూ డీఎస్సీ పరీక్ష రాసింది ధన్యాసి స్వాతి. ఇదంతా ఉద్యోగం సాధించడానికి మాత్రమే కాదు... ఆమె తండ్రి కష్టం వృథా కాకూడదని. పట్టుదలగా పరీక్ష రాసిన స్వాతి అనుభవాలు ఆమె మాటల్లోనే..!

ఆరోజు అంటే జనవరి 2న పొద్దున్నే లేచా. చదివింది ఒకటి రెండుసార్లు పునఃశ్చరణ కూడా చేసుకున్నా. పరీక్ష ఉదయం తొమ్మిదిన్నరకు. పరీక్షా కేంద్రం పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా రాజుపాళెంలోని శ్రీవెంకటేశ్వర కాలేజీ. అక్కడకు వెళ్లాలంటే మా ఊరు నుంచి రెండు గంటలు ప్రయాణం. దాంతో ఉదయం ఆరుగంటలకే అమ్మా, నేను ఆటోలో బయల్దేరాం. కొద్ది దూరం వెళ్లాక నొప్పులు మొదలయ్యాయి. నేను బాధపడితే అమ్మ కంగారు పడుతుందని చెప్పలేదు. పంటిబిగువున పరీక్షా కేంద్రానికి వెళ్లా. అమ్మకి విషయం అర్థమైంది. ఎగ్జామ్ హాలు వరకు తోడు వచ్చింది. ఆసుపత్రికి వెళ్దామని బతిమాలింది. అక్కడున్న చాలామంది కూడా 'పరీక్ష వద్దు... ఆసుపత్రికి వెళ్లడం మంచిది..' అని చెప్పినా నేను వినలేదు. ఆ సమయంలో అందరూ 'ఈ అమ్మాయి ఎంత మూర్ఖంగా పరీక్షకు సిద్ధమైంది' అని అనుకున్నారు. నిజానికి అది మొండితనం కాదు. పేదరికం. నాన్న కష్టాన్ని వృథా చేయకూడదనే తాపత్రయం.

నాన్న కష్టంతో: మాది ప్రకాశం జిల్లాలోని సింగరాయకొండ మండలం. నాన్న సెంట్రింగ్(కర్రపని) పని చేస్తుంటాడు. అమ్మ కూడా నాన్నకి చేదోడువాదోడుగా ఉంటుంది. నాకో అక్క, తమ్ముడు. నాన్నరెక్కల కష్టం మీద మా ముగ్గుర్ని పెంచి పెద్ద చేశాడు. తన స్థాయికి తగినట్టు ప్రభుత్వ పాఠశాలలో చదివించాడు. అయితే చిన్నతనం నుంచి నేను తెలుగులో ముందు ఉండేదాన్ని. ఉపాధ్యాయులు మెచ్చుకునేవారు. దాంతో తెలుగు టీచర్ కావాలనే కోరిక మనసులో బలంగా పడింది. నా కలల్ని అర్థం చేసుకున్న నాన్న కూడా కష్టమైనా చదివించాడు. డిగ్రీ అయ్యాక 2017 మా మేనమామ మహేశ్‌తో పెళ్లి చేశారు.




డీఎస్సీకి అర్హత: చదువయ్యాక టీపీటీ(తెలుగు పండిట్ ట్రైనింగ్)లో చేరా. నాన్న అందుకోసం యాభైవేల రూపాయల ఫీజు కట్టారు. అది తనకి తలకు మించిన భారం. అందుకే ఫీజు కడుతున్న రోజే ఉద్యోగం తెచ్చుకోవాలనుకున్నా. రాత్రింబవళ్లు చదువే లోకంగా బతికేదాన్ని. ఆ కోర్సు అయ్యాక టెట్ రాసి... డీఎస్సీకి అర్హత సాధించా. రెండు నెలల క్రితమే నోటిఫికేషన్ పడింది. అప్పటికే గర్భిణిని.

అలానే సిద్ధమయ్యా: తగిన జాగ్రత్తలు తీసుకుంటూనే చదువుకునేదాన్ని. కానీ ఎక్కువ సేపు కూర్చోవడం అసౌకర్యంగా ఉండేది. అయినా పుస్తకాలు వదిలేదాన్ని కాదు. నేను అలా చదువుకోవడం చూసి అమ్మానాన్నలు కంగారు పడేవారు. నాకు మొదట వైద్యులు చెప్పిన ప్రసవతేదీ జవవరి 13. ఈలోపు పరీక్ష అయిపోతుంది కాబట్టి ఇబ్బంది ఉండదని అనుకున్నా. కానీ పరీక్ష సమయానికి నొప్పులు రావడంతో శారీరకంగా కన్నా మానసికంగానే ఎక్కువ మథనపడ్డా. ఎందుకంటే డీఎస్సీ సాధించడం ఎంతోమంది కల. పైగా నెల్లూరు జిల్లాకు తెలుగు టీచర్ పోస్టు ఒక్కటే కేటాయించారు. ఇప్పుడు రాయకపోతే మళ్లీ ఎప్పటికో అవకాశం. వీటన్నింటికీ తోడు మా ఆర్థికస్థోమత అంతమంతమాత్రమే. నిజంగా ఈ ఉద్యోగం సంపాదించడం నా కలైతే.. రెండోది ఆర్థిక అవసరం. నాన్న కట్టిన ఫీజు కూడా గుర్తొచ్చింది. కాబట్టి బాధను భరించడమే మంచిదనుకున్నా.

గుర్తుతెచ్చుకుని మరీ: పరీక్ష హాలులో కూర్చున్నాక క్రమంగా నొప్పి పెరిగింది. కాలేజీ నిర్వాహకులు కూడా 'బిడ్డ కంటే పరీక్ష ముఖ్యమా' అని గట్టిగా మందలించారు. నాకేమీ కాదు, నాకు పుట్టబోయే బిడ్డ నన్ను ఇబ్బంది పెట్టదు కాబట్టి పరీక్ష రాయగలనని అనుకున్నా. ఆ ధైర్యంతోనే సిద్ధమయ్యా. నొప్పుల బాధ ఉన్నా చదివింది గుర్తు తెచ్చుకునే ప్రయత్నం చేశా. ఏడుస్తూనే పరీక్ష రాశా. అప్పటికే సమయం గడుస్తోంది. ఎనభై శాతం పరీక్ష చాలా శ్రద్ధగా పూర్తిచేశా. రెండు గంటల తరువాత ఇక రాయలేకపోయా. అయినా ఎలాగోలా ప్రయత్నించాలనుకున్నా. కానీ చివరి అరగంట గడిచేకొద్దీ కళ్లు తిరిగి శరీరం సహకరించలేదు. చివర్లో తోచింది రాసి పేపరు ఇచ్చేశా. బయటకు వస్తుంటేనే కళ్లు తిరిగి పడిపోయా. ఆసుపత్రికి వెళ్లిన అరగంటకే సహజ డెలివరీ అయింది. అబ్బాయి పుట్టాడు. బిడ్డ క్షేమంగా ఉన్నాడని తెలిశాక నాకు పోయిన ప్రాణం తిరిగొచ్చినట్టైంది. ఇప్పుడు ఆలోచిస్తే నేనేనా అన్ని నొప్పులు భరించి సాహసం చేసిందని అనిపిస్తుంది.


రంగవల్లిక



19 చుక్కలు, 7 వరుసలు. 7 వచ్చేవరకు.



- బి.సుజాత
హైదరాబాద్



19 చుక్కలు, 7 వరుసలు, 7 వచ్చేవరకూ.



- నండూరి లక్ష్మీ,
రాజమండ్రి

మా చిరునామా:
వసుంధర,
ఈనాడు
ప్రధాన కార్యాలయం,
రామోజీ ఫిలిం సిటీ,
హయత్ నగర్
మండలం,
రంగారెడ్డి జిల్లా - 501 512.
email: vasundhara@eenadu.net

ఈటీవీ ఆంధ్రప్రదేశ్ జనవరి 3, 2019 విజేతలు

ముత్యాల ముగ్గుల పోటీ 1. వై.అఖిల, పాలతోడు, మండపేట 2. ఎం.నారాయణమ్మ, దర్శి 3. వై.ఐశ్వర్య, కడప 4. బి.మహేశ్వరి, మంత్రాలయం. 5. కె.కుమారి, రాజమహేంద్రవరం 6. ఎం.భూలక్ష్మి, కోండ్రుపాడు 7. ఎ.నాగేశ్వరమ్మ, కావలి 8. జె.సుజాత, రొంపిచెర్ల 9. ఓ.మాధవీలత, గంగన్నపాలెం 10. వై.అమృత, కడప

నజరానా

టీ కాచే గిన్నెలో టీ మరకలు ఎంతకీ పోవడంలేదా... కాస్త ఉప్పుతో తోమి చూడండి.



ఆడపిల్లని కాపాడాలని...



'అమ్మాయిలకు రక్షణ కల్పించాలనే ఉద్దేశంతో 130 నగరాల్లోని వీధుల్లో 35 వేల మంది మహిళా గైనకాలజిస్టులు వాకథాన్ నిర్వహించారు. సామాజిక కార్యకర్త సావిత్రిబాయి జ్యోతిరావు పూలె జయంతిని పురస్కరించుకుని దీన్ని ఏర్పాటు చేశారు. ఈ వాక్‌థాన్‌ని 'అబ్‌స్టెట్రిక్స్ అండ్ గైనకాలజీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించింది. పలు ప్రాంతాలకు చెందిన సామాజిక సేవా సంస్థలు, పాఠశాల, కళాశాల విద్యార్థులు సహా వందలాదిమంది మహిళలు ఇందులో పాల్గొన్నారు. 'బాలికకు రక్షణ', 'బాలికలకు విద్య' అనే అంశాల పట్ల మహిళా వైద్యులు, సామాజిక సేవా కార్యకర్తలు వెళ్లిన ప్రతీచోటా అవగాహన కలిగించారు. వీళ్లంతా ముంబయిలోని నిరుపేద కుటుంబాలు నివసించే ప్రాంతాలు, స్థానిక ప్రభుత్వాసుపత్రులు సహా ప్రైవేటు ఆసుపత్రులను ఎంచుకున్నారు. ఆడపిల్ల ప్రాముఖ్యతను తెలిపే ప్లకార్డులను పట్టుకుని మరీ అవగాహన అందించారు. మహారాష్ట్ర సహా పలు రాష్ట్రాల్లో వేలాదిమంది సంయుక్తంగా చేసిన ఈ వాక్‌థాన్‌ను 'ఇండియన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్' నిర్వాహకులు పర్యవేక్షించారు. త్వరలో ఈ వాక్‌థాన్‌ను రికార్డుగా నమోదు చేయబోతున్నారు.



ఆక్వామెన్ బాడీ బిల్డింగ్

జాసన్‌మోమో... ఎవరో తెలుసా? ఈ పేరు తక్కువ మందికే తెలిసుంటుంది. మరి 'ఆక్వామెన్'?... ఓ... ఎందుకు తెలీదు..! అతని ఫిట్‌నెస్... ముఖ్యంగా అతని బాడీ(చెస్ట్) చూసి ఫ్యాన్స్ అయిపోని ఫిట్‌నెస్ ఫ్రీకర్స్ ఉండరు. జాసన్‌లా ఛాతి పెంచి విరుచుకు తిరగాలని తలంచని యువకుడుండడు. అంతటి ఆకర్షణీయమైన ఛాతిని సంపాదించడానికి ఆయన పడిన కష్టం అంతా ఇంతా కాదు. జాసన్ రోజూ ఉదయాన్నే ప్రణాళిక బద్ధంగా వ్యాయామం మొదలు పెట్టేవాడు. వార్మ్‌అప్, ఇతర ఎక్సర్‌సైజులు అయ్యాక... చెస్ట్ మీద దృష్టి పెట్టేవాడు. ప్రెస్సింగ్ (ఇన్‌క్లేన్, డిక్లేన్, ఫ్లాట్) ఇలా సెట్స్‌గా విభజించి చేసేవాడు. ఫ్లాట్‌బెంచ్ డంబెల్స్ ఫ్లైయిస్, వెయిటెడ్ పుషప్స్, చెస్ట్‌ఫుల్ ఓవర్స్ క్రమం తప్పకుండా చేసేవాడు. రోజూ నాలుగు గంటల కఠోర శ్రమతో పాటు... తగిన పోషకాహారం తీసుకునేవాడు. మీలా దృఢమైన ఛాతి పెంచాలంటే ఏం చేయాలో చెప్పండని అభిమానులు అడిగితే... 'ప్రతి ఒక్కరి బాడీ వేర్వేరు లక్షణాలతో, రూపాలతో ఉంటుంది. దానికి తగ్గట్టుగా నిపుణుల సలహా మేరకు వ్యాయామాలు చేయాల'ని వినయంగా చెప్పాడీ సముద్ర పుత్రుడు.



పండగలా జీవిద్దాం



వచ్చేది సంక్రాంతి పండగ.. సెలవులు.. సొంతూరికి ప్రయాణాలు.. ఇంకేముందీ... రిలాక్స్ అయిపోదాం.. పొద్దెక్కాక లేద్దాం.. లంచ్ సమయానికి టిఫిన్ చేద్దాం.. దొరికిందల్లా లాగించేద్దాం.. అనుకోవడం లేదు నేటి తరం. మిలీనియల్స్ మోటో మారుతోంది. పండగన్నా.. వరుసగా సెలవులన్నా.. పద్ధతిగా ప్లాన్ చేస్తున్నారు. సోషల్ లైఫ్, గ్యాడ్జెట్‌లకు దూరంగా ఉంటూ ప్రతి క్షణాన్ని ఆస్వాదిస్తున్నారు. ఏవో కొన్ని రోజులే అనుకోకుండా.. దాన్నే లైఫ్‌స్టైల్‌గా మలుచుకునేందుకూ ఇష్టపడుతున్నారు. నిత్యం పండగ మూడ్‌లోనే ఉంటూ లైఫ్‌ని సెలబ్రేట్ చేసుకునేందుకు ఇష్టపడుతున్నారు. మరి, మీ సంగతేంటి? ఏవో కొన్ని రోజులేనా? రోజూ పండగలా జీవించే ప్రయత్నం చేస్తున్నారా? లేదా? కొత్త ఏడాది తీసుకున్న రిజల్యూషన్స్‌కి పండగ సెలవులు యాడ్‌ఆన్ అవ్వాలి.. మరింత ఉత్సాహాన్ని నింపాలి!!

బుర్రకి ఓఎస్ అప్‌డేట్స్

సొంతూరికి వెళ్తే. అక్కడి యాసని పట్టుకునే ప్రయత్నం చేస్తాం. అమ్మమ్మ, తాతయ్య.. మాటల్లోని నుడికారాల రుచిని గ్రహించే ప్రయత్నం చేస్తాం. ఆయా పదాలకు అర్థాలు తెలుసుకుంటాం. వచ్చేటప్పుడు బ్యాగుల్లో బోలెడన్ని జ్ఞాపకాల్ని నింపుకొని ఇంటికి రాగానే హార్డ్‌డిస్క్‌ల్లోకి కాపీ చేసి బిజీ అయిపోవద్దు. అక్కడ చూపిన ఆసక్తి కాంక్రీట్ జంగిల్లోకి రాగానే వదిలేయొద్దు. కొనసాగించాలి.

- నిత్యం ఫోన్ ఓఎస్‌ని అప్‌డేట్ చేసినట్టుగా మెదడునీ అప్‌డేట్ చేస్తుండాలి. మెదడు ఓఎస్ అనుకుంటే.. యాప్‌ల రూపంలో కొత్త స్కిల్స్‌ని ఎప్పటికప్పుడు ఇన్‌స్టాల్ చేస్తుండాలి. డ్యాన్స్ చేయడం.. వంట చేయడం.. ఏదైనా కొత్త భాషని అభ్యసించడం... లాంటివి ఏవైనా మెదడుకు కచ్చితంగా మేతే. కొత్త ఏడాది మీరు సంకల్పించుకున్న వాటిల్లో ఇది ఉండే ఉంటుంది. పట్టు సడలించొద్దు. నిత్యం నేర్చుకునేందుకు సిద్ధంగా ఉండాలి.

రోజూ లాగించాల్సిందే

పండగ వచ్చిందంటే అమ్మ వేసే గారెలు తింటూనే.. అత్త కలిపి పెట్టిన పెరుగు వడని ఓ పట్టుపడతారు.. ఆ తర్వాత పులిహోర.. పాయసం.. ఇలా పొద్దునే అల్పాహారం బొజ్జనిండా లాగించాల్సిందే. మరి, మిగతా రోజుల సంగతేంటి? ఉరుకులు పరుగులు పెడుతూ చేతికి అందిన ఓ యాపిల్‌తోనో.. బిస్కెట్ ప్యాకెట్‌తోనో సరిపెట్టుకోవడం మంచిది కాదు. వైద్య పరిశోధనల ప్రకారం రోజూ పుష్టిగా అల్పాహారం తీసుకోవడం ద్వారా బరువు తగ్గొచ్చుట.

- అన్ని రోజులూ ఫుల్‌గా అల్పాహారం తినేంత టైమ్ ఎక్కడిదీ అనుకోవద్దు. ఎందుకంటే.. ఎన్నో కలల తీరాల్ని దాటుకుని.. ఏడెనిమిది గంటలు తర్వాత నిద్రలేస్తాం. అలసిన పొట్టకి అల్పాహార విందు ఇవ్వాల్సిందే.

'బ్రేకప్' చెప్పాలి

చావిట్లో కట్టేసిన లేగదూడతో కాసేపు.. తాతయ్య రేడియో వింటూ ఉయ్యాల బల్లపై ఇంకాసేపు.. కజిన్స్‌తో కర్రాబిళ్లా ఆడుతూ గడిపేస్తాం. గ్యాడ్జెట్‌లు.. వాటికి ఛార్జింగ్‌లు.. వై-ఫైలు.. వాటికొచ్చే సిగ్నల్స్ ఊసే ఉండదు. విహార యాత్రల్లోనూ ఎక్కువ శాతం మంది టెక్నాలజీని పక్కనపెట్టేసి రిలాక్స్ అయ్యే ప్రయత్నం చేస్తారు. వెకేషన్ పూర్తి చేసుకుని తిరుగు ప్రయాణంలోనే మళ్లీ మొదలు. చూపుంతా తెరలపైనే.. వేళ్లెప్పుడూ కీబోర్డు మీటలపైనే. ఇదే వద్దు. ఏదో పండగ పది రోజులే కాదు. రోజూ కొంత సమయం పాటు టెక్నాలజీకి బ్రేకప్ చెప్పాల్సిందే.

- రోజులో మీకు ఇష్టమైన టైమ్‌ని సెట్ చేసుకుని అన్ని గ్యాడ్జెట్‌లను స్విచ్‌ఆఫ్ చేయాలి. మీకు మీరు విధించుకునే 'కర్ఫ్యూ అవర్స్' అన్నమాట. ఆ సమయంలో మనసుకు రిలాక్స్‌గా అనిపించే పనేదైనా చెయండి. ఉదాహరణకు సాయిత్రం 8 తర్వాత అన్ని గ్యాడ్జెట్‌లను ఓ గంట పాటు పక్కన పట్టేసి మీ పెంపుడు జంతువులతో వాకింగ్‌కి వెళ్లండి. బండి లేదా కారుని శుభ్రం చేయండి. కాసేపు పుస్తకం చదవండి.

మట్టికీ మీకు మధ్య నెట్‌వర్క్

సెలవుల్లో ఊరికెళ్తే పొద్దునే లేచి ఆ చోటంతా చుట్టేయడం.. పొలాల్లో తిరగడం.. అంతా నడిచే! కారు.. బైకు ఊసే రాదు. ట్రై చేద్దాం అనుకుంటే ఎడ్లబండిపై ఏరూ.. ఊరూ దాటేయొచ్చు. అదే నడకని తిరుగు ప్రయాణంలో ఊరి పొలిమేరల్లో వదిలేయొద్దు. నడక తాలూకు జ్ఞాపకాల్ని ఫోన్ ఇంటర్నల్ మెమొరీలో కాకుండా మదిలో భద్రం చేసుకోండి. రొటీన్ లైఫ్‌లోనూ కారు, బైక్‌లను పక్కనపెట్టి నడక అందుకోండి. సైన్స్ చెప్పేదీ ఇదే.. రోజుకో 20 నిమిషాలు నడిస్తే పోయేదేం లేదనే. ఫిట్‌నెస్‌కి మూలం నడకే.

- పండగ ముగిసిందో లేదో.. మరునాడు అలారం సెట్టింగ్స్‌ని మార్చొద్దు. ఊరు నుంచి వచ్చామో లేదో.. హుషారు మొత్తాన్ని బైక్‌కి ఇచ్చేయకండి. మంచం దిగిన పాదాలు మట్టిని తాకాలి. రోజూ నడవాలి. మట్టికి మనకి మధ్య నిత్యం నెట్‌వర్క్ కనెక్టు అయ్యి ఉండేలా చూసుకోవాలి.

కునుకేసుకోండి

కజిన్స్‌తో వాకిట్లోనే వన్‌స్టెప్ క్యాచ్ క్రికెట్టో.. ఏడు పెంకులాటో ఆడడం.. అవీ బోర్ అనిపిస్తే కాలువగట్టుకి ఈతకెళ్లడం. లంచ్‌కల్లా ఇంటికొచ్చి తినడం.. కాసేపు కునుకు తీయడం. హాలిడేస్‌లో ఉన్న ఆ మజానే వేరు కదా! ఇక్కడ ఆటలెంత ముఖ్యమో.. తిన్నాక కునుకూ అంతే ముఖ్యం. పరిశోధనల్లో తేలిందేమంటే.. తిన్నాక తీసే పవర్ న్యాప్‌తో స్లిమ్ అవ్వొచ్చుట. అంతేకాదు.. మెదడు రీఫ్రెష్ అయ్యి చేసే పనిపై ఏకాగ్రతను పెంచుతుందట. ఇంకా చెప్పాలంటే.. గుండె పనితీరుని మెరుగుపరుచుకునేందుకు కునుకెంతో మేలట.

- చదువుల్లో, ఆఫీస్‌ల్లో ఉండేవారికి రోజూ కునుకేయడం కుదరదుగానీ.. ఓ పది నిమిషాలు కూర్చున్న చోట అవకాశం దొరకొచ్చు. దీంతో ఒత్తిడి తగ్గుతుంది. వారాంతాల్లో మాత్రం కచ్చితంగా 20 నుంచి 30 నిమిషాలు కునుకు తీయడం మర్చిపోవద్దు.

మాటల్లేకుండా ఎన్నాళ్లు?

ఆరోజు ఎందుకలా తను ప్రవర్తించిందో నాకిప్పటికీ అర్థం కావట్లేదు.. అవును మేమిద్దరం స్నేహితులం. నా డిగ్రీ అయిపోగానే పైచదువుల కోసం ఉన్న ఊరు వదిలి పట్నం బయలుదేరాను. అప్పటి వరకు అమ్మాయిల పేరెత్తితే పారిపోయే రకం నేను. పీజీ స్థాయికి రాగానే పక్కనున్న స్నేహితులు.. వాతావరణం పూర్తిగా నన్ను మార్చేశాయి. అప్పుడే పరిచయం అయింది తను.. పేరు లాస్య.. రెండు రోజుల్లోనే నన్ను రేయ్ అని పిలవడం మొదలెట్టింది. తెలియకుండానే చాలా దగ్గరయ్యాం. ఎంతలా అంటే తను లేకుంటే రోజు గడవలేనంతగా. ఇక మొదలు రెండేళ్లు అలా గడిచిపోయాయి. నేను అమ్మాయిలకి దూరమే కానీ నా మరదలు చిన్ని అంటే ప్రాణం. తను నేను నాలుగేళ్లుగా ప్రేమించుకుంటున్నాం. ఏవో మనస్పర్థలతో ఇద్దరం కొద్దిరోజులుగా దూరంగా ఉంటున్నాం. ఆ విషయం నా స్నేహితురాలికి తెలుసు. ఒకరోజు రాత్రి తనతో ఫోన్లో మాట్లాడుతున్నప్పుడు తను అన్నదానికి ఏం మాట్లాడాలో అర్థం కాలేదు. 'ఒరేయ్.. నీతో జీవితాంతం కలిసి నడవాలనుందిరా' అంది. తనని నేనెప్పుడూ ఆ దృష్టితో చూడలేదు. మరి ఎందుకిలా? అని అడిగాను. 'ప్రేమించే



అమ్మాయిని అమ్మలా చూసే వాడెక్కడుంటాడురా' అని ప్రతి సమాధానం. 'నా మనసులో ఇంకా నా మరదలే ఉందే. నన్ను క్షమించు.' అని చెప్పాను. ఆరోజు మొదలు నేటికి రెండున్నర నెలలు కావస్తోంది. తన నన్ను ఒరేయ్ అని ఎప్పుడు పిలుస్తుందా? అని ఎదురుచూస్తూనే ఉంది నా మది. తను నా ఎదురుగా కూర్చొని ఎప్పుడు కబుర్లు చెబుతుందా? అని వేచి చూస్తున్నాయి నా కళ్లు. రోడ్డుపై నడిచేటప్పుడు అల్లరి చేస్తూ నన్ను ఆటపట్టించడానికి తను లేదే అని అడుగు ముందుకు వేయడం లేదు నా పాదాలు. నాజీవితంలోకి తను వచ్చిన తరువాత ఎన్నో మార్పులు నేను నాలా లేను. ఇప్పుడిక తను నాతో లేదు. ఇంత మూర్ఖంగా ఎలా ప్రవర్తించగలిగింది. తనేదో తప్పు చేశానన్న భావనతో వెళ్లిపోయిందని నా మిత్రుల ద్వారా తెలుసుకున్నాను. లేదు నేస్తమా నువ్వెప్పుడూ తప్పు చేయలేదు. నీ మనసులో ఉన్న భావనను నాతో చెప్పుకొన్నావు. అంతేగా ఇప్పుడు నన్ను ఒంటరిని చేసి నీ దారిన నువ్వు వెళ్లిపోతే నాకు తోడెవరే. నా ఓటమిలో, నా గెలుపులో అన్నింటా నాకు తోడుగా నిలిచి భరోసా ఇచ్చిన నీవు ఇలా అన్యాయంగా వెళ్లిపోతే ఎలా ఉండగలననుకున్నావు. కాలేజీలో నువ్వు నన్ను చూసీచూడనట్టు వెళ్తుంటే ప్రాణం తోడేసినట్లు అవుతుంది. ఇక ఈ బాధలు భరించటం నావల్ల కాదే.. ప్లీజ్ వచ్చేయవా.. ఎప్పటిలానే నా ప్రాణస్నేహంగా నిలుస్తావని మనస్ఫూర్తిగా ఆశిస్తున్నాను. - రామ్



అత్తెసరు జీవితం నుంచి ఆర్థిక పాఠాల దాకా..


వరల్డ్ ఎకనామిక్ ఫోరం(డబ్ల్యూఈఎఫ్). ప్రపంచంలోని దిగ్గజ వాణిజ్య సంస్థలకే దిక్సూచిలా పనిచేసే అంతర్జాతీయ సంస్థ ఇది. ఆ సంస్థ తన సృజనకు మరింత పదును పెట్టాలని ఓ ప్రత్యేక ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది.

రంజిత్‌రెడ్డి చల్లా. వరంగల్ జిల్లా శాయంపేట మండలం మైలారానికి చెందిన సామాన్య మధ్యతరగతి యువకుడు. తండ్రి జైపాల్‌రెడ్డి ఆర్టీసీలో మెకానిక్‌గా ఉంటూ ఇటీవలే గుమాస్తా అయ్యారు. అమ్మ శకుంతల గృహిణి. ఖర్చుల కోసం కాలేజీలోనే రెస్టారెంటులో పార్ట్ టైం ఉద్యోగం చేశాడు రంజిత్.

ఈ రెండు విషయాలకు సంబంధం ఏంటనేగా మీ ప్రశ్న. ఉంది. డబ్ల్యూఈఎఫ్ చేపట్టిన ప్రత్యేక ప్రాజెక్టులో మన రంజిత్ పనిచేయనున్నాడు మరి. స్విట్జర్లాండ్‌లో వరల్డ్ ఎకనామిక్ ఫోరం పైలట్ ప్రాజెక్టుగా

ఆర్థికవేత్తగా తెలుగు కుర్రాడి సత్తా

చేపడుతున్న 'బిజినెస్ ఎంగేజ్‌మెంట్ ఆపరేషన్ స్పెషలిస్టు'గా ఎంపికయ్యాడు. అసలేంటీ ప్రాజెక్టు? తెలుగుకుర్రాడు రంజిత్ ఎలా ఎంపికయ్యాడో తెలుసుకుందామా?



ప్రపంచవ్యాప్తంగా ఉన్న అనేక బహుళ జాతి సంస్థలకు డబ్ల్యూఈఎఫ్ సలహాలు, సూచనలు ఇస్తుంటుంది. వాణిజ్యంలో నెంబర్‌వన్‌గా నిలవడానికి సహకరిస్తుంటుంది. మన దేశంలో దిగ్గజ సంస్థలైన రిలయన్స్, ఆదిత్య బిర్లా, టాటా, నెస్లే, ఐటీసీ లాంటివి కూడా డబ్ల్యూఈఎఫ్ సలహాలు తీసుకొంటాయి. అంతర్జాతీయ వాణిజ్యంలో ఇన్నాళ్లూ కస్టమర్ సర్వీస్, కస్టమర్ రిలేషన్స్ అనే పంథా కొనసాగింది. ఇప్పుడు వినియోగదారులకు లాభం చేకూర్చే 'కస్టమర్ సక్సెస్ మేనేజ్‌మెంట్' అనే కొత్త పంథా ముందుకొచ్చింది. ఈ కొత్త పోకడను అభివృద్ధి చేసేందుకు డబ్ల్యూఈఎఫ్ పైలట్ ప్రాజెక్టుగా 'బిజినెస్ ఎంగేజ్‌మెంట్ ఆపరేషన్' అనే విభాగాన్ని ఏర్పాటుచేసింది. ఇందులో రంజిత్‌ను స్పెషలిస్టుగా ఎంపిక చేశారు. ఆడియో, వీడియో, మానవ వనరుల రౌండ్ల వారీగా ఇంటర్వ్యూ చేశారు. విశాల దృక్పథాన్ని పరీక్షించారు. 'నువ్వసలు ఎందుకు వరల్డ్ ఎకనామిక్ ఫోరంలో ఉద్యోగం చేయాలనుకుంటున్నావు?' అని అడిగారు. 'ఇదో అద్భుతమైన సంస్థ అని, ఈ గొప్ప సంస్థ ఒక యంత్రం అనుకుంటే అందులో నేనో బోల్టుగానైనా ఉండాలనేది నా లక్ష్యం' అని చెప్పి వారిని మెప్పించాడు రంజిత్.

రెస్టారెంట్‌లో పనిచేస్తూ..

డిగ్రీ వరకు హన్మకొండలో చదివిన రంజిత్ మొదటి నుంచి భిన్నంగా ఆలోచించేవాడు. డిగ్రీలో బ్యాచిలర్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ చేశాడు. అప్పుడంతా బీటెక్‌లో చేరకూడదా? అన్నారు. అయినా వెనుకడుగు వేయలేదు. ఇష్టమైనదే చదవాలని గట్టిగా నిర్ణయించుకున్నాడు. డిగ్రీ అవ్వడంతోనే బ్యాంక్ ఆఫ్ అమెరికాలో కొలువు సంపాదించాడు. తర్వాత మరో సంస్థలోకి మారాడు. తర్వాత స్విట్జర్లాండ్‌లో లాసన్నె విశ్వవిద్యాలయంలో ఎంబీయేలో చేరాడు. ఇక్కడికొచ్చాక ప్రపంచ ఆర్థిక ఫోరం (డబ్ల్యూఈఎఫ్)లో ఎలాగైనా ఉద్యోగం చేయాలని సంకల్పించాడు. ఆ ఉద్యోగం అంత సులువుగా రాదు. ఫ్రెంచ్ భాషపై మంచి పట్టు ఉండాలి.

> **డబ్ల్యూఈఎఫ్‌లో పనిచేయడానికి తలపండిన ఆర్థికవేత్తలు పోటీపడతారు. కంపెనీల్లో దశాబ్దాల పాటు అపార అనుభవం ఉండి, ఉన్నత హోదాలో కొనసాగిన వారినే ఎక్కువగా ఎంపిక చేసుకుంటారు. మొత్తం 25 మంది భారతీయులు డబ్ల్యూఈఎఫ్‌లో పనిచేస్తున్నారని అంచనా. సరికొత్త వ్యాపార మెలకువలు ఆలోచించి బడా కంపెనీల్లో కొత్త వాణిజ్య పంథాను సృష్టించడమే నా ముందున్న కర్తవ్యం. - రంజిత్‌రెడ్డి చల్లా**

కష్టపడి ఫ్రెంచ్ నేర్చుకున్నాడు. నాలుగు సార్లు దరఖాస్తు చేసినా సంస్థ నుంచి ఎలాంటి స్పందనా లేదు. అప్పటికే రెండేళ్లు చేయాల్సిన ఎంబీయే మూడేళ్లు పట్టింది. మొదటి సంవత్సరం నాన్న, అక్క స్వప్న, బావ రాజేశ్వర్‌రెడ్డిలు ఆర్థికంగా చేయూతనిచ్చారు. అయినా ఇంకా వారిని ఇబ్బంది పెట్టకూడదని అనుకున్నాడు. అందుకే యూనివర్సిటీ రెస్టారెంటులో రెండేళ్లు పనిచేసి ఖర్చుల కోసం సంపాదించుకుంటూ చదువుకున్నాడు. అయిదోసారి దరఖాస్తు చేసుకొన్నాక కొలువు వరించింది.

- జి.పాండురంగశర్మ, ఈనాడు, వరంగల్